భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

★

మే 1965

సంపుటము 42 : : సంచిక 5

విడిప్రతి వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మే 1965

సా జయతి శక్తి రాద్యా

శ్రీ హారీత శివశర్మ

నీలపు నింగిలో తనుకు నింపిన నీ తనుయష్టియందు ప
ద్మాలయమూర్తి! నీదు కనులందున నిండిన రక్తిరేఖలం
దో లలితాంగఖేల! తలయూచిన నల్లని లేలిహానమున్
పోలిన నీదు కైశికము నందున నిల్చిన దృష్టి దృష్టినై.

ఆ నీ నేత్రము లందు రమ్యతర సంధ్యా బంధుర ప్రేమ రే
ఖానైర్మల్యము నిర్మలంబయిన రాకాచంద్రమో వీధిన్నై
చానా! వెన్నెల లూదునో, పసిమి మించన్ నించునో భావముల్,
నేనై చేసిన యూహలన్ నిలుపునో నిష్ఠన్ పటిష్ఠంబుగా.

నీ నడలందు వీణియలు; నీ పదపద్మపరీత భూములం
దో నలినాక్షి! దివ్యమధుదోహన శీలము లాత్త పుణ్యముల్
జాలములైన బంభరపు చాలులు చాలులు గాగ తేనెకున్
చాలిన క్రమగీతముల జల్లులు చల్లు నదేమి చిత్రమో!

ఎవ్వతె వీవు? ఎచ్చటను ఎత్తితి జన్మము? ఏమి దాస? వా
నవ్వది యేమి? పల్వరుస నానిన యోష్ఠపు రెండు బింబముల్
చివ్వకు వచ్చినట్లయిన చిత్రము కంటెవ? నిన్నుగాని నే
నెవ్వరియందు చూడ మదినెంచను రమ్యతకైన యర్థమున్.

అందములేద; చందమని యన్నదిలేద; విలాస దీప్తిచే
విందనిలేద కన్నులకు; విద్ధమనోరథ రేఖవోలికన్
కుందిన డెందమై పదలుకొన్న విధమ్మగు రూపసంపదన్
ఎందున నిల్చుకొంటివి మహేశ్వరి! అందముకాని యందమున్.

నిన్నున్ జూచి తలంతు నెప్పుడు ధురా నీరంధ్ర నీలాభ్రసం
ఛన్నాత్మైకము పూర్వజన్మమున నెంచన్ రాని కాలమ్మునం
దన్నా ! నీవును నేను కూడి యొకజంటై యొక్క దేహమ్ముగా
మన్నామన్న పవిత్రమైన అతిరమ్యంబైన దివ్యోహమున్.

తెలినులి వెన్నెలల్ సుదతి తెచ్చిన హాసములం దనంతమై
చలమరి బిగ్గఁబట్టిన వసంతము పంతముచేసి వంతుగా
లలి భరతంబు పట్టిన ఫలం బనుమేయము కాద యేని మ
త్తిలి తలిరాకు డెందమున తేలున పుష్పములై రహస్సుధల్.

అలికులవేణి యంచనిన నందరు చెప్పిన యట్లుగా నగున్
చెలువము నీదు సొమ్మనుచు చెప్పినచో నదిగూడ నట్లగున్
చెలి ! మరి యేమనందు నిను చెప్పఁగ; మాటలు వేయునేలనే
చలిమలగట్టుపై తపము చాలదు నిన్నను రక్తి నింపగన్.

అలికులవేణి కన్నులకు నందిన రూపము రూపమంచు నే
తెలియఁగ నైన రోజులకు తేకువ మేకొను టేమి లోకువై
మలగిన దృష్టి బాహిరపు మార్గములందున నిల్చునట్టి మూ
ఢులకును మేటియై నిలచి కొల్చిన వా డనుభూతి లేకరున్.

ఆ రూపం బదియేమి ? ఓ తబిసికన్యా ! అన్యథా ధిక్కృత
స్వారాజ్య స్థితివోలె నున్నది; మహేశానీ దృశా తీవ్రబా
ధా రూఢో జ్వల యజ్ఞధూమ విచలత్ స్వాహా ప్రభూ ప్రాజ్యశే
ఖారణ్యంబును వోని నీ యెడదయం దార క్తిమల్ ముక్తమై.

సగము మోడ్చిన కన్నుల చాయలందు
శ్రావణాభ్రంపు చెలువముల్ జమురుకొనెనొ
నెయ్యపుంగూర్మి వెలిగించు నెలత కనులు
ముగ్ధములు నమ్యె వజ్రకార్ముకములట్లు.

అర మోడ్పు కనుల యందున
స్థిరమై యొక కాంతిరేఖ తెచ్చిన వెలుగై

సా జయతి శక్తిరాద్యా

పరమమ్ము దివ్యభావము
విరిసెన్ హృదయమ్మునిండి వెల్గుకు వెలుగై.

నాలో నే ననుకొంటి నిద్ది యెవరో నా ప్రాణమేలున్ తగన్
నాలో నేననుభూతి పొందితి నదే నా జీవితం బేలగన్
నాలో రమ్యరహస్సుధాజలధు లానందైకవారాంనిధుల్
హేలాభాసురముల్ రసప్రథితముల్ హేరాళమై నిండగన్.

నేనై లేనటు లయ్యె; నామెయును లేనేలేద; యున్నట్టిదే
మో నారీ నరరూపమొక్కటిగనై యొండొక్క డొండొక్కడై
నానాజీవము లొక్కటై జగమదంతా యొక్కడైనట్టులై
నేనున్ ఆమెయు నొక్కటై ఇతరమంతేలేక యున్నట్టులై.

వెలలి సహస్రశీర్షములు విచ్చిన పూరుషు డెవ్వడో పొరిన్
అలరి సమస్తపాదుడయి యాడిన తాండవ మట్లుగా మరిన్
లలితసమస్తపాదుడయి లాస్యములాడిన యట్లుగా మరిన్
చెలగిన మూర్తిగా నయిన చెల్వయు పూరుషు డొక్కరూపమై.

ఆకారంబులు డుల్లి యాత్మ యొకడై యజ్ఞేయమై చిద్ఘన
ప్రాకామ్యస్థితి నందినట్టు లొక భావం బబ్బినంతన్ మరిన్
ఏకాకారము దాల్చి భూతమొకడై ఏకార్ణవం బిందునన్
ఆకారంబులులేని నాట్యము లనంతశ్రీకమై యొప్పినన్.

ప్రళయపయోధివీచికలు పట్టిన యట్టితెరల్ విదిర్చెనో
ప్రళయపయోధివీధి పృథులమ్మగు రంగముగా నమర్చెనో
విలయము తాండవం బడరి వెక్కసమా జడదారి భూతమై
చలమున వాలవాల యని సల్పిన నాట్య మహాంకృతిన్ చనన్.

ఎవ్వరు లేర; ఏమియును నెంచగలేద; మరే యొక్కడై
రివ్వననాడు నాట్యముల రీతులు భీతిమెయిన్ ంచెనో;
చివ్వననాగి యంతట హసించెనో; కాదని పగించెనో;
త్రెవ్విన దేహమందయిన తేకువ శ్రీగలి రూపుకట్టెనో.

మూడు గుణమ్ములన్ ముదిత ముప్పిరిగొన్నదొ; శుద్ధ సత్వమై
కూడినమాయగా పదలుకొన్నదొ; కన్నదొ భిన్నతత్త్వముల్;
ఆడిన రెండునేత్రముల యందు సముద్భవమైన కాంతి సా
గాడిన మార్గముల్ శివములై తరగల్ పడగల్ హసించెనో.

ఆయమ కన్నులంబడి మహోద్యుతివంతములైన కాంతులే
వో యమితంబులై బయలుపుంతల సాగిన యంతటన్ మహః
శ్రేయసవీథులున్ బహుళ సృష్టికుపాధు లనంతశక్తి సం
ధాయకముల్ మహత్వము లనంతములై శివలై చెలంగినన్.

ఈ లోకమ్ము లివేమి సర్గమున కేమీ యిప్వు డారంభమా?
ఈ లోకంబులు లోకపాలకు లహీనేచ్ఛావిధాత్రాకృతుల్
గా, లోకస్థు లకుంఠితుల్ జననము ల్గాంచన్ విడంబించెనో
లీలాసంగతి నామె దృక్పథము లేలింపన్ సవీనాధ్వముల్.

బహువనపాదపాబ్ధికుల పర్వతపూర్ణ శిరఃసరఝ్ఝరీ
సహిత మహోమహీమహిత జంతువితానము లాదిగా సుదు
స్సహాములు శక్తివంతము లసాధ్యమహాస్నముపేతముల్ దిశా
వహన సమర్థముల్ ఉబికివచ్చెను ఆయమ కంటికాంతులన్.

పదరి యవిద్య యందు ప్రతిభానము చెందెనొ; లేక తానుగా
నుదరిన మాయతో కలిసి యొప్పెనొ సంగములేని యాత్మ; తా
నొదిగిన దెట్టులో ఎరుకనొప్పమిచే పురుషుండు వ్యగ్రుడై
ఎదుటను నున్న ఆమె గని యిట్లనియెన్ వినికృత్తభీకుడై.

నా రూపం బిదియేమి! యేమి మరి చానా! నీదు రూపంబు; నా
నా రుక్కోద్ధతి క్రొత్త కాంతివయి కన్నా వేమి మూర్తాకృతిన్;
హ్రీరమ్యంబయి సూర్యచంద్ర ప్రసరచ్ఛ్రీ కాంతి రేఖా నవీ
నారామమ్ములు కన్నులై మొనగనో నైర్మల్యముల్ పండెనో.

ఎవ్వతె వీవు? ఎచ్చటను యెత్తితి జన్మము? యేమిదాన? వా
నవ్వదియేమి? క్రొత్తయగు నాదిమసృష్టి కనాది రూపమై

సా జయతి శక్తిరాద్యా


క్రుఙ్వగ లేదుగా నడిమి కూర్పుల యూర్పులలోన నూర్పులై
నవ్వడికన్న భూతముల చాయల పుట్టితె దివ్యమూర్తివై?

కామింతునో నిన్ను కలికిరూపము గొన్న
ఆత్మభావంబును అతివ మిన్న!
ప్రేమింతునో నిన్ను ప్రేమోనువాకమ్ము
పలికించు కులికించు పడతి మిన్న!
పూజింతునో నిన్ను పూజారినై క్రొత్త
మంత్రమ్ములనుజేసి మడతిమిన్న!
పండింతునో నిన్ను పదలుక్షేత్రమ్ముగా
మనసు నాగళ్ళ కొమ్మలకు మిన్న!

వేయికన్నుల రూపమ్ము విందుకొందు;
వేయి మనముల కామన వెక్కసింతు;
వేయి కోర్కుల ప్రేమమ్ము చేయునెంతు;
వేయి చేతుల పూజలు విన్నవింతు.

విదిత సమస్తలోక పదవీస్థితి నాథ్యులు దేవతల్ మహా
భ్యుదయముకోరి నిన్ను నదివో కదుభక్తిని కొల్తు రార్తులై
ఉదితసమస్తజంతు పరమోదధి వౌదువు; నేన యెవ్వడన్?
సుదతి వచింపగావలెను సూనృత వాక్యము నీవనైనటుల్.

అయమ నవ్వే; నవ్వే మరియంతట తానును; రెండు నవ్వులై
అయతి సూర్యచంద్ర ప్రభవైధిత వైధనకాంతిమచ్ఛటా
శ్రీ యుదరంబులై పదునుచేసిన పల్లవుచేనిలో నవ
శ్యాయ దినంబులన్ కొనలు సాగిన వెన్నెలు ప్రమోగి నట్టులై.




ఆ నవ్వుల్ మరి నవ్వులా? విదితవేదార్థైక పారమ్య వి
ద్యానాదమ్ములు; నాదరూపమగు బ్రహ్మద్రవ్య వైవర్తముల్;
ఆ నారీనరు లిద్దరున్ మనుజులా; ఆనంద రూపాకృతుల్;
ఆనా డబ్బిన వైభవం బెగసి యేలా లోకముల్ నిండెడిన్.

ఒకరి నొకళ్ళు చూచుకొని ఊర్జితులిద్దరు ఇద్దరైనటుల్
ఒకరి నొకళ్ళు చూచుకొని ఊర్జితమూర్తులు ఒక్కరైనటుల్
ఒకరి నొకళ్ళు చూచుకొని ఊర్జితు లా సకలంబు తాముగా
సకలులు నిష్కలుల్ విదితశాంతరసాకృతు లాది దైవముల్.

'శివ' యన; యేమి యేమిగ వ
చింతు 'శివా' యన; నిద్ద రాత్మలన్
శివమగు యోచనావిధము
చేతను, ప్రేమముచేత, రమ్యభా
వ వివశచిత్తు లంతట ప్ర
వర్తిత కాము; లకామ తాడితుల్;
ప్రవరులు; ప్రబ్బికొన్న నుత
వాంఛులు; వాంఛలు లేనివారలున్.

ఆత్మకు రెండు రూపము ల
టన్నవి లేవును; లేదు రూపమున్;
ఆత్మయొకండు నిత్యము; స
నాతన; మాద్య; మనాది మధ్య; మ
ధ్యాత్మ; మతర్కితోపనత;
మట్టిరు లిద్దరు నొక్కరైచనన్
ఆత్మ యొకండు తా వెలిగ
నంతట బ్రహ్మమునా విశుద్ధమై.



నన్నయ భృగువంశ కీర్తనము

శ్రీ పడలి మండేశ్వరరావు

భృగువంశ కీర్తనము, సర్పయాగ కథ—ఈ రెండింటినీ జంట కథ లనవచ్చును. భృగువంశ కీర్తనము ఆదిపర్వ మందలి ప్రథమాశ్వాసమున చెప్పబడినది. సర్పయాగ కథ ద్వితీయాశ్వాస మందలిది. భృగువంశ కీర్తనమును రెండు భాగములుగా చూడవచ్చును. మొదటి భాగమునందలి కథ అగ్ని సర్వ భక్షకుడగుట, రెండవ భాగము ప్రమద్వర కథ. సర్పయాగ కథను కూడ రెండు భాగములుగా చూడవచ్చును. మొదటి భాగము సౌపర్ణోపాఖ్యానము, రెండవభాగము ఆస్తీకుని చరితము. భృగువంశ కీర్తన కథా శరీరమందలి రెండు భాగము లెట్టి నిష్పత్తిలో నున్నవో, సర్పయాగ కథా శరీరమందలి రెండు భాగములును కూడ ఆ నిష్పత్తిలోనే ఉన్నవి. ఈ రెండు కథల లోను పూర్వోత్తర భాగములకు గల కాల వ్యవధి విశాలమైనది. ఈ రెండు కథలలోను సర్పకులమునకు గలిగిన అకాండ ప్రళయము, అది ఉడిగింపబడుట వర్ణింపబడినవి.

భృగువంశ కీర్తనము చాల చక్కని కథ. అందులో పూర్వభాగములోని అందము వేఱు, ఉత్తరభాగములోని అందము వేఱు. ఈ రెండు భాగముల నిర్మాణములోను ఒక రకమైన సౌష్ఠవము (Symmetry) కనబడుతుంది.

పులోమను రక్కసుడెత్తుకొని—పోవుట.	ప్రమద్వర సర్పదష్ట అగుట
చ్యవనుని వలన పులోమకు—విముక్తి కల్గుట.	రురుడు తన ఆయుర్దాయాన్నిచ్చి ప్రమద్వరను బ్రతికించుకొనుట.
తన భార్యకు కల్గిన ఆపదకు—కారణము అగ్నిహోత్రుడని భృగు వాతని శపించుట.	తన భార్య మరణానికి కారణమైన పాపజాతిని రురుడు తుదముట్టించదలచుట.
బ్రహ్మ అగ్నిహోత్రునికి తొల్లింటి పవిత్ర స్థానాన్ని ఇచ్చుట.	సహస్రపాదుడు పాములకు గల ముప్పును తొలగేటట్లు రురుని మనసును మళ్లించుట.

స్థూలదృష్టికి కథానిర్మాణంలో ఇంతకన్న ఎక్కువ విశేషము కానరాదు. పాత్ర చిత్రణపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కానరాదు. పాత్రల మనస్సులలో అరలు పొరలు కనబడవు. ఛందోరీతులలో ప్రత్యేక ప్రయోగ విశేషములు లేవు.

అయినప్పటికి నన్నయ రచనకు ఉదాహరణగా నీయదగిన రీతిని నడిచినది భృగువంశ కీర్తనము. కథను రెండు మూడు విధాలుగా చెప్పవచ్చును. కథను పాత్రల మనస్తత్వ దృష్టినుంచి గాని, ప్రత్యేక పరిస్థితులలో పాత్రల ప్రవర్తన విధానాలు ఎలా ఉన్నాయో అని గాని పరిశీలించవచ్చును. ఈ మార్గమున ప్రతీ కథా అనేక విధాలుగా వ్రాయవచ్చును. ఇది గాక కథ చెప్పుటలో ఇంకొకమార్గ మున్నది. జరిగినది జరిగినట్లుగా, ఉటస్థుడు చూచినట్లుగా, పాత్రల మనసులలోనికి ప్రవేశించకుండా కేవలము ఒక చరిత్రను కాని, సంఘటనను కాని ఏకరువు పెట్టినట్లు ఉండవచ్చును. ఇది పైకి చాల తేలికైన మార్గము. కాని, కవికి సాయపడే పరికరాలయిన పాత్రల మనస్తత్వాలు, దీర్ఘమైన సంభాషణలు, సంభాషణ లోని చమత్కారాలు, మలుపులు, విరుపులు, లోకోక్తులు, ఇందులో ఏమీ ఉండవు. దీర్ఘమైన వర్ణనలకు ఇందులో తావు లేదు. అందుచేత భాష కూడా ఎక్కువ అలంకృతమై ఉండదు. అందుచేత ఇట్టి కథనములో సాధారణముగా కవికి సాయపడే సామగ్రి అంతా బహిష్కరింపబడుటచేత కథ రక్తికట్టుట చాలా కష్టము.

నన్నయ భృగువంశ కీర్తన మిట్టి నిరాడంబరమైన కథ. ఇందులోని రచన ఇంచుమించుగా నిరలంకారముగా నిర్వ

హింపబడినది. ఇందులో మనలను ఆశ్చర్యపరచే విదగ్ధ సౌందర్య మేమీ లేదు. కాని, యీ కథకు ఒక స్నిగ్ధ సౌందర్య పరివేషం నన్నయ కల్పించినాడు. దీనిని నన్నయ కేవలము శబ్దము వల్లనే సాధించినాడు. చిత్రకారునికి రంగులు, శిల్పికి రాయి, గాయకునికి నాదము ఎట్టివో, కవికి శబ్దము అట్టిది. కాని, శబ్దాన్ని కవులందరు ఒకేవిధముగ ఉపయోగించరు. శబ్దాలతో చిత్రాలను కల్పించి, శబ్దముచేత ఎంతో చాకిరీ చేయించుకుంటారు, కొందరు కవులు. వారికి శబ్దముయొక్క ప్రయోజనము తర్వాత ఏర్పడే చిత్రానికి దోహదము చేసేటంత వఱకే. ఇంకొక తరహా రచనలో శబ్దాలపట్ల కవికి గల మోజు హెచ్చు. అందులో కొందరికి వాటిలోని నాద విన్యాసముపట్ల వల్లమాలిన అభిమానం. అందుచేత ప్రాసలతోను, అనుప్రాసలతోను, లాటాను ప్రాసలతోను శబ్దాలతో శ్రవణ పేయమైన రంగవల్లుల నేర్పరుస్తాడు. మఱికొందరు కవులు శబ్దార్థములకు గల పొత్తు ఎంతవఱకు సాధ్యమో, ఏ శబ్దము ఎంత అర్థాన్ని యీయగలదో, ఒకానొక అర్థము సిద్ధింప దానికి ఎంత తక్కువ పదజాలాన్ని వాడడ మవసరమో మున్నగు వానికి సంబంధించిన ప్రయోగాలను చేసి, భాషను ఆలోచనకు, భావ ప్రకటనకు సున్నితమైన, సునిశితమైన పరికరముగా మలుస్తారు. తిక్కనవంటి కవులకు శబ్దము మొదటి విధముగా ఉపయోగపడింది. శబ్దాలంకారముల పట్ల మక్కువగల కవులు రెండవ మార్గాన్ని అనుసరించారు. ప్రబంధకవులు మూడవ మార్గాన్ని అన్వేషించారు.

నన్నయ మార్గము వీని అన్నిటికన్న చాల భిన్నమైనది. సుందరమైనది. ఇందులో ఫలము (Effect) కోసం ప్రయత్నంలేదు. భాషను మరి ఏదో ప్రయోజనము వాంఛించి వాడుతూన్న స్ఫురణ కల్గదు. శబ్దాలంకారముల ప్రాచుర్యం కానరాదు. భాషను భావ ప్రకటనకు ఉత్తమమైన పరికరముగా మలుస్తున్నామన్న భావము కానరాదు. ఇందులోని ప్రతి శబ్దము ఒక ముగ్ధ ప్రమద్వరవంటిది. ప్రమద్వరను గూర్చి మనకేమి తెలుసునంటే, ఏమీ తెలియదు. కాని మన మనసున మాత్రం మనకు ప్రమద్వర అంటే విపరీతమైన అభిమానం. నన్నయ ప్రయోగించిన శబ్దాలు కూడ అట్టివే. ప్రమద్వర 'ప్రమదాజనంబులయం దెల్ల నుత్కృష్ట'. ఆమె తండ్రి గంధర్వరాజు, తల్లి మేనక, పెరుగుతున్నది మహాముని ఆశ్రమమున. అందుచేత తండ్రిలోని ఓజస్సు, తల్లిలోని లావణ్యము ఆమెలో కనబడాలి. ఆశ్రమవాస జీవితంలోని నిరాడంబరత్వం పవిత్రత ఆమెలో ఉండి ఉండాలి అని మనము వూహించవచ్చును. అలాగే నన్నయ రచనలో సంస్కృతములోని ఓజో గుణము, తెనుగులోని లావణ్యముతోబాటు ద్రష్టయొక్క వాక్కు కనబడుతుంది. ఇందులో ప్రయత్న స్ఫురణ ఎక్కడా కానరాదు, అయినా ఏ సందర్భంలోను అర్థమునకు గుఱి తప్పడం కూడా కానరాదు. నన్నయ శబ్దములే కరిగి భావములుగా మాఱిపోతాయి గాని, శబ్దమునుండి భావము ఉద్భవిల్లదు. శబ్దమే అర్థము, భావము. అంటే నన్నయ శబ్ద ప్రయోగానంతరము శబ్దమునకు అర్థమును మన మాలోచించి, దానినుండి కవి భావమును వూహించవలసిన అవసరములేదు. శబ్దమును గూర్చి నాసి చేయుచున్నంతసేపును శబ్దముయొక్క వ్యాపారము సంకుచితమైనదే అయిపోతుంది. నన్నయ శబ్దమే ప్రాణవంతమైన అర్థము, ప్రణవాన్ని పోసే భావము.

భృగువంశ కీర్తనములో గోచరించే ముఖ్యమైన సౌందర్యమిదే. ఆరంభమున కథ పరుగిడుతూన్నట్లు కనబడుతుంది.[1] ఎక్కడా పాత్ర చిత్రణ కొఱకు ప్రత్యేకమైన శ్రద్ధ కనబడదు. అయినా పులోముడు వింత రక్కసుడుగాను, భృగుపత్ని అతి సాధ్వసచిత్తగాను కళ్లకు గట్టినట్లు కనబడుతారు.

"అయ్యసుర విన్నిట్లెఱింగె ? నెవ్వరు చెప్పె ?" అని భృగువు అడిగిన ప్రశ్నకు సమాధానముగా "పులోమ యిట్లనియె :

"'ఈ యగ్నిదేవుఁ డసురకు
నో యనఘ చెప్పుటయు విని మ—హోగ్రాకృతితో
నా యసుర నన్ను వరాకర
మై యున్నెడ యెత్తికొని ర—యంబునఁజనుచోన్.
కుక్షిచ్యుతుఁడై సుతుఁడా
రాక్షసు భస్మంబు సేసె—రాజిత శక్తిన్

---

1. "భృగుఁడను విప్రుండు—మగువఁ బులోమయన్
దాని గర్భిణిఁ దన—ధర్మపత్ని
నగ్నిహోత్రమునకు—నగ్నుల విహరింపు
మని పంచి యభిషేచ—నార్థ మరుగ
నంతఁ బులోముఁడన్—వింత రక్కసుఁ డగ్ని
హోత్ర గృహంబున—కొయ్య వచ్చి
యుత్తన్విఁ జూచి యు—న్మత్తుఁడై యెవ్వరి
సతి యిది చెప్పుమా—జాత వేద
యనఁగ నగ్నిదేవుఁ—డనృతంబునకు విప్ర
శాపమునకు వెఱచి—శాప భయము
దీర్చుకొనఁగఁ బోలుఁ—దీర్చ రా దనృతాభి
భాషణమున నైన—పాప భయము. (1—1—129

రక్షించె నన్ను' ననవుడు
నా క్షణము మునీంద్రుఁ డగ్ని— కతిరోషమునన్."
(1—1—133, 134)

"నీ వతి క్రూరుండవు, సర్వ భక్షకుండవుగ" మ్మని శపించెను. (1—1—135). ఈ శాపము వచనంలో ఉన్నది. కాని, యీ వచనంలోని రెండు వాక్యాలు వెనుకటి పద్యము నుండి దూసుకొనివచ్చే యీటెలలా ఉన్నాయి. ఇందులో మునీంద్రుని రోషము ఉన్నది. గర్భవతి అయిన భార్య మహా పదకు గురియై సాధ్వసనిమిత్త మయినందుకు ఆమెపట్ల జాలి ఉన్నది. కుక్షిచ్యుతుడైన బాలునికి మహాపద తప్పిందన్న స్ఫురణ ఉన్నది. సుతు డా రక్కసుని భస్మము చేశాడన్న తృప్తి, విస్మయము కూడా ఉన్నాయి. ముఖ్యముగా ఇన్ని ఇక్కట్లకు కారణమైనవాడు అగ్ని అన్న భావము హృదయాన్ని దహించి వేయుచ నున్నది. 'ఆ క్షణమ మునీంద్రు డగ్ని కతి రోషము నన్' అన్న భాగము పద్యములో ఇమిడిపోయి తర్వాతి వాక్యాలు మరీ చిన్నవికావడం వలన ఈ శాపము మిక్కిలి తీక్ష్ణమైన దయింది.

ఈ కథ ఇంతటితో ముగిసినట్లే. మిగతా కథను రెండు వాక్యాలలో చెప్పవచ్చును: "అగ్ని భట్టారకుండు నిఖిలలోక వ్యాప్తంబైన తన తేజోమూర్తి నుపసంహరించగా, బ్రహ్మ దాని నెఱింగి, యగ్నిదేవు రావించి, అమ్మహాముని వచనం బమోఘంబు గావున నీవు సర్వభక్షకుండ వయ్యును, శుచులయం దెల్ల నత్యంత శుచివై, పాత్రులయం దెల్లఁ బరమ పాత్రుం డవై, పూజ్యులయందెల్ల నగ్రపూజ్యుండవై, వేదచోదిత విధా నంబులయందు విప్రసహాయుండవై భువనంబుల నడపు మని విశ్వగురుండు వైశ్వానరుం బ్రార్థించి, నియోగించి, భృగువచనంబు ప్రతిష్ఠించె !"

కాని, మొదటి భాగము ఏడు పద్య గద్యములలో (25 పంక్తులలో) చెప్పగా, ఈ భాగానికి ఎనిమిది పద్య గద్యలు (సుమారు 30 పంక్తులు) అవసరమైనది. అందులో సగ భాగము లసత్యమాడ రాదనియు, తాను శాపమును పొందిన లోకయాత్ర లేకుండుననియు, అగ్నిభట్టారకుడు భృగునితో చెప్పిన మాటలు. తర్వాతి సీసపద్యములో అగ్ని తన తేజో మూర్తి నుపసంహరించగా జనులు సంభ్రమాక్రాంతులగుట, మునులు, దేవతలు బ్రహ్మకడ కేగుట చెప్పబడినది. తర్వాత బ్రహ్మ అగ్నిదేవుని రావించి భృగువచనమును ప్రతిష్ఠించుట వివరింపబడినది. ఈవిధముగా ఇక్కడ పూర్వోత్తర భాగములు ఎంతో పరస్పరాసమ రూపముగా ఉన్నట్లు కనబడు తుంది. కాని కథను చదువుతూంటే ఇట్టి అనుమానమే కలుగదు. కథ అంతా ఒకే విధముగా నడుస్తున్నట్లు తోస్తుంది. కాని, మొదటి భాగములో అనేక విషయాలు చొప్పించబడ్డాయని, రెండవ భాగములో ఒక్క చిన్న అంశమే పొగడీయబడిందని ఎవ్వరికీ తోచదు. అసలు కథను ఇన్ని భాగా లుగా విడదీసి చూడనే చూడము. అంతా ఒకే ఒక సంఘటన అనే భ్రాంతిని కవి కల్పించాడు. "భృగు వచనంబు ప్రతిష్ఠించి" అన్నమాట యీ భ్రాంతిని బలపరుస్తుంది.

అయినప్పటికీ ఈ ఉత్తరభాగ మింత పొడవుగా ఏల ఉన్నదన్న సందేహానికి సమాధాన మీయవలసి ఉన్నది. వైదిక కర్మలకు అగ్నిహోత్రముతో ముడివడియున్న సంబంధాన్ని బట్టి, నన్నయ నాటి దినములలో ఈ విషయమునట్ల ప్రజ లకుగల ఆసక్తినిబట్టి, నన్నయ ఈ భాగానికి ఇంత ప్రాము ఖ్యాన్ని ఇచ్చిఉండవచ్చు. కాని వైదిక సంప్రదాయానుయాయు లకు ప్రత్యేకముగా ప్రీతిపాత్రమైనదైనా, దానిపట్ల ప్రత్యేక మైన అభిమానము లేనివారికి కూడా యీ భాగము ఆవశ్యక మని తోచునట్లే, యీ భాగమును నన్నయ నిర్వహించాడు. అంటే మొత్తము భృగువంశ కీర్తనాన్ని శిల్పదృష్టితో చూడ వలసిన అవసర మున్నదన్నమాట.

ఈ దృష్టితో చూడగా ఈ భాగములోను తర్వాతి ప్రమద్వర కథలోను శాంతమే ప్రధానమైన రసము. ఇది కేవలము జీవితాన్నుంచి భయపడి, పారిపోయి, చెట్టు పుట్టలు పట్టగా, లోకమునుండి దూరముకాగా ఏర్పడిన విరా గముతో కూడిన శాంతము కాదు. భృగువంశ కీర్తనములో ఎందరో మహర్షు లున్నారు. కాని, చిత్ర మేమంటే వీరందరూ వీత రాగులూ, జడ భరతునివలె నిష్కర్ములూ, నిస్సంగులూ కారు. వీరందరి వివాహములు చిత్రమైనవి. భృగువు పులోముడనె రక్కసునిచే వరియింపబడిన పులోమను వివాహమాడాడు. అతని కొడుకు చ్యవనుడు. అతడు సుకన్య అనే రాచబిడ్డను కోరి వివాహము చేసికొన్నాడు. అతని కొడుకు ప్రమతి. అతడు అమృతోద్భవ యగు ఘృతాచిని వలచి రురునికి తండ్రి అయినాడు. రురుడు ఒక "గంధర్వరాజునకు మేనకకుం బుట్టినదాని రూప లావణ్య గుణంబులు ప్రమదా జనంబులయందెల్ల నుత్కృష్ట యగుటం జేసి ప్రమద్వరయన నొప్పుచున్న కన్యక నతి స్నేహం బున" వివాహమాడ దలచాడు. ఆమె సర్పదష్టయై మరణిం చగా తన ఆయుర్దాయమందు సగ మామె కిచ్చి, ఆమెను బ్రతికించుకున్నాడు. వీరందఱిని నిస్సంగులనీ, వీతరాగులనీ, లోకా న్నుంచి ఎక్కడికో పరువెత్తిపోయేవారనీ ఎలా అనుకోగలం ?

వీరు ఉత్తమ శృంగారప్రియులే గాక ఇతర విధములుగా కూడ నిష్క్రియాభిముఖులు గారు. భృగువు రోషించినవాడై

అగ్నిభట్టారకుని శపించగా, బ్రహ్మ కూడా చేయగలిగిందేమీ లేక అతని వచనాన్ని ప్రతిష్ఠింపచగల్గాడంటే! తల్లి గర్భమందుండగానే చ్యవనునికి రక్కసునిపై మిక్కిలి కోపం గల్గింది! కుక్షిచ్యుతుడైన అతడు ఆరాక్షసుని భస్మము చేశాడు. ఇక రురుడు :

"కన్నియల తోడ నాడుచు—నున్న దానిఁ
బాద మర్దితమై యొక్క—పన్నగంబు
గఱచెఁ గన్నియ యందఱు—వెఱచి పఱచి
యఱచుచుండఁ బ్రమద్వర—యవని ద్రెళ్లె."
(1—1—146.)

ప్రమద్వర అంటేనే ప్రకృష్టమైన మదమున కాస్పదమైనది. అట్టి ప్రమదాజనంబులయం దుత్కృష్ట, రాచకూతురు అందులో ఆడుతూన్నది—ఆమెను కఱచింది ఒక పాము. కాని, నన్నయ అలా అనలేదు. 'పాద మర్దితమై యొక్క పన్నగంబు గఱచె' నన్నాడు. త్రొక్కబడిన పాము కఱవడం సహజమే అయినా, నన్నయ వాడిన శబ్దముల ఔచిత్యము గమనింపదగ్గది. పన్నగమంటే పాదములచే నడచునది కాదని అర్థము. పాదములచే నడచునది కాబట్టి ఒక ప్రాణి పాదమర్దిత కావడంతో, ఆ ప్రాణికి ఎక్కడలేని అక్కసు రావడానికి అవకాశ మున్నదన్న ధ్వనివల్ల తప్పు పాముది గాక ప్రమద్వరదే అవుతోంది. కాని, సర్పదష్టయైన ప్రమద్వర మరణించింది. ఇది తప్పొప్పులు తేల్చుకొను సమయము కాక "కరుణా కలిత హృదయుల" ము కావలసి యున్నది. రురు డామెను వివాహ మాడలేదు. కాని, శోక వ్యాకుల హృదయుడు. తన శోకాన్ని పైకి కూడా చెప్పుకోలేని అవస్థ. అందుచేత 'ఏకతంబ' వనమునకు వెళ్లాడు. దీనవదనుడై ఆక్రోశించాడు. ప్రమద్వరను బ్రతికించుకొని ఆమెను వివాహమాడాడు.

కాని, తన భార్య మరణానికి కారణమైనది పాద మర్దితమైన ఒక పన్నగము కాగా, రురుడు పాపజాతి మీదనే పగ బూనాడు. కనిపించిన పాము నల్లా చంపడం ప్రారంభించాడు. ఇట్టివానిని మనము కామక్రోధాలు జయించిన వానిగా ఎలా భావిస్తాము ?

అందుచేత భృగు వంశములో శృంగారము, వీరము, కరుణము, క్రోధము మున్నగువాని కన్నింటికిని అవకాశ మున్నది. కాని, పూర్వోత్తర భాగములు రెండింటను ఇవి అన్నియు శాంతమునందే పర్యవసానమును పొందుట గమనింపదగినది. 'అట్టి' భృగువు (1—1—143) అని వ్రాది చెప్పబడిన భృగువు కూడ శాంతుడై అలిగినను, మహా పరుషములు పల్కినను అలుగవోడిన అగ్నిదేవుని శాంతము ముందు కథలో తిరోహితుడు కావలసి వచ్చినది. అందుచేతనే పూర్వ కథయందు శాంతము ప్రధానమైన అగ్నిహోత్రునికి ఎక్కువ ప్రాముఖ్య మీయబడినది. అనగా ఈ పూర్వ కథయందలి కరుణము, వీరము క్రోధము మున్నగునవన్నియు శాంతమునందే అంతర్భూతమై పోయినవి.

అట్లే ఉత్తరభాగమునందును పాములపట్ల రురుని పగ, వానిని చంపుటయందు వాతడు చూపిన ఉత్సాహము, అతని సంరంభము అన్నియు సహస్రపాదుని ఉపదేశమువలన తిరోహితమై పోయినది.


ఈ ప్రథమాశ్వాసమునందు శాంత రసనిర్వ్యూఢి కల్గినది. వినెడివారు మహర్షులు, వినిపించెడివాడు ఉగ్రశ్రవసుడు, కవి బ్రహ్మర్షి, కావ్యము భారత్యమరాపగ, అందలి రసము శాంతము. అందుచేతనే ప్రథమాశ్వాసమున గల తొలి కథ శాంతరస ప్రధానమైన భృగువంశ కీర్తనముతో భారత కథా నిర్వ్యూఢికి అనుకూలమైన వాతావరణము సృష్టింపబడినది. భృగువంశ కీర్తనమును సాధనముగా గ్రహించి శ్రోతల మనస్సు లందలి కల్మషమును కడిగివేసి, వారిని శాంతరస ప్రధానమైన భారతకథా శ్రవణమునకు అనుకూలమైన చిత్తవృత్తిని గలవారినిగా సన్నద్ధులను చేయగలిగాడు నన్నయ. ఈ ఒక్క కారణము చాలును—ఈ కథకు ఈ ఆశ్వాసమం దొక స్థానము లభించడానికి.

* * *

ఇక ఈ శాంత రసమును పోషించు అంశములు మఱి కొన్ని యీ రచనలో కనబడతాయి. అందులో ఒకటి యీ కథలో వచనానికి గల ప్రాబల్యం. ఈ కథలోని వచనము భాషకే వన్నె తెచ్చేది. ఇందులో అలంకారములు లేవు. దూరాన్వయం లేదు, పద కాఠిన్యం కనబడదు. పాఠకునికి చిక్కులు కల్గించే గుప్తకథలు కనబడవు. ఇంతకన్నా విస్పష్టకముగా వివరింపబడిన చరిత్ర ఎక్కడా కానరాదు. రచన ఎంత నిరాడంబరమో అంత ఉదాత్తమై శాంతరస పరిపోషకముగా నున్నది. భారతము శాంతరస ప్రధానమైన కావ్య మగుటచేతనే నన్నయ దానిని చంపూ కావ్యముగ రచింప నమకట్టెనేమో ? ఈ విషయమును గ్రహించిన తిక్కన తన ఉత్తరరామాయణమును నిర్వచనముగా రచించి, శాంతరస ప్రధానమైన భారతమును తిరిగి చంపూ కావ్యముగ రచింప నమకట్టెనేమో ? తర్వాతి కవుల రచనలలో శాంతరస ప్రాధాన్యము తగ్గిన కొలదియు వచన రచనయం దాడంబరము పెరిగినదేమో ? దీనిని గూర్చి సిద్ధాంతము చేయుట సాహసమే కాని, శాంతరస ప్రధానమైన కావ్యముల యందు శోభించినంతగా, ఇతర రసప్రధానములైన కావ్యము


లందు నవరస రచన శోభిల్లదేమో సహృదయులు పరిశీలింప దగిన అంశము.

శాంతరస ప్రధానమైన భృగువంశకీర్తనమునకు వన్నెతెచ్చిన మఱొక అంశము అందలి పాత్రపోషణము. అందలి పాత్రలు ఒక్కొక్కరు ఒక్క క్షణకాలము మాత్రము మన మనోనేత్రమునకు ముందుగ నిలిచి తిరోహితు లగుదురే కాని, వివిధ దృక్కోణముల నుండి పరిశీలించుట కవకాశము కల్పించెడి వారు కారు. పులోముడు వింత రక్కసుడు, పులోమ అతి సాధ్వపవిత్ర, కుక్షిచ్యుతుడైన చ్యవనుడు దుర్నిరీక్ష్యుడు, తండ్రి కగపడిన చ్యవనుడు బాలార్కుడు. అగ్నిదేవుని శపించడానికి సన్నద్ధుడైన భృగువు, పామును త్రొక్కిన ప్రమద్వర, శోక వ్యాకుల హృదయుడై ఆక్రోశించిన రురుడు, కృతాంతకర దండంబు బోని దండము నెత్తుకొని పాములను డొల్లవేసెడి రురుడు, 'హరిహరి' అంటు భయపడే డుండుభ మహాహి— ఒక్కొక్కటి ఒక్కొక్క చిత్రం. ఈవిధమైన రచనవల్ల ప్రతి పాత్ర కూడా మన సానుభూతికి పాత్ర మవుతూ, ఏ ఒక్క పాత్ర కూడా మన మనసునంతా ఆక్రమించుకోదు. శాంతరస సిద్ధికి ఒకవిధమైన నిర్మమత అవసరం.—అంతర్ముఖులంకావడం అవసరం. ఈ భృగువంశ కీర్తనములోని పాత్రచిత్రణలో నిర్మమత పరాకాష్ఠ చెందింది. ఇది అగ్నిభట్టారకుని పాత్ర చిత్రణలో మఱీ చిత్రముగా కనబడుతుంది. ఈ కథలోని అగ్నిభట్టారకుడు సత్యా సత్యాలను చెప్పగల్గినవాడు, ధర్మాధర్మవివేచన చేయగలడు, శాపానుగ్రహ సమర్థుడు, ఆకలి దప్పిక అతనికి ఉన్నాయో లేదో కాని సర్వభక్షకు డయాడు. అతడు శుచి, పాత్రుడు, పూజ్యుడు. కథలో ఏ యితర పాత్రను గూర్చి మనకు ఇన్ని విషయాలు తెలియవు. కాని, యీ పాత్ర ఎక్కడా మన కళ్లకు రూపు కట్టదు. మనకు రూపు కట్టేది ఒక్కటే. అది నిఖిలలోక వ్యాప్తంబయిన అగ్నిదేవుని తేజోమూర్తి. ఈ రూపునకు ఒడ్డూ పొడుగు గల మూడు పరిమాణములు లేవు. ఇది కాలము అనబడే చతుర్థ పరిమాణంలో కూడ కనబడక, మనస్సునంతా ఆక్రమించే పంచమ పరిమాణములో నున్న నిర్వికారమైన, నిర్గుణమైన, కాలాతీతమైన శాంతగుణ ప్రధానమైన తేజస్సు; ఏదో మన మనస్సును ఆక్రమిస్తోంది. ఈ మూర్తిని ఆ పరిమాణంలో గాని అందుకొనలేము. పాత్ర చిత్రణములో ఇది అపూర్వమైనది. అద్భుతమైనది. ఇక్కడ మన మనసును ఆక్రమించేది త్రిలోక పావనమైన ఒక తేజోమూర్తి, ఒక తేజో విశేషము. చిత్ర వర్ణస్ఫూర్తి గల విచిత్ర వ్యక్తులను సృష్టించడం కంటె నిరాకారమైన తేజోమూర్తికి కావ్యములో గుణవాచకములను వాడుతూ, ఆ గుణములన్నీ తేజోమూర్తిలో లీనమయే టట్లుగా చేసే సృష్టిలోని అపూర్వమైన, రమ్యమైన, రమణీయోదాత్తమైన, అఘనిబర్హణమైన రచనలోని పవిత్ర సౌందర్యాన్ని గుర్తించమని కోరుతున్నాను. ఇట్టి అపూర్వమైన రచన నన్నయ వాక్కునకు కట్టుబడి ఉండడం చేతనే ఈ ఆదికవి వాగనుశాసను డయాడు.



మేడ మీది గది

శ్రీ కె. యాదవరెడ్డి



ఆ చుక్కల అడవిలో
స్నేహ హస్తాల కోసం
చాచిన చేతులు తడిసినవి
నెత్తుటిలో.

భవిష్యత్తును దాచుకున్న ఎముకల్లో
జీవించిన ఒక్కొక్క క్షణం
నిలువనిచ్చే మెట్టు,
చేతులు కార్చిన కన్నీటితో
పెరిగిన పొలాలు
కూలిన భవనాలు—
అక్కడే.........

ఎక్కడో ఉన్న అవశేషంలో
చీకటి గదిలో వెలుగుతోంది
కొవ్వొత్తిలా నాగరికత;
అక్కడ తచ్చాడుతున్నాయి
మహామహుల నీడలు;
ఒక్కొక్కరిని చంపుకొన్న ఘనత
మనకే దక్కింది;
కొవ్వొత్తి సగం దాకా కాలింది;
ఆ గదిలోకి చేరాలనే వాంఛ
నెరవేరింది చివరికి—

కొన్ని కన్నీళ్ళను తొక్కేసి
కొన్ని నిట్టూర్పులను అణిచేసి
కొన్ని శ్వాసలను నులిమేసి.

అక్కరల నడకలు

శ్రీ బండి నాగరాజు

అక్కర లైదింటిలోను చక్కని నడక గలది 'మధ్యాక్కర'. దాని తరువాతనే తక్కినవి. మహాక్కర, మధురాక్కరల నడకలు కొంచెము శ్రమతో గూడినవే!

రెండింద్రగణములు, ఒక సూర్యగణమును మరల రెండింద్రగణములు ఒక సూర్యగణమును గలిగి, మధ్యకు విఱుగుచు, సమానమగు నడక గలిగి యున్నందున మధ్యాక్కర నడక మధురమోహనముగా నుండును. యతి దగ్గఱను, పాదముల చివరను, వీలయినచో ప్రతి గణమునకును గూడ పదము విఱిగినప్పుడు, ఆ పద్యము నడక యిట్టిదని స్పష్టముగా గ్రహించుట మిక్కిలి సులభము. యతియు, యతి దగ్గఱ పదము విఱుగుటయు పద్యము నడకను గుర్తించుటకు మిక్కిలి సహాయపడును. అప్పుడే శ్రవణపేయతయు ఉండును; అదే యతి యొక్క పరమ ప్రయోజనము!

ఉదాహరణము :

"స్వామికి మాకును మధ్య
      శబ్ద స్వరూపమై నిల్చి,
వేమాఱు మా నివేదనల
      వినిపింతు వా దేవునకును,
కోమలమైనన నీ మాట
      కొను నమ్మ! యూఱుండు, నిన్ను
నే మెల్ల 'మధ్యాక్కర' మని
      యింపుగా బిల్తు టందులకె!" (మదీయము)

యతి మాఱినప్పుడు, పద్యముయొక్క నడకయు మాఱును. అందులకు నన్నయ మధ్యాక్కర యుదాహరణము. ఆయన, ఐదవ గణారంభమున యతి నిలిపినాడు, అందువలన నడక మాఱి, వేఱొక సొయగము వచ్చి చేరినది! నన్నయ మధ్యాక్కర :

"ద్వాదశ మాసిక వ్రతము సలుపుదుఁ
      దరుణి! మా యన్న
యా దేశమునఁ జేసి, సర్వ తీర్థము
      లాడుచు, బ్రహ్మ
వాదుల సంగతి బ్రహ్మచర్య సు
      వ్రతుఁడనై యుండి,
నీదు మనోరథ మెట్లు సలుపంగ
      నేర్తు నే నిప్డు?"

(భార—ఆది. VIII, 133)

మధ్యాక్కర తరువాత, కొంచెము హాయి గూర్చునవి 'అంతరాక్కర', 'అల్పాక్కర' యును.

'అంతరాక్కర' ను గూర్చి ఏప్రిల్—65, 'భారతి' లో కొంత మనవి చేసియున్నాను. అది కర్ణాట చతుష్పద, ద్విపద మొదలగువాని చాయలలో నడచునట్లు తోచును.

ఉదాహరణము :

"తెలుఁగు సాహిత్య మెల్లఁ—దేజమ్ము నించి
వెలువమున జాతి నెల్ల—శ్రీకరము సేయఁ
దలచిన కవిత్రయము సం—థను గ్రహించియే
వెలసి రామీఁదఁ గావ్య—విదులగువారు."

(మదీయము)

అంతరాక్కరకు ఒక సూర్యగణము, రెండింద్రగణములు, ఒక చంద్రగణము పడవలెను. మూడవ గణము చివరి యక్షరమున యతి. దీనికి చిన్నకోట పెద్దన వార్గవ గణారంభమున యతి చెప్పి, తేటగీత చ్ఛాయలో నడపినాడు. (చూ. కావ్యాలం. VIII ఉల్లాసము.)

దీనికంటెను గూడ 'అల్పాక్కర' నడక అద్భుతముగా నుండును. పాదమునకు రెండింద్రగణములు, ఒక చంద్రగణము ఉండవలెను. మూడవ గణారంభమున యతి. ఇది సీసపాదముయొక్క ఉత్తరార్థ చ్ఛాయలో నడచును. లేక, 'హంసగతి' రగడ చ్ఛాయలో నుండును.

ఉదాహరణము :

"ఇంద్రుండు మఱియొక్క—యింద్రుఁ గూడి
చంద్రుతో నొడఁబడి—చనిన సత్క

వీంద్రు లల్పాక్కరం—బిది యందురు
చంద్రాస్య కవిజనా—శ్రయ కవీంద్ర."

(కవిజ. జాత్య. 29)

[హంసగతి రగడ : లక్షణసార సంగ్రహకర్త చిత్రకవి పెద్దనార్యుడు, 'ఉదాహరణ కావ్యము' నకు లక్ష్యముగా కూర్చిన 'హనుమదుదాహరణము' న సప్తమీ విభక్తిలో దీనిని కలికోత్కళికలందు చెప్పినాడు. కాని, దీని లక్షణమును రగడ (లక్ష్య లక్షణము)లు చెప్పుచోట చెప్పలేదు. ప్రసిద్ధములైన నవవిధ రగడలను చెప్పి, దీనిని పేర్కొననే లేదు. ప్రయోగించి మాత్రము చూపినాడు. అప్పకవియు దీనిని పేర్కొనకుండుటయు, లక్షణము చెప్పకుండుటయునే గాక, తాను గూర్చిన 'కృష్ణోదాహరణము' న అదే సప్తమీ విభక్తిలో ఈ 'హంసగతి' ని (పేరు చెప్పలేదు) కలికోత్కళికలందు చెప్పినాడు!

దీని లక్షణము : "పంచ మాత్రాక గణములు రెండు' త్రిమాత్రాక గణములు రెండు ఉండును. మూడవ గణారంభమున యతి. ప్రాసయతి లేకుండుటయు, రెండేసి పాదముల కొకటి చొప్పున ప్రాసమును, అంత్యప్రాసమును నియతముగా నుండుటయు రగడల సామాన్య లక్షణము."

పెద్దన యిచ్చిన లక్ష్యము :

"మణియు నుతి కెక్కు శ్రీ—మంతులందు
జరవక వరంబు లిడు—శాంతునందు
భావ సేవిత రామ—భద్రునందు
రావణ ముఖాసహ్య—రౌద్రునందు...."

(ల. సా. సం. II, 72 పు)

అప్పకవి యిచ్చిన లక్ష్యమునందు నాల్గవ పాదమున "ఛందోభంగము" (అప్పకవీయ పరిష్కర్తలచే సూచితము.) కన్పట్టుచున్నది. "విదళిత ఘోరారి—బృందునందు" (iv, 326.) ఇందు మొదటి గణము చతుర్మాత్రాకము గనుక ఛందోభంగము. దీనిని, "విదళిత క్రూరారి—బృందునందు" అని పఠించిన సరిపోవును. ఈ రగడను గూర్చి ప్రత్యేక వ్యాసము వ్రాయవలసి యున్నది. పెద్దలు పరిశీలింపగలరు.]

ఈ అల్పాక్కర, కమ్మగా పాడుకొనను గూడ అనువుగా నున్నది. ఈ క్రింది పాటతో సరిపోల్చి చూడుడు :

"శిలలపై శిల్పాలు—చెక్కినారు, (మనవాళ్ళు)
సృష్టికే అందాలు—తెచ్చినారు,
కనుచూపు కరువైన—వారికైనా
కనిపించి కనువిందు—కలిగించు (రీతి) గా ...."

ఆచార్య ఆత్రేయగారు రచించిన ("మంచి మనసులు" లోని) యీ పాట తొలి చరణము (కుండలీకరణములలోని మాటలు తీసివేసినచో) అంతయు—గణబంధమున—అల్పాక్కరను పోలి యున్నది.

ఇంక మొదటిదగు మహాక్కరను గూర్చి ఆలోచింతము. దాని లక్షణము : "పాదమునకు ఒక సూర్యగణము, ఐదింద్ర గణములు, ఒక చంద్రగణము ఉండును. ఐదవ గణారంభమున యతి. (మిగిలిన వివరములు తక్కిన జాతి పద్యములకు వలెనే) ఇది మహాక్కర సామాన్య లక్షణము."

ఉదాహరణము :

"అమరఁ బ్రావళ్ల రెండువాఁ జెలఁగి నా
లగుచోట విరతి యాదిత్యు మీఁద
నమరవతి రెండు మూఁడు నా ల్గయిదు నా
లగు తావులను నిల్పి సొబగు మీఱ
నమరఁ జేయుచుఁ జంద్రు నే డగుచోట
నదికిన యేడు గణములలోనఁ
గ్రమము తప్పక యుప్పాటు పెద్దయ
క్కర మొప్పుఁ గవి జనాశ్రయుఁడు చెప్పె."

(కవిజ. జాత్య. 25)

అన్ని పాదములయొక్క ఉత్తరార్ధములు మాత్రము చూచినచో (ఐదవ గణమునుండి కడపటి వఱకు), సీస పాదపు టుత్తరార్ధముల భణితి తోచుచున్నది. అల్పాక్కర, హంసగతి రగడల ఛాయలును కనిపించును. యతి విచారము వదలిన, మహాక్కరయొక్క ఉత్తరార్ధము అల్పాక్కర పాదమగును! ముందు దీనిని చక్కగా గుర్తుపట్టి, తరువాత పూర్వార్ధమును అతికించి చూడవలెను. మహాక్కర పూర్వభాగము, మొదటి మూడు గణముల వఱకు తేటగీతి పూర్వార్ధచ్ఛాయలో నడచును. అదే ఊపుతో మఱియొక ఇంద్రగణము పలికి, నిలిపి మహాక్కర యుత్తరార్ధమును అనుసంధానము చేయవలెను, అప్పుడు దీని నడక బోధపడును. ఏమైనను కొంత శ్రమయే తోచును. దీనిని తీర్చుటకు పదార్ధమును కొంచెము ఎక్కువే కావలెను. ఐనను, సీసము కంటె చిన్నది గనుక, పాదమున కొక్కచోటనే యతి గనుక— సీసమే తేలిక— దానికంటెను ఇది తేలిక !

ఐతే, సామాన్య లక్షణము ప్రకారము వ్రాయబడిన మహాక్కర ఐనచో ఈవిధముగా తంటాలుపడి నడక పట్టవచ్చును. కాని, దీనికి మినహాయింపులు గూడ కొన్ని యున్నవి. వాటితో దుంప తెగిపోవును. వ్రాయువారి కది సుఖమే గాని, చదువువారికి చావు, చచ్చిన కుజ్జిదూడ నీడ్చుకొని పోయినటే యుండును.

మహాక్కరకు మన లాక్షణికులు పచ్ఛికముగా అంగీకరించిన కొన్ని విశేష లక్షణములు :

(1) మొదట నుండవలసిన సూర్యగణము, రెండవచోట గాని, నాల్గవచోట గాని ఉండవచ్చును. అప్పుడు పాదారంభమున ఇంద్రగణ ముండును. పైన నుదాహరించిన కవిజనాశ్రయ మందలి పద్యములోని ఒకటి, మూడు పాదములను ఈవిధముగా విభజింపవచ్చును.

అమరఁ ద్రా | వళ్ల | రెండునాఁ | జెంగివా
అమరు జే | యుచుఁ జంద్రుఁ | వేడుగు | చోట—

కాని, యీ పాదములు సామాన్య లక్షణము ప్రకారము సరిపోవుచున్నవి, కాబట్టి విశేష లక్షణముతో ఇచ్చట ప్రసక్తి లేదు. కవిజనాశ్రయకారుడు ఈ విశేష లక్షణము చెప్పియుండలేదు. పైగా, 'క్రమము తప్పక ఒప్పునట్లు కవిజనాశ్రయుడు చెప్పె' నని లక్షణము గలదు.

విన్నకోట పెద్దన యిట్లు చెప్పియున్నాడు : "అరయ రెండవ నాల్గవచోట నర్కుం డయిననుం దనర్పుచుండ." (కావ్యాలం. viii ఉల్లాసము) అత డిచ్చిన మహాక్కర రెండు నాలుగు పాదములను ఇట్లు విభాగింపనగును :

అరయు | రెండవ | నాలవ | చోట్ల—
సారమై | ప్రాస | వడికవ | గణములు—

ఈ చివరి పాదమును సామాన్య లక్షణము ప్రకారమును సరిపెట్టవచ్చును

సార | మై ప్రాస | వడిసవ | గణములు—

ఈ విశేషమునే అప్పకవియు అనువాదము చేసినాడు. (మా. అప్ప. iv, 276).

(2) మొదటి సూర్యగణము అట్లే యున్నను, రెండవ చోట గావి, నాల్గవచోట గాని ఇంద్రగణమునకు బదులుగా ఒక సూర్యగణము వచ్చి నిలుచును.

ఈ విషయము ననంతు డిట్లు చెప్పెను : "ఆది హరిగొల్వ రెండును నాలుగు నగువానరంబున నర్కుండైన నాదరంబున నెడసొచ్చు." (ఛంద. iii, 40)

అనంతుని మహాక్కర నాల్గవ పాదము ఉదాహరణము:

ఆద | రంబున | నెడసొచ్చు | నని న—

(3) మొదట నుండు సూర్యగణముతోపాటు, రెండు నాలుగు చోట్లను రెండింద్రగణములకు బదులు రెండు సూర్యగణములు గూడ వచ్చి (మొత్తము మూడు సూర్యగణములు) నిలుచును.

ఈ విషయమును చిత్రకవి పెద్దన చెప్పెను : "రెండవ చోట నాల్గింటను వనజహిత గణంబైన వచ్చి వరుసతో నెడ సొచ్చు." (ల. సా. సం. ii, 103)

చిత్రకవి పెద్దన మహాక్కర మూడవ పాదము :

వనజ | హితగ | ణంబైన | వచ్చి—

ఇందే నాల్గవ పాదము : "హనుమ నాల్గవ గణముపై వళ్ల రాఁగ—"ఇందు గణభంగము చూపట్టుచున్నది :

హనుమ | నాల్గవ | గణముపై | వళ్లరాఁగ.

ఇందలి 'వళ్లరాఁగ' ను, 'వళ్లరా(న్)' అని సవరించవచ్చును, లేక, 'వలరాఁగ' నవిన సరిపోవును. 'వళ్ల(న్)' అనియైనను సవరణ చేయవచ్చును.

(4) "కన్నడమందు, మహాక్కరయొక్క రెండు నాలుగు పాదములందు ఆఱవ గణము 'బ్రహ్మగణము' కావలయును. బ్రహ్మ గణములు : నగణము, హగణము, గగము, నగణము— అనునవి నాలుగు."

ఈ విశేష లక్షణము, కావ్యాలంకార చూడామణి (ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారిది, 1920 సం. viii ఉల్లాసము, 26 వ) లో పుట యుడుగున మహాక్కరకు పాఠాంతరముగా నీయబడిన దానిలో నున్నట్లు తోచుచున్నది.

పాఠాంతరము :

"వారక పంచేంద్ర గణములు
వనజారియును గడిది వెలయుచుండు
నాఱవ రెండవ యాఱవ చోట్ల
నర్కుఁ డైనను దనర్పఁ
గోరి యొప్పటి పంచమ గణమునఁ
గూడి మొదల నిలువ
సారమై పరి నప్త గణములు
సాఁగ మహాక్షర మతిశయిల్లు."

ఐతే, దీనికి ఎంతో సంస్కారము అవసరమై యున్నది.

ఇందు చెప్పబడిన విషయము: "ఐదు ఇంద్రగణములును, ఒక చంద్రగణమును వదలక యుండును. (మొదటను?), రెండవ నాలుగవ, ఆఱవచోట్ల—(ఒక) సూర్యగణమైనను ఉండును (ఉండవలెను ?). ఐదవ గణారంభమున యతి యుండును. ఇట్లు ఏడు గణములతో మహాక్షరము అగును." అని దీని సారాంశము కావచ్చును.

ఈ విషయము దృష్టియం దుంచుకొని పై పాఠాంతరము నిట్లు సవరింపవచ్చును :

1 వ పాదము : ఐదవ గణారంభమున యతి యుండవలెను గనుక 'వనజారి'ని దీసి 'వనజ వైరి' ని పెట్టదగును. అప్పుడు నాల్గవ గణము సూర్యగణ మగును.

వారక | పంచేంద్ర | గణములు | వనజ |
వైరియు | ను గడిది | వెలయుచుండు;

2 వ పాదము : 'ఆఱవ' అను మాట రెండు పర్యాయములు వచ్చినందున ఒకదానిని 'నాలవ' గా పఠింపదగును. మొదటి 'ఆఱవ' ను 'నాలవ' చేసిన, 'ర—ల' ప్రాస మేర్పడును. ఇది విన్నట్లు పెద్దనకు సమ్మతమే యనను, 'అఖండయతి' పడును ! దీనిని పెద్దన అంగీకరించునా ? మొదటి 'ఆఱవ' ను అట్లే యుంచి తరువాతి 'ఆఱవ' ను 'నాలవ' చేసిన 'ర—ఱ' ప్రాస మేర్పడును ! ఇదియు పెద్దనకు సమ్మతము కాదుగదా ? మఱియు, "అర్కుం(డై)నను దనర్చు" అన్నచో ఒక యింద్ర గణము తక్కువ యగును, అందువలన దీనిని ఎట్లో సాగగొట్టి సరిపెట్టవలెను !

వాలవ | రెండవ | యాఱవ చోట్ల—
సరి సర్కుఁ | డై న | ను దనర్చుఁగాఁ

ఇప్పుడు 'సరి(వ్)' అను పట్టి గడ్డి దుఱిగి, 'తనర్చు' కు ఒక 'బులాకి' 'గా' తగిలించ వలసెను ! ఇందువలన ఆఱవ గణము సూర్యగణ మైనది !

3 వ పాదము : లక్షణములో చెప్పకపోయినను లక్ష్యములబట్టి, మొదట గూడ సూర్యగణము ఉండవచ్చునని తెలియుచున్నది. ఉత్తరార్ధమున మరల నొక యింద్రగణము తక్కువ పడినది. దానిని మరల కసవు దుఱిగి పూరింపవలెను !

గౌరి | యొప్పటి | పంచమ | గణమునఁ—
గూడి మొ | దలవిలు | వంగనగు

ఇప్పుడు అదనముగా చివర "ంగనగు" ను నింపవలసి వచ్చినది.

4 వ పాదము : దీనిలో పెద్ద చిక్కేమియు లేదు.

సార | మై పలి | సప్తగ | ణములు—
సాఁగము | హాక్ష ర | మతిశయిల్లు.

ఇందు వాల్గవ గణము సూర్యగణముగా పడినది. పడరా దన్నచో— ఇన్ని మార్పులిమి గదా !—దానిని 'ణంబులు' చేసిన సరిపోవును ! ఇంతదూరము దీనిపై కుస్తీ ఏల యనగా, ఆఱవ గణమున గూడ సూర్యగణము ఉంచదగునేమో యని, అది రచయితకు కొంత సౌలభ్య మనియును! దీని నిట్లు అంగీకరించు పక్షమున, అసలు మూలపాఠ మెట్లున్నదో గూడ పూర్తిగా పరిశీలింపవలసి యున్నది :

మూలపాఠము :

"వారి జాప్తుండు పంచేంద్ర గణములు
        వనజారియును గూడి వెలయుచుండ
వారయ రెండవ నాలవచోట్ల
        నర్కుం డయినను దనర్చు చుండఁ
గౌరి యువ్వడి పంచమ గణమునఁ
        గూడి మొదల విలువంగొనగు
సారమై ప్రాస వడి సప్తగణములు
        సాఁగ మహాక్షర మతిశయిల్లు."

నన్నయభట్టు, ఇట్టి విశేషములను గొన్నిటిని మధ్యాక్కరయందు ప్రయోగించి యున్నాడని "నన్నయ మధ్యాక్కర" యను నా వ్యాసము (ఆంధ్ర—దినపత్రిక, ఆదివారం—సారస్వతానుబంధం, 22—1—61) న వివరించి యున్నాను.

కడపట, 'మధురాక్కర' ను గూర్చి చూతము :

ఒక సూర్యగణము, మూ డింద్రగణములు, ఒక చంద్ర గణము ఉండును. వాల్గవ గణారంభమున యతి.


దీనిని నన్నయ ఒకటి, ఎఱ్ఱన రెండు వాడియున్నారు. మరల ప్రాచీను లెవ్వరును ప్రయోగింపలేదు. విశ్వనాథవారు కొన్ని చూపినారు.

ఈ పద్యపాదము, యతి స్థానము వఱకు—తేటగీతి పూర్వార్ధమువలె నడచును. తరువాత, ఇంద్రగణమును చంద్ర గణమును గలిపి మఱొక రకముగా నడక సాగించును.

ఉదాహరణము :

"క్షమఁడు వింద్రద్రతయుంబును
        వెందుతోఁ గూడుకొని
యెనయ నొక్కొక్క పాదమై
        యేను గణములతోడఁ
బెనఁచి మూఁటిపై వళ్లంచి
        బెరయఁ బ్రాసంబు లిడినఁ
దనరు మధురాక్కరం బన
        దనుజారి నీలకంఠ." (ల. సా. సం. ii, 105)

అచ్చపు తెనుగుజాతి పద్యములైన వీనిని తఱచు చూచిన కొలది వీని నడక స్ఫురించి, ఇవి సరిక్రొత్త ప్రయోగములకు మనస్సును ప్రేరేపించునని నా యభిప్రాయము.



ప్రజాస్వామ్యము: ఒక పరిశీలన

శ్రీ కల్లూరి బసవేశ్వరరావు
శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు

ప్రజాస్వామ్యమంటే యేమిటో అనేకులు రాజనీతి శాస్త్ర కోవిదులు అనేక విధాలుగా నిర్వచించి యున్నారు. మెయిన్ అనే పండితుడు ప్రజాస్వామ్యమంటే అధిక సంఖ్యాకుల పరిపాలనమని యన్నాడు. ఆక్స్ఫర్డ్ నిఘంటువులో ప్రత్యక్షంగా ప్రజలచేత గాని, వారి ప్రతినిధులచేత గాని నిర్వహింపబడే ప్రభుత్వమే ప్రజాస్వామ్యమని నిర్వచింపబడి యున్నది. ఏ ప్రభుత్వమునందు ప్రతి వ్యక్తి భాగస్వామి అవుతున్నాడో అదే ప్రజాస్వామ్య మన్నాడు ఆచార్య సీలే. ఏ ప్రభుత్వమునందు పరిపాలనాధికారము ఒక వర్గమునకు కాక సమాజంలోని సర్వ వ్యక్తులకూ స్వాధీనమై యుంటుందో అదే ప్రజాస్వామ్య మన్నాడు లార్డు బ్రైస్. లింకన్ మహాశయుడు ప్రజలచేత, ప్రజల కొఱకు నడుపబడే ప్రజల ప్రభుత్వమే ప్రజాస్వామ్య మన్నాడు. ఆంగ్లభాషలో ప్రజాస్వామ్యాన్ని "డెమోక్రసీ" అని అంటారు. "డెమోక్రసీ" అనునది ఒక సమాసం. ఆ సమాసంలో "డెమోస్" "క్రషియా" అను రెండు యవనభాషా పదాలున్నవి. "డెమోస్" అంటే ప్రజలని అర్థము. "క్రషియా" అంటే అధికారమని అర్థము. కాగా "డెమోక్రసీ" అంటే ప్రజాప్రభుత్వమని అర్థము చెప్పవచ్చును.

ఎవ రెన్ని విధాలుగా నిర్వచించినా ఒక్కటి మాత్రము సత్యము. అదేమిటంటే ప్రజాస్వామ్యము ఒక యుత్తమమయిన ప్రభుత్వ విధానము. ఈ ప్రభుత్వ విధానములో వయసు వచ్చిన స్త్రీ పురుషులు వోటువేసే హక్కు ద్వారా తమ ప్రభుత్వాన్ని తామే ఏర్పాటు చేసుకుంటారు. ఆవిధంగా ప్రతిష్ఠించుకొన్న ప్రభుత్వముపై ప్రజలు పర్యవేక్షణాధికారమునే కాక పూర్తి అజమాయిషీ కలిగియుంటారు. పైగా అత్యావశ్యక మనుకుంటే ఆ ప్రభుత్వాన్ని తొలగించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకొంటానికి అవకాశము కలిగియుంటారు. నియంతృక దేశాలలో తమ ప్రభుత్వాన్ని తామే ఏర్పఱచుకోటానికి గాని, ఆవశ్యకమైనచో దానిని తొలగించుకోటానికిగాని, ప్రజల కేమాత్రము అవకాశ ముండనే యుండదు. అందువలననే ప్రజాస్వామ్యము ఒక యుత్తమ ప్రభుత్వ పద్ధతిగా ప్రశంసింపబడుచున్నది.

ఎర్నెస్ట్ బార్కర్ వంటి ఆంగ్ల రాజనీతి వేత్తలు "చర్చాపూర్వకమైన ప్రభుత్వమే ప్రజాస్వామ్య"మని నిర్వచిస్తున్నారు. ప్రజాస్వామ్యము పనిచేసే తీరును పరిశీలించితే యీ నిర్వచనము ప్రశస్తమైనదిగానే గోచరిస్తుంది. ప్రజాస్వామ్యములో ప్రజలే సర్వాధికారులు. ప్రజల అభీష్టాలకు, అభిరుచులకు, అభిప్రాయాలకు అనుగుణముగా ఆ ప్రజల ప్రభుత్వము తన కార్య పంచయాన్ని ఎంచుకోవలసి యుంటుంది. అందుకు చర్చలు, విమర్శ ప్రతి విమర్శలు ఎంతో తోడ్పడుతాయి. అట్టి చర్చలకు, విమర్శ ప్రతి విమర్శలకు ప్రజాస్వామ్య సమాజాలలో అవకాశాలు అధికముగా ఉంటాయి. ప్రజాస్వామిక సమాజాలలో చర్చల సరళికి ముఖ్యముగా చతుర్విధాంగములు దోహదం చేస్తాయి. ఆ నాలు గంగాలు ఇవి. ఒకటి రాజకీయ పక్షాలు. రెండవది వోటర్ల సంఘాలు. మూడవది శాసన సభలు. నాల్గవది మంత్రి మండలి. ఈ నాలుగంగాలు చర్చలకు ఒక స్పష్ట రూపాన్ని కల్పించుటయే గాక, పరస్పరము సహకరించుకొనుటయూ అత్యవసరమే. వీనికి తోడు ప్రజాస్వామిక దేశాలలో ఇతర సంస్థలు కూడ చర్చల ధోరణికి, అభిప్రాయ ప్రకటనకూ సహాయపడతాయి. అటువంటి సంస్థలలో కార్మిక సంఘములు, విద్యాలయాలు, యువజన సంఘములు చెప్పుకోతగినవి. ఈ సందర్భమందే ప్రజల అభిప్రాయాలను ప్రకటించుటలో,

ప్రజల అభీష్టాలను ప్రచారము చేయుటలో, ఆ అభిప్రాయాభీష్టాలను సంస్కరించుటలో పత్రికలు నిర్వహించుచున్న పాత్ర ప్రశంసింపదగ్గది. ఈవిధంగా ప్రజాస్వామిక దేశాలలో ప్రజల దగ్గఱనుండి ప్రభుత్వస్థాయి దాక అఖిల రంగాల్లో అనంతమైన భావ ప్రసారము, అనన్యమైన విమర్శ ప్రతి విమర్శలు జరుగుతూ యుంటాయి. కాగా చర్చాపూర్వకమయిన ప్రభుత్వమే ప్రజాస్వామ్య మనుట సమంజసముగనే యున్నది. (Democracy is the Government by discussion.)

ప్రజాస్వామ్యము ఉత్తమమయిన రాజ్య వ్యవస్థయే గాక ఉదాత్తమయిన జీవిత విధానము కూడ. ప్రజాస్వామిక జీవన విధానానికి వ్యక్తియొక్క స్వేచ్ఛా వికాసములే మూల సూత్రాలు. సహజముగా హేతుశీలి యయిన మానవుడు స్వాతంత్ర్యేచ్ఛ ప్రేరేపింపగా సత్యమును అన్వేషించుతూ దాస్య నిగళాలను త్రెంచుకుంటూ స్వేచ్ఛాపథములో పురోగమించుచున్నాడని ప్రజాస్వామికవాదుల సిద్ధాంతము. స్వేచ్ఛాపథములో మానవుడు సాగించుచున్న యీ యాత్ర నిరవధిక మయినట్టిది. ఒక సమాజమూ లేక ఒక దేశమూ స్వేచ్ఛ ననుభవిస్తున్న దన్నప్పుడు, ఆ సమాజములో గాని, ఆదేశములో గాని, వ్యక్తి ఎంతవఱకు స్వేచ్ఛ ననుభవించుతూ, ఏవిధముగా సంస్కృతి సంపన్ను డవుతున్నా డన్నది ప్రధాన మైనట్టిది. ఎందుకంటే స్వేచ్ఛా సమాజానికి వ్యక్తి వికాసమే కొలత బద్ద. కాగా ప్రజాస్వామ్యము వ్యక్తి స్వేచ్ఛకూ, వ్యక్తి వికాసానికీ అగ్రతాంబూల మిస్తుంది. అయితే ప్రజాస్వామిక సమాజములో వ్యక్తి స్వేచ్ఛ ఏవిధముగా లభ్యమగుచున్నది? దానికి మార్గములేవి ? అను ప్రశ్నలు పుట్టుట సహజం. వ్యక్తి స్వేచ్ఛను ప్రోదిచేసే అతి ముఖ్యమైన ప్రాథమిక స్వత్వాలకు (Fundamental Rights) ప్రముఖ స్థాన ముంటుంది. అట్టి ప్రాథమికస్వత్వాలలో వాక్సభాస్వాతంత్ర్యములు, మత స్వాతంత్ర్యము, సంఘ స్థాపన స్వాతంత్ర్యము, శాసనబద్ధ పరిపాలనము అతి ప్రధాన మైనట్టివి. ప్రజాస్వామ్యమంటే చర్చాపూర్వకమయిన ప్రభుత్వము కాబట్టి ప్రజాస్వామిక జీవిత విధానములో భావ ప్రకటన స్వాతంత్ర్యము ప్రధాన లక్షణము కాక తప్పదు. ఆవిధముగనే ప్రజలు కార్మిక సంఘాల వంటి వానిని స్థాపించుకొనుటకూ, సభలలో పాల్గొనుటకూ, శాంతియుతముగా ప్రభుత్వ విధానాలనూ ప్రతిఘటించుటకూ ప్రజాస్వామిక సమాజము సకల సదుపాయాలను సమకూరుస్తుంది. ప్రతి పౌరుడూ తన అభిరుచులకు అనుగుణమైన మతాన్ని స్వీకరించి దానిని ప్రచారము చేసికొనుటకు ఆటంకమేమీ యుండదు. అంతేగాక శాసనాలను ఉల్లంఘింపనంతవఱకూ, ప్రజాస్వామ్యం ప్రతి వ్యక్తికి నిర్నిరోధమైన స్వేచ్ఛను ప్రసాదించుతుంది. ఆ శాసనములు రాజ్యాంగబద్ధము లగునా ? కావా ? అను విషయాన్ని నిర్ణయించునది పాలకవర్గము కానేకాదు. మఱి సర్వతంత్ర స్వతంత్రములైన న్యాయస్థానాలు మాత్రమే. అయితే పైన చెప్పబడిన స్వాతంత్ర్యములు నామ మాత్రముగా ప్రస్తావింపబడినంత మాత్రాన అది సత్యమయిన ప్రశస్తమయిన ప్రజాస్వామిక సమాజము కాదు. వానిని ప్రతి పౌరుడూ తన దైనందిన జీవనములో అనుభవింపవలయును. కాని సంఘములో ఆర్థికమైన హెచ్చు లొచ్చులవల్ల అనేకులకీ స్వాతంత్ర్యాలు ఆకాశ కుసుమముల మాదిరిగా ఐపోతాయి. ఈ దుస్థితిని తొలగించుటకై ప్రజాస్వామిక జీవన విధానము ఆర్థిక సమానత్వానికీ, అధికార వికేంద్రీకరణమునకూ అగ్రస్థాన మియ్యక తప్పదు. ఇంతవఱకూ చెప్పుకొన్న దానినిబట్టి ప్రజాస్వామ్యము ఉత్తమమయిన ప్రభుత్వ పద్ధతియే గాక, ఉదాత్తమయిన జీవన విధాన మనియూ, ఈ జీవన విధానమునకు వ్యక్తి స్వేచ్ఛా వికాసములే పునాది రాలనియూ, ఆ స్వేచ్ఛా వికాసములు వాక్సభా స్వాతంత్ర్యాది ప్రాథమిక స్వత్వముల నుండి ప్రాదుర్భవించుననియూ, ఆ స్వత్వములు సంపూర్ణముగా అనుభవనీయములు కావాలంటే ఆర్థిక సమానత్వమూ, అధికార వికేంద్రీకరణమూ ప్రజాస్వామిక జీవన పద్ధతికి ప్రధాన లక్షణములై భాసిల్లవలె ననియూ నిగ్గుతేలినది..

ప్రజాస్వామ్యము చరిత్ర

ప్రజాస్వామ్యాన్ని—ప్రత్యేక రాజ్య వ్యవస్థగా—పరిశీలించునప్పుడు గత కాలములో అది యెట్లా చెల్లుబడి యైనదో స్థూలముగా నైనా వివరింపక తప్పదు. ప్రాచీన కాలములో ఏథెన్సు వంటి యవన నగర రాజ్యాలలో ప్రజాస్వామ్యము పరిఢవిల్లినదని కొందఱు భావింతురు. కాని ఏథెన్సులోని ప్రజాస్వామ్యము అనేక లోపాలవల్ల అనతి కాలములోనే పతన మయినది. ఆ లోపాలలో ముఖ్యమైన వానిని కొన్నిటినైనా తెలిసికొనుట మంచిది. ఏథెన్సు నగర వాసులలో నూటికి పదిమంది మాత్రమే ప్రజాస్వామిక స్వత్వాలను అనుభవించెడివారు. ఉదాహరణమునకు ఆనాటి స్త్రీలకుగాని, బానిసలకు గాని రాజకీయాధికారాలు లేవు. ఏథెన్సు నగర పౌరులలో సాంఘిక సామరస్యము లేదు. సంఘములో పై తరగతుల వారిని—ముఖ్యముగా శ్రీమంతులను—క్రింది తరగతులవారు తీవ్రముగా ఎదుర్కొన్నారు. వారు ప్రజాస్వామిక విధానమువల్ల తమకు లభించిన అధికారాలను ఆధారముగా చేసుకొని సంపన్నుల జీవితాన్ని దుర్భరము చేసినారు. శ్రీమంతుల నడుము విఱుగగొట్టుటకై పన్నుల

ప్రబలముగా విధించిరి. ఈ దుర్భర జీవితమునుండి విముక్తి పొందుటకై పై తరగతులవారు ఏథేన్సు నగరమును వీడి మాసిడోనియా వంటి దేశములకు వలస పోయిరి. యూరిపిడీస్, అగథాన్ వంటి ప్రజ్ఞామూర్తుల జీవిత చరిత్రయే దీనికి తార్కాణము. ఏథేన్సు నగర ప్రజాస్వామ్యములో మరొక దోషము పరిపాలనకు సంబంధించి నట్టిది. ప్రభుత్వోద్యోగుల సంఖ్య బహుళము కాగా కోశాగారములోని ధనమంతయూ వారి సంబళములకే సరిపోయెడిది. అంతేగాక ఏథేన్సు ప్రజాపతులు విదేశాంగ విధానమును చక్కదిద్దుటలో విఫలులైరి. యుద్ధ నిర్వహణములో పరాజయముల పాలైరి. ఏథేన్సులోనే కాక ఇతర యవన నగరాలలో సైతమూ ప్రజాస్వామ్యము ఇటువంటి దోషలవల్లనే కాలగర్భములో కలసిపోయినది. ఆనాటి యవన తత్త్వవేత్తలలో ప్లేటో, అరిస్టాటిల్ పేరుపొందినవారు. వారు స్వకీయ గ్రంథములలో ప్రజారాజ్య వ్యవస్థ యందలి దోషాలను తీక్ష్ణముగా విమర్శించిరి. అరిస్టాటిల్ "పాలిటిక్స్" అను తన గ్రంథములో అల్పసంఖ్యాక వర్గమునకు ప్రజాస్వామిక విధానములో ధర్మమూ, రక్షణమూ లభింపవని స్పష్టముగా చాటినాడు. "అధిక సంఖ్యాకులు ఏకగ్రీవముగా అంగీకరించినదే ధర్మమని ప్రజాస్వామిక వాదులు వక్కాణింతురు ..... అధిక సంఖ్యాకుల ఏకైక సంకల్పమే ధర్మ మయినచో .... వారు ధర్మహీనులై అల్పసంఖ్యాకులగు శ్రీమంతుల సంపత్తిని జప్తు చేయుదురు." (Democrats say that Justice is that to which the majority agree. .if Justice is the will of the majority... they will unjustly confiscate the property of the wealthy minority.)

యవన నగర రాజ్యాలలో ప్రజాస్వామ్యము పతనమైన పిమ్మట అది కొంతకాలముపాటు రోమక సామ్రాజ్యములో రూఢికెక్కినది. కాని అక్కడ నిరంకుశ రాజన్య ప్రవృత్తి ప్రజాస్వామ్యమును పంచబంగాళము చేసినది. ప్రాచీన కాలములో యవన రోమక నగర రాజ్యాలలోనే కాక, భారతదేశము చైనా వంటి ప్రాచ్య దేశములలో సైతమూ ప్రజాస్వామిక వ్యవస్థ ప్రకాశించినట్లుగా చారిత్రక సాక్ష్యము లభించినది. బుద్ధభగవానునకు ముందే ఆర్యావర్తములో గణుతికెక్కిన గణ రాజ్యములు (Republican states) అనేకమున్నట్లు నిశ్శంకముగా చెప్పగలము. కాని యీ గణరాజ్య తంత్ర మెట్టిదో, అది ఏవిధముగా పరిపోషిత మైనదో, దాని ప్రాగుణ్యము లెట్టివో వ్యాఖ్యానించుటకు తగిన సామగ్రి యింకనూ లభింపలేదు.

నవీన యుగములో ప్రజాస్వామ్యము తలయెత్తి రెండు వందలేండ్లు కూడ కాలేదు. 1775 వ సంవత్సరములో అమెరికా స్వాతంత్ర్య యుద్ధము సంభవించినది. 1914 వ సంవత్సరములో ప్రథమ ప్రపంచ సంగ్రామము జరిగినది. ఈ మధ్యకాలములో ప్రజారాజ్య వ్యవస్థ ఫ్రాంసులో, ఇంగ్లండులో, హాలెండులో, స్విట్జర్లాండులో అమెరికా వంటి దేశములలో క్రమక్రమముగా పాదుకొని అభివృద్ధి చెందినది. ఈ కాలములోనే ప్రజారాజ్య తంత్రము ఒక శాస్త్ర రూపమును పొందినది. ఆ శాస్త్రరూపము నేర్పఱచుటకు పలువురు ప్రజాస్వామిక వాదులు సహాయభూతులైరి. వారిలో లాక్, జెఫర్సన్, అబ్రహాం లింకన్, టామ్ పెయిన్, వాల్టేర్, రూసో, టిటూక్విల్లీ, జెరిమీ బెంథామ్, జాన్ స్టూవర్ట్ మిల్ జగత్ప్రసిద్ధులు. వారి గ్రంథములు ప్రజాస్వామ్యమునందలి మూలసూత్రాలను క్షోదక్షమముగా పరామర్శించినవి. ముఖ్యముగా జె. యస్. మిల్ వ్రాసిన "ప్రాతినిధ్య ప్రభుత్వము" (Representative Government) "స్వేచ్ఛ" (Liberty) లనాటికీ ప్రామాణిక గ్రంథములే.

పదునెనిమిదవ శతాబ్దములో బయలుదేరిన విప్లవాలలో పారిశ్రామిక విప్లవము అతి ప్రధాన మయినట్టిది. శాస్త్రవేత్త లనేకులు కనిపెట్టిన యంత్రముల మూలముగా ఈ విప్లవము తొలుత ఇంగ్లండులో పాదునూపినది. ఇంగ్లండునుండి యిది బెల్జియం, ఫ్రాంసు మున్నగు దేశాలకు ప్రాకినది. ఈ పారిశ్రామిక విప్లవము ఆర్థికరంగములో విప్లవకములయిన పరిణామములను ప్రవేశపెట్టినది. ఇతఃపూర్వమున్న యుత్పత్తిసాధనముల స్థానములో నూతనోత్పత్తిసాధనములు నెలకొల్పబడినవి. యంత్రములు నెలకొల్పబడుటచే యంత్రాగారములు వెలసి, యుత్పత్తి అధికముగా కొనసాగినది. పరిశ్రమలతోపాటు పట్టణములు పెరిగినవి. ధనికవాద వ్యవస్థ (Capitalism) తలయెత్తినది. సమాజములో పెట్టుబడిదారులూ, శ్రామికులూ అను రెండు తెగలేర్పడినవి. ఈ రెండు తెగల నడుమ నున్న విభేదమును బట్టి సంఘములో సామరస్యము విచ్ఛిన్నమయినది. "పారిశ్రామిక విప్లవము క్షేత్రమునుండి కర్మాగారమునకు, గ్రామమునుండి నగరమునకు, వ్యవసాయమునుండి పరిశ్రమకు వలస పోవునట్లు చేసినది. పారిశ్రామిక ధనికవాద వ్యవస్థను జనింప జేసినది. నిర్వహణ లక్ష్యములపట్ల నిశితభావ భేదములు గల శ్రీమంతులూ, శ్రమైకజీవులూ అను రెండు సాంఘిక వర్గములను సృష్టించినది." (The Industrial Revolution brought about a migration from farm to factory, from country to city, from agriculture to industry; and brought into relief the capitalistic system of industry, the two social classes, the bourgeoisie and proletariat, being sharply differentiated in functon and interests.)

పారిశ్రామిక విప్లవమునకు పిదప పొడుకొన్న ధనికవాద వ్యవస్థలో పెట్టుబడిదారుల అధిక లాభాపేక్ష హేతువుగా శ్రామికుల జీవితము దుర్భరమయినది. ఆర్థికరంగములో "నిర్నిరోధ వ్యాపార సూత్రము" ను (Laissez-faire) అమలుపఱచిన ఆనాటి ప్రభుత్వాలు కార్మికుల దైన్యమును ప్రబద్దలు చేయుటకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. అందుచే జాతీయ సంపత్తి అంతా కొలదిమంది చేతులలో గూడు కట్టుకోగా, అధిక సంఖ్యాకులు దరిద్రులైనారు. ఈ సమయములోనే "నిర్నిరోధ వ్యాపార సూత్రము ప్రాతిపదికగా గల పెట్టుబడిదారీ విధానము తగదనియూ, ఉత్పత్తి సాధనములు కేవల వ్యక్తుల సంపూర్ణాధికారమునకు లోబడి యుండరాదనియూ, ఆర్థికరంగములో ప్రభుత్వ యాజమాన్యము ఆవశ్యకమనియూ, ఒక నూతన సిద్ధాంతము ప్రచలితమైనది. ధనికవాద ఆర్థికవ్యవస్థకు ప్రతి ద్వంద్వముగా ప్రచలితమైన యీ సిద్ధాంతమునే "సామ్యవాదము" (Socialism) అని యందురు. పందొమ్మిదవ శతాబ్దములో సెయింట్ సైమన్, రాబర్ట్ వోవెన్, ఛార్లెస్ ఫోరియర్ అనువారు సామ్యవాద భావ బీజాలను పుష్కలముగా వెదజల్లిరి. ఇంగ్లాండులో కూడ సామ్యవాద సిద్ధాంతము మేధావులను ఆకర్షించినది. వెబ్ దంపతులు, బెర్నార్డ్ షా, ప్రొఫెసర్ కోల్, లాస్కి, హెచ్. జి. వెల్స్, లార్డ్ బీవరిడ్జి మున్నగువారు సామ్యవాద సిద్ధాంతములను వెలుగునకు తెచ్చిరి. వారు ధనికవాద ప్రజాస్వామ్యమును, సామ్యవాద ప్రజాస్వామ్యముగా మార్చవలెనని ప్రయత్నించిరి. ప్రజాస్వామ్యము ధనికవాద దోష దూషిత మౌటచే విఫల మయినదని వారి వాదము. ఆర్థిక సమానత్వము ముఖ్యమైన సమాజములో రాజకీయ స్వేచ్ఛ మనజాలదని వారి మతము. రాజకీయ స్వేచ్ఛను రక్షింపజేసే ప్రజాస్వామ్యము ఆర్థిక సమానత్వానికి ఆదరువైన సామ్యవాదముతో ఏకము కావలె ననునదే వారి యుద్దేశ్యము. వారి అభిప్రాయముల ప్రకారము ప్రజాస్వామ్యము సాధనము. సామ్యవాద సమాజము సాధ్యము. అందుచే వారి యీ సిద్ధాంతమును "ప్రజాస్వామిక సామ్యవాదము" (Democratic Socialism) అని పేర్కొనవచ్చును. ప్రజాస్వామిక సామ్యవాదులు జాతి ఆర్థిక జీవనము మీద ప్రభుత్వము పార్శ్వపత్తము కలిగియుండాలని, ఆర్థికరంగములో ప్రభుత్వ నిర్వహణము అత్యావశ్యకమని భావింతురు. ఉత్పత్తి సాధనములు ప్రభుత్వ పరతంత్రములై యుండవలయునని అంగీకరింతురు. అప్పుడే సాంఘికాభ్యుదయము సంభవించుచుండని వారి భావన. ఈవిధముగా ప్రజాస్వామ్యమును సామ్యవాదముతో జోడించు తీరును ఆవాడే కొందఱు రాజనీతి విశారదులు ఖండించిరి. ఖండించుటకు హేతువు లేమిటి? ప్రజాస్వామ్యము, సామ్యవాదము—ఈ రెండునూ విరుద్ధమయిన రాద్ధాంతాలు. ప్రజాస్వామ్యములో వ్యక్తి స్వేచ్ఛకూ, అధికార వికేంద్రీకరణమునకూ అత్యధిక ప్రాధాన్య మున్నది. నిజముగా ఈ రెండే ప్రజారాజ్య వ్యవస్థకు మూలస్తంభాలు. సామ్యవాదములో వ్యక్తి స్వేచ్ఛకు స్థానమే లేదు. సామ్యవాద రాజ్యాలలో రాజ్య వ్యవస్థ విరాట్పురుషుని వంటిది. అట వ్యక్తి రాజ్య వ్యవస్థకు దాసుడు. అతని పురుషార్థచింతన మంతయూ ఆ రాజ్య వ్యవస్థకు అంగ మగుటయో లేక బలి యగుటయో తప్పదు. వ్యక్తి బాహ్యాభ్యంతర జీవితములను రెంటినీ రాజ్య వ్యవస్థయే శాసించును. ప్రజాస్వామ్యములో వ్యక్తి ప్రభుత్వము మీద తన ముద్ర వేయుగా, సామ్యవాద వ్యవస్థలో ప్రభుత్వమే వ్యక్తిని కీలుబొమ్మగా చేసి ఆడించును. ఇంతెందుకూ! ప్రభుత్వమే సర్వ వ్యవహారములలో తగుదునమ్మా యని ప్రతి మాటికి జోక్యము కలుగజేసుకొని చరమ నిర్ణయములు చేయును. తత్ఫలముగా వ్యక్తి ప్రభుత్వ మహా యంత్రములో ఒక చీలయై పోవును. అతనిలో నున్న సహజశక్తులు గగ్గుల కాల్చైపోయి, చౌఱవ చచ్చిపోవును. అందుచే ప్రజాస్వామిక సామ్యవాదమువల్ల ప్రజాసామ్యము వంచబంగాళ మవునని వీరి సిద్ధాంతము, ప్రజాస్వామిక స్వామ్యవాదులు వాంఛించు ప్రభుత్వము చరమ ఘట్టములో నిరంకుశత్వముగా ఫలించునని వారి నిర్ణయము. ఈవిధముగా సామ్యవాదమును ప్రజాస్వామ్యమునకు అతుకుటను వ్యతిరేకించిన విజ్ఞులలో "హిలారి బెల్లాక్" ప్రాతః సంస్మరణీయుడు. ఆయన 1912 సంవత్సరమునందే "ది సెర్వైల్ స్టేట్" అను స్వీయ గ్రంథములో తన వాదమును నిరూపించెను.

సామ్యవాదులలో రెండు తెగ లున్నవి. "మితవాద సామ్యవాదులు", "అతివాద సామ్యవాదులు" అనబడువారే ఆ రెండు తెగలు. ఒకవైపు మితవాద ప్రజాస్వామ్యవాదులు ప్రజాస్వామ్యమును, సామ్యవాదమును ఒకే గాటను కటి వేయుటకు కృషి చేయుచుండగా, మఱొకవైపు అతివాద సామ్యవాదులు ప్రజాస్వామ్యమునకే ఎసరు పెట్టిరి. వారిల లూయీ బ్లాంక్, ప్రౌఢన్, కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ ఎన్నదగినవారు. వీరి సిద్ధాంత మీవిధంగా నుండును: "పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య" మనగా ఏమో కాదు. అది అల్పసంఖ్యాకులగు శ్రీమంతులు అధిక సంఖ్యాకులయిన శ్రామికులను అణగద్రొక్కు క్రూర ఘోర నిరంకుశత్వము. అంతేగాక ఆ రాజ్య వ్యవస్థ కేవలము పెట్టుబడిదారుల కొఱముట్టు. దానిని కూలద్రోయుటకు విప్లవము వినా మఱొక మార్గము లేదు. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యమును పట్టి పల్లార్చి,

శ్రామిక నిరంకుశత్వము ద్వారా సమ సమాజమును (Commuoism) సంస్థాపించుటయే అభ్యుదయము. ఈ అభ్యుదయ పూర్వకమయిన చారిత్రక గతి అనివార్యము. సమ సమాజవాదములో అనేక దోషము లున్నవి. వాని నిట ప్రస్తావింపవలసిన అక్కఱలేదు. కాని, ప్రధానమయిన, అనవరతమూ జ్ఞప్తి యందుంచుకోవలసిన సత్య మొకటి యున్నది. అది యిది. సమసమాజ వాదము ప్రజాస్వామ్యమును సంపూర్ణముగా త్రోసిరాజన్నది. రష్యలో 1917 సంవత్సరములో కార్మిక కర్షక నిరంకుశ ప్రభుత్వము పాదుకొన్నది. అప్పటినుండియూ సమ సమాజ వాదము సర్వవిధములా ప్రజాస్వామ్యమునకు ప్రతిద్వంద్వియై ఆచరణకు వచ్చినది.

ప్రథమ ప్రపంచ సంగ్రామము సామ్రాజ్యవాద దేశములు వలసల కొఱకు చేసికొన్న కయ్యమని కొందఱు వర్ణింతురు. కాని ఉడ్రోవిల్సన్ పేర్కొనినట్లుగా ఆ యుద్ధము ప్రజాస్వామ్యమునకూ నిరంకుశత్వమునకూ నడుమ పుట్టిన పోరు. ప్రజాస్వామ్యమును పరిరక్షించుట కొఱకే అమెరికా ఆ యుద్ధ ప్రాంగణములో కాలుమోపినదని ఆయన పేర్కొన్నాడు. ఆ సమరములో ప్రజాస్వామిక దేశములకు విజయము కలుగుటచేత ప్రజాస్వామ్యము గండము గడచి గట్టెక్కినట్లయినది. యుద్ధానంతరము జర్మనీ, ఇటలీ, పోలెండ్, జెకోస్లొవేకియా, ఆస్ట్రియా మున్నగు దేశములు ప్రజాస్వామిక ప్రభుత్వాలను ప్రతిష్ఠించుకొన్నవి. అది ప్రజాస్వామ్యానికొక ప్రబల విజయమే. కాని అచిరకాలములో ఆర్థికమాంద్యము, ద్రవ్యోల్బణము నిరుద్యోగము మొదలయిన సంక్షోభాలచేత క్రొత్తగా నెలకొన్న ప్రజాస్వామిక ప్రభుత్వములు బలహీనపడినవి. ఆ పరిస్థితులలో జర్మనీ—ఇటలీలలో నాజీ—ఫాసిస్టు నిరంకుశ ప్రభుత్వము లేర్పడి ప్రజాస్వామ్యమును కబళించినవి. అవి తమ సైన్య బలమును పెంపొందింప జేసుకొని యితర దేశములమీద దండెత్తుటచేత 1939 సంవత్సరములో ద్వితీయ ప్రపంచ సంగ్రామము అనివార్యమై అవతరించినది. ప్రజాస్వామిక దేశములు, సమ సమాజవాద దేశమయిన రష్య ఏకమై నాజీ నియంతలను, ఫాసిష్టు శక్తులను వోడించి మానవత్వమునకే మహోపకారము చేసినవి.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరము అంతర్జాతీయ రాజకీయ రంగమునందు అనేక పరిణామములు ఆవిర్భవించినవి. రవి యస్తమించని సామ్రాజ్యమును ఏకచ్ఛత్రాధిపత్యముగా ఏలిన ఇంగ్లండు క్రమక్రమముగా తన వలసలకు స్వాతంత్ర్యమును ప్రసాదించినది. ఆనాడు స్వతంత్రము పొందిన ఆసియా దేశములలో భారతదేశము బర్మా ప్రముఖమయినవి. ద్విజాతి సిద్ధాంతము ప్రాతిపదికగా భారతదేశము రెండుగా చీలిపోయినది. పాకిస్థానము ఏర్పడినది. ఒలందుల ఏలుబడికి స్వస్తి చెప్పి ఇండోనేషియా స్వతంత్ర మయినది. ఇండోచైనా భూభాగమును ఏలిన ఫ్రాంసు కూడా నిష్ప్రయోజనకరమయిన యుద్ధమును కొనసాగించి, తుద కటునుండి తొలగిపోవక తప్పలేదు. ఇటీవల మలయా స్వతంత్రమై, సింగపూర్ మున్నగు భూఖండములతో మలేసియాగా రూపొందినది. ఇది ఆసియాఖండమునకు సంబంధించిన గాథ. ద్వితీయ ప్రపంచ యుద్ధమునకు తరువాత పేర్కొనదగిన వానిలో ముఖ్యమయినది ఆఫ్రికా దేశముల చైతన్యము. ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, బెల్జియం—ఈ దేశములు తమ ఆఫ్రికా వలసలకు స్వాతంత్ర్యము నొసగినవి. ఈ యొసగుట ప్రజా స్వాతంత్ర్య యుద్ధములచేత గాని, కాల ప్రభావమును గుర్తించుట చేత గాని సంభవించినది. మఱికొన్ని ఆఫ్రికా దేశములు పాశ్చాత్య దేశములకు ముక్కుడి గులాములయిన ప్రభువులను పడద్రోసి ప్రజాప్రభుత్వములను ఏర్పఱచుకొన్నవి. ఎటు చూచినప్పటికి ఇంకను వలసలను పట్టుకొని ప్రాకుచున్నది ఒక్క పోర్చుగీసు దేశమే. భారతదేశము సాత్త్విక పద్ధతులు విఫలముకాగా, బలప్రయోగముతో గోవాను డామన్‌డయ్యూలను లోపఱచుకొన్నది. ఆఫ్రికాలోని అంగోలా మొజాంబిక్‌లను విడుటకు పోర్చుగీసు దేశము అంగీకరించుటలేదు. ప్రపంచ ప్రజాభిప్రాయమును తృణీకరించుచున్న ఆ దేశమును పారద్రోలవలయునను జాతీయవాదులు దేశాంతరముల సహకార సానుభూతులతో జాతీయోద్యమమును కొనసాగించుచునే యున్నారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరము ప్రపంచములో అగ్రరాజ్యము లనబడు వాని మధ్య ప్రాభవ తారతమ్యము గోచరించినది. వలసలను వీడిన ఆంగ్లదేశము ఇతఃపూర్వ ప్రాభవమును కోలుపోయి ప్రథమశ్రేణి దేశముగా కాక, ద్వితీయశ్రేణి దేశ మయినది. ఫ్రాంసు దేశము అస్థిర ప్రభుత్వముల వలన అంతకుముందు అంతంత మాత్రముగా నున్న ప్రాభవమును—వలసలు వదలుటతో—సంపూర్ణముగా కోల్పోయినది. పాశ్చాత్య దేశములలో కుబేర సంపత్తితో, రాజకీయ చైతన్యముతో ప్రకాశించుచున్న దేశము ఒక్క అమెరికాయే. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరము స్వేచ్ఛా ప్రపంచమునకు నాయకత్వము వహించినది అమెరికా. ప్రజాస్వామ్య పరిరక్షణార్థము అమెరికా దీక్షాకంకణమును ధరించినది. సామ్యవాద రాజ్యములకు రష్య దేశము నాయకత్వము వహించినది. ప్రపంచ రాజ్యము లన్నియు స్థూలముగా రెండు కూటములుగా బద్ధ లయినవి. ఒక కాలక్రమముగా చెప్పవలయు నన్నచో జాన్ ఫాస్టర్ డల్లెస్ పదవీకాల మంతయు అమెరికా, రష్య కూటముల కుమ్ములాటతో గడచిపోయినది. ప్రజాస్వామ్య వ్యవస్థను

కాపాడవలయునని అమెరికా ప్రయత్నింపగా, సామ్యవాద భావ బీజముల వెదజల్లుటకు రష్యా పూనుకొన్నది. క్రొత్తగా స్వాతంత్ర్యము పొందిన దేశములను లాలించుటకీ రెండు దేశములు ప్రయత్నించినవి; ప్రయత్నించుచున్నవి. అమెరికా ప్రజాస్వామ్యమును ప్రోది చేయుటకై మిత్ర దేశములతో సైనిక కూటములను ఏర్పఱచినది. సామ్యవాద దేశముల చుట్టు పట్టుల స్కంధావారముల కంచెను నాటినది. సరిగా ఈ సమయములోనే ఈ రెండు కూటములకు దూరముగా నుండి వానిమధ్య సామరస్యమును స్థాపించుటకు, స్వతంత్ర రాజ్యము లొక కొన్ని విబంధ విధానము నవలంబించి, పురోభివృద్ధి సాధించుట మొదలిడినవి. అట్టి రాజ్యములకు మార్గదర్శక మయినది భారతదేశము. జవాహర్‌లాల్ నెహ్రూ విదేశాంగ విధానము ప్రథమ దశయందే ఈ విబంధ విధానము నవలంబించి ప్రచారము చేయుటయే యని చెప్పవచ్చును. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరము ఆసియా దేశములో కలిగిన మఱొక పెద్ద మార్పు చైనా సామ్యవాద దేశముగా అవతరించుట. ప్రపంచములో మొదట అనేక రాజ్యములు చైనాను వెలివేసినవి. చైనా యొక అస్పృశ్య రాజ్యముగా చుట్టు నాలుగు గోడలు కట్టుకొన్నది. ఎటు తిరిగి మొదటి బాండుంగ్ సభ తర్వాతనే చైనా తన ఏకాంతవాసమును ఉల్లంఘించి, అంతర్జాతీయ రంగములో ప్రముఖపాత్ర వహించుట మొదలిడినది. చైనా యుత్తమ గుణములను గూర్చి ప్రపంచమంతటా బాకాలూది చాటి, దాని ప్రాభవమును ఇబ్బడిగా ముబ్బడిగా పెంచిన దేశము భారతదేశము అన్న విషయము మిత్రరాజ్య సమితిలో, తదితర వేదికలమీద భారత ప్రభుత్వ నాయకులు దాని ప్రతినిధులు చేసిన ప్రసంగములు విన్నవారికి చదివినవారికి తేటతెల్లమే.

అయినచో ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరము ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచములో ఏ రూపములో నున్నది ? స్వతంత్రములయిన దేశము లన్నియు మొదట పాశ్చాత్య సంస్కృతి ప్రభావముచే ప్రజాస్వామ్యమునే వరించినవి. కాని, అనేక కారణములనుబట్టి కొన్ని కొన్ని దేశములలో ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ శిథిలమయినది. అట్టిచో ఆ దేశములలో ఈ ఒక ముఖ్య సైనికాధికారియో, ప్రముఖ జాతీయ నాయకుడో ప్రభుత్వ సారథి యగును. ఖండముల క్రమములో ఈ పరిణామమును పరిశీలింతము. పాకిస్థానులో అధ్యక్షుడగు స్కందర్ మీర్జాను తొలగించి, అయూబ్‌ఖాన్ గద్దె ఎక్కెను. అతడు ప్రజాస్వామ్యమును ఉడిచిపెట్టి, నిరంకుశ విధానములతో కూడిన రాజ్యాంగమును అమలుపఱచుచున్నాడు. విశేష మేమనగా ఆ నియంత ఆ రాజ్యాంగమును ప్రజాస్వామ్య వ్యవస్థ యనుచున్నాడు. ఆ ప్రజాస్వామ్య వ్యవస్థ పేరు "ప్రాతిపదిక ప్రజాస్వామ్యము" (Basic Democracy). ఈ వ్యవస్థలో ప్రాథమిక స్వత్వముల స్వరూపము ప్రభుత్వాధిపతుల అభిరుచి భేదమునుబట్టి మాఱును. ఒక మితిలో ప్రతిపక్షములు చెల్లును. నేపాలమునందు మహేంద్ర రాజా కోయిరాలా ప్రభుత్వమును రద్దుపఱచి, వివిధ వర్గములకు ప్రాతినిధ్యము గల సభల నేర్పఱచి "పంచాయతి ప్రజాస్వామ్యము"ను పాదుకొల్పెను. ఆ రాజుగారి అగ్రహానుగ్రహములనుబట్టి ప్రజానాయకులు ప్రభుత్వమునుండి తొలగుటయో, దానిలో చేరుటయో సంభవించుచున్నవి. బర్మాలో నున్నది విప్లవక సామ్యవాద సైనిక నిరంకుశత్వము. దాని కధిపతి నెవిన్. కొంతమంది సైనికాధికారులు లొక మండలిగా నేర్పడి, ఆ యధిపతికి చేదోడు వాదోడుగా నుందురు. రాజకీయ పక్షము లట లేవు. ఏ స్వాతంత్ర్యమూ ఆ దేశములో లేదు. మలయా సింగపూర్, సారవాక్, బ్రునై ఏకము కాగా ఏర్పడిన మలేసియాలో ప్రజాస్వామ్య మున్నది. ఇక ఇండోనేసియా యున్నది. దాని కధిపతి సుకర్నో. ఆయన ఆదేశము పాలిటి కారణజన్ముడయిన అవతార పురుషుడు. "నా విష్ణుః పృథివీపతిః" అను ఆర్యోక్తి ఆయనవట్ల నూటికి నూరుపాళ్ళు చెల్లును. ఇండోనీసియాలో ప్రజాస్వామ్యము లేదు. మఱియున్నది సుకర్నో రాగద్వేషములనుబట్టి మార్పులు చెందు ప్రభుత్వము. సామ్యవాద నిరంకుశతాచ్ఛాయలు గలది ప్రభుత్వము. అయినను దానిని సుకర్నో ప్రజాస్వామ్యమనుచున్నాడు. దాని పేరు "ప్రచోదిత ప్రజాస్వామ్యము" (Guided Democracy). జపాన్, ఫిలిప్పైన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో ప్రజాస్వామ్య భేదములు నిలబడి యున్నవి. చైనా, ఉత్తర కొరియా, ఉత్తర వియత్నాం సామ్యవాద రాజ్యములు. కంబోడియా ప్రజా ప్రతినిధుల సభకు పూచీపడియున్న ఏకైక నాయక ప్రభుత్వము. మిగిలిన ఆసియా దేశములలో సైనిక నిరంకుశత్వ మున్నదో, ప్రజాస్వామ్య మున్నదో లేక ప్రత్యేక లక్షణములు గల ప్రభుత్వ మున్నదో లేదో నిశ్చయముగా చెప్పజాలము.

ఈనాటి ఆసియా ఖండమును పరిశీలించినచో ప్రజాస్వామ్య వ్యవస్థకు, సామ్యవాద వ్యవస్థకు పోరాటము కొనసాగుచున్నట్లు చూపట్టక మానదు. రష్యా భారతదేశములతో కయ్యమునకు దిగిన చైనా ప్రజాస్వామ్య వ్యవస్థను ఆసియా ఖండములో భగ్నముచేయ నిశ్శంకముగా, నిర్నిరోధముగా, నిర్విరామముగా కృషిచేయుచున్నది. చైనా, భారతదేశముల పీవరా సమరము భిన్న రాజకీయ వ్యవస్థల సంఘర్షణమే. సామ్యవాదమో, ప్రజాస్వామ్యమో, ఏదో యొకటియే ఆసియా ఖండములో నుండవలెను గాని, భిన్న వ్యవస్థల శాంతి సహజీవనము దుస్సాధ్యమని చైనా సిద్ధాంతము. పాశ్చాత్య దేశ

ములే సామ్రాజ్యవాద దేశములని మొన్న మొన్నటిదాక ఆసియా ఖండము వాయెత్తి యఱచినది. నేడో! ఆసియాఖండము లోనే సామ్రాజ్యవాద దేశములు తలయెత్తినవి. వానిలో చైనా మొదటిది. సీమారేఖం నుల్లంఘించి పరదేశముల నాక్రమించుట, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు భగ్నము లగునట్లుగా విప్లవములను ఎగుమతి చేయుట చైనా రాజనీతి. నయమున గాని, భయమున గాని చైనా అన్యదేశములతో తన సంబంధ బాంధవ్యములను చక్కదిద్దుకొనుచున్నది. రష్య తోడి సిద్ధాంత కలహము కొనసాగించుచున్న చైనా నానాడు సర్వ ప్రపంచము నకు—లేనా డొక ఆసియాకే కావచ్చు—మహా విషమ సమస్య యగును. ప్రజాస్వామ్య ప్రియులీ రహస్యమును గుర్తింపక తప్పదు.

ఆఫ్రికా ఖండములో భిన్నభిన్న విధముల ప్రభుత్వము లున్నవి. వ్యాసమునకు మొదట మనము నిర్వచించిన ప్రజా స్వామ్యము లక్షణములు ఆఫ్రికా దేశముల రాజకీయ వ్యవస్థల యందు గానరాదు. అరబ్ దేశములలో ఏకైక నాయక ప్రాభవము గల ప్రభుత్వము లున్నవి. ఆ నాయకుడు రాజ వంశీయుడు గావచ్చు. లేక ప్రజలనుండి పైకి వచ్చినవాడు గావచ్చు. మొరాకో, జోర్డాన్ వంటి దేశములలో రాజ వంశీయులధిపతులై ప్రజా ప్రతినిధుల బలముతోడనో, లేక సైన్య బలముతోడనో పరిపాలనము చేయుదురు. ఈజిప్టు, అల్జీరియా వంటి దేశములలో—పేరులో మార్పు తప్ప—దాదాపు సమ సమాజవాద దేశముల రాజ్య వ్యవస్థయే యున్నది. ఆఫ్రికాలో ఈ యైదారేండ్లలో కొత్తగా తమ యిల్లు తాము చక్కదిద్దుకొనుటకు పూనుకొన్న దేశములు చాలా యున్నవి. ప్రజాస్వామ్య వ్యవస్థతో, ప్రతిపక్షములతో బయలుదేరిన యీ దేశములలో ఒక ప్రత్యేక విధానము రూపొందుతూ యున్నది. దేశాభివృద్ధి పేరిట ప్రజా స్వాతంత్ర్యములను రద్దుపఱచుట, ప్రతిపక్షములను అణచుట, ఏకైక నాయకునకు సర్వాధికారములను కట్టబెట్టుట, ఆ విధానముయొక్క లక్షణములు. ఘనా వంటి దేశముల చరిత్రయే దీనికి తార్కాణము. కెన్యాలో ప్రభుత్వ పక్ష ప్రతిపక్షము లేకమై తుదకు ఏకపక్ష ప్రభుత్వమే ఏర్పడినది. మలేసియా మాదిరిగా టాంజేనియా (టాంగన్యికా, జాంజిబార్) ఏర్పడినది. యునైటెడ్ అరబ్ రిపబ్లిక్ కొంతకాలము సిరియాను కలుపుకొన్నది. తుదకా కలయిక చెడినది. ఇపుడు ఇరాక్‌తో యునైటెడ్ అరబ్ రిపబ్లిక్ పొత్తు పెంపొందించుకొను చున్నది. సామ్రాజ్యవాదముచేత, ఫ్యూడల్ విధానముచేత ఆఫ్రికా రాజ్యములు చెడి చెటాకులలో కలిసినవి. నూతనముగా స్వాతంత్ర్యము పొందిన తరువాత ఈ రాజ్యములు ప్రభుత్వ

వ్యవస్థలను ఏర్పరచుకొనుచు, ప్రజాస్వామ్యమును, సామ్యవాదమును మేళవింపవలయునని పాటుపడుచున్నవి. భారత దేశములో ప్రజాస్వామిక లక్షణములధికముగా గల ప్రజాస్వామిక సామ్యవాదము తలయెత్తినది. ఆఫ్రికా దేశములలో సామ్యవాద నిరంకుశత్వము ప్రధానముగా గల ప్రజాస్వామిక సామ్యవాదము బాల్యదశలో నున్నది.

ఇక్క డొకమాట చెప్పవలయును. నూతనముగా స్వతంత్రము పొందిన దేశములుగాని, యితర దేశములుగాని సమర్థముగా పరిపాలనము కొనసాగించుకొనజాలని పక్షములో, ఆదేశములు అంతర్జాతీయ రాజకీయముల చదరంగములో పావులగుట తప్పలేదు. దీనికి కాంగో, దక్షిణ వియత్నాముల చరిత్రయే యుదాహరణము. విభిన్నజాతులు గల దేశములలో కూడ ఆయా జాతుల మాతృదేశములు మాటిమాటికి జోక్యము కలుగజేసికొనుచున్నవి. సైప్రస్ గాథ చదివినవారికి ఈ విషయము క్రొత్తగాదు. టర్కీ, గ్రీస్, పాశ్చాత్య రాజ్యము లొకవంక, వీని ప్రాభవము పతనమగుయునని రష్య మఱొకవంక ఆ ఆ దేశ వ్యవహారములలో బహాళముగా ప్రత్యక్షముగనో, పరోక్షముగనో పాల్గొనుచున్నవి. జాతి వివక్షణము చూపు దక్షిణాఫ్రికా ప్రభుత్వము ప్రజా ప్రభుత్వముగా చెలామణి యగుచున్నది. ఆగ్నేయ ఆసియాలో స్వజాతీయుల ప్రాపకముతో చైనా ఆయా దేశాధిపతులకు మంత్రాంగము నేర్పుచున్నది. ఇక లాటిన్ అమెరికా యున్నది. ఆ ఖండములో ఎప్పు డెట్టి ప్రభుత్వ ముండునో, ఎవరు రాజ్యాధిపతి యగునో ఎవరుమా చెప్పలేరు. అక్కడ అమెరికా ఆర్థిక ప్రాబల్య మధికము. లాటిన్ అమెరికాలో సమ సమాజ వాదము రాగూడదని అమెరికా పట్టుదల. అట యువ్వగ్రా రాజ్యములను తయారుచేయవలయునని రష్య తాపత్రయము. క్యూబా గాథ యిదియే గదా! ఇదివఱకు అమెరికా, రష్యాలు పోటీపడగా, ఇప్పుడు వానికి చైనా తోడైనది. మిగిలిన దేశముల మాట యట్లుండనిండు. సిద్ధాంతముల పేరిట గాని, శాంతి భద్రతల పేరిటగాని, అమెరికా, రష్య, చైనాలు ఆయా దేశములను లోపఱచుకొనవలయుననియే తలంచుచున్నవి. ఆఫ్రికాలో చైనా, అమెరికా, రష్యలకు ప్రతిభటముగా విలద్రొక్కుకొనవలయునని యూరాటపడుచున్నది.

ఇది ప్రజాస్వామ్యము చరిత్ర. పాశ్చాత్య దేశములలో కొన్నిటియందు, భారతదేశము వంటి ప్రాచ్య దేశములయందు ప్రజాస్వామ్య వ్యవస్థ యనున దొకటి యున్నది. ఇంతవఱకు వినేదించిన విషయములనుబట్టి యీ సారాంశము తేలును. (1) నవీన యుగములో ప్రజాస్వామ్యము ప్రారంభమై రెండు వందల యేండ్ల కంటె ఎక్కువ కాలేదు. అమెరికా ఇంగ్లండు, ఫ్రాంసు, స్విట్జర్లాండు మొదలయిన దేశాలలో ప్రజాస్వామ్యము నెమ్మదిగా నిలద్రొక్కుకొని క్రమక్రమముగా వికాసము చెందినది. (2) ప్రజాస్వామ్యమునకు వ్యతిరేకముగా —బద్ధశత్రువులుగా—సామ్యవాదము, ఫాసిజము, సమసమాజవాదము వంటి నిరంకుశ తత్త్వములు ఈ యుగములోనే విజృంభించినవి. (3) ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరము ప్రపంచము అమెరికా రష్యల నాయకత్వమున ప్రజాస్వామిక నిరంకుశతా కూటములుగా చీలిపోయినది. చైనా కాలక్రమమున ప్రజాతంత్ర వ్యవస్థకు ధూమకేతు వయినది. శేష రాజ్యములు కొన్నింటిని మినహాయించినచో ప్రాచ్య పాశ్చాత్య రాజ్యముల ప్రభావమునకు ప్రత్యక్షముగనో, పరోక్షముగనో లోబడుచునే యున్నవి. (పశేషము)



రాత్రి మనిషి

శ్రీ ఆదివిష్ణు

ఇందులో పాత్రలు:

రెడ్డి
జనార్ధనరావ్
తుకారామ్
వెంకట్రామయ్య
వసంత.

ప్రశాంతి:

అన్ని రోజులూ బ్రతికినంత కాలమూ గుర్తుండిపోవు. చాలా రోజులు గమనించకుండానే జరిగిపోతాయి. వాటి నసలు ఖాతరుచేసే ప్రయత్నం జరగదు. బహు కొద్ది రోజులు మాత్రం కచ్చితంగా గుర్తుంటాయి.

రెడ్డి కథకి నాంది జరిగిన రోజు వర్షం వచ్చింది. వర్షం వచ్చిన ఆరోజు గురించి ముందు చెబితేనే గానీ ఈ ముగింపుకి అందం రాదు.

అందం! . . . . . .

నవ్వొస్తోంది.

రెడ్డి కథలో ట్రాజెడీ అనే రంగుని పులుముకుని అందం అనే వస్తువు విరగబడి ప్రకాశించింది. వేదాంతానికి మూల మేమిటో తెలీదు గాని ఇది సిసలైన వేదాంతం కాదని తెలుసు. కొంద రేడుస్తూంటే అందంగా ఉంటుందనే సూత్రాన్ని ఆధారంగా తీసుకొనే 'అందమైన ముగింపు' అని చెప్పడం జరిగింది.

ఆరోజు—వర్షం వచ్చే ముందు ఆకాశం ఉరిమింది!

(మెల్లిగా తెర తొలగడం ప్రారంభమైంది. ఉరుములు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఉండి ఉండి ఈదరగాలి రివ్వున వీస్తోంది.)

వర్షం వచ్చేముందు ఆకాశం ఉరుముతుందని అద్దె గదిలో కిటికీ ప్రక్కన నించొన్న రెడ్డి వీధిలోకి చూస్తూ అనుకున్నాడు. అతని మనస్సులో వర్షం కురుస్తున్నట్టుంది. అతని మనసులో ఉరుములు ప్రతిధ్వనిస్తున్నట్టూ ఉంది.

చీకటిగా ఉంది బైట. గదిలో లైటు వెలుగుతున్నా సుబ్బారెడ్డి మనస్సులో చీకటిగానే ఉంది. సాధారణంగా అతను ప్రశాంతంగా ఉండలేడు. పరిస్థితులు అందుకు అనుకూలించడం లేదని అతని అభిప్రాయం.

అతని అభిప్రాయాలపైన అతనికి నమ్మకం యెక్కువ. తనని నమ్మనేలేని మనుష్యులంటే వాళ్లపైన దురభిప్రాయమూ ఉన్నది.

అదీ రెడ్డి—అతనే రెడ్డి.!

(ఉరుములు వినిపిస్తున్నాయే గాని వర్షం రావడంలేదు. దుమ్ము లేపుకొంటూ ఈదరగాలి విసురుగా గదిలోకి వచ్చింది. తలుపు వేయడానికి హాల్డాలు మీద పడుక్కున్న జనార్ధనరావ్ విసుగ్గా లేచేడు. ఓ తడవ రెడ్డివేపు చూచి తలుపు వేసి వస్తూ అన్నాడు.)

జన :ఎంతసేపని అలా నించుంటావ్ రెడ్డి !

రెడ్డి :(వెంటనే తల తిప్పి పరాకుగా పలికి పేలవంగా నవ్వేశాడు.)

జనా :నాలుగు రోజుల్నుంచీ గమనిస్తున్నాను. బైట మనల్ని వేధిస్తూన్న మునురులాగా నువ్వూ తయారవుతున్నావు. మునురు వాతావరణ మంటే నా కిష్టంలేదు. అలాగే మనసులో ఏడుస్తున్న మనిషన్నా యిష్టంలేదు. కాబట్టి నీ మనస్సులో దాచుకున్న దేదో చెప్పేయ్. బరువు కొంచెం తగ్గినట్టవుతుంది.

రెడ్డి:—(కిటికీ దగ్గర్నుంచి కదిలివస్తూ అన్నాడు) వర్షమొచ్చేట్టుందిగానీ రావడంలేదు.

జనా:—మాట మార్చేస్తున్నావ్ రెడ్డి!

రెడ్డి:—లేదోయ్. నాకో సరదా ఉంది. చీకట్లో తుప్పర్లు తుప్పర్లు వర్షం ఒంటిమీద పడుతూంటే సాధ్యమైనంతవరకూ వర్షపు చినుకుల్ని లెక్కగట్టాలని తాపత్రయం. ఇప్పుడేం జరుగుతుందో తెలుసా—చీకటిని చంపేదానికి బైట లైట్లు వెలుగుతున్నాయి. వర్షాన్ని రానీకుండా ఉరుములు భయపెడుతున్నాయి. (ఉరిమింది) అదుగో విను!......విన్నావుగా. అదీ తంతు,

జనా:—(నవ్వేశాడు.)

రెడ్డి:—ఎందుకోయ్ నవ్వుతావ్ జనార్ధనరావ్?

జనా:—భలేగా అన్నా విప్పుడు. కవిత్వం రాయడం మొదలు పెట్టు.

రెడ్డి:—ఈ జాతకానికి అది గూడాను.

జనా:—లేకకోతే నే నడిగిం దేవిటి? నువ్వు చెప్పే దేమిటి? ముసురు వాతావరణం ఈ గదిలో గూడా వద్దోయ్ అన్నా న్నేను.

రెడ్డి:—మా జిల్లాల్లో వర్షం అరుదు. అందుచేత నీళ్ళకరువు. అందుకనే నీళ్ళన్నా, వర్షమున్నా చాలా ఇష్టం నాకు.

జనా:—కాదనను. కానీ నీ మనస్సులో మరేదో గూడు కట్టుకు నుంది. అది విప్పి చెప్పడంలేదు నువ్వు. చూడు రెడ్డి! మనిద్దరం సమ వయస్కులం. అనుభవించవలసిన జీవితం మన ముందు చాలా ఉంది. ఈ వయస్సులో దిగులూ, చింతా అనే పదార్థాలకి అర్థం లే దసలు. అలాటిది— నీలో నువ్వే కుమిలిపోవడం విచిత్రంగా ఉంది నాకు. దీన్ని మొదట్లో నే నంతగా పట్టించుకోలేదు గాని యిప్పు డిక తప్పనిసరే అవుతుంది.

రెడ్డి : కుర్రవాడివనే అర్హత తప్ప మరేవిధమైన అలంకారానికీ నోచుకోలేదు. నే నందుకు పెట్టి పుట్టలేదు. (ఆకాశం ఉరిమింది) జనార్ధనరావ్—నన్ను కదిలించకు. అసలే మతిపోయి ఛస్తున్నాను. ఆవేశంలాటిది కలుగుతోంది. నా మనసులో తిరుగుతూన్న 'రంగుల రాట్నం' చాల భయంకరంగా ఉంటుంది. ప్రపంచంలో ప్రతి చిన్న విషయాన్నీ పట్టించుకోవడం నేర్చుకోవద్దు. పురుగు లాటి మనిషి న్నేను. నన్నెందుకు కదిలిస్తావ్ చెప్పు!

(జనార్ధనరావ్ ఏమీ మాటాడలేదు. వెళ్ళి పక్కమీద కూర్చున్నాడు. రెడ్డి తలుపుతీసి తలుపు రెక్కమీద నడుం ఆనించేడు. గాలి విసురుగా లోపలి కొచ్చేసింది. మళ్ళా ఉరిమింది ఆకాశం.)

జన : తలుపేయ్ రెడ్డి! తలుపేయ్!

(రెడ్డి తలుపు వేయులేదు. వీధిలోకి చూస్తూ నించు న్నాడు. ఎడాతెరపీ లేకుండా ఆకాశం ఉరుముతోంది. గాలి హోరు భయంకరంగానూ ఉంది.)

జన : రెడ్డి! నీకే చెప్తూంట. తలుపేయ్. తొరగా వేయ్.

(రెడ్డిలో కదలిక లేదు. జనార్ధనరావ్‌కి భయం వేసింది. గబగబా లేచి వెళ్ళి రెడ్డిని లోపలికి లాపి తలుపు వేశాడు. బయట జరుగుతున్న వృష్టి తాలూకు తమాషా శబ్దం లోపలికి సన్నగా వినిపిస్తోంది. రెడ్డి తలుపు కివతల బొమ్మలా నించుండిపోయేడు. అతని కనుకొలకుల్లో నీళ్ళు నిలిచేయి. జనార్ధనరావ్ వచ్చి రెడ్డి భుజంమీద చేయి వేశాడు. రెడ్డి వెక్కివెక్కి ఏడ్వడం ప్రారంభించేడు.)

జన : (ఉలిక్కిపడ్డాడు) ఎందుకు రెడ్డి ఏడుస్తావ్? మీ వూళ్ళోనూ వర్షం పడుతుంది లేవోయ్. భయపడకు.

రెడ్డి : (ఏడు పాపి కళ్ళు తుడుచుకున్నాడు).

జన : ఇంటిమీదకి బెంగ పోయిందా రెడ్డి?

రెడ్డి : (తలూపేడు.)

జన : పిచ్చి రెడ్డి! ఎంత పసివాడవోయ్ నువ్వు! ఆడపిల్లలా ఇంటిమీద నీ కెంత బెంగేమిటయ్యా బొత్తిగా?

రెడ్డి : మావూరు .... మా వూరు మీ వూరంత దగ్గర్లో లేదు. మావూరు వెళ్ళాలంటే రెండు రోజుల ప్రయాణం. మీవూరు నువ్వు రెండు గంటల్లో వెడతావ్. మావూళ్ళో నాకు ....

జనా : పోనీలే రెడ్డి! ఒకపని చెయ్యి. వారంరోజులు సెలవుపెట్టి మీవూ రెళ్ళిపో. ఎంచక్కా అక్కడ గడిపేసి తిరిగిరా.

రెడ్డి : మావూరు వెళ్ళేందుకు పాతిక రూపాయలు కావాలి. నా కిచ్చే జీతం నీకు తెలుసుగా. లాంఛైఁ రూపాయిలు. నైన్టీ. నువ్వు బి. ఏ. చదువుకున్నావ్. నా జీతానికి రెండు రెట్లు నీ జీతం. నేను యస్సెల్సీ మూడుసార్లు చదివి అవుననిపించుకున్నాను. నీకు మంచి మంచి బట్ట లున్నాయి. ఖరీదైన సిగరెట్లు కాలుస్తావ్. నెలకి పది తడవలు సినీమా కెడతావ్. నే నంత అదృష్టానికి నోచుకోలేదు. దౌర్భాగ్యుడ్ని. నీచ జాతకుడ్ని. నీమీద నాకు అసూయ. నన్ను చూస్తూంటే నాపైన నీకు జాలి. 'అయ్యో పాపం! రెడ్డి ఎంత దుస్థితిలో ఉన్నాడో' నన్న దిగులు. ఏడుపు. రోత. ఇవన్నీ తలుచు కుంటూ కూర్చుంటే చచ్చిపోవాలని ఉంటుంది. పారి పోయి హిమాలయాల్లో ముక్కు మూసుకుందా మనిపి స్తుంది. కానీ—నేను బందీని. నన్ను బంధించిన మనుషు లందుకు వొప్పుకోరు. నన్ను నా యిష్ట మొచ్చినట్టు చేయనివ్వరు. నా చేతులు కట్టేశారు. జనార్ధనరావ్ నన్ను చంపుకుతింటున్నారోయ్! (ఏడు పొచ్చేసింది.)

(జనార్ధనరావ్ క్షణం సేపటి వరకూ మాటాడలేక పోయేడు. గదినంతా రెండుమాట్లు తిరిగేడు. కిటికీ దగ్గర

నించున్నాడు. మళ్ళా రెడ్డి వేపు వచ్చేడు.)

జనా : నన్ను క్షమించు రెడ్డీ ! క్షమించు. నిన్ను అర్థం చేసుకోలేక పోయేను.

రెడ్డి : (జనార్దనరావ్ రెండు చేతులూ పుచ్చుకున్నాడు) అంత మా టనకు. అంతమా టనకు. నేను నోరు విప్పి ఏం మాటాడినా ఘోరంగా ఉంటుంది. అందుచేతనే సాధ్యమైనంతవరకూ నోరుమూసు క్కూచుంటాను. అందుచేతనే నా కోరికల తల్లీ నరుక్కుంటాను. అందుచేత.... అందుచేతనే రాయిలా బ్రతుకుతున్నాను జనార్దనరావ్!

జనా : (చేతులు విడిపించుకుని దూరంగా జరిగేడు.) అనుకుంటున్నావ్ గానీ నీ కంటే ఘోరంగా బ్రతికే మనుషులు చాలామంది ఉన్నారోయ్. అవుతే వాళ్ళంతా నీలాగా 'సినిక్' గా తయారయ్యారా ? లేదు. పైగా వాళ్ళ నీడల్ని మరిచి దిలాసాగా బ్రతుకుతున్నారు. నవ్వుతూ తిరుగుతున్నారు. నువ్వూ అలాగే తిరుగు. నీకేం తక్కువని.

రెడ్డి : (నిస్సహాయతను తెలిజేస్తూ తలూపేడు.)

జనా : పోనీ, ఒకపని చేయి. నేనో యాభై రూపాయ లప్పు యిస్తానుగానీ మీవూ రెళ్ళి వచ్చేయ్. మళ్ళా ఆ డబ్బుని నీ దగ్గ రున్నప్పుడు ఇచ్చెయ్. సరేనా ?

రెడ్డి : (కళ్ళల్లో వెలుతురు నిండింది) థాంక్స్ జనార్దనరావ్ థాంక్స్.

(జనార్దనరావ్ తన పెట్టెలోంచి అయిదు పదులు తెచ్చి రెడ్డి కిచ్చేడు. రెడ్డి ఆ డబ్బుని జేబులో దాచుకున్నాడు. గబగబా తన పెట్టె తెరిచి ఒక నీలంరంగు చిన్న అట్ట పెట్టెని తెచ్చి జనార్దనరావ్ కిచ్చేడు.)

రెడ్డి : ఈ పెట్టెని తెరిచి చూడు. నీ కళ్ళు జిగేల్ మంటాయి.

(పెట్టెలో ఉన్న రెండు జతల గాజుల్ని జనార్దనరావ్ బైటకు తీసేడు.)

రెడ్డి : రెండు జతల బంగారు గాజులు. వాటిని (తనవేపు చూసుకున్నాడు) నేను కొన్నాను. ఈ రెండేళ్ల సర్వీసులో దాచి కొన్నాను. వాట్ని చూస్తుంటే నాకు గర్వమోయ్. ఎలా ఉన్నాయో చెప్పావు గాదే ? ఎలా ఉన్నాయిట ?

జనా : బాగున్నాయి. బ్రహ్మాండంగా ఉన్నాయి.

రెడ్డి : ఉంటాయి. కొన్నది నేనాయె. నాకో చెల్లె లుందోయ్ జనార్దనరావ్ ! చిన్నన్నయ్యా, చిన్నన్నయ్యాంటూ ఒక క్షణమైనా విడిచి ఉండదు. సుజాత దానిపేరు. మా యింటికి దీపం. దాని కిప్పుడూ పదహారేళ్ళు. రెండేళ్ల క్రితం ఉద్యోగం కోసం నేనీ జిల్లా కొస్తున్నప్పుడు పిచ్చితల్లి నోరు విప్పుకు అడిగింది 'నాకే చిన్నన్నయ్యా! నాకో మంచి బహుమానం కావాలిరా' అని. చెల్లెల ముచ్చట తీర్చేందుకు ఈ దౌర్భాగ్యుడు రెండేళ్లపాటు వాయిదా వేశాడు. రెండేళ్లనుంచీ నే నింటికి వెళ్లకపోవడానికి కారణం యిదే. జనార్దనరావ్. నా కిప్పు డెంత ఆనందంగా ఉందనుకున్నావ్ ! నువ్విచ్చిన ఏభై రూపాయిలూ పుచ్చుకుని రెక్కలు కట్టుకు మావూళ్లో వాలుతాను. నా చెల్లెకి బహుమ తిస్తాను. దాని కళ్లల్లో నిండిన ఆనందాన్ని పంచుకుని మరో పదేళ్లపాటు నిశ్చింతగా బ్రతుకుతాను. ఓ ....

జనా : (అట్ట పెట్టెని రెడ్డి కిచ్చేడు) నిజంగా నువ్వు పిచ్చి వాడివోయ్ !

రెడ్డి : (అట్ట పెట్టెని గుండెలకి అదుముకున్నాడు) మా చెల్లెకి పెళ్లి చేయాలి. మంచి మొగుడ్ని వెదకాలి. అమ్మని మనసుని బాగుచేయాలి. (కాసే పాగాడు) ఆరేళ్ల క్రితం ఒక రైల్వే పోర్టరు రైలుకింద పడి చనిపోవడాని గురించి మా వూరి జనం అనేక రకాలుగా చెప్పుకున్నారు. ఆత్మహత్య, మతి పోయింది, అప్పు లెక్కువ, తాగి చచ్చేడు. ఏమైతేనేం—మా నాన్న పోయేడు. రైల్వే పోర్టరు కొడుకు హైస్కూలు చదువులట్ట! చదువు! అన్నారు జనం. నేను చదవడం యిష్టంలేదు వాళ్లకి. కష్టంచేసి సంపాయించి స్వశక్తి మీద చదివేను. రెండోసారి పరీక్ష పోయినప్పుడు తండ్రిగతే కొడుక్కి పట్టి ఏ రైలు క్రిందనో రెడ్డి శవం చూడవలసి వస్తుందని జోస్యం చెప్పిన మనుష్యులు చింతించేలా మూడోసారి వాళ్ల దగ్గరెట్టుకు చదివి పాస యేను. పరాయి మనుషులు నవ్వినా, ఏడ్చినా ఖాతరు చేయను. కానీ, నా అన్న—అడుగడుక్కీ వాడి పోరు భరించలేనంతగా తయారైంది. నాన్న ఉన్న రోజుల్లోనే జులాయిగా తిరిగేడు. నాన్న పోయిన తర్వాత పట్టపగ్గాలు లేవు వాడికి. చెల్లి రాస్తున్న ఉత్తరాలు భయంకరంగా ఉన్నాయి. తాగుతున్నాట్ట. అమ్మనీ పదిసనీ రోజా చంపేస్తున్నాట్ట. దేవుడ్ని గూడా లెక్క చేయని మనిషికి తల్లేమిటి, భార్య ఏమిటి? ఛీ...... వాడింత చెడిపోకముందే చచ్చినా బాగుండేది. నాకు అన్నయ్యమీద గౌరవం బ్రతికి ఉండేది.

జనా:—రెడ్డీ! అవేం మాటలోయ్. తప్పు కదూ!

రెడ్డి:—(కోపం వచ్చింది) కాదు. ముమ్మాటికీ కాదు. వాడు నిజంగానే చావాలి. నీకు తెలీదు జనార్దనరావ్. వాడివల్ల

మా కెవరికీ సుఖంలేదు. మా సుఖాన్ని తినేస్తున్న మనిషి నేమనాలి? రాక్షసుడు, దయ్య మనాలి. వాళ్ళేమవ్వాలి? మనుషుల్లో బ్రతక్కూడదు. వాళ్ళు చావాలి.

జనా:—పోనీలేవోయ్. ఇప్పుడవన్నీ ఎందుకులే. (కిటికీ దగ్గరిగా వెళ్ళేడు) ఇంకా వర్షం రావడం లేదేమోయ్ రెడ్డి!

రెడ్డి:—(నెమ్మదిగా అన్నాడు) ఈ గాజులు చెల్లికోసం చేయించాను. మావూరు వెళ్ళేందుకు డబ్బులేక నీ దగ్గ రప్పు చేశాను—కాని జనార్ధనరావ్ నాకు నమ్మకం లేదోయ్. ఈ గాజులు మా చెల్లి చేతి కుండవు. ఆ పాపి ఉంచనీడు. వాడి తాగుడికీ, జూదానికీ ఇవి కావాలి. ఇవి కావాలి జనార్ధనరావ్.

(ఏదో గుర్తు కొచ్చింది. మనిషి పూర్తిగా మారిపోయేడు. జేబులో చేయిపెట్టి యాభై రూపాయిలూ తీసి జనార్ధనరావ్ కిచ్చేశాడు. జనార్ధనరావ్ బిత్తరపోయేడు.)

జనా:—ఏమిటోయ్ ఇది! నీ మతేమైనా పోతోందా? వూరెళ్లి పోతున్నానని సంబరపడ్డా వింతవరకూ. ఇప్పుడు యాభై ఇచ్చేస్తున్నావ్. ఏమి టిదంతా?

రెడ్డి:—వద్దు! నాకీ డబ్బు వద్దు. మా వూరూ వద్దు. మా వూరెళ్లి ఈ గాజుల్ని మా అన్నయ్య చేతి కివ్వలేను. నా రెండేళ్ల కష్టాన్ని పేకాటకో, తాగుడికో ధార పోయించలేను. నా ఆనందాన్ని చంపేస్తాడు అన్నయ్య. ఇవి నా దగ్గరే ఉంచేస్తాను. నా చెల్లెల్ని కలల్లో చూస్తాను. నా కలల్లో చెల్లికి గాజులు తొడుగుతాను. నా కలల్లో చెల్లి నవ్వుతుంది. అది బంగారుకల. అది చాలు నాకు. ఆ తృప్తి చాలు నాకు. చెల్లి నో అయ్య చేతిలో పెట్టిం తర్వాత ఈ గాజు లిస్తాను. చెల్లితోపాటు ఈ గాజులకీ అతనే రక్ష!

జనా : చిత్రంగా మాటాడుతున్నావ్ రెడ్డి!

రెడ్డి:—మా అన్నయ్య గురించి నీకేం తెలీదు. ఇప్పటికీ మా అమ్మ వూడిగం చేస్తున్నదంటే ఎవరోయ్ కారణం? మా అన్న! ఇప్పటికీ మా అమ్మ కలత నిద్రలో చావు రాలేదేమని ఏడుస్తుందంటే ఎవరోయ్ కారణం? మా అన్న! (ఈ తడవ ఆకాశం కొంచెం గట్టిగా ఉరిమింది. రెడ్డి పిచ్చిగా అరిచేడు) ఉరుము...... ఇంకా భయంకరంగా ఉరుము......మా వూరెళ్లి ఉరుము. మావూళ్లో పిడుగులువేయి. మాఇంటిమీద మరిచిపోకుండా వేయి. మా అన్న, మా వదిన, మా అమ్మ ముగ్గుర్నీ పొట్టన పెట్టుకో. మా చెల్లిని బ్రతికించు. వెళ్ళు. (ఏడ్చేడు) అన్నయ్యా! ఎందు కిలా అయిపోయావు? నువ్వెందుకు చెడిపోయావు? (ఉరిమింది మళ్ళా) ఏం? ఇంకా ఇక్కడే ఉరుముతున్నావ్. మా వూరి దారి తెలీదా? నన్ను చూపించమంటావా? దారి చూపించేదా? (రెడ్డి కదలబోయేడు. జనార్ధనరావ్ అతన్ని పట్టుకు ఆపేడు.)

జనా : కసి పెరిగిపోయిన మనిషివి నువ్వు. నిబ్బరంగా బ్రతకడం నేర్చుకో రెడ్డి!

రెడ్డి : ఎలా నేర్చుకోను? ఇవన్నీ ఎలా ఓర్చుకోను? చెప్పు జనార్ధనరావ్!

జనా:—చెప్పేదా?

రెడ్డి:—వింటాను. చెప్పు.

జనా:—ముందలా కూర్చో చెప్తాను.

(రెడ్డి తన హోల్డాలుమీద కూర్చున్నాడు. జనార్ధనరావ్ సిగరెట్టు ముట్టించి రెడ్డివేపు చూడకుండా మధ్య మధ్య కాలుతూన్న సిగరెట్టువేపూ, అప్పుడప్పుడు మూసిఉంచిన తలుపువేపూ చూస్తూ చెప్పేడు)

జనా:—రెడ్డి! రెడ్డి అనే కుర్రాడికి ఒకటే సమస్య. పతనమవుతున్న అతని కుటుంబం మూడు పూలూ ఆరు కాయలుగా వర్ధిల్లే దెప్పుడా అని. కొన్నాళ్ళు ఎదురు చూసేడు. దారి కన్పించలేదు. ముఖ్యంగా వాళ్ళన్నయ్య దయ్యమై కూర్చున్నాడు. అసలే బీదకుటుంబం. దాని కతను అందమైన అలంకారం. రెడ్డి చూపు మరో పక్కకి మళ్ళింది. అతని కిప్పుడు పచ్చటి 'యువ ప్రపంచం' కన్పించింది. పందాలు వేసుకుని పట్టపగ్గాల్లేకుండా కాలాన్ని చాలా 'ఈజీ'గా గడిపేస్తోంది. యువ ప్రపంచం. మంచి మంచి బట్టలూ, ఖరీదైన సిగరెట్లు, సినిమాలు, షికార్లు—జీవితానికో సుందరమైన రూప కల్పన చేసుకునే ఇందరి కుర్రాళ్ల అదృష్టానికి రెడ్డి తన జాతకాన్ని పోల్చి చూచుకున్నాడు. ఏడుపొస్తోంది. ఆతనిలో కసి కలుగుతోంది. జెలసీ పెరిగిపోతోంది. అయినా తనేం చేయలేక పోతున్నాడు. ఏం చేయడానికీ చాతకావడంలేదు. ఓ పక్క తన దారుణమైన కుటుంబం, మరోపక్క తనని యాగీ చేస్తున్న యువ ప్రపంచం. భరించలేని అనుభవం. సహించరాని నరకం.

రెడ్డి : (మళ్ళీ ఏడుపొచ్చింది) అవు. జనార్ధనరావ్! నా ముందు అద్దాన్నుంచకు. నాక్కావలసింది అద్దంకాదు. మార్గం. నేను సుఖంగా బ్రతికేందుక్కావలసిన మందు. అది చెప్పు. అదే చెప్పు.

జనా : చెప్తాను. నీక్కష్టం కలక్కపోతే చెప్తాను. నేను చెప్పింది విని నన్ను దూషించకపోతే చెప్తాను.

రెడ్డి : రెండు చేతులూ యెత్తి నమస్కారం చేస్తాను. సరె. ఇకచెప్పు జనార్దనరావ్.

జనా : (నవ్వుతూ అన్నాడు) మరేం లేదు. నువ్వింతమునుపు అన్నదే. కాకపోతె అది ఉద్రేకంవల్ల ఆవేశావ్. నేను చేప్పే దేమిటంటే కొంచెం నీమనసుని అవతలపెట్టి 'మనిషి ధర్మమ'నే సూత్రాన్ని మరిచి సంచరించాలి. అంతె.

రెడ్డి : అంటె?

జనా : నీ కెవ్వరూ లేరనుకో. నిన్ను కన్న అమ్మలేదు. అన్నయ్య లేడు. వదినలేదు. ఎవ్వరూ లేరు అని అనుకో. దాన్ని గట్టిగా నమ్ము. నీకొచ్చే డబ్బు నీకోసం నువ్వే వాడుకో. ఒక చక్కటి పిల్లని చూచి పెళ్లిచేసుకో. ఈ ప్రపంచంలో నీకు సంబంధించినంత వరకూ నీక్కావలసిన మనుష్యులు మీరిద్దరే! అవుతే దీన్ని స్వార్థమంటారు. కాదనను. ఇలాటి పరిస్థితుల్లో స్వార్థాన్ని ప్రయోగించాలి. తప్పదు మరి. నాఅమ్మా, నాఅన్నా, నా కుటుంబం అనుకుని ఏడుస్తూ కూర్చుంటే నువ్వీ జన్మలో సుఖ పడవని రాసిస్తాను. కొంచెం వారిని వదులుకుంటే చాలు. సుఖం నీసొంత మవుతుంది. దీని కోసం నువ్వు హిమాలయాలకి వెళ్లనక్కర్లేదు. పిడుగులు పడి మీవాళ్ళు చావనక్కర్లేదు.

రెడ్డి : అర్థం చేసుకున్నాను. నిజం. నువ్వు చెప్పిందే నిజం. అదే నిజం.

(రెడ్డి కిటికీ దగ్గరి కెళ్లాడు. అక్కడే వించుని వీధిలోకి చూస్తున్నారు. తలుపు శబ్దమైంది. జనార్దనరావ్ వెళ్లి తలుపు తెరిచాడు. తుకారాం వచ్చేడు. వస్తూనే అన్నాడు)

తుకా: చూడవోయ్! వస్తా వొస్తానని చెప్తూ ఈవ్వెధవ్వర్షం రావడమే లేదు—మా ఆవిడ కోపంలాగా. అసలు నన్నడుగుతే వర్షమనేది కుండల్తో పోసినట్టు వస్తేనే అందం. అంతేగాని ఉదయం కొంచెం, మధ్యాహ్నం కొంచెం, మళ్లా రాత్రి కొంచెం అన్నట్టు వంతులు వారీగా వస్తే—చూశావూ—నాకు వొళ్ళు మంట. అందుచేతనే మా ఆవిడ్ని అంటాను— 'ప్రియంవదా! నీకోపాన్ని వర్షంతో సహా ఒక్కసారిగా కక్కేయ్ అవటా'ని. ఉహు! అది నామాట కసలు పట్టించుకోనే పట్టించుకోదు. అడదాన్ని పూర్తికోసం యెంత బాగుంటుందనుకున్నావ్ జనార్దనరావ్! చాలా బాగుంటుందిలే.

జనా: అవునుగానీ ఈవేళప్పు డిదేం యిలా వచ్చేవ్? హాయిగా ఎంచక్క ఇంట్లోకూర్చుని వేడివేడిగా గారెలు తింటూంటే ఎంతహాయిగా వుంటుందని. ఇంటి దగ్గర నేనుంటే ఈవేళప్పుడు మాఅమ్మ నన్ను బైటకు పోనీదసలు. వంటగదిలో ఆవిడ ప్రక్కన కూచోబెట్టుకుని నా కేం కావలో సమస్తం అడిగి తెలుసుకుని చేసి మరీ తినమంటుంది. మాయిల్లు స్వర్గం. కానీ యీ హొటలు వాయరుతో అడ్జస్ట్ కాలేక చస్తున్నాననుకో. ఏమిటో వాడి బొందకూరలు. ఒకదానికి అర్థముండదు. రుచి మాట దేవు డెరుగు! గతిలేక తినడమవుతుంది.

తుకా: ఇల్లులేక నువ్వు చస్తున్నావ్. ఇల్లుండి నేను ఛస్తున్నాను. ప్రియంవదతో ఏకాంతం చూచి మనసువిప్పుకు మాటాడుదామని ప్రయత్నిస్తే అర్జంటుగా ఏదో పనున్నట్టు ఎవడో రావడం అప్రయత్నం కాస్త తినే యడమూను. మా యింట్లో "ప్రైవేట్' లేదోయ్. మా జనాభాకి 'ఎటికెట్'తెలీదు. హిందూదేశం లాటిది మాయిల్లు. ఏ వేళప్పుడేం చేయాలో, ఏం చేయకూడదో, ఎవరెవర్ని ఎప్పుడెవా వదిలిపెట్టాలో—ఇవేం తెలీవు. అందుచేతనే ఏంతోచక ఇలా బజారుమీద పడి ఏదో మీలాటి స్నేహితుల్తో కాసేపు మాట్లాడడానికి అలవాటు పడిపోతున్నాను.

రెడ్డి: (వీధిలోకి చూస్తూ నవ్వేడు)

తుకా : అదేమిటోయ్ జనార్దనరావ్! గూట్లో పిచ్చికమ్మలాగా, లేకపోతే రాబందులాగా నవ్వుతాడు రెడ్డి! ఈవేళ అమావాస్య గూడా కాదాయె.

జనా : ఇవాళ కొంచెం సరదాగా ఉన్నాడులే.

తుకా : అలా చెప్పు. మా ప్రియంవద అంటుందిగదా 'ఏమండీ, మీ రెప్పుడూ సరదాగా ఉండరే, సీరియస్‌గా చిటపటలాడతూంటే నాకు చిరాకు బాబూ' అని. ప్రియంవదకి చెప్పాలి. 'ప్రియంవదా! మనకీ యింట్లో సుఖం లేదు. నాన్నా, అమ్మా, పెద్దన్నా, చిన్నన్నా, చిన్నాదినా వెధవప్ప, దిక్కుమాలిన తమ్ముళ్లమధ్య మన సరదాలు సప్పవు. రాణించవు. పోదాం. ఈ నరకాన్నొదిలి పోదామ' ని. కానీ, జనార్దనరావ్ నాకో ట్రాన్స్ఫర్ వచ్చి చావడంలేదోయ్. వస్తే యీ యిరకాటం నుంచి తప్పుకునే పని.

జనా : అవునవును. వద్దనుకున్న వాళ్లకే వస్తుంది వెధవ ట్రాన్స్ఫరు.

తుకా : అవునా ! చస్తున్నానోయ్. పెళ్లయి సంవత్సరమయింది. నేనూ, ప్రియంవదా కలిసి సినిమా కెళ్లలేదు. కలిసి షికారుకి వెళ్లలేదు. సినిమా చూడాలంటే ప్రియంవదని మా అమ్మ తీసుకెడుతుంది. షికారు మాటెత్తితే వదిన అందరూ ముక్కులమీద వేళ్లేసుకుంటారు. ఎలాగోయ్ చచ్చేది!

రెడ్డి : నాకు నవ్వుగా ఉంది.

తుకా : కులాసాగా ఉన్నావుటగా. నవ్వవయ్యా నవ్వు. నీకు నవ్వుగానే ఉంటుంది. నీకేం పెళ్లామా, బిడ్డలా ! సంసార భారం తెలిసిన వాడివి. నవ్వుతావంటే నవ్వవూ. నీకు నవ్వుగానే ఉంటుందిలే నాయనా ! బాగా నవ్వు.

(ఆకాశం ఉరిమింది. తుకారాం జడుసుకున్నాడు.)

తుకా : థూ ! దీం దుంపతెగ! చూసుకో నా తడాఖా అని ఉరుముతుందే గానీ వర్షం రాదేమిటోయ్ బొత్తిగా. వర్ష మొచ్చినా బావుండును. రాత్రంతా యిక్కడే గడిపి తెల్లారిం తర్వాత యింటికి పోదును.

జనా : రాత్రంతా యిక్కడే గడిపేందుకు వర్షమే రావాలా ?

తుకా : లేకపోతే మా పెద్దన్న చండశాసనరావ్‌గారు నా చర్మం వొల్చేస్తారు. రాత్రంతా ఎక్కడ చచ్చేవురా అని ఆరా తీస్తారు. వర్ష మొచ్చిందని మా ఫ్రెండు గదిలో ఉన్నానంటే ఏదో—చెప్పుకునేందుకు చక్కటి కారణమవుతుంది. 'ప్రియంవదా ! రాత్రి రాలేకపోయేను క్షమించు' అంటే, నవ్వేసి వూరుకుంటుంది పిచ్చి ప్రియంవద !

(బైట వర్షపు చినుకులు పడటం చూసేడు రెడ్డి.)

రెడ్డి : (దాదాపు అరిచేడు) వర్ష మొస్తోంది వర్షం ! వర్షం!

తుకా : (అదిరిపోయేడు) థూ ! అబ్బ భయపడిపోయేను గదటయ్యా ! ఏమిటా గావుకేకలు ! వర్షమొస్తే యిప్పు డేమైందిట ? అసలేమిటి నీ హడావిడి?

రెడ్డి : నా కిప్పుడు బైట నిలబడాలని ఉంది. వర్షంలో పూర్తిగా తడవాలని ఉంది.

తుకా : రోడ్డుమీద పడి దొర్లు. ఎవరి క్కావాలిట. వెళ్లు వెళ్లు. అదరగొట్టావు గదటయ్యా మహానుభావా !

(రెడ్డి తలుపులు తీసుకుని బైటికి వెళ్లబోయేడు. కానీ జనార్దనరావ్ అతన్ని ఆపేడు.)

జనా : ఏమిటోయ్ నీ పిచ్చి ! వర్షంలో తడవాలనే !

రెడ్డి : (అతన్ని విడిపించుకున్నాడు) నాకు అడ్డురాకు జనార్దనరావ్ ! నన్ను బైటకు వెళ్లనివ్వు. వర్షంలో నా యిష్ట మొచ్చినట్టు తడవనివ్వు. విశ్రాంతిగా ఆడుకోనివ్వు. చిన్నతనాన్ని మళ్లా అనుభవించనివ్వు.

(అంటూనే తలుపు దగ్గ కెళ్లాడు. తలుపుతీసి ఆశ్చర్యంగా నిలుచున్నాడు. ఒకమాటు అనుమానాస్పదంగా లోపలి వేపు చూశాడు.)

తుకా : ఏం ? అక్కడే నిలుచున్నావే ? కాగితప్పడవ లేమైనా ఏర్పాటు చేయమన్నావా చిట్టిబాబూ !

(రెడ్డి మాటాడలేదు. అతన్ని తప్పుకుంటూ వెంకట్రామయ్య వచ్చాడు. అతని వయస్సు 50 సంవత్సరాలుంటాయి. అతని వెనకనే వసంత వచ్చింది. ఆమె వయస్సు 18, 20 ల మధ్య ఉంటుంది. అందంగా ఉన్న ఆ పిల్లని ఆ అద్దె గదిలో ఉన్నవాళ్లందరూ ఆశ్చర్యంగా చూసేరు.)

వెంక : క్షమించండి బాబూ ! వర్ష మొస్తోంటే తలదాచుకునేందుకు యిలా వచ్చాము. రావచ్చు గదా.

తుకా : భలేవారండి మీరు. నాకేం అభ్యంతరం ? రండి వచ్చి అలా కూర్చోండి (చాప చూపించేడు.)

వెంక : వద్దులే నాయనా. కాసే పలాగే నిలుచుంటాము. వర్షం కాస్త తెరపివ్వగానే వెళ్లిపోతాము. రా. వసంతా! ఇలా రామ్మా !

రెడ్డి : వసంత !

వెంక : అవును బాబూ ! మా రెండో అమ్మాయి.

జనా : మంచిపేరు పెట్టారు. చాలా చక్కటి పేరు.

తుకా : (సిగరెట్టు తీయబోయేడు. అది వో పట్టాన పెట్టెలోంచి రాలేదు. అతని చేతులు ఒణికిపోయేయి. ఇంతా చేసి అగ్గిపుల్లని నోట్లో పెట్టుకుని సిగరెట్టుతో దాన్ని అంటించుకో బోయేడు) సారీ .... ఇలా .... (ఈ తడవ నిక్షేపంగా కాల్చుకున్నాడు) చాలా చలిగా ఉంది కదూటోయ్. కొంచెం చేతులు వణుకుతున్నాయి. అంతే. అంతేనండి. అంతేనోయ్ రెడ్డి. అంతే.

వెంక : (అతన్ని పట్టించుకోలేదు) ఈ వర్షాన్ని చూస్తుంటే ఇంతలో తగ్గేట్టు లేదు.

తుకా : ఫర్వాలేదు. తగ్గిం తర్వాతనే వెళ్లండి. నాకేం అభ్యంతరంలేదు. నీకూ అంతే గదూటోయ్ జనార్దనరావ్?

(జనార్దనరావ్ కుంపటి వెలిగించే ఏర్పాటులో ఉన్నాడు. రెడ్డి వసంతవేపు కన్నార్పకుండా చూడటం తుకారాంకి నచ్చలేదు. వసంత కిటికీవేపు చూస్తోంది.)

వెంక : కుంపటెందుకు నాయనా వెలిగిస్తున్నావ్?

తుకా : కాఫీ ఏమైనా కాచే ఏర్పాట్లో ఉన్నాడేమో. మా ప్రియంవద ......

జనా : చలిగా ఉంది కదండీ ! కొంచెం వళ్ళు వేడి చేసుకోడానికి.

(వెంకట్రామయ్య నవ్వేవాడు. ఆయన నవ్వడం చూచి తుకారామూ నవ్వేశాడు. వెంకట్రామయ్య నవ్వు ఆపినా తుకారాము ఆపలేదు. కారణ మేమిటో తెలీక అందరూ అతనివేపు చూశారు. అప్పటిగ్గాని అతని నవ్వు ఆపలేదు. నవ్వు ఆపి సిగరెట్టుని తాపీగా పీల్చేడు.)

తుకా : నాపేరు తుకారాం. ఇతని పేరు జనార్దనరావ్ అతని పేరు రెడ్డి. సుబ్బారెడ్డి. వాళ్ళిద్దరూ ఈ రూము తాలూకు మనుష్యులు. నేను వీళ్ళిద్దరికీ స్నేహితుణ్ని.

వెంక : నాపేరు వెంకట్రామయ్య. అది సరి గానీ నువ్వు భలే గమ్మత్తుగా మాటాడుతావే?

తుకా : అవునండీ ! ప్రియంవదా యిలాగే అంటుంది.

వెంక : అవుతే నీకు పెళ్ళయిందన్నమాట.

తుకా : నా కయ్యింద్ది గానండి. వీళ్ళిద్దరికీ యింకా కాలేదు.

జనా : తుకారాం !

తుకా : ఆయ !

జనా : నువ్వు కొంచెం నోరు మూసుకుంటావా ?

వెంక : మాటాడ నివ్వు నాయనా ! అతను మాటాడక, నేనూ మాటాడక, మీరూ మాటాడకపోతే ఏం తోస్తుంది చెప్పు. ఎవళ్ళో ఒకళ్ళు మాటాడాలిగా. పోనీ మా వసంత తోనె మాటాడిద్దును. కానీ, అది మూగపిల్ల.

తుకా : మూగా ?

జనా : అరరే !

రెడ్డి : (వసంతవేపు సూటిగా చూసేడు) దేవుడికి బుద్ధి లేదు. ధర్మం లేదు. సృష్టిలో చాలా దారుణాలు పెట్టాడు. వాటిలో యిదొకటి.

వెంక : రెండో అమ్మాయి గతి యిలా ఉంటే మొదటిపిల్ల రోగిష్ఠిది. ఈ వూళ్ళో హాస్పిటల్లో చేర్పాను. దానికోసం మావూరు వదిలి యిావూ రొచ్చేము. ఇదిగో ఆ పక్క వీధిలో నందివాడ వారింట్లో ఉంటున్నాం. ఏం చెప్పేది నాయనా మా బాధలు !

తుకా : కానీ, వెంకట్రామయ్యగారూ ! వసంత గారికి చాలా అన్యాయం జరిగిపోయిందండి. చాలా అన్యాయం.

(వసంతలో చలనంలేదు. కిటికీవేపు అలాగే చూస్తోంది. వెంకట్రామయ్య వోమాటు ఆమెవేపు చూచి అన్నాడు.)

వెంక : ఈ మూగపిల్లకు అదే దేవుడు కొండంత తెలివి పెట్టాడు. బొమ్మలాటి రూపాన్ని ప్రసాదించేడు. అయినా సరే చూస్తూ చూస్తూ ఈ పిల్లకి పెళ్ళి కాదు. నేనా పెద్ద ముండావాడినై పోతూన్నాను. పిల్లేమో ..... పోనీలే నాయినా, ఎవరి ఖర్మకి ఎవరు బాధ్యులు?

తుకా : అంతే లెండి. అంతే.

(బైట వర్షం పెరిగింది. రెడ్డి కుంపటి దగ్గరికొచ్చి కూర్చున్నాడు. తుకారామూ, జనార్దనరావూ కూర్చున్నారు. వర్షంతోపాటు ఉరుములూ ఎక్కువయ్యాయి. ఉన్నట్టుండి రెడ్డి లేచేడు. వో తడవ వసంతవేపు చూసేడు. గబుక్కున తలుపు తీసుకుని వీధిలోకి వెళ్ళిపోయేడు.)

తుకా : అరె .... అదేమిటోయ్ జనార్ధనరావ్. రెడ్డి వొట్టి పిచ్చివాడిలా ఉన్నాడు.

వెంక : ఇంత వర్షంలో అత నలా వెళ్ళిపోయా డేమిటి ?

తుకా : వర్షాన్ని చూడటానికిట. ప్రియంవదకి నే నలా వర్షంల తడవడం బొత్తిగా యిష్టంలేదు. రేప్పొద్దున్న జ్వరం వొస్తే చేసే దెవరు ?

వెంక : తమాషాగా ఉన్నాడు మనిషి.

జనా : ఈ మునురు నాలుగు రోజుల్నుంచీ ఉన్నది. రెడ్డి నాలుగు రోజుల్నుంచీ చిత్రంగా కనుపిస్తున్నాడు. ఎన్నాళ్ళ నుంచో దాచుకున్న కథని ఇవాళ చెప్పేడు.

తుకా : కథా ! కథే ! రెడ్డి కథే !

జనా : అవును. రెడ్డికథే ! ఒక బీదవాడి కథే !

(హఠాత్తుగా లైట్లు ఆరిపోయాయి. బైటనుంచి రెడ్డి కేక వినిపించింది. తుకారాం బిగ్గరగా అరిచేడు. ఉరుములు ఉధృతంగా వినిపిస్తున్నాయి. జనార్దనరావ్ గబగబా లాంతరు వెలిగించేడు. గొడుగు తీసుకున్నాడు.)

వెంక : బైట రెడ్డి ఎందుకు అరిచేడు ?

తుకా : భయంవేసి. అంతేనండి.

జనా : కాదు. అది అతని ఆవేశం. గుండెల్లో దాగిన కోర్కెల గొంతు.

తుకా : అంతే నంటావా ?

జనా : చూద్దాం రా.

తుకా : పద. ముందు నువ్వు నడు.

వెంక : ఆగండి. మేమూ వస్తున్నాం.

జనా : అవుతే. ఈ గొడుగు మీరు తీసుకోండి. నేను తడిసినా ఫర్వాలేదు. ఆ చేత్తోనే యీ లాంతరూ పుచ్చుకోండి.

(వెంకట్రామయ్యకి గొడుగూ, లాంతరూ యిచ్చేడు. అందరూ బైటకు నడిచేరు. తెర ఖాళీ అయింది.)

ప్ర యో క్త :

రెడ్డి కథకి నాంది జరిగింది.

ఇప్పుడు రెడ్డి 'ప్రేమ' అనే కొత్త విషయంలో యిరుక్కున్నాడు. ప్రేమకి 'విలువ' యివ్వడం నేర్చుకున్నాడు. అతను వర్షం వచ్చిన రాత్రి వో లైటు స్తంభం దగ్గర నించుని తలెత్తి ఆకాశంవేపు చూస్తో పిచ్చిగా కేక పెట్టే నందుకు అర్థం లేకపోలేదు. వసంతలాటి మర మనుషులకి మాటెందుకు నేర్పావు కాదు భగవంతుడా అని భగవంతుణ్ణి విసుక్కున్నాడు. అతను దేవుణ్ణి తిట్టేడు. తిడితే మరింత హీనంగా బ్రతకవలసి వస్తుందని అతని భయం.

సుబ్బారెడ్డి పూర్తిగా మారిపోయేడు. అత నేది మాటాడినా వసంత నుద్దేశించి మాటాడేవాడు. తరచూ వెంకట్రామయ్య వాళ్లింట్లోకి వెళ్లేవాడు. మాటరాని అందాల బొమ్మతో మాటొచ్చిన మగవా డెంత గర్వంగా మాటాడుదాడో అంత గర్వంగానూ మాటాడుతాడు.

అత నిప్పుడు మంచి మంచి బట్టలు కడుతున్నాడు. ఖరీదైన సిగరెట్లు కాల్చుతున్నాడు. తీరుబడి చిక్కినప్పుడల్లా సినీమాల కెడుతున్నాడు. ఈ రాతి మనిషిలో యింత గొప్ప సంచలనం కలిగినందుకు విస్తుపోయేడు జనార్దనరావ్.

(తెర నెమ్మదిగా తొలిగింది. ఇప్పుడా గది మునుపటి కంటె అందంగా ఉంది. జనార్దనరావ్ కిటికీ దగ్గర నించున్నాడు. రెడ్డి హుందాగా మాటాడుతున్నాడు.)

రెడ్డి : నువ్వు చేసింది పొరపాటని ఒప్పుకో. క్షమించడానికి నాకేం అభ్యంతరం లేదు.

జనా : (కిటికీలోంచి చూస్తున్నాడు.)

రెడ్డి : మనిషి క్కావలసిన అవసరాలు నాకూ అందుబాటులో ఉన్నాయి. మీలాగా రెండు పూటలా భోంచేస్తున్నాను. కాఫీలు తాగుతున్నాను. సినీమాలు చూస్తున్నాను. ఇన్నీ నువ్వు గమనిస్తూన్నావు. ఇంకా నాలో నువ్వు గ్రహించిన పేదరిక మేమిటి జనార్దనరావ్ ? ఏం చూసి నన్ను పేదవాడి వనగలిగావు ?

జనా : (చూపు రెడ్డివేపు తిప్పేడు) నువ్వేమైనా అను— నువ్వా అమ్మాయిని ప్రేమించడం నా కిష్టంలేదు.

రెడ్డి : వా, మై క్వశ్చన్ ఈజ్ వై ?

జనా : చెప్పను. అది అంతే. నువ్వు ప్రేమించదాని క్కాదు ఉంది.

రెడ్డి : మరెందుకు ? మరెందుకు పుట్టాన్నేను? అయినా నామీద నీకెందు కింత జెలసీ ? నా గురించీ, నా పేదరికం గురించీ ఆ వెంకట్రామయ్యగారికి పదే పదే చెప్పవలసిన అవసరం నీకేమిటి ?

జనా : (కోపం వచ్చింది) రెడ్డీ ! (నెమ్మదిగా అన్నాడు) ఆవేశంలో కళ్లు మూసుకుపోతున్నాయి నీకు. ఈ రాత్రి ప్రశాంతంగా పడుక్కుని ఆలోచించు. (క్షణము ఆగేడు) ఒక్క టడిగేదా రెడ్డీ ! నువ్వు వెంకట్రామయ్యగార్కి వంద రూపాయిలు అప్పు యివ్వగలిగేవు. అంత స్తోమతుకి నువ్వు తగ్గవాడివేనా ? నీ గుండె మీద చేయి వేసుకుని నిజం చెప్పు చూద్దాం. (క్షణం ఆగేడు) అంత డబ్బుని నువ్వెలా సర్దగలిగేవో తెలీకుండా ఉంది. మ వ్యాయవికి అప్పిచ్చావ్. ఆ అప్పు ద్వారా వసంత మెప్పుని సంపాయించుకోవాలని నీ ఉబలాటం. అవునా ?

రెడ్డి : అవును.

జనా : (నిష్ఠూరంగా అన్నాడు) వసంతనబడే మూగపిల్ల మెప్పు ఖరీదు వంద రూపాయల అప్పు. సెహభాష్ రెడ్డీ ! ప్రయోజకుడివై పోతున్నావ్.

రెడ్డి : (కోపం వచ్చింది) నోర్ముయ్ నువ్వు. నాకు వసంత మెప్పులో ఉన్న థ్రిల్ మరెక్కడా దొరకదు. ఆడబ్బు అమ్మకిస్తే అన్నయ్య సరదాలకి ఖర్చవుతుంది. అన్నయ్య సరదాలు నాకు గిట్టవు. వాడి ఆనందానికి నేను త్యాగాలు చేస్తూ కూర్చోలేను. తెలిసిందా జనార్దనరావ్ ? తెలిసిందా ?

జనా : (కిటికీ దగ్గరిగా వెళ్లాడు) ఇప్పుడే తెలుస్తోంది రెడ్డీ! ఒకవిధంగా నిన్ను పాడుచేసింది నేను. నొప్పేసుకుంటున్నాను. నువ్వానాడు నీ దారుణమైన కుటుంబ పరిస్థితులు చెప్పి కళ్లనీరు నింపుకుంటే చూచి సహించలేక మార్గం చెప్పేను. స్వార్థం పెంచుకో, నీ బాగు నువ్వు చూసుకో, నీ కెవరూ లేరని అనుకో, అని సలహా యిచ్చేను. నా సూచన ఇంతవరకూ వస్తుందని నే నప్పుడు వూహించలేదు. కాబట్టి తప్పు నాదే. క్షమించు. కానీ, రెడ్డీ! ఇది నీకు జరుగుతున్న పతనమని మరిచిపోవద్దు. ఈ హెచ్చరికనూ స్వీకరించు.

రెడ్డి : ఇది నాకు పతనం కాదు. నే నసలు పతన మవ్వను. నా జీవితానికో కొత్త మలుపిది. నేను వసంతని ప్రేమించడమే కాదు జనార్ధనరావ్ ! వీలైతే పెళ్లి చేసుకుంటాను. నా ప్రాణం పైతం ఆమెకోసం ధార పోస్తాను.

జనా : కానీ, ఆమె మూగదోయ్.

రెడ్డి : మూగపిల్ల పెళ్లికి అనర్హురాలని ఎక్కడైనా రాసిపెట్టి ఉందా ? అలాగైతే ప్రపంచంలో ఉన్న మూగపిల్లల గతేం గాను ? ఏంగాను ? (కొంచెం ఆగి అన్నాడు) ఆలదు చేత—ఐ వాంట్ టు మారీ దట్ గర్ల్ పోస్లీ. మోరోవర్, షి లుక్స్ వెరీ బ్యూటిఫుల్ జనార్ధనరావ్. ఈజిట్ నాట్?

జనా : కులం, వాళ్ల ఇతర విషయాలు—

రెడ్డి : అవన్నీ నా కనవసరం. ఐవాంట్ వసంత. నా జీవితానికి వసంత కావాలి. నేను మనిషి నవ్వాలి.

జనా : (మళ్లా కిటికీలోంచి వీధిలోకి చూస్తున్నాడు.)

రెడ్డి : నే నిక్కడ నోరు పడేట్టు వాగుతూంటే నువ్వు దిక్కులు. చూస్తా వేమిటి ? ఆ కిటికీదగ్గ రేముంది ? ఆ వీధిలో ఏం జరుగుతోంది ?

జనా : (దగ్గరిగా వచ్చేడు) పెళ్లనేది వెయ్యేళ్ల పంట. వెయ్యేళ్ల పంటకి ఈ కాస్త పరిచయం పునాది కాదు. బాగా ఆలోచించుకో.

రెడ్డి : ఎంతో ఆలోచించే యీ నిర్ణయాని కొచ్చేను. దేవుడొచ్చేది నా నిర్ణయం మారదు.

జనా : నీ వెనక నీ మనుషు లున్నారు. వాళ్లకీ కొన్ని అభిప్రాయా లుంటాయి.

రెడ్డి : ఎవరోయ్ నా మనుషులు ? జీవితమంటే ఖాతరు చేయకుండా, తన వాళ్లని మరచిపోయి విలాసంగా తిరిగే అన్నయ్యా నా మనిషి ? చావుకి కాళ్లు చాపి గూడా అన్నయ్యని పొడుచేస్తున్న అమ్మా నాకు కావలసిన మనిషి ? ఎప్పటికైనా పరాయిదై పోయే చెల్లెలా నా మనిషి ? ఎవరోయ్ నా మనుషులు ? వసంత నా మనిషి, నా మనసు, నా ప్రాణం, నా ఆలోచన, నా తపన.

(మధ్యలో తుకారాం వచ్చేడు.)

తుకా : ఏమిటోయ్—మాంచి తగాదాలో ఉన్నట్టుంది వ్యవహారం. ఇప్పుడు నేను చాలా అర్జంటు పనిమీద వచ్చేను. గనక— మీ వ్యవహారాన్ని కాసేపు ఆపండి. రాత్రేం జరిగిందంటే, ప్రియంవదని పిలిచేను. పిలిచి అడిగేనూ, 'ప్రియంవదా ! ఈ వెన్నె లెంత అందంగా ఉందో చూడు. ఈ వెన్నెల్లో పచ్చగడ్డిమీద వెల్లకిలా పడుక్కుని, తెల్లని ఆకాశాన్నీ, నీ మొహంలాంటి చందమామనీ, నీ తల్లో పువ్వుల్లాంటి నక్షత్రాల్నీ చూడాలని ఉంది—నా కొంచెం తోడొస్తావూ ! అని (జనార్ధనరావ్ భుజం కుదుపుతూ కులాసాగా అన్నాడు). ప్రియంవద నవ్వేసిందోయ్, ఎంత చక్కగా నవ్విందని. నాకు తెలుసోయ్.....

రెడ్డి : ఏమిటీ పోరి ?

తుకా : (గబగబా రెడ్డి దగ్గరి కెళ్లాడు) పోరి కాదు చిట్టీ! నా జీవిత మమ్మా ! జీవితం. (మళ్లా జనార్ధనరావ్ దగ్గరి కొచ్చేడు) అప్పుడేమైందీ—వర్షైండి, మీ యిష్టం అన్నదోయ్ ప్రియంవద. ఇద్దరం దొడ్డిదోవగుండా పోవాలని అనుకున్నాం గదా వచ్చి దొడ్డి తలుపు తీశామో లేదో (కోపం వచ్చేసింది) వెధవ పెర్వానిటీ వాడూను ప్రత్యక్షమయ్యేడు. వాడిని చూచి మేము భయపడ్డాము. మమ్మల్ని చూచి ఆ వెధవ 'కేర్' మన్నాడు. పరీక్ష రేపు పెట్టుకుని సినిమాల కెళ్లే ఐడుర్దాయి మా పెద్దన్న కొడుకు చిరంజీవి. వాడి రాక మేమెక్కడ గుర్తుపట్టామోనని అదిరి గొంతు చించుకున్నాడు. శుభమంటూ యిదేం వ్యవహారంరా భగవంతుడా అని నే నిద్రై పోయాను. అయ్యిందా—ఆపళంగా ప్రారంభమైందోయ్ యుద్ధం, భీభత్సమూను. మా గొడవకి మా అమ్మ, నాన్న, వదినలు—హిందూదేశం యావత్తు మేలుకుంది. దొడ్డి తలుపు దగ్గర నించున్న మమ్మల్ని (గాద్గదికంగా) ఎందుకు లేపోయ్ జనార్ధనరావ్ చెప్పుకుంటే అభాను. 'ప్రియంవదా ! మన మెక్కడికైనా పోదాం. దేన్లోనైనా పడి అమరజీవులౌదాం. అంతేగాని ఈ నరకంలో మనం బ్రతకలేమూ అనటాని!' నేను చెప్పేను. పిచ్చిది. నవ్వి వూరుకుందోయ్. (కాస్తాగి) జనార్ధనరావ్ వో సిగరెట్టు యివ్వవోయ్.

(జనార్ధనరావ్ సిగరెట్టు యిచ్చేడు. తుకారాం ముట్టించేడు. ఇప్పు డతనికి నవోత్సాహం కలిగింది. కుర్చీలో కూర్చుంటూ అనేశాడు.)

తుకా : ఏంవాయ్ జనార్ధనరావ్ ! మా ఫ్రెండ్సు కొందరు ఢిల్లీ వెడుతున్నారోయ్ చూట్టానికి. నువ్వూ వస్తావా ?

జనా : ఢిల్లీనే. చాలాదూరం కదుటోయ్ ?

తుకా : ఏడ్చింది లేవోయ్ దూరాని కేముచ్చె గాని, నువ్వొస్తావో రావో చెప్పు ముందు.

జనా : రావాలనే వుంది మరి.

తుకా : ఆమాట చాలోయ్ జనార్దనరావ్. అయితే నాకు తోడు దొరికానన్నమాట. మా వాళ్లతో చెప్పేస్తాను. ఇంకో శాల్తీని గూడా లిస్టులో ఎక్కించేయుండని.

జనా : అది సరే గానీ, డబ్బెంత వుతుందిట. ఎన్నాళ్లుండా లిట.

తుకా : ఆఁ! ఎంతోనా ? వందల్లో ఉంటుంది. అక్కడ నాలుగురోజు లుంటాం.

జనా : మనవెంట బట్టలే మాత్రం తిను కెళ్లాల్సి ఉంటుందో!

తుకా : (విసు క్కలిగింది) జజ్జారం అనుకున్నావా చిట్టీ! ఢిల్లీ నాయ్ ఢిల్లీ. ట్వెంటీఫోరవర్స్ డ్రైక్లీనర్స్ షేవర్ శివాజీ వాజ్ బోర్న్.

జనా : ఏమిటోయ్ శివాజీ అక్కడే పుట్టాడా ?

తుకా : యస్. హి వాజ్ మై ఎక్స్‌ప్లాన్ ! హూ యూజ్ నో మోర్ నా !

జనా : చంపావు గదటయ్యా ! నేనేమో ఛత్రపతి.....

తుకా : (నవ్వేడు ఘొల్లున) వాడి సంగతి మనకేం తెలుసు గురూ ! (రెడ్డి వేపు చూసి అన్నాడు) అవునూ— ఏమిటయ్యా రెడ్డి ! మేమింత మాట్లాడుతూన్నా చేయి కలపవూ ?

జనా : అతను వసంతని పెళ్లి చేసుకోబోతూన్నాట్ట. పెళ్లి.

తుకా : అట్నే. చాలావరకు వచ్చిందే వ్యవహారం. అను కుంటూనే ఉన్నా ఇదేదో తలకెక్కే తిక్కని. నిజంచేసి పారేశావ్ రెడ్డి !

రెడ్డి : పెళ్లిచేసుకోడం తప్పా ?

తుకా : ఎవ డా మాటన్నది? వాడి కెన్ని గుండె లుండాలి మా టన డానికి ? తప్పు కాదు చిట్టీ ! ఆలోచనలేని పెళ్లి తప్పమ్మా ! ఆమాట మాత్రం నిజం.

రెడ్డి : ఆలోచించేందుకు నాకు మనసుంది. ఆ మనసు గట్టిది. నా కెవరూ ఏమీ చెప్పక్కర్లేదు.

తుకా : ఇంతవరకూ వచ్చిం తర్వాత నీకేం చెప్పినా తోచదులే అసలు. సరె, నీ ఖర్మ. ఎవ డేం చేస్తాడు ?

రెడ్డి : డోంట్ బి సిల్లీ ! నాకు ఖర్మేమిటి ? రాజులాటి మనిషి న్నేను. నాముందు అనుభవానికొచ్చే అందమైన సన్నివేశా లెన్నో ఉన్నాయి. నాకేం ఖర్మ. ఖర్మ మీ అందరిదీ. చాతకాని మనుషులు మీరు. అండర్‌స్టాండ్?

తుకా : నే నిది భరించలేను. కానీ—నన్ను లెప్పుగొట్టకు రెడ్డీ! ఇన్నాళ్లూ మంచిగా బ్రతికిన మనిషిని. మంచిగానే ఉండనివ్వు.

(తుకారాం ఇంకా ఏదో మాటాడబోయేడు. అంతలో వెంకట్రామయ్య రావడం మూలంగా మాట మార్చేడు.)

తుకా : రండి వెంకట్రామయ్యగారూ ! మీకోసం వచ్చి, మీ రింటిదగ్గర లేకపోతే యిదిగో యిల్లా వచ్చేను.

వెంక : బజార్లో కొంచెం పనుండటంవల్ల లేటయింది మరిక పోదామా ?

తుకా : వెళదాం రండి. ఈ గదిలో మతిపోయిన మనుష్యులు పిచ్చి కేకలు పెడుతున్నారు. పదండి పోదాం. (వెళ్లిపోతూ రెడ్డితో అన్నాడు) రెడ్డి ! మనం అనవసరంగా పోట్లాడుకున్నాం. ఇదేం బాగోలేదు. ఈ లోకంలో అనుభవించడానికి కొందరు పుడతారు. ఆ కొందర్ని మనిషి చెరపలేడు. చాలామంది దౌర్భాగ్యు లుంటారు. వాళ్లని దేవుడూ బాగుచేయలేడు. ఈ రెండో కారణంగా నువ్వంటే జాలి నాకు. నా మన సర్థం చేసుకో. రండి వెంకట్రామయ్యగారు వెడదాం.

(వెంకట్రామయ్య, తుకారాం వెళ్లిపోయేరు.)

రెడ్డి : ఫూల్ !

జనా : ఎవరు ?

రెడ్డి : నువ్వు కాదు. తుకారాం. భార్య ఆలోచననీ, భార్య సుఖాన్నీ గ్రహించలేని మనుష్యులందరూ నా దృష్టిలో ఫూల్స్. భార్య ఉండి ఇంట్లో ప్రైవెసీ లేదని చెప్పి బజార్లో స్నేహితులతో బాతాఖాని కొట్టే ప్రతి మనిషి నా దృష్టిలో పెద్ద ఫూల్.

జనా : పెద్దవాడివయ్యావ్. ముక్కూ మొహం తెలీని ఒక ఆడపిల్లచేత ఆకర్షింపబడి, నీలో యింత రియాక్షన్ కలిగిందంటే ఆశ్చర్యంగా ఉంది. నేను గానివ్వు, తుకారాం గానివ్వు—ఎవరేమి చెప్పినా అది నీ మంచికోసమే నని మరచిపోకు. నీకు తెలిదేమో గాని వస్తుతః నువ్వు కొంచెం పిచ్చివాడివి. నీ మనసు కళ్లెంలేని గుర్రం. ముందు దాన్ని అదుపులో పెట్టుకో. నీ బ్రతుకుని చూసి జెలసీతో మండిపోయేంత దౌర్భాగ్య స్థితిలో లేను నేను. ఆరు కాయలూ, మూడు పువ్వుల్లాటి జీవితానికి నారుమడ్ని. నన్ను యూగీ చేశావ్. ఏదో ఒక రోజున నీ పశ్చాత్తాపాన్ని గూడా స్వీకరించగలనని ఆశి యున్నాను.

(వసంత విసురుగా, బెదురుగా గదిలోకి రావడంతో మాట లాపేడు.)

జనా : వస్తా. కాసేపట్లో మళ్లా వచ్చేస్తాను. (వెళ్లాడు)

రెడ్డి : రా .... వసంతా! రా. ఇప్పటివరకూ నా జీవితమనే వస్తువుమీద కువిమర్శలతో విసిగిపోయేను. నువ్వొచ్చేవు. ఆనందంగా ఉంది నాకు. నువ్వు మూగపిల్లవే కావచ్చు. నాకు నోరుంది. నువ్వు అందాల బొమ్మవి. నాముందలాగే నించో. నీ వంతూ నా వంతూ నేనే మాటాడేస్తాను.కావలిస్తే కవిత్వం చెప్తాను.

వస : (కిటికీవేపు నడిచింది.)

రెడ్డి : వర్షమంటే నా కెంతో యిష్టం. అరోజు కలిశావ్ నువ్వు. నీకు తెలీదు గాని వసంతా (తల వంకించేడు) నీ మూలంగా నే నెంతో మారిపోయేను. నిజమే. జీవితంలో ప్రతి అడుగూ వోడిపోతూ వస్తున్న మానవుణ్ని. నీ పరిచయం నా వోటమికి స్వస్తి చెప్పబోతోంది. ఇక్కడే నా స్నేహితులకి కడుపుమంట. అన్ని మఖాలూ వదులుకుని 'దేవుడా నాకేది దారి' అని ఏడుస్తున్న మనిషిని వెతికి వాడితో వాళ్ల జాతకాన్ని పోల్చి చూచుకుని మురిసిపోయే యీ మనుషులకి ఒక ఛాన్స్ చేజారి పోతోంది—నామూలంగా. జీవితం నాకూ వరప్రసాదమే అన్నాను. ఇన్నాళ్లా నాకు సానుభూతి వలికిన వోళ్లు కట్టుబడి పోయేయి. కళ్లల్లో విషాన్ని ఒలకబోస్తూ నాకు నీతులు చెప్పబోతున్నారు వసంతా. నీతులు. !

వస : (తల వంచుకున్నది.)

రెడ్డి : పోనీలే. నా విషయాల కేమొచ్చె—అన్నట్టు నీకు మీ నాన్నగారు కనిపించలేదా ?

వస : కనిపించేరు. వెంట తుకారాం ఉన్నాడు. వాళ్లిద్దరూ యిప్పుడు నాకోసం మా యింటికి వెదుతున్నారు. గుమ్మందగ్గర ఎదురుపడ్డ వాళ్లని తప్పించుకు నే నిలా వచ్చేశాను. మీతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి.

రెడ్డి : (తల దిమ్మెత్తేలా ఆశ్చర్యపోయేడు) వసంతా ! (కొంచెం ముందుకు జరిగేడు) ఏమిటిది వసంతా ! నువ్వు .... నువ్వు .....

వస : నేను మూగదాన్ని కాదు.

రెడ్డి : (అతని మొహంలో వెయ్యి దీపాలు వెలిగాయి) ఈ ఎక్సైట్‌మెంట్‌ని భరించలేను. అవుతే వసంతా ! నీ యిష్టం మొచ్చినట్టు మాట్లాడు. కిలకిలా నవ్వుతూ మాట్లాడు. వినేవాడి మతి భ్రమించేలా తియ్యగా, హాయిగా మాట్లాడు. కానీ, వసంతా ! మాట్లాడే ముందు చెప్పు, నువ్వెందు కింత నాటకం ఆడేవ్?

వస : నా కథ వింటారా ?

రెడ్డి : చెప్పు. నువ్వేం చెప్పినా వింటాను. ఒక చిత్రమైన అనుభూతిని గుండెల్లో దాచుకుంటాను.

వస : (కిటికీ దగ్గరే నించుని చెప్పింది) నావంటి పేదరాలి కథ మీకన్నా ఘోరంగా ఉంటుంది. పుట్టిన రెండో యేట వంటరిదా న్నయ్యాను. పెంచిన మేనమామ నన్నో ముసలివాడి చేతిలో పెట్టి తన బాధ్యత తీర్చుకుందా మనుకున్నాడు. కథ అడ్డం తిప్పుదామని ప్రయత్నించి నేనే అడ్డం తిరిగేను రెడ్డిగారూ !

రెడ్డి : (ఉలిక్కిపడ్డాడు) ఏమిటి వసంతా ! మీ నాన్న ......

వస : నాలాటి దానికి వూరికో కథ ఉంటుంది. వెంకట్రామయ్య మా నాన్న కాదు. నన్ను పోషిస్తున్న వో మాంత్రికుడు. నేను మూగదానిని. నా కోరిక ప్రకారం నా నోరు నేనే కట్టేసుకున్నాను. జీవితంలో మాటాడకూడదనుకున్నాను. నే ననుభవిస్తున్న రంపపుకోత నా గుండెల్లోనే దాచుకోవాలని కోరిక. (కాసే పాగింది) మీలాగ నేనూ మునువు పిచ్చిదానినే. వర్షం మాట అంటే నాకూ యిష్టమే. (పేలవంగా నవ్వేసింది) అందుకే మీరంటే నా కిష్టం. వర్ష మొచ్చిన రాత్రి మనిద్దరం కలుసుకున్నాం. నా ఆలోచనల కున్న రంగులు మీలో చూచుకొన్నాను, అందికే మీరు పతన మవడం యిష్టం లేదు. సహించనే లేను. పెళ్లిచేసుకునే అర్హత నాకు లేదు. నైతికంగా చచ్చిపోయిన వసంత మళ్లా బ్రతకడం దుస్సాధ్యం. మా వ్యాపారానికి వెంకట్రామయ్య మిమ్మల్ని ఎరగా వాడుకో చూశాడు. అతను చాలా మందిని మోసగించేడు. నేను పట్టించుకోలేదు. కానీ, మీరు మోసపోకూడదు. మీరు నా జాతి మనుషులు. (తల పైకెత్తి అన్నది) నన్ను మరిచిపోండి రెడ్డి ! జీవితంలో నే నెవరికైనా సాయం చేసేనని చెప్పుకుంటే అది మీకే అవుతుంది. (బాధగా అన్నది) ఇవాళ ఉదయుం వెంకట్రామయ్యకి మీరు వంద రూపాయలప్పు యిచ్చేరు. దాన్ని అప్పుగా తీసుకో డతను. అంత డబ్బు మీరెలా యివ్వగలిగేరో, దానికి మీరెంత అవస్థపడి ఉంటారో నాకు తెలుసు. నా మెప్పు పొందాలనుకున్నవాళ్ల నెందర్నో చూచి నవ్వుకున్నాను. మిమ్మల్ని చూచి ఏడ్చేను. ఈ జాతకురాల్ని క్షమించమని దేవుణ్ని వేడుకున్నాను. ఇంతకంటే నేనేం చెప్పగలను ? మీమీద నాకు జాలి. మరేవిధమైన వాంఛా లేదు. —

రెడ్డి : (ఏడుపొచ్చింది) భగవంతుడా ! నన్నెందు కిలా పరీక్షిస్తావ్ ? నన్నెందు కిలా పరీక్షిస్తావ్ ?

వస : తుకారాంలాటి వారికి మాతో ఎంతో అవసరముంది. ఆ మనిషి మా వెంకట్రామయ్యకి బాగా నచ్చేడు. నేను అసహాయురాలిని. నా కోర్కెలన్నీ ఎప్పుడో బలైపోయాయి. (బాధపడ్డది) తుకారాం లొక్కుడు. నాతో ఎన్నో చెప్పేడు. మనసులేని పశువు.

రెడ్డి : (కోపం వచ్చింది) తుకారాం ! (నెమ్మదిగా అన్నాడు) వెళ్లిపో .... వసంతా. మళ్లీ నాకు కనిపించకు. వెళ్లిపో.

వస : శలవు. నమస్కారం. వెళ్లేముందు ఒక్కమాట. జీవితంలో వోడిపోయినవాళ్లెందరో ఉన్నారు. మీ రొక్కరే కాదు. దిగులుపడకండి (కిటికీలోకి చూచింది). అదుగో వెంకట్రామయ్య వస్తూన్నాడు. ఇప్పుడు నే చెప్పిందంతా

మరిచి మీకేం తెలీనట్టు వూరుకోండి. నా కోసం నటించండి.

రెడ్డి : (పేలవంగా నవ్వేడు) మంచి మాటన్నావ్ వసంతా ! నటిస్తాను. మిగిలిన ఆ ఆఖరి కళా ప్రదర్శిస్తాను. సరేనా?

(వెంకట్రామయ్య వచ్చేడు. ఇద్దర్నీ కాసేపు పరీక్షగా చూసేడు. తర్వాత వసంతతో అన్నాడు.)

వెంక : నువ్విక్కడున్నావా అమ్మా ! మంచిదానివే ! తొరగా తెములు పోదాం.

వస : (జాలిగా చూచింది రెడ్డివేపు.)

రెడ్డి : వెళ్లిరా వసంతా ! వెళ్లిరా ! నీకోసం తుకారాం యెదురు చూస్తుంటాడు పాపం.

వెంక : (బిత్తరపోయేడు) ఏమిటి బాబూ మర్మంటున్నది?

వస : (జాలిగా చూచింది రెడ్డివేపు.)

రెడ్డి : వెంకట్రామయ్యా ! ఒకతడవ వసంతవేపు చూడు. ఆ అమ్మాయి కళ్లల్లో గూడు కట్టుకున్న జాలిని చూడు. సరిగ్గా చూడు వెంకట్రామయ్యా !

వస : (మూగతనం నటించి ఏదో అనబోయింది.)

రెడ్డి : నిన్ను చూస్తుంటే నా కేడుపొస్తోంది వసంతా ! ఇంకా యెందుకు నటిస్తావ్ ? (గద్దించేడు) తీసు కెళ్లు వెంకట్రామయ్యా, మళ్లా యీ చాయల్లో కనుపించకండి. వెళ్లండి. వెళ్లిపోండి.

వెంక : ఏం బాబూ ! నీ మతేమైనా .....

రెడ్డి : నీ దయువల్ల నిక్షేపంలా ఉంది. నామీద నీ ప్రయోగం బాగా పనిచేసిందనే ఒప్పుకుంటాను. గెటవుట్ వెంక ట్రామయ్యా ! గెటవుట్ (గట్టిగా అరిచేడు) దయచేసి మీ రిద్దరూ వెళ్లిపోండి. (ఏడు పొచ్చింది.)

వస : ఏమండి ! (రెడ్డివేపు వెళ్లబోయింది.)

వెంక : (వసంత చేయి పుచ్చుకున్నాడు) ఆగు ! ముందిక్కడ్నుంచి కదులు. వూ .... కదులు !!

(వసంతని తీసుకుపోయేడు వెంకట్రామయ్య.)

ప్రయోక్త :

రెడ్డి కథ ముగిసింది. రెడ్డి కథ ముగిసేముందు సన్నగా ఈదరగాలి వీచింది. ఎక్కడో ఉరిమింది గూడాను. మళ్లా వర్షం వచ్చే సూచనలూ కనిపించేయి.

రెడ్డి ! .... ఎందు కలా వణికిపోతున్నావ్ నువ్వు ? ఎందు కలా కలవరపడిపోతున్నావ్ నువ్వు ? ఎందుకయ్యా..... ఎందుకు ? .... చూశావా .... నిన్ను చూస్తుంటే నవ్వొస్తోంది. నవ్వేదా రెడ్డి ! ఎందుకో తెలుసా .... తెలుసా .... తెలుసా ?

ఆకాశం గట్టిగా ఉరిమింది. రెడ్డి ఉలిక్కిపడ్డాడు. గబ గబా కిటికీ దగ్గరి కెళ్లాడు. కిటికీలోంచి ఆకాశంవేపు చూశాడు.)

రెడ్డి : ఉరుముకాదు నాకు కావలసింది. పిడుగు. లక్ష పిడుగులు ఏకమై యిక్కడే పడాలి.

జనా : (వస్తూ అన్నాడు) నే నంతా విన్నాను రెడ్డి ! జీవితంలో ఏడ్చేవాళ్లంటే రోత నాకు. ఇప్పుడు నిన్ను చూస్తుంటే నా కేడుపొస్తోంది. నిజం రెడ్డి ....నిజం.

(రెడ్డి ట్రంకుపెట్టె తెరిచేడు. నీలంరంగు పెట్టెని తీసి దాన్ని జనార్ధనరావ్ చేతుల్లో పెట్టేడు. జనార్ధనరావ్ పెట్టెని తెరిచేడు. గాజుల్లేవు.)

జనా : (ఉలిక్కిపడ్డాడు) గాజులేవి రెడ్డి !

రెడ్డి : ఖర్చయ్యాయి జనార్ధనరావ్ ! అర్థంలేని విలాసానికీ మోసానికీ, స్వార్థానికీ ఉపయోగపడ్డాయ్. వెర్రి బహుమతిని మంటలో కలిపేను. నా గొంతుని నేనే కోసుకున్నాను. ఆత్మహత్య. సూయిసైడ్. అన్నయ్యని తిట్టిన ఘనుడా వెధవై పోయావా ? ఒక బీదవాడు, ఒక అయోగ్యుడు ప్రేమించేడు—పదుగురులో నగుబాటు చెందేడు. అమూల్యమైన ఆనందాన్ని అమ్ముకున్నాడు. చాలా జనార్ధనరావ్ ?

(ఉరిమింది మళ్లా)

అదిగో .... దౌర్భాగ్యదేవత నన్ను పిలుస్తోంది. పిలుస్తోందోయ్. మళ్లా మొదలయ్యే కథకి రమ్మని పిలుస్తోంది. వస్తున్నాను దేవతా ! వస్తున్నాను.

(రెడ్డి ఏడుస్తూ వేగంగా పరుగెత్తుకుంటూ వెళ్లిపోయేడు. జనార్ధనరావ్ బిత్తరపోయేడు.)

ప్రజలు ప్రభుత్వం

శ్రీ జాన్ స్ట్రాచీ

అభివృద్ధి చెందిన మానవ సమాజాల వ్యవహారాలను సర్దుబాటు చేయడానికి ప్రజాస్వామ్యమనేది ఇంతవరకు కనుగొన్న వాటిలో ఉత్తమమార్గం. కాని ఇది మానవ సమస్యలకు గట్టి పరిష్కారంకాదు. ఎందుకంటే గట్టి పరిష్కారమనే దేదీ లేదు. కనుక మనం మానవ సమాజ వ్యవస్థలు వ్యవహరించవలసిన తీరు విషయంలో అలా ఉండాలి, ఇలా ఉండాలని అని హెచ్చుగా కోరుకోకపోవడం నేర్చుకొనడం మంచిది. రాజకీయ వృద్ధుడైన చర్చిల్ ప్రజాస్వామ్యం గురించి బ్రిటిష్ కామన్స్ సభ లాబీలో తరచు అనేమాటలు నాకు ఎంతో ప్రీతిపాత్రమైనవి. ఆయన ఏమనేవాడంటే "ప్రజాస్వామ్య ప్రభుత్వం అన్ని ప్రభుత్వాలకన్నా మరీ అధ్వాన్నమైనది" అని.

ప్రజాస్వామ్యం సర్వరోగ నివారిణి కాదనడానికి మరొక కారణం ఉన్నది. ప్రపంచంలోని అన్ని రాజ్యాలు గట్టిగా పని చేయగల ప్రజాస్వామ్య రాజ్యాలు కాగలిగినా—అవి కాజాలవను కోండి—అంతమాత్రం చాలదు. ఎందుకంటే, నూరారు ప్రజాస్వామ్య రాజ్యాలు ఏర్పడినా, ప్రపంచంలో ఇతర రాజ్యాలు—సర్వసత్తాకాధికారంగల ఇతర రాజ్యాలు ఉంటాయి. అణ్వస్త్ర యుగంలో సర్వసత్తాకాధికారంగల రాజ్యాలు పనికిరావని నా అభిప్రాయం. ఈవిధమైన మానవ వ్యవస్థ, కొట్టుమిట్టాడుతూ—మనము బ్రతుకుతున్న ఈ శకంలో మానవజాతి మనుగడను నిలబెట్టదు.

ఇది ప్రజాస్వామ్యం—యుద్ధం అనే సమస్యను లేవదీస్తుంది. యుద్ధం—యుద్ధ నివారణ మన శకంలో అత్యంత ప్రధానమైన సమస్య. మనము మన ఆర్థిక జీవితాన్ని పెట్టుబడిదారీ విధానపు పంథాలో రూపొందించుకోవలెనా లేక సోషలిస్ట్ వాద పంథాలో ఏర్పాటు చేసుకోవలెనా అన్న దానికంటే కూడా యుద్ధం—యుద్ధ నివారణ అనేది అత్యవసరమైన సమస్య. పెట్టుబడిదారీ విధానం క్రిందనైనా, సోషలిస్ట్ విధానం క్రిందనైనా ప్రజలు బ్రతుకగలరని అనుభవం చాటనే చాటుతున్నది. అయితే అణ్వస్త్రయుద్ధంక్రింద ప్రజలు బ్రతుకజాలరు.

జీవితమంతా సోషలిస్ట్‌గా వ్రాస్తూ, వెనుదిరిగిచూస్తే ఈ యుద్ధ సమస్యపై సోషలిస్ట్‌లమైన మేము చాలా అపోహలు పడ్డాము. ఇంతకంటే ఎక్కువ అపోహలకు మమ్ములను గురిచేసిన సమస్య మరొకటిలేదు. యుద్ధానికి కారణము పెట్టుబడిదారీ దేశాలమధ్య ఆర్థికమైన వైషమ్యాలేనని కొంచెము ఇంచుమించుగా సోషలిస్ట్ లందరూ ఒకప్పుడు విశ్వసించినవారే. ఈ విశ్వాసమునుండే మరొక నమ్మకము ఉత్పన్నమయినది. అది ఇది ;- పెట్టుబడిదారీ విధానాన్ని రద్దు చేసి, సమాజాన్ని సోషలిస్ట్ ప్రాతిపదికపై వ్యవస్థీకరిస్తే యుద్ధ కారణము తొలగించబడుతుంది, ప్రపంచ శాంతిస్థాపన సుకరమవుతుందని ఈ వాదము ఎలా సమర్థనీయమో నాకు గోచరించడములేదు.

ప్రపంచ విధానాల విషయంలో మనకు పెద్ద సోషలిస్టు దేశమైన రష్యయొక్క 45 ఏండ్ల అనుభవము ఉంది. ఆధునికమైన సోషలిస్ట్ పంథాలలో ఆర్థిక జీవితాన్ని వ్యవస్థీకరించే మరొక పెద్దదేశము చైనా ప్రవర్తన విషయంలో మనకు 14 ఏండ్ల అనుభవముంది. శాంతి—యుద్ధము అనే అత్యంత ప్రధానమైన ఈ సమస్యపై వాటి కృషి ఏమిటి? పెట్టుబడిదారీ దేశాలకంటే సామ్యవాద దేశాలు ఎక్కువగా కయ్యానికి కాలుదువ్వే లేదా దురాక్రమణ కొడిగట్టే దేశాలని ఆరోపించేవారిలో నేను ఒకడినికాను. సైన్యంతో ఇతర దేశాలను జయించడం ద్వారా ప్రపంచాన్ని కమ్యూనిస్టు మయం చేసేందుకు రష్య కృత నిశ్చయంతో ఉన్నదని చెప్పడం తప్పు అని తలుస్తాను. ఒకనాడు ప్రపంచమంతా కమ్యూనిస్టు ప్రపంచంగా ఉండగలదని రష్య ప్రభుత్వము విశ్వసిస్తున్నదనేది

నిజము. ఏమైనప్పటికి ఇటీవలివరకు యుద్ధమనేది వెనుకటి మాట 'కాదని' కూడా రష్యా విశ్వసించింది. ప్రభుత్వాలను ఏర్పాటుచేసే వ్యక్తుల విశ్వాసముకంటే వారు ఏమి చేస్తారన్నదే చాలా ముఖ్యము. అంతేకాకుండా మొత్తంమీద కమ్యూనిస్టు దేశాలు వెలసినప్పటినుండి శాంతి సమరాల విషయంలో అవి మనకంటే అధ్వాన్నంగానూ లేవు. మేలుగాను లేవు. ఫిన్లెండ్, హంగెరీలలోను, బాల్టిక్ రాజ్యాలను కలుపుకొనడంలోను తదితర సందర్భాలలోను రష్యా తరచు దూకుడుగాను, దురాక్రమణాత్మకంగాను వ్యవహరించింది. అయితే పశ్చిమాన మనమూ అలాగే ఉన్నాము. ఉదాహరణకు నా దేశమైన బ్రిటన్ సూయజ విషయంలో రష్యావలెనే వ్యవహరించింది.

అయితే ఇది సోషలిస్టుకు చాలా క్రుంగదీసే నిర్ణయము. అత్యంత ప్రధానమైన, మనకు తల మున్కలైన సమస్యకు పరిష్కారములేదని ఇది సూచిస్తుంది. సోషలిస్టు పథాలలో మన సమాజాలను మార్చడం ద్వారా అణ్వస్త్రయుగంలో శాంతి పరిరక్షణ ఎలా అన్నదే సమస్య. సోషలిజం వాంఛనీయమైనదే. అది అలాగనే నా నమ్మకము. అయితే అది శాంతి సమరాల సమస్యను పరిష్కరిస్తుందనే నిదర్శన మేమీ లేదు. ఇటీవల చైనా బుద్ధిపూర్వకంగా భారత్‌పై దురాక్రమణ జరిపింది. అంటే ఒక కమ్యూనిస్టు దేశము అర్ధసోషలిస్టు దేశంపై దాడి చేసిందన్నమాట. శాంతి పరిరక్షణ ఎలాగన్న సమస్యకు పరిష్కార మార్గము కనుగొన్నామని సోషలిస్టులు చెప్పుకోవడానికి అస్కారములేదు. అలా వాళ్లు చెప్పుకుంటే హాస్యాస్పదులవుతారు.

అయితే, యుద్ధానికి కారణాలు ఆర్థిక సంబంధమైనవే నన్న సోషలిస్టు విధానంలో తప్పు ఏమిటి? విజయానికై చేసే యుద్ధాలలోని అసలు ఉద్దేశము ప్రధానంగా ఆర్థికమైనదేనని ఎప్పటివలె నా కింకా నమ్మకము. పెద్ద బానిస రాజ్యాలున్న వెనుకటి ప్రపంచంలో యుద్ధంలో విజయసాధనలోని ఉద్దేశ మేమంటే ముఖ్యంగా ఓడిన ప్రజలను బానిసలుగా పట్టుకోవడం, వారితో పనులు చేయించుకోవడం. ఓడిపోయిన వారిని బందీలుగా పట్టుకొన్నైనా పట్టుకుంటారు లేదా తమ దేశాలకు బానిసలుగా పంపి పనులు చేసేందుకు నియోగిస్తారు. ఇది అప్పుడు విజేతలు చేసేపని. ఇదేవిధంగా రోమన్‌లు చేశారు. అలాగాకపోతే ఓడిపోయిన వారిని వాళ్ల దేశములోనే ఉండనిచ్చి ఆ తరువాత ఏదో ఒకవిధంగా వాళ్లు ఉత్పత్తి చేసిన దానిని వాళ్లు బ్రతకడానికి మాత్రము చాలినంత వదలి తీసుకోవడం జరుగుతుండేది.

ప్రాచీనకాలంలో ప్రపంచంలో ఉత్పత్తి చాలా తగ్గుస్థాయిలో జరుగుతుండేది. అప్పుడు పనిపాటలు లేకుండా విశ్రాంతిగా కాలము గడిపే వర్గ ప్రజలు విలాసంగా జీవించేందుకు ఒకటే మార్గముండేది. అదేమిటంటే యుద్ధాలు చేసి విజయాలు సాధించడము ద్వారా కూలిపనిచేసే బానిసలను ఎక్కువ మందిని తెచ్చుకోవడము. ఏమైతేనేం అది చాలా కాలం క్రిందటి విషయం. ఏమైనప్పటికీ, పెట్టుబడిదారీ దేశాల యుద్ధాలకు కారణాలు ముఖ్యంగా ఆర్థికమైనవేనని ఇంకా సోషలిస్టులు విశ్వసిస్తున్నారు. "సామ్రాజ్యవాదము" అనే తన పుస్తకంలో లెనిన్ యుద్ధానికి కారణాలను గురించి తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పెట్టుబడిదారీ దేశాలు లేదా సమాజాలు తమ మార్కెట్లను విస్తరించుకునేందుకు, కొత్త మార్కెట్లను ఏర్పాటు చేసుకునేందుకు, పెట్టుబడిరంగాలను విస్తరింపజేసుకునేందుకు పరస్పరం ఒకదానిపై మరొకటి ధ్వజమెత్తితీరాలని ఆయన నమ్మకము. పెట్టుబడిదారీ దేశాలు అలా చేయకపోతే, మితిమీరిన పెట్టుబడితోను, అవసరాలకుమించి ఉత్పత్తి చేయబడిన వాడకం సరుకులతోను సతమతమైపోతాయి. ప్రతి పెద్ద పెట్టుబడిదారీ సమాజము 'ప్రెజర్ కుక్కర్' లాంటిదని, ఎప్పుడో ఒకప్పుడు ప్రేలి ప్రపంచంపై విరుచుక పడటమో లేకపోతే అదే సతమతమై నాశం కావడమో జరుగుతుందని లెనిన్ బోధించారు.

లెనిన్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతములో చాలవరకు నిజమున్నదని నే నింకా నమ్ముతున్నాను. 1917 లో అప్పుడున్న పెట్టుబడిదారీ విధానంపై ఆయన వ్రాశారు. ఇలాంటి పెట్టుబడిదారీ విధానము ఇతర దేశాలలో మాత్రమే వ్యాపించగలదు. ఆ పెట్టుబడిదారీ విధానము ముఖ్య లక్షణము కార్మిక జనాన్ని జీవనానికి చాలీ చాలని ఆర్థిక స్థితిలో అణగద్రొక్కి ఉంచడమే. పెట్టుబడిదారీ వ్యవస్థ విదేశాలలో మార్కెట్లను చూసుకోవలసి ఉండేది. అదేవిధంగా పెట్టుబడి పెట్టేందుకు రంగాలను కూడా విదేశాలలో చూసుకోవలసి ఉంటుంది. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నదేశంలో మార్కెట్ చాలా పరిమితంగా ఉంటుంది. ఇందుకు కారణం ప్రజలలో ఎక్కువమంది దారిద్ర్యము అనుభవిస్తుండటమే. పెట్టుబడిదారీ వ్యవస్థగల దేశాలు తమ కార్మికుల జీవన ప్రమాణాన్ని క్రమంగా పెంచగలవన్న విషయంలోను వాస్తవానికి పెంచాయన్న విషయంలో అనుమానమేమీలేదు. ఇలా చేయడంవల్ల దేశంలోనే విస్తృతమవుతున్న మార్కెట్ సమకూరుతుంది. తత్ఫలితంగా విదేశాల్లో మార్కెట్ల విస్తరణ అనవసరమైంది.

ఈ సంభవాన్ని లెనిన్ గుర్తించాడు. ఇది ఆశ్చర్యకరమే. అయితే ఆయన దానిని ఏదోనని కొట్టి పారేశాడు. దాన్ని ఆచరంలో పెట్టగలిగితే అది సమస్యను పరిష్కరిస్తుందనడంలో సందేహంలేదు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ సహజంగా

దానిని చేయజాలదు. "సామ్రాజ్యవాదం"అనే లెనిన్ పుస్తకం 4 వ ప్రకరణంలో ఎవరూ అంతగా గమనించని ఒక పేరాఉంది. అందులో ఆయన స్పష్టంగా ఇలా చెప్పారు. జీవన ప్రమాణాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ పెంచగలిగితే, వ్యవసాయాన్ని అభివృద్ధి పరచగలిగితే అప్పుడు అపరిమితంగా విస్తరణపై బయటి ఒత్తిడిని తొలగించవచ్చు. పెట్టుబడిదారీ దేశాలు రక్తపాతంతో కూడిన యుద్ధాలలో పరస్పరం ఢీకొనవలసిన అవసరమేమాత్రము ఉండదు.

గత 20 ఏండ్లలో పెట్టుబడిదారీ వ్యవస్థ సరిగ్గా ఈ రెండు పనులే చేసిందనే వాస్తవాన్ని ఇప్పుడు కాదనడమంటూ లేదు. అది వ్యవసాయాన్ని అభివృద్ధిపరచింది. అంతేకాకుండా పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజల జీవన ప్రమాణాన్నిపెంచింది. కనుక లెనిన్ వాదం ప్రకారం అదింకేమాత్రము పెట్టుబడిదారీ విధానము కాదు. వాస్తవానికి నేడు పాశ్చాత్య దేశాలలో ఉన్న ఆర్థిక వ్యవస్థ—గత 20 ఏండ్లలో సంస్కరణలు, సవరణలవల్ల నిజంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అని ఏమాత్రము పిలువబడజాలనంత పెద్దగా మారిపోయిందని చెప్పే ఆర్థికవేత్తలున్నారు. ఇది తప్పు అని తలుస్తాను. పాశ్చాత్య దేశాలు మరింత అనువుగా పెట్టుబడిదారీ సమాజాలుగా వర్గీకరించబడినవి. నేను చూపెట్టినదేమంటే ఏ రెంటినైతే పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పటికీ చేయజాలదని లెనిన్ చెప్పాడో సరిగ్గా ఆ రెంటినే పరిమితమైన, అయితే ముఖ్యమైన మార్పులతో పెట్టుబడిదారీ వ్యవస్థ చేయుగలదని. (మార్క్సు వూహకు సంబంధించిన ప్రధాన సమస్య విషయంలో మనము మరొక మార్గంలో వెనక్కుపోయామని మీరు గమనించే ఉంటారు. కార్మికుల దౌర్భాగ్యము నానాటికి పెరుగుతూనే ఉంటుందని మార్క్సు వూహ. ఈ వూహ రుజువు కాలేదన్నది వాస్తవము. ఈ వాస్తవం అన్నిటిని మారుస్తుంది.)

దీని సంతటినుండి పెటు బడిదారీ సమాజాలమధ్య యుద్ధము ఇంకేమాత్రము అనివార్యము కాదనే నిశ్చితాభిప్రాయానికి వచ్చాను. శాంతిని పరిరక్షిస్తూ, పెట్టుబడిదారీ సమాజాలు అన్నిటిని సరిగా నిర్వహించగలవు. అంటే దురదృష్టవశాత్తు అవి తప్పనిసరిగా శాంతిని పరిరక్షిస్తాయనికాదు. సోషలిస్టు దేశాలకు, బహుశః దురాక్రమణను జరుపడానికి, విస్తరణకు ఎలాంటి అవసరముండదు. తమ ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడంలోను, మొత్తంమీద అభివృద్ధిని సాధించడములోను అవి నిరవధికంగా నిమగ్నము కాగలవు. అయితే అదేవిధంగా అనుభవము చూపే విషయం మరొకటుంది; అదేమంటే, నిజానికి అవి దురాక్రమణ కొడిగట్టి పడడానికి ఇదేమీ హామీ కాదని. ఎందుచేతనంటే హిమాలయాల దక్షిణపు వాలుల్లో చైనా సైన్యాలు చేస్తున్న దేమిటి? చైనా దేశంలో అభివృద్ధిని సాధించేందుకు తన శక్తి సంతటిని, వనర్లను ధారవోసి వివేకమైన తలంపుతో వాస్తవంగా తెగించి కృషి చేస్తూ ఉండాలి. అయితే భారత్ పై దాడి జరిపేందుకు 14 డివిజన్ల సైన్యాన్ని పంపింది.

యుద్ధానికి కారణము ఇదని తోస్తుంది : ప్రత్యేకంగా సార్వభౌమాధికార రాజ్యాలు—అవి పెట్టుబడిదారీ, సోషలిస్టు, ఫ్యూడల్, తదితరములైనవి ఏమైనాసరే—ఉండటమేనని. ప్రపంచము వందకుపైగా సార్వభౌమాధికార రాజ్యాలుగా వ్యవస్థీకరించబడడం, లేదా విడిపోవటమే యుద్ధానికి కారణమన్నది సత్యము.

జాగ్రత్త పడకపోతే ప్రజాస్వామ్యవాదులు కూడా యుద్ధ కారణాల గురించి సరికొత్త భ్రమకు లోను కావచ్చుననుకుంటాను. భ్రమకు లోనుకాకుండా చూచేందుకు, యుద్ధ కారణాల సమస్యపై సోషలిస్టులకు కల్గిన భ్రమ విషయాన్నంతటిని చర్చించాను. యుద్ధానికి కారణము క్రూర ప్రభుత్వాలలోను, నిరంకుశ ప్రభుత్వాలలోను, తదితర నియంతృత్వ ప్రభుత్వాలలోను ఉన్నదని, ప్రపంచ రాజ్యాలన్నీ ప్రజాస్వామ్య దేశాలయితే తప్ప, ప్రపంచంలోని ప్రభుత్వాలన్నీ శాంతియుతంగా ఉంటేనే తప్ప యుద్ధప్రమాదము లేకుండా ఉంటుందని ప్రజాస్వామ్యవాదులు తరచు వాదించడానికి అలవాటు పడ్డారు.

ప్రజాస్వామ్య దేశాల ప్రపంచంలాంటిది ఎప్పుడైన అవతరించడమనేది జరిగితే, ప్రజాస్వామ్యాలలో సహజంగానే శాంతి కామిత ఉన్నదనే విశ్వాసము కూడా ఒక భ్రమేనని అనుభవము చాటుతుందేమోనని నా భయము. వాస్తవానికి మొత్తంమీద ప్రజాస్వామ్య దేశాలు—క్రూర, నిరంకుశ ప్రభుత్వాలకన్నా, ఇతర ఏక పక్షీయంగా వ్యవహరించే ప్రభుత్వాలకన్నా—తక్కువ దురాక్రమణోద్దేశములు కలవని, కయ్యానికి కాలుదువ్వడం తక్కువని నా విశ్వాసము. వోటర్లకు బాధ్యత వహించే ప్రభుత్వము ఏమైనప్పటికి అప్పుడప్పుడు శాంతి విషయంలో వత్తిడులకు లోనవుతుంటుంది. కాని ప్రజాస్వామ్యాలు సదా పూర్తిగా శాంతిని కోరేవన్నమాట సత్యదూరం. ప్రజాస్వామ్య దేశాలలో ఎక్కువమంది వోటర్లు కొన్ని సమయాల్లో సహేతుకము కానటువంటి కయ్యాలకి కాలుదువ్వే ఆవేశాలకు లోనవుతుంటారు. గత శతాబ్ది చరిత్రను మనము పరిశీలిస్తే, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు దురాక్రమణ జరిపేవిగాను, కయ్యానికి కాలుదువ్వేవిగాను ఉండినవని మనము తెలుసుకోగలము. ఇందుకు సందేహ మేమీలేదు. బ్రిటన్ విష

యంలో ఇలాంటి ఉదాహరణలు వెంటనే మనకు జ్ఞప్తికి వస్తాయి. అమెరికా నేడు కొంచెము దుందుడుకు దేశమనే వామపక్ష ప్రజలు చాలామంది భావిస్తున్నారు. అయినప్పటికి అమెరికా ప్రభుత్వము నిస్సంశయంగా ప్రపంచములో అత్యంత సమర్థంగా పని చేస్తున్న ప్రజాస్వామ ప్రభుత్వాలలో ఒకటి. అమెరికా ప్రత్యేకించి చెప్పదగినంత దుందుడుకు దేశమని నేను అనుకోను. అయితే పూర్తిగా విశిష్టంగా శాంతియుతము కాదని కూడా నేను అంగీకరిస్తాను.

ప్రజాస్వామ్య రాజ్యాల ప్రపంచము ఇంకా యుద్ధ ప్రమాదమున్న ప్రపంచమే. ప్రజాస్వామ్య దేశాల ప్రపంచాన్ని గురించి మనము చెప్పుకో కల్గింది మహా ఉంటే అలాంటి ప్రపంచము—నిరంకుశ, క్రూర ప్రభుత్వాల ప్రపంచంతో పోల్చితే యుద్ధానికి దిగే అవకాశము తక్కువని, ప్రజాస్వామ్య రాజ్యాలు యుద్ధానికిపోయే అవకాశము తక్కువని. సంతోషకరములుకాని ఈ వాస్తవాలను మనము ఎదుర్కోనక పోతే, శాంతి సమరాల సమస్యపై సోషలిస్టులు భ్రమ పడినట్లుగానే ప్రజాస్వామ్యం విషయంలో కూడా మనము భ్రమకు లోనవుతామని తలుస్తాను.

అలాంటప్పుడు, ప్రజాస్వామ్య ప్రభుత్వాలున్న ప్రపంచములో యుద్ధము ఇంకా సంభవమే. వాస్తవానికి ఇంతకుమించి మరింతలోతుగా చెప్పవలసి ఉంటుందనుకుంటాను. దీర్ఘకాల దృష్ట్యా, ప్రత్యేకమైన సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య దేశాలున్న ప్రపంచములో యుద్ధము అనివార్యము. చాలాకాలము వరకు యుద్ధము వాయిదా పడవచ్చు. ప్రస్తుతము ప్రపంచ మెదుర్కొంటున్న సంకట పరిస్థితులు చాలామంది అనుకునే విధంగా వెంటనే ప్రమాదకరములు కావని నా విశ్వాసము. ఈ క్లిష్ట పరిస్థితులలో ఏదో ఒకటి ప్రపంచ వ్యాప్తమైన అణ్వస్త్ర యుద్ధాన్ని తెచ్చిపెట్టి మనలను తుడిచి పెట్టవచ్చునని నేను అనుకోను. ఐనప్పటికి ప్రపంచము ఈవిధంగానే నడుస్తుంటే విపత్కర పరిస్థితులు అంతు—పంతు లేకుండా ఒకదాని తరువాత ఒకటి ఏర్పడుతుంటే, ఎప్పుడో ఒకప్పుడు ఈ విపత్కర పరిస్థితులలో ఒకటి ప్రపంచ సంగ్రామాన్ని తెచ్చిపెట్టదా అనటాన్ని మనం ఎలా కాదనగలము?

మనము అంతర్జాతీయ అరాజకములో బ్రతుకుతున్నాము. నేడు సార్వభౌమాధికార రాజ్యానికి మించిన శక్తి ఏదీ లేదు. అరాచకానికి దాని శాసనాలు దానికున్నాయి. అవి గణాంకములైన శాసనాలు, ఆకారణంగా అవి మానవుని అజమాయిషీకి లోబడినవికావు. అయితే మానవుని వివేచనకు, వూహలకు లోబడి ఉంటాయి. కనుక మనము నమ్మకంగా ఈ విషయాన్ని వూహించవచ్చు. నిరవధికంగా అరాచక పరిస్థితిని నెలకొనజేస్తే అది ఎప్పుడో ఒకప్పుడు ఘర్షణకు దారితీస్తుంది. అలా జరుగకపోతే చారిత్రికానుభవమంతా తప్పే.

కనుక అణ్వస్త్రయుగంలో మానవుని మనుగడకు ప్రత్యేకమైన ప్రజాస్వామ్య రాజ్యాల ప్రపంచానికంటే ఎక్కువైనది కొంత అవసరమనే అభిప్రాయానికి వచ్చాను. మానవాళి విపరీతమైన ఈ వినాశకర శక్తులను కనిపెట్టకుండాఉంటే, ప్రత్యేకమైన సార్వభౌమాధికార రాజ్యాల ప్రపంచము సాధ్యమయ్యేది. సహించదగిన ప్రపంచమూ అయ్యేది. అప్పుడప్పుడు యుద్ధాలు ఉంటాయనడంలో సందేహము లేదు. అయితే ఏదో విధంగా మానవజాతి చరిత్ర గతిలో అప్పుడప్పుడు యుద్ధాలు ఉంటూనే ఉన్నాయి. అయినప్పటికీ నాగరికత వారి మనుగడను నిలబెట్టింది. అణ్వాయుధాలు తయారుకాడంతో అంతా మారిపోయింది. మానవ నాగరికత పరిరక్షణకు పూర్తి అణ్వస్త్ర యుద్ధము అనుగుణము కాదన్న నిశ్చితాభిప్రాయమునుండి మనము ఎలా బయట పడగలుగుతామో నాకు గోచరించడం లేదు.

మానవుల మనుగడకు అవసరము, అనివార్యము అయినదేమంటే ప్రపంచమంతా ప్రజాస్వామ్య దేశాలయ్యేవరకు ఒకదేశమునుండి మరొక దేశానికి ప్రజాస్వామ్యము విస్తరిల్లడము మాత్రమే చాలదు. మరొక విధంగా అవసరమైనదేమంటే ప్రపంచ ప్రజాస్వామ్యము అంటే ఒకే ప్రజాస్వామ్య ప్రభుత్వంక్రింద ప్రపంచాన్నంతటిని ఏకం చేయడమని, ఇంతకు తక్కువైనదేమీకాదని నా అభిప్రాయము. కొద్ది తరాలలో ప్రపంచ వ్యాప్తమైన, ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రపంచంలోని వోటర్లకు బాధ్యత వహించే ప్రభుత్వాన్ని ఏదో ఒక విధంగా మానవ నాగరికత ఉద్భవింపజేయనిదే, దీర్ఘకాల దృష్ట్యా మానవ నాగరికత ఎలా మనగలదో నాకు గోచరించడంలేదు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం అంటే, ఆ ప్రభుత్వాన్ని ప్రపంచ ప్రజలు ఉపయోగించుకునేందుకు, విమర్శించేందుకు ఏదో ఒక విధంగా సాధ్యపడాలని నా భావం. అంటే విభిన్న రీతుల ప్రభుత్వాలలో ఏదో ఒకదానిని ఎంచుకునేందుకు ప్రజలకు సాధ్యమై తీరాలి. అధికారంలో ఉండగా తమ ప్రభుత్వంపై కనీసం తమ పలుకుబడిని, తమ ప్రభావాన్ని చూపెట్టేందుకు ప్రజలకు సాధ్యమవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే నే నింతకుముందు నిర్వచించిన ముఖ్యమైన ప్రజాస్వామ్య సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా వర్తింపచేయాలి.

బహుశ ఇదంతా మనకు చాలా దూరమైన విషయం. ఇదంతా వెంటనే జరుగడం సాధ్యం కాకపోవచ్చు. అయితే ఈ

శంకావాదంలో మీలో చాలామంది మరింత ముందుకుపోయి ప్రపంచ ప్రజాస్వామ్యము ఎప్పటికీ అవతరించదని చెబుతారని నా దృఢ విశ్వాసము. లేదా ఏమైనప్పటికీ అది చాలావరకు జరుగకపోవచ్చని చెబుతారని నా గట్టి నమ్మకము.

మంచిది; అలాగే కావచ్చు. అణ్వస్త్రయుగంలో మానవాళి మనుగడ అసంగతమే కావచ్చునని మీరు నిజంగా చెబితే మీరు సరిగ్గానే చెప్పినవారు కావచ్చు. అయితే, అణ్వస్త్రయుగంలో మనగలమనే ఆశను మానవజాతికి కలిగించే ఏ ఇతర లక్ష్యమైనా, ఉద్దేశమైనా, కారణమైనా ఆదర్శమైనా, ఉన్నదేమో చెబితే వినాలని ఉన్నది. అదే ప్రపంచ ప్రజాస్వామ్యమని, ఇంకేదీకాదని నా అభిప్రాయం. లక్ష్యము సుదూరమైనదీ, సాధించడానికి కష్టమైనదీఅన్న వాస్తవికత, దానిపట్ల భక్తి విశ్వాసాలుంచడమునుండి మానవుని ఎప్పుడూ నిరోధించలేదు.

ప్రపంచ సమైక్యం ఎలా రావచ్చునో వివరంగా చెప్పమంటే నేను వివరాలు చెప్పజాలను. ప్రపంచ వినాశాన్ని తప్పించేందుకు తగినంత తొందరగా ప్రపంచ ఐక్య సాధనకు ఏకైక మార్గం ప్రజాస్వామ్య ప్రతికూలమూ కావచ్చు. అణ్వస్త్రాలుగల పెద్ద దేశాల నిరంకుశత్వమువల్లనే అది జరుగవలసి ఉన్నది. అయినప్పటికి దీర్ఘకాల దృష్ట్యా అది సహించరానిదవుతుంది. ఐక్య ప్రపంచం తుదకు ప్రపంచ ప్రజాస్వామ్యము కావలసి ఉంటుంది. ప్రపంచ ప్రజాస్వామ్యము ఎలా ఏర్పాటు చేయబడుతుందని ఆలోచించడం ముఖ్యమని అనుకోను. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన జాతీయ ప్రభుత్వాలు ప్రపంచ ప్రభుత్వాన్ని ప్రాతిపదికపై ఎన్నిక(నిస్సందేహంగా ఏదో పరోక్షమైన పద్ధతిపైనే) చాలా దశాబ్దాలకు ఏర్పాటు చేయవచ్చు ననుకుంటాను.

అయితే తుదకు ప్రపంచ ప్రజలు దానికి ప్రత్యక్షంగా వోటు చేయాలి. అంటే ప్రపంచ ప్రజలు దానిని ఆమోదించి తీరాలి. ప్రపంచ ప్రభుత్వాన్ని పోలిన మరొక సంస్థ కంటే ఐక్యరాజ్యసమితి ఒకవిధంగా వసుధైక ప్రభుత్వంపట్ల ప్రజలవాంఛకి ప్రతిరూపమని నేను భావిస్తాను. ఐక్యరాజ్యసమితి ఒక చర్చావేదిక. అందుచేత అది తప్పనిసరిగా అవసరము. అయితే అది ఏవిధంగానూ ప్రభుత్వము కాదు. ప్రపంచ ప్రజాస్వామ్య ప్రభుత్వానికి రెండులక్షణా లుండాలి. అవి అధికార బాధ్యతలు. ఈ రెండూ ఐక్యరాజ్యసమితికి లేవు.

20వ శతాబ్దం అనుభవం దృష్ట్యా, నిశ్చితమైన పెట్టుబడిదారీ వ్యవస్థలు మొదలు పూర్తిగా సోషలిస్టు వ్యవస్థలవరకు ఆయా దేశాలు పలువిధాలైన ఆర్థిక వ్యవస్థలు కల్గి ఉండవచ్చునని నా నిశ్చితాభిప్రాయము. ఆర్థిక వ్యవస్థలు ఎంత ఎక్కువగా సోషలిస్టు వ్యవస్థలుగా ఉంటే అంత ఎక్కువగా సంతృప్తికరమైనవిగా రుజువు అవుతాయని నా అభిప్రాయము. అయినా అదృష్టము కలిసివస్తే, కౌశలముతో ఈ ఆర్థిక వ్యవస్థలను లేదా వీటిలో ఏ ఒక్కదానినైనా సాధ్యమైనంత బాగా పని చేసేట్లు చేయవచ్చు. కనుక, మన ఆర్థిక వ్యవస్థను మనము ఎలా వ్యవస్థీకరించుకుంటామనేదానికంటే రెండు విషయాలు మరింత ముఖ్యము లయ్యాయి. మొదటిది : ప్రజాస్వామ్య ప్రాతిపదికపై, మన దేశాల రాజకీయ జీవితాన్ని మనము వ్యవస్థీకరించుకోవడం. రెండవది : అణ్వస్త్రయుగములో మన మనుగడకు ముఖ్యమైన ప్రపంచ వ్యాప్త మానవజాతి సమైక్యానికి గవేషణ. మానవజాతి ఐక్యం లేనిదే ఈ అణ్వస్త్రయుగములో మనము నశించి తీరవలసిందే. మన దేశాలలో మనము ఏర్పాటు చేసుకునే రాజకీయపు ఏర్పాట్లు అత్యంత ముఖ్యమైనవి. ఎందుచేతంటే రాజకీయపు ఏర్పాట్లు ప్రజాస్వామికమైనవి కాకపోతే అన్ని రకాల అన్యాయాలు, అస్థిరత్వాలు, ఒడుదుడుకులు, విపత్తులు సంభవిస్తాయన్నదాన్ని అనుభవము చాటుతున్నది. ప్రపంచాన్ని ఏకం చేసేందుకు మన శక్తిస్తోమతలు మరింత ముఖ్యమైనవి. ఎందుచేతనంటే అణ్వస్త్రయుగం గుణపాఠ మిది : "ఐక్యం కండి—లేదా అంతం కండి."



గోత్ర మొకటే


శ్రీ సి. నారాయణరెడ్డి

నల్ల రేగడి మట్టిలోపల
పల్లవించిన మానవాత్మకు,
ఇసుక తెరల యెడారిలో కుసు
మించు గుండెకు గోత్ర మొకటే.

బొగ్గువలె కనిపించు చర్మము
ధారలలో తరగెత్తు నెత్తురు,
పాల వన్నెల మేనులందున
లీలగా ప్రవహించుగాదా !

కొండ మల్లెల మనసులో గుస
గుసలు పోయెడు మిసిమి తలపులు
పరిమళించును రాచనగరున
విరియు మల్లెల కళ్లలోపల.

మణులు పొదిగిన రాజమహలున,
మట్టితో కట్టిన సమాధిని,
ఒదిగియున్నది యుగయుగాలుగ
ఒకే ఒక్క వియోగ వేదన.



పెళ్ళికాని ఉద్యోగినులు

"సంఘ సేవకుడు"

నా చిన్నతనంలో ఆడపిల్లల పెళ్ళికోసం తలిదండ్రులు పడేపాట్లు చూచేవాణ్ణి. ఎందుకు ఇంత ఆరాటం అని అనుకునేవాణ్ణి. వారి మనస్తత్వం ఏమీ అర్థమయ్యేదికాదు. పిల్లకు పరికిణీ కట్టుకునే వయసు వచ్చి రాగానే తండ్రి బయలుదేరేవాడు; వరాన్వేషణకోసం "అష్ట వర్షా భవే త్కన్యా....తత ఊర్ధ్వం రజస్వలా" అని మననం చేసుకుంటూ. ఊరూరూ తిరగడం, జాతకాలు సంపాదించడం, ఆస్తిపాస్తుల ఆరాతీయడం—ఇదీ పద్ధతి.

ఇక ఏ తల్లి అయినా, ఎదుగుతున్న తన కూతురిని

"మది తలపులు తళుకులు చేర
మెయి సొరులు అంచులు దీర
చిరు గుండియ పొంగులు వార"

అన్న వర్డ్స్‌వర్త్ మహాకవి చూపులతో చూచేదికాదు. ఈ లక్షణాలు కనిపించాయో లేదో,

"కూకటివేణిలో కురులు
కూడకమున్న, కుచద్వంద్వ(?) మోహముల్
పోకలతోడి సామ్యమును
పొందకమున్న"

పెండ్లికాదేమని, ముద్ద మింగుడుపడడంలేదని, రాత్రిళ్ళు కళ్ళ మూతలు పడడంలేదని మొగుణ్ణి సతాయించేది. ఆ పుణ్యాత్ముడు ఈ పోరు పడలేక, పెండ్లి సంబంధాల వార్తయినా తేలేక ఇంటికి రావడంకన్నా గుడే పదిలమని, ఎక్కడో కాలయాపన చేసేవాడు. ఉద్యోగో సద్యోగో అయితే ఆఫీసులోనే కాలక్షేపం చేసేవాడు.

పిల్లల తండ్రులు ఎంతగా పీడించేవారో నా చిన్నతనంలో నాకు బాగా జ్ఞాపకం. మా బంధువుల్లో ఒకాయన ఒక్కమారు మా ఇంటికి వచ్చారు. నా చదువూ సంధ్యా విశ్వరంగా కనుక్కున్నారు. అప్పుడు నాకు పద్నాలుగు ఏళ్లయినా లేవు. తన అమ్మాయిని పెళ్లి చేసుకోవలసిందని మా తాతగారినీ, మా నాయనగారినీ, నన్ను, మా అమ్మను పోరుపెట్టాడు. ఆ పోరు భరించలేక మేమందరం ఏదో సాకుతో పక్క ఊరికి బయలుదేరాము. మరి రెండేళ్ల తర్వాత మరొక పెద్ద మనిషి ఇలాగే నన్ను పీడించాడు. "ఈ కాలపు చదువు లేమిటి? పొట్టకోసమే కదా! నేను నీకు తగినంత ఆస్తి వ్రాసిస్తాను. మా అమ్మాయికి తొమ్మిదేళ్లు. నీకు పదహారన్నావు గదూ! మంచి ఈడే. పెళ్లి చేసుకో. మా యింట్లో ఉండు. నేను నీకు నాకు వచ్చిన బాధాంతం తర్కమూ చెబుతాను. సంప్రదాయ విషయాలు సరేసరి. శ్రీభాష్యం కాలక్షేపం చేయిస్తాను" అంటూ నెల కొకసారి వచ్చి సతాయించేవాడు. నేను సవినయంగా "స్వామి నేను చిన్నవాణ్ణి. నాకు పెళ్లేమిటి? ఇంతకూ మీ 'పాప' చక్కగా దీపకళికవలె ఉంటుంది. నాబోటి వికార స్వరూపం ఎందుకు మీకు? ఓపిక పట్టండి. మంచివాడే వస్తాడు?" అనేవాణ్ణి. ఆయన విసిగిపోయి పిల్లను ఎవరికో కట్టాడు. కొన్నేళ్లతర్వాత నాకు కనిపించాడు. "నీవు ఎంత బ్రతిమాలినా మా పిల్లను పెళ్ళి చేసుకోలేదు. వాడికి ఇవ్వవలసి వచ్చింది. వట్టి త్రాష్ట్రం(?)" అన్నాడు; ఆ తప్పు నాదే అయినట్టు.

తండ్రి ఆందోళన ఎంత దీనావస్థకు కారణమవుతుందో ఒక బెంగాలీ పెద్దమనిషి చెప్పిన కథ ఒకటి చెబుతాను. "1922 నేను కలకత్తాలో మీర్జాపూర్ వీధిలో ఒక గదిలో ఉండేవాడిని. నాతోపాటు నా తమ్ముడూ ఉండేవాడు. వాడు మెడికల్ కాలేజీలో చదివేవాడు. వాడి సహపాఠి ఒక్కడు రోజూ మా గదికి వచ్చి నా తమ్మునితోపాటు ఆనాటమీ చదువుకొనేవాడు. అతడు చాల అందగాడు. ఒకరోజు కుండపోతగా వాన కురుస్తున్నది. ఆ సహపాఠి తడిసి ముద్దయి మా గదికి వచ్చాడు. మోకాలిలంటి నీటిలో నడుస్తూ వచ్చినట్టు అతనిని చూడగానే తెలుసుకోవచ్చు. వణికిపోతున్నాడు. అయినా నవ్వుతూ ఒక సంగతి చెప్పాడు. అతనితోపాటు మరిఇద్దరూ వరదల్లో పడి వస్తున్నారట. మరొక వయోవృద్ధుడు కూడా కష్టం మీద వారితోపాటే వస్తూ ఎగాదిగా చూస్తున్నాట్ట. తర్వాత

ఎవరు మీరు అని అడిగాడట. మెడికల్ కాలేజీ విద్యార్థులం అని అనగానే, మొదట అడగడానికి జంకినా, తర్వాత నెమ్మదిగా 'మీలో ఎవరైనా మా అమ్మాయిని పెళ్లాడుతారా?' అని నీళ్లు నములుతూ అడిగాడట. యువకులు మురికి మడిగుండం చూపుతూ, 'ఏమిటి! మీ అమ్మాయి ఆ మడిగుండంలో పడిందా?— అని అడిగారట. 'మీకూ నాలాగ ఒక కుమార్తె ఉంటే, ఇలా ఎగతాళి చేసేవారా?' అని వృద్ధు రున రునలాడాడట."

ఇక పెళ్లి పెత్తనాలు ఉత్తుత్తివి అయితే ఇల్లాలి వణుకులు, దెప్పులు చెప్పనక్కరలేదు. మనవారు చీటికీ మాటికీ కన్నీళ్లు కురిపించేవారైనా, వ్యంగ్యంగా చురకలు కన్నీటివర్షంలో మెరుపులలాగ తగులకుండా ఉండేవికావు. కనుక గృహిణి ఆగ్రహించి నాలుకను పదును పెట్టిందా అదొక కళగా ఉండేది. ఒక నాయకురాలు తన నాలుకను కత్తికన్నా పదునుగా ఎలా వాడేదో ఒక జానపద గేయం వినిపిస్తాను. ఆ నాయకురాలికి ఒక కుమార్తె. ఆ కుమార్తె పెళ్లీడు దాటిపోగానే చప్పబడిపోయి వూరికే ఉండిపోయింది. కాని వయసు వూరికే ఉండనిస్తుందా? "వయసో వల్లకాడో!" అన్నారు పెద్దలు. ఎవరితోనో గాంధర్వం చేసుకుంది. ఆసంగతి నాయకురాలికి మొదట తెలియదు. తర్వాత తెలిసింది. అడవులిలాగ మగని వద్దకు దూసుకుని వచ్చి

"పెళ్లీడుపిల్ల గుండెమీద కుంపటిగా ఉన్నా
దాని పెళ్లికి జతనం చేశావా ఏమన్నా?
సరే, నీ అనుమానాలు తీరకనే ఉన్నా
దమ్మిడీ ఖర్చు లేకుండా మనవణ్ణే ఎత్తుకోవన్నా!"

అని కసిరి కొట్టిందట. అంత బాధలోను ఆవిడ వ్యంగ్య వైభవాన్ని మరచిపోకుండా మాట్లాడిందట.

పూర్వం కుమార్తెల వివాహం ఆర్థికంగా పెద్ద బరువుగా ఉండేది. ఈ బరువు ఎన్నో కొంపలు కూల్చివేసేది. ఏదోవిధంగా ఒక అయ్య చేతిలో పెట్టి సంతృప్తి పడదామనే తహతహ చెప్పతరంకానిది. ఈ తహతహ తర తరాల నాటిది. దీనికి కాళిదాసుమాటలే తార్కాణ:

"అర్థోహి కన్యా పరకీయఏవ
తా మద్య సంప్రేష్య పరిగ్రహీతుః
జాతో మమాయం విశద ప్రకామం
ప్రత్యర్పితన్యాస ఇ వాంతరాత్మా."

కాని, కొత్త హిందూ వివాహ చట్టంతో పరిస్థితి మారిపోయింది. ఈడు రాగానే పిల్లలకు పెండ్లి చేయాలనే నిర్బంధం సడలింది. అవివాహితల ఎడ సంఘంలో అసహ్యం కూడ తగ్గింది. అవివాహితలు ఏదో ఉద్యోగం సద్యోగం చూచుకొని గడపవచ్చు జీవితం. డబ్బు లేనందున పిల్ల పెళ్ళి చేయలేకపోతున్నానని అంటూ ఏ పట్టణపు శివార్లలోనో క్రొత్త మేడలు కట్టుకోడం ఏ తండ్రీ పాపంగా భావించడు. పూర్వం అయితే తండ్రి తన పిత్రార్జితమైన ఇంటిని కుదువన్నాపెట్టి ఆడపిల్లలకు పెండ్లి చేసేవాడు. నేడు తల్లులేమో తమ బిడ్డలు ఎదిగి ముదిరిపోతున్నా కన్నీళ్లు కురిపించకపోవడం అలా ఉండగా, ముప్పూటలా భోజనం మింగుతారు. డబ్బుకోసం గడ్డితినే తండ్రేమో తన డబ్బు పొదుపు చేసుకుంటూ కూతురు సంపాదించి తెచ్చే డబ్బును ఖర్చు పెట్టుకుంటున్నాడు. అన్నదమ్ములేమో ఆమె ఆర్జనను ఆరగిస్తూ టెర్లిన్ షర్టులు తొడుక్కొని వీధులలో తిరుగుతారు. తక్కిన యువకులేమో ఆ అమ్మాయిలను తలుచుకొని గుటకలు మింగుతూ ఇంటిముందు కనిపించీ కనిపించనట్టు పోతుంటారు; ఇంటిపెద్దలు చూచీ చూడనట్టుంటాడు.

ఈ ఉద్యోగినులలోను రెండు రకాల వారున్నారు. ఒకరేమో అవివాహితలైన ఉద్యోగినులు. మరొకరేమో వివాహితలైన ఉద్యోగినులు. వీరిద్దరూ ఆర్థిక, సాంఘిక మానసిక వ్యత్యాసాలున్న రెండు ప్రపంచాలకు ప్రతినిధులు. వివాహితలయిన ఉద్యోగినులవల్ల వారి పిల్లలకు నష్టం. అవివాహితులయిన ఉద్యోగినులు తమకే హాని కలిగించుకుంటారు. ఇప్పుడు మనం అవివాహితలైన ఉద్యోగినుల సంగతి పరిశీలిద్దాం.

పాశ్చాత్య సంప్రదాయాలను—పాశ్చాత్య సంప్రదాయాలని మనం అనుకుంటున్న వాటిని—అనుసరిస్తున్న మన పై తరగతుల వారు కొందరు హిందూ సంఘంలో స్త్రీలు ఉద్యోగాలు చేయ్యడం మన పాత సంప్రదాయాలను జయించడంవంటిదని చెప్పుకుంటారు. ఇది వాస్తవమా? పాశ్చాత్య దేశాలలో ఈలాటి వైఖరే ఉందా?

పాశ్చాత్యుల ఆచార వ్యవహారాలను సన్నిహితంగా పరిశీలించినవారు చెప్పగా విన్నాను: వారు చెప్పిన దానినిబట్టి, చదివిన దానినిబట్టి అక్కడి ఆడపిల్లలు పాత సంప్రదాయాలనే అనుసరిస్తున్నారని స్పష్టమవుతున్నది. ఆమధ్య అంతర్జాతీయ ప్రాచ్య మహాసభకు వచ్చిన ప్రతినిధులను చూచాను. వారిలో పలువుర్వా కళ్లకు అప్పుడే కళాశాలనుంచి వచ్చినట్టు కనిపించారు. వారిలో కొందరు దౌత్య కార్యాలయాలలో ప్రధాన పదవులు నిర్వహిస్తున్నవారు. వారిలో ఒక ఫ్రెంచి పెద్ద మనిషి అందమైన భార్య, పిల్లలుగల గృహస్థు. అమెరికాలోను పలువురు త్వరగానే పెళ్ళి చేసుకుంటున్నారని విన్నాను. రష్యావారు కూడా త్వరగా పెళ్లాడుతున్నారు.

పెళ్లికాని ఉద్యోగినులు

కాని, మనలో మధ్యతరగతి వారు పాశ్చాత్య దేశాల మధ్య తరగతివారికన్నా ఆలస్యంగా పెళ్లి చేసుకుంటున్నారు. తిండికోసం పాటు పడడమూ, అవివాహితగా ఉండడమూ తమ సౌకుమార్య వ్యక్తిత్వాలను పెంచుతాయని ప్రపంచంలో ఏ మారుమూలా మహిళలు అనుకోడంలేదు.

పశ్చిమ దేశాల్లో పెండ్లికాని ఉద్యోగినులు హెచ్చుగా ఉన్నమాట నిజమే. దీనికి కారణం ద్వితీయ యుద్ధానంతరం స్త్రీల జనాభా హెచ్చుగాఉండడం ఒక్కటి. డబ్బు లేకో, అందచందాలు లేకో, మంచి మగడు కావాలనో అవివాహితలుగా ఉండిపోయే సంప్రదాయమూ పాశ్చాత్య దేశాలలో ఉంది. ఏమైనా అవివాహితలైన ఉద్యోగినులు ఎప్పుడూ సమస్యగానే ఉన్నారు. యుద్ధాలు మొదలయిన పెక్కు కారణాలవల్ల పాశ్చాత్య దేశాల పరిస్థితి దిగజారిపోవచ్చు. భారతదేశం దానినే ఎందుకు నకలు చేయాలి ?

స్త్రీలకు ఉద్యోగం ఏమిటి?—అని నే నన్నానా, అందరూ పీక్కుతింటారు నన్ను. అభివృద్ధి నిరోధకుడని తిడుతారు. ఉద్యోగం చేయడం మంచిదనే వాదాన్ని భావుకతతో చూచే వారు పలువు రున్నారు. ఉద్యోగం చేసే భార్య సహాయంగా, తోడునీడగా ఉంటుందని, పాతకాలపు గృహిణి కేవలం గుదిబండ వంటిదని ఆవేశంతో చేసేవాదం కేవలం బూటకంగా కనిపిస్తుంది. చదరంగం ఆటగాడికి చదరంగం ఆట తెలిసిన భార్య వెనుకనుంచి ఎత్తులు చెబుతూంటే ఆ ఆటగాని పరిస్థితి ఎలా ఉంటుంది? తన పని బాగా తెలిసిన మగవానికి కూడ భార్య తన పనిలో జోక్యం చేసుకోడం పరిపడదని పలువురు భావావేశావిష్టులకు తెలియదు. నిర్లక్ష్యంగా ప్రవర్తించే మగవానికి మాత్రమే భార్య ఆసరా అవసరమౌతుంది.

పనిలోను సహాయంచేసే సహధర్మచరితో మన యువకులు ఏమి చేసుకుంటారన్న విషయం అలా వదలి, వ్యక్తిత్వం ఉత్సాహం ఉన్న భార్య కావాలనే వారి సంగతి చూద్దాం. అలాటి వారు స్వయంగానూ ఏమీ చేయడంలేదు. మన మేధావులు ఏ ఐ. ఏ. ఎస్. లో పెద్ద గుమాస్తాలుగానో, ఏ ఇంజనీరింగ్ శాఖలో పెద్ద మేస్త్రీలుగానో సుఖంగా కాలం గడుపుతుంటారు. అలాటివారికి వ్యక్తిత్వం ఉన్న అందమైన భార్య ఉండడం వల్ల ప్రయోజనం లేకపోగా, ప్రమాదం ఉంది. వారు కావ్యాలలోని నాయికలాగ ఉండవచ్చు. కాని, ఆ నాయికలు జీవిత కావ్యాలలో అన్వయించరు గదా!

అరమరలు లేకుండా ఆలోచిస్తూపోతే, నేటి హిందూ సమాజంలో అవివాహిత అయిన ఉద్యోగిని మన ఆలోచనగాని, అభ్యుదయకరమైన ప్రయోజనంగాని అవసరం లేకనే సాంఘిక విచ్ఛిన్నంవల్ల ఏర్పడిన జీవి అని స్పష్టమవుతుంది. సుఖంగా జీవించడానికి సంపాదించుకొంటున్నామని, ఉన్నత వ్యక్తిత్వం కోసం పని చేస్తున్నామని ఉద్యోగినులు అనే మాటలన్నీ కేవలం బూటకం. వారు బహిరంగ పరిస్థితులకు లొంగిపోయి ఏమీ చేయలేని తలిదండ్రులు ఆడే చదరంగంలో పావులవంటివారు మాత్రమే, నని నా నమ్మకం.

ఇలాంటి పరిస్థితికి కారణం మన రక్తంలో జీర్ణించుకొనిపోయిన పాత వివాహ సంప్రదాయాలు, పవిత్ర వైవాహిక బంధనాలు విచ్ఛిన్నంకావడం. ఈవిచ్ఛిన్నతకు కారణం ధనవంతులయిన హిందువులు బాగా పెరిగిపోయిన నగరాలకు వలసరావడం. వీరు ఎన్ని సంవత్సరాలున్నా నగర జీవులు కాలేరు; గూడు కట్టుకున్న పాత సంప్రదాయాల ముద్దవంటివారు. హిందూ సంఘం కాలానుగుణంగా వైవాహిక వ్యవస్థను సంస్కరించుకోలేకపోతున్నది. ఫలానాగోత్రం ఫలానాశాఖ, ఫలానాసూత్రం వరుడికి తద్భిన్నమైన గోత్రశాఖలుగల వధువు కావాలని పత్రికలలో పడే ప్రకటనలనుబట్టి నేటి మన సంఘం దృష్టి ఎంత హ్రస్వమైపోయిందో వూహించుకోవచ్చు.

ఈ పరిస్థితిలో కొందరు ప్రేమ వివాహాలే పరిష్కార మార్గమని అంటారు. వారికి పాశ్చాత్య వివాహ పద్ధతులుగాని, వివాహానికి పూర్వాంగంగా ప్రేమింపజేసే పద్ధతులుగాని తెలియవు. పాశ్చాత్యదేశాలలో ఏ దొరగారో, ఏ దొరసానిగారో అందమైన, ధనవంతుడైన యువకుణ్ణి చూచారనుకోండి. వెంటనే పన్నుగడ పన్ని, విందులూ, నాట్యాలు ఏర్పాటుచేసి ఆ యువకుణ్ణి ఆహ్వానించి, తమ కుమార్తెను పరిచయం చేయించి, పరిచయం పెరిగి ప్రణయంగా మారే పరిస్థితి కల్పిస్తారు. తర్వాత యువతీ యువకులు విహారాలు సాగించి వివాహానికి అవకాశాలు కలిగించుకుంటారు.

కాని మనం ఇప్పుడు అలాటి "ప్రేమ వివాహాలు" ఏర్పాటు చేసుకోనూజాలము;వివాహ వ్యవస్థను, సంస్కరించుకోనూజాలము. పరిణామ మేమిటంటే ఆడపిల్లల అడుగు అటు గట్టుమీదా కాదు; ఇటు నావమీదా కాదు. వారు ఫలానా మనిషికి ఇచ్చి పెళ్లి చేయమని కోరలేరు. పూర్వపు ఒక పల్లెటూరిపిల్ల చెప్పినట్టు ఫలానా వాడు వద్దనీ అనలేరు. ఆ పల్లెటూరిపిల్ల ఇలా అన్నదట:—

> "సామలదేశానికి నన్నియ్య బోకవ్వ
> నేను తినలేను సామల బువ్వ.
> వడ్లపండే దేశానికి నన్నియ్య బోకవ్వ
> నేను దంచగలేను ఆ వడ్లన్నీ.
> కొర్రల దేశానికి నన్నియ్య బోకవ్వ
> నేను తినలేను కొర్రల బువ్వ.

మక్కల దేశానికి నన్నియ బోకవ్వ
నేను తినలేను మక్కల బువ్వ.
తైదల దేశానికి నన్నియ్య బోకవ్వ
నేను తినలేను ఆ తైద రొట్టె.
యూరాండ్లమీదికి నన్నియ్య బోకవ్వ
యూపకాయ చేదు నేను పడలేను.
బావలమీదికి నన్నియ్య బోకవ్వ
భారీ దొడ్ల పెండ నే దీయలేను.
మరదుల మీదికి నన్నియ్య బోకవ్వ
మల్లెచెట్లకు నీళ్లు నే బోయలేను.
సముతుల మీదికి నన్నియ్య బోకవ్వ
సముద్రం లోతు దిగి నే చూడలేను."

ఇక ఏమి చేయడానికీ లేదు గనుక ఉద్యోగంలో చేరుతారు. పెండ్లి కోసం కలలు గంటుంటారు. పూర్వం చదువుమాని ఇంట్లో కూర్చునేవారు—వెయిటింగ్ రూములో వేచి ఉన్నట్టు. ఇప్పుడు వెయిటింగు రూములు ఆఫీసులు. పూర్వపువాళ్లకేమో ఆలస్యంగా నయినా బండి అందేది. ఇప్పటివారికి బండి అందడం లేదు—కొందరికి బండి అందుకుందామన్న ధ్యాస తక్కువవుతూంది.

ఇలాంటివారేమో ఆశలు పెట్టుకునేవుంటూ, ఏ విందుకో, వినోదానికో వెళ్తున్నట్టు ముస్తాబు చేసుకుని ఆఫీసుకు బయలుదేరుతారు. ఈ ముస్తాబులో శ్రద్ధ హెచ్చడంవల్ల పనిలో అశ్రద్ధ ఎక్కువవుతుంది. క్రమంగా మగవాడంటేనే అసహ్యం పుడుతుంది. ఈ అసహ్యం పుట్టినా, కొందరు పెళ్లాడుతారు. అప్పటికే ప్రేమకు, సంతోషానికి తరుణం మించిపోతుంది. ఇంత ఆలసించి పెళ్లి చేసుకోనివారికి ఏదో డబ్బు సంపాదించుకుంటున్నామన్న సంతృప్తి అయినా ఉంటుంది.

ఈ సందర్భంలో మనస్తత్వానికి సంబంధించిన ఒక్క విషయం చెప్పవలసి ఉంది. శారీరక మానసికావసరాలు తీరనప్పుడు పురుషుడైనా, స్త్రీ అయినా మనస్సును మోసగించుకోగలరు గాని, శరీరాన్ని వంచించుకోలేరు. కనుక వాంఛలు వెర్రితలలు వేయడం సంభవిస్తుంది. దానివల్ల సంఘానికి చాల నష్టం ఏర్పడుతుంది. బ్రహ్మచర్యం, మనో నిగ్రహం మంచి ఆదర్శాలే గాని, సాధ్యంకానివనే ఉద్దేశ్యంతోనే మన పూర్వులు గార్హస్థ్యానికి ప్రాధాన్య మిచ్చారు. బ్రహ్మచర్యం అవలంబించి జీవితాన్ని భగవంతునికి ముడుకట్టిన ఆండాల్‌వంటివారు ఆ కాలంలోను లేకపోలేదు. బుద్ధుని కాలంలోని బౌద్ధ భిక్షుణులు, శైవయుగంలో అక్కమహాదేవివంటిభక్త శిఖామణులూ

ఉన్నారు. మీరాబాయి, వేంగమాంబ, మనకాలంలో శారదామణిదేవి వంటివారు ఉన్నారు. వారి లక్ష్యం ఉదాత్తం. అలాటి లక్ష్యోదాత్తత అందరికీ సాధ్యంకాదు.

కనుక ఏ స్త్రీ అయినా, ఏదో ఘన విజయం సాధించడానికి వివాహం మానుకోవలసిన అవసరంలేదు. వివాహం చేసుకున్నంత మాత్రాన సాహిత్యంలోనో, విజ్ఞానశాస్త్రంలోనో విజయసాధనకు ఆటంకం ఉండదు. మన ప్రాచీన కవయిత్రులందరూ గృహిణులే. శాస్త్రవాదాలు చేసినవారంతా గృహిణులే. ఇరవయ్యో శతాబ్దంలో ఉత్తమమైన నవలలో ఒక్కటిగా పరిగణితమైన "ది ఫార్ప్యూన్స్ ఆఫ్ రిచర్డ్ మహోనీ" వ్రాసిన వనిత శ్రీ జె. ఎం. రాబర్ట్సన్ భార్య కావడంవల్ల నష్టపడలేదు. మేరీ స్లోడోవ్స్కా, ఇరిన్‌క్యూరీ వివాహం చేసుకున్నందున విజ్ఞాన శాస్త్రవేత్తలు కాకపోలేదు. పురుషుని కన్న గొప్ప పనులు చేయడానికి స్త్రీలు అవివాహితలుగా ఉండనక్కరలేదు. మీదు మిక్కిలి సుఖకరమైన వైవాహిక జీవితం గొప్ప పనులకు సహాయకారి కాగలదు.

గృహనిర్వహణ దృష్టితోను, ఆర్థికదృష్టితోను చూచినా, మన సంఘంలో డబ్బును అదుపులో పెట్టేది గృహిణే. భర్త రాబడి పెరిగినకొద్దీ ఈ అదుపూ, అధికారం భార్యకు ఎక్కువవుతాయి. (పైకి పోనుపోను మగవాళ్లు భార్యా విధేయులైపోతారన్న ప్రథకు ఇదే కారణ మనుకుంటాను.)

ఇక ప్రేమ సంగతికి వద్దాము. ప్రేమకు, పెళ్లికి పొసగదని ఇటీవలి యువకులలో దురభిప్రాయం ప్రబలింది. దీనినే ప్రేమస్వాతంత్ర్యం, ప్రేమ స్వేచ్ఛ అంటే మాత్రం నేను ఒప్పుకోను. స్వాతంత్ర్యం, ప్రేమ అనేవి రెండూ అతకని విడివిడి విషయాలు. ప్రేమ అంటేనే బంధనం—తీయని బంధనం. ప్రేమలో అరమరలేవీ ఉండవు అంటాడు కబీర్ :

"పియా చాహై ప్రేమరస
రాఖా చాహై మాన్,
ఏక మ్యానమే దో ఖడగ .
దేఖా సునా న కాన్."

'ప్రేమ' అనే దానిని ప్రత్యేక దృష్టితో చూచేవారి సంగతి వేరు. కన్యల మనస్సు, అభిరుచి అన్నెపు మొగ్గితే వార్త అవివాహితలుగా ఉండనక్కరలేదు. ఎందుకంటే, హిందూ సమాజం మొదటినుంచీ ఎంతో లోకజ్ఞత, అనుభవం గడించుకొన్నది. గనుక కొద్దిపాటి విచిత్రమైన కామ ప్రవృత్తులను సహిస్తూనే వచ్చింది.

"బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా" అన్నది సామాన్యమైన నానుడి. దీనిని ఇప్పుడు అవివాహితలైన ఉద్యోగినులకు వర్తింపజేయాలని నా అభిప్రాయం. అన్ని ధర్మాలు, అన్ని కర్మలు, అన్ని శర్మలు స్త్రీనే ఆశ్రయించి ఉన్నాయి. కనుక ఆమె అవివాహిత కావడం సముచితం కాదు. కేవలం ఊరింపులతో తనివితీరదు. వాటికి అటుకట్టుగా పరిణయం అవసరం. అవివాహితలైన ఉద్యోగినులు వివాహరంగంలో దిగాలని కోరుతున్నాను. వారు దిగుతారనే నమ్ముతున్నాను. అయితే యువకు లే ? పౌరుషం గలవారు కనిపించవద్దూ మరి? అనే ప్రశ్న ఉంది. ఈ సందర్భంలో నాకు సన్నిహితమైన ఒక సంగతి చెప్పి నామాట ముగిస్తాను.

నా మిత్రుని సోదరి ఉంది. రెండు, మూడు పెద్ద డిగ్రీలున్న విదుషి. అదే ఆమె ప్రత్యేకత. పాతికేళ్లు దాటాయి. ఉద్యోగంలో ప్రవేశించింది. ఉద్యోగంలోనే ఉండిపోవడమా? పెండ్లి కూడా చేసుకోడమా?-అన్న సమస్య పుట్టింది. సామాన్యర్హతలు గలవారిని చేసుకోడానికి మనస్సు ఒప్పలేదు. ఆమె డిగ్రీలు చూసి ప్రతివాడూ భయపడేవాడే. అన్ని డిగ్రీలా కంవాడంటే, వాడికి ఎన్ని బందాలో! ఎన్ని నిర్బంధాలో! కనుక పెండ్లా ? నౌకరీయా? పెళ్లయితే సామాన్యుణ్ణి ఎన్నుకోడమా? మానుకోడమా ? నా సలహా అడిగారు, సన్నిహితత్వాన్ని బట్టి. 48 గంటలు గడు విచ్చి, పెండ్లో, నౌకరీయో తేల్చుకోమన్నాను. ఆమె తన చెలులను, నెచ్చెలులను అందరినీ సమావేశపరచి ఆలోచించింది. పెళ్లిచేసుకుందామనే నిశ్చయించుకుంది. సామాన్యుణ్ణి ఎన్నుకుంది. ఆయన మొదట కొంచెం గాబరాపడ్డాడు. పెళ్లయింది. మూడు పూవులూ, ఆరు కాయలుగా ఉంది సంసారం. ఆయన ప్రైవేటుగా చదివి పెద్ద డిగ్రీలు సంపాదించుకున్నాడు. అందుకే అన్నాను : "యువకులు ముందుకు రావాలి."

చిరస్మరణీయం

శ్రీ యగళ్ళ రామకృష్ణ

విప్పార్చుకున్న నీహారికా నేత్రాలతో
గగనమంతా మన కేసి చూస్తున్నపుడు,
జీవితంలోని ఆశల్లా నగానికి హారించుకపోయిన
జాబిలి జాలిగా వెన్నెలలు ప్రసరిస్తున్నపుడు,
తుఫాను రేపిన అశాంతితో కడలి కెరటాలు
బీభత్సంగా బండరాళ్ళను బాది, చేతకాని
ఉగ్రత్వంతో అల్పబిందువులై తిరిగి నీటిలో
కలసిపోయి కలగి హోరెత్తినపుడు,
ఉపశాంతి కల్పించలేక భంగపడి వెనుతిరిగిన
పిల్లగాలులు సరుగుడు గుబుర్లలో దూరి
గుండెలు అవిసేలా ఆక్రోశించినపుడు,
విస్తుపోయిన కాలం క్షణమాత్రం ఆగిపోయి
వింతగా మన కేసి తిరిగిచూచి నివ్వెరపోయిన ఆ రేయి—

నీ ద్రవీభూత హృదయం
ఆర్ద్రనేత్రాల్లో ప్రతిఫలించిన ఆ రాత్రి—
ఆనందమో, ఆవేదనో తెలియని ఉద్వేగానికి
ఆనకట్టలు కట్టలేక వెక్కి వెక్కి ఏడ్చిన నిన్ను
నా గుండెలకు అదుముకున్నపుడు,
నీ హృదయం గాద్గద్యంతో నా మనసు చెవులో
చెప్పిన రహస్యాలకు కీచురాళ్లు శ్రుతికలుపుతున్నపుడు,


సుమ సుగంధాలో
అవిశ్రాంత ధూమాలో
జ్వాలాగ్ని కీలల తీవ్రోష్ణ ప్రవాహాలో
భాషాభివ్యక్త్యసాధ్య భావాలో
ఏవో.........?!?

అవి, మనల్ని స్నేహానురాగార్ద్రతా పాశాలతో
బంధించిన ఆ రేయి—నే నెన్నడూ మరువలేదు;
నే నెప్పుడూ మరచిపోను.


లండన్‌లో శ్రీ ఎస్. వి. రామారావు చిత్రకళా ప్రదర్శనం

శ్రీ ఎస్. వి. రామారావు 1936 లో గుడివాడలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పట్టభద్రులయిన తర్వాత మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లోను, ఆంధ్రప్రదేశ చిత్రకళాశాలలోను చిత్రలేఖనం అభ్యసించి డిప్లొమాలు పుచ్చుకొన్నారు. బొంబాయిలో జరిగిన అఖిలభారత కళాప్రదర్శనంలోను, అఖిల భారత కళా ఖాసీ ప్రదర్శనంలోను, హైదరాబాద్‌లో జరిగిన అఖిలభారత కళా ప్రదర్శనంలోను, ఆంధ్రప్రదేశ్ లలితకళా ఎకాడమీలోను బహుమతులు పొందారు.

1961 లో బొంబాయి జహంగిర్ ఆర్ట్ గేలరీలో జరిగిన "టెన్ పెయింటర్స్" ఎగ్జిబిషన్‌లోను, ఢిల్లీలో జరిగిన "ఎయిట్ పెయింటర్స్" ఎగ్జిబిషన్‌లోను, 1964 లో లండన్‌లోని ఇండియా హౌస్‌లో జరిగిన "సిక్స్ ఇండియన్ పెయింటర్స్" ప్రదర్శనంలోను, 1965 లో లండన్‌లోని న్యూ విషన్ సెంటర్ వారు ఏర్పాటుచేసిన "ఇంటర్నేష



కనకదుర్గ దేవాలయం



దీపావళి పండుగ

నల్ ఆల్ఫబెట్ ఆఫ్ మాడర్న్ ఆర్ట్" ప్రదర్శనంలోను పాల్గొన్నారు.

ఈయన ఐదు చిత్రాలను న్యూఢిల్లీలోని నేషనల్ ఆర్ట్ గ్యాలరీ ఆఫ్ మాడర్న్ ఆర్ట్ వారు ఖరీదు చేశారు. మద్రాసులోని నేషనల్ గ్యాలరీ, బెంగళూరులోని ప్రెడ్ హార్వే గేలరీ, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ, న్యూఢిల్లీలోని ఫోర్డ్ ఫౌండేషన్, శాన్‌ఫ్రాన్సిస్కోలోని మాడర్న్ ఆర్ట్ మ్యూజియం డైరెక్టర్, బ్రిటిష్ కౌన్సిల్ (కామన్‌వెల్త్ సెక్షన్), స్లేడ్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, కేరళ ప్రదేశ్ ఆర్ట్స్ మ్యూజియం ఈయన చిత్రాలను ఖరీదు చేశాయి. ఇంగ్లండ్, అమెరికా, కొలంబో, జోర్డాన్, సియర్రాలియోన్ మొదలయిన దేశాలలోని పలువురు కళాభిమానులు ఈయన చిత్రాలు కొన్నారు.

శ్రీ రామారావు ఆల్ ఇండియా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ (న్యూ ఢిల్లీ), హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ, ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్ (విజయవాడ) మొదలయిన సంఘాలలో సభ్యులు. ఈయన ఆంధ్ర సచిత్ర వారపత్రిక, భారతి మొదలయిన పత్రికలకు చిత్రలేఖనం గురించి పెక్కు వ్యాసాలు వ్రాశారు. "మురళి" అనే తెలుగు మాసపత్రికకు సంయుక్త సంపాదకులుగాను ఉన్నారు.


ఈయన స్లేడ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో కామన్‌వెల్త్ స్కాలర్‌గా ఉన్నారు. ఫ్లోరిడ విశ్వవిద్యాలయంలో ఈయనకు లలితకళా


భ్యాసంకోసం 1965 - 67 సంవత్సరాలకు ఫెలోషిప్ ఇచ్చారు.

ఈయన 1965 ఏప్రిల్ 12 వ తేదీనుంచి మే 1 వ తేదీవరకు లండన్‌లోని న్యూవిజన్ సెంటర్ గ్యాలరీవారి యాజమాన్యాన తన చిత్రాలు ప్రదర్శించారు. లండన్‌లో ఇదే ఈయన తొలి "ఏకవ్యక్తి చిత్ర ప్రదర్శనం."

శ్రీ ఐ. ఇ. ట్రెగన్తెన్ జంకిన్ శ్రీ ఎస్. వి. రామారావును గురించి ఇలా వ్రాస్తున్నారు:

"శ్రీ రామారావుకు ప్రాచీన భారతీయ కళాసంప్రదాయమంటే తగని ప్రేమాదరాలు. చిరకాలంగా ఈయన మనసులో నాటి చిగిరించిన ఈ ప్రేమాదరాలను వ్యక్తీకరించడానికి వైయక్తికమైనరీతిని రూపొందించుకొన్నారు ఈయనను చిన్ననాటి నుంచే ప్రకృతిలోని వైవిధ్యదీధితులు, పరిసరాలలోని వివిధ విచిత్ర వర్ణదీప్తులు ముగ్ధుణ్ని చేశాయి. కాంతిప్రవాహం తరంగిత మయినట్టు కనిపించే పట్టువస్త్రాలు, నక్షత్రాలతో మెరుస్తున్నట్టున్న బుటేదారీ నగిషీ జరీ వస్త్రాలు, భారతీయ దేవీ దేవుల వైభవ రహస్యాలు, భారతీయాచార వ్యవహారాలలోని వింతలు, వెన్నెలలో కాయకల్పం పొందినట్టున్న గంభీర భవనాలు, సహజ





కృష్ణ వేణి

ప్రకృతి దృశ్యాల సొబగు, గజిబిజిగా పెరిగిన వనరాజి మనోజ్ఞత, పూవుల రేకుల, చల్లని నీడలిచ్చే ఆకుల మార్దవ మనోజ్ఞతలు - ఇవన్నీ ఆయనను ముగ్ధుణ్ని, ప్రలుబ్ధుణ్ని చేశాయి. వీటిని ఈయన ప్రేమించారు; కల్పనా కమనీయతను, విచిత్రవర్ణ సుషమను, ప్రాచ్యపర్ణ చిత్రాల స్వరూపాలలోని సూక్ష్మమైన మేళవింపులను ఈయన చాలగా ప్రేమించారు.

ఈయన చిత్రాలు కంటికి, మనస్సుకు విందుచేస్తూ, నూతనాలోచనలకు అవకాశమిస్తాయి. ఈయన అంతశ్చేతనతో - తనకు తెలియకుండానే - ప్రాచ్య పాశ్చాత్య కళా రీతులను సమన్వయపరచారేమోనని అనిపిస్తుంది. లండన్‌లో ఈయన తొలి చిత్ర ప్రదర్శనం ఇదే. త్వరలోనే లండన్ వదలి ఫ్లోరిడాకు వెళ్ళుతున్నారు. అక్కడ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో చిత్రకళా భ్యాసానికి ఈయనకు ఫేలోషిప్ ఇచ్చారు."

—


కచ్ బాడవ ప్రాంతంపై పాకిస్తాన్ కన్ను

పాకిస్తాన్ అన్ని వైపులనుంచి భారతదేశాన్ని ఇబ్బంది పెడుతున్నది. ఇటీవల పడమటనున్న కచ్ ప్రాంతంలోని బాడవ ప్రాంతాలలో వాటా కావాలంటున్నది. మన ఇంట్లో అడుగు పెట్టడం, తిష్టవేసి ఇల్లు తనదే అనడం పాకిస్తాన్‌కు మామూలు అలవాటు. ఈ వివాదానికి మూల మేమిటో తెలుసుకొనే ముందు బాడవ ప్రాంతాల చరిత్రను సంగ్రహంగా తెలుసుకోవడం అవసరం.

రన్ అనేది గుజరాతీ మాట. దీనికి ఎడారి అని అర్థం. దక్షిణంలో సింధుశాఖ, ఉత్తరాన ఈ ఎడారి ఉండడంవల్ల కచ్ శతాబ్దాలుగా పశ్చిమ భారతంలో విడి ప్రాంతంగా ఉండేది.

ఒకప్పుడు సింధు నదం కచ్ ప్రాంతంలో ప్రవహించి అరేబియా సముద్రంలో చేరేదట. అప్పుడు ఈ రన్ ప్రాంతం డెల్టా. నది గతి మారిపోవడంతో ఈ డెల్టా ప్రాంతం కాలక్రమేణ ఎడారిఅయి, కొంత సముద్రంలో మునిగిపోయింది. 1819 లో పెద్ద భూకంపం వచ్చి, ఈ ప్రాంతంలో పశ్చిమ భాగమంతా సముద్రంలో మునిగిపోయింది.

ఉత్తరంనుంచి ఎవరూ దాడి చేయకుండా ఈ బాడవ ప్రాంతం శతాబ్దాలుగా కచ్‌కు రక్షణగా ఉంది. కచ్ క్రీస్తుకు పూర్వం 142 నుంచి 124 వరకు గ్రీక్ చక్రవర్తి మినెండర్ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. తర్వాత సిథియనుల రాజ్యంలో భాగంగాఉంది. క్రీస్తుపూర్వం 56 లో విక్రమాదిత్యుడు ఈ సిథియనులను ఓడించాడు. ఒక తరంవరకు ఇది విక్రమాదిత్యుని వశంలో ఉంది. తర్వాత మరల సిథియనులు ఆక్రమించుకున్నారు. తర్వాత పార్థియనులు ఆక్రమించారు. వారి రాజ్యం కచ్‌లో రన్, బ్రోచ్ (భరుకచ్ఛ) వరకు వ్యాపించి ఉండేది. తర్వాత 9 వ శతాబ్దంలో అరబ్బులు గుజరాత్‌ను, కాథియావాడ్‌ను జయించి కచ్‌లో తిష్టవేసి, సింధ్ వరకు ఆక్రమించుకొన్నారు.



14 వ శతాబ్దంలో కచ్ రాజపుత్రుల వశమైంది. తుఘ్లక్ వంశం వాడైన ముజఫ్ఫర్ షా గుజరాతు రాజా కంట్‌కోట్‌ను జయించి అహమదాబాద్‌లో సల్తనత్ స్థాపించాడు. అప్పుడు కచ్ స్వతంత్రమైంది. 1530 వరకు కచ్ పాలకులకు, సింధ్ పాలకులకు యుద్ధాలు జరిగాయి. ఆఖరుకు 1530 లో కచ్ మొఘల్ సామ్రాజ్యంలో భాగమైంది. 120 సంవత్సరాల పాటు ఇది మారలేదు. 17 వ శతాబ్దంలో మహారాష్ట్రుల పాలనలోనికి వచ్చింది. 1815 లో బ్రిటిష్‌వారు కచ్ మహారావును (పాలకుడు) వోడించి, కొన్ని సంవత్సరాల తర్వాత కప్పం కూడా విధిం

వారు. తర్వాత ఇది ప్రత్యేక రాష్ట్రంగా పశ్చిమ భారత ప్రదేశ సంస్థానాల ఏజంటు పరిపాలనలో ఉండేది. స్వాతంత్ర్యానంతరం చీఫ్ కమిషనర్ రాష్ట్రంగా ఉండి, భాషా రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత గుజరాతులో లీనమయింది.

కచ్ బాడవ ప్రాంతపు వైశాల్యం దాదాపు 9000 చతురపు మైళ్లు ఉంటుంది. గుజరాత్‌లోని కచ్‌జిల్లా తూర్పు ఉత్తర ప్రాంతాల్లో ఈ బాడవ ప్రాంతం వ్యాపించి ఉంది. ఈ ప్రాంతాన్నానుకొనే పాకిస్తాన్‌లోని సింధురాష్ట్రం సరిహద్దు ఉంది.

సంవత్సరంలో చాలాభాగం ఈ ప్రాంతములో వాల వరకూ ఉప్పునీటితోనూ, మంచినీటితోనూ మునిగిపోయి ఉంటుంది.

ఈ బాడవ ప్రాంతంలో అక్కడక్కడ పశుగ్రాసం లభిస్తుంది. 1762 లో సింధు ప్రాంతాన్ని పరిపాలించిన ఒక రాజు ఈ బాడవ (రాన్) పై కన్నువేశాడు. అయితే ఆ సింధు రాజు ఈ ప్రాంతంపై తన పెత్తనం చెలాయించినట్లు ఏ రికార్డులలోనూ లేదు. ఈ ప్రాంతంలో ఆ రాజు కొందరు సైనికుల నుంచటమైతే జరిగిందికాని ఆతడి కొడుకు తన హయాంలో ఆ సైనికులను ఉపసంహరించివేశాడు. పాత కాలపు రాజులకు సంబంధించినంతవరకూ ఈ బాడవచరిత్ర యిదీ.

గతంలో ఆంగ్లప్రభుత్వం ఈ బాడవప్రాంతాన్ని కచ్ అంతర్భాగంగా సదా గుర్తించింది.

కచ్—సింధు సరిహద్దు 45 మైళ్లమేరకు భూమిపై గుర్తించటం జరిగింది. రాన్ (బాడవ) ప్రాంతంతోసహా మిగిలిన ప్రాంతాలలో సర్వే పూర్తి అయింది. సరిహద్దును అధికారపటాలపై గుర్తించటం జరిగింది. 1914 లో బొంబాయి ప్రభుత్వం (అప్పటికి సింధురాష్ట్రం బొంబాయిలోనే కలిసి ఉండేది) చేసిన తీర్మానం ఈ బాడవను కచ్ సంస్థానపు అంతర్భాగంగా గుర్తించి అందుకు సంబంధించిన అనుమానాలకు స్వస్తి చెప్పింది.

18 వ శతాబ్దంలో సింధురాజు నావేశించిన పేరాన 1947 లో ఏర్పడిన పాకిస్తాన్‌కు తిరిగి ఆవేశించినట్లు కనబడుతున్నది. ఈ విధంగా చూసుకుంటే లాహోర్ ప్రభువు రంజిత్‌సింగ్ జయించాడనే కారణంగా కాబూల్‌నూ, పెషావర్ ప్రభువు కనిష్కుడు పాలించాడనే కారణంగా మధ్యాసియా ప్రాంతం మొత్తాన్నీ తనకు రావాలని పాకిస్తాన్ కోరవచ్చు. పాకిస్తాన్ ఎత్తుగడ సామాన్యమైనదేమీ కాదు. కాశ్మీర్‌లో వేసిన ఎత్తుల ఫలితాన్ని చవిచూరగిన పాకిస్తాన్‌కు ముందు ఒక ప్రాంతాన్ని ఆక్రమించటం, ఆ తరువాత ఆ ప్రాంతం వాస్తవికంగా తన అధికారంలో ఉన్న ప్రాంతమని వాదించటం లోని మలుపు తెలుసు.

1956 లో ఛాడ్‌బెట్ అనే చోట పాకిస్తాన్ మొదటి సారిగా ఈ ఎత్తు ఎత్తింది. ఛాడ్‌బెట్ బాడవప్రాంతపు ఉత్తర భాగంలో ఉంది. పాక్ సైనికు లీ ప్రాంతంలో ప్రవేశించి కందకాలు త్రవ్వి స్థావరాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ఈ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న భారతదళం ఆవంక రాగా పాకిస్తానీలు వారిపై కాల్పులు జరిపారు. ఆ తరువాత ఆ ప్రాంతానికి భారత సైనికదళాలు వచ్చిపడ్డాయి. అంతటితో పాకిస్తానీలు వారం రోజులలోపలే తోక ముడవటం జరిగింది. అయితే ఛాడ్‌బెట్ విషయంలో నిరసన పత్రాలు పంపటం ద్వారా పాకిస్తాన్ తన హక్కు స్థాపించుకోవాలని పిదప కాలంలో ప్రయత్నంచేసిందికాని భారత ప్రభుత్వం ఈ నిరసన పత్రాలను దృఢంగా త్రిప్పికొట్టింది. సరిహద్దుల పరిరక్షణకు అవసరమైన అన్నిచర్యలూ తీసుకొనగలమని భారత ప్రభుత్వం పాకిస్తాన్‌కు వివరంచేసింది.

బాడవను చేజిక్కించుకోవటానికి చేసిన ప్రయత్నాలీవిధంగా విఫలమైపోగా పాకిస్తాన్ తన లక్ష్యసాధనకు వేరొక ఎత్తు ఎత్తింది. పంజాబ్, రాజస్థాన్‌లతోగల పాక్ సరిహద్దు నిర్ణయ కార్యక్రమం పూర్తిఅయినా గుజరాత్ పాకిస్తాన్ సరిహద్దు నిర్ణయ కార్యక్రమ నిర్వహణలో ఐచ్ఛికంగా ఆలస్యం చేయుటం, అడ్డుపుల్లలు వేయటం ప్రారంభించింది. భారత సర్వేశాఖ 1964 అక్టోబర్ 17 వ సరిహద్దు నిర్ణయ కార్యక్రమానికి తేదీ నిర్ణయించవలసిందని వ్రాసిన లేఖకు, ఆ తరువాత పంపిన టెలిగ్రాములకూ పాకిస్తాన్‌నుండి ఇంతవరకూ సమాధానంలేదు.

ఈ బాడవ విషయంలో పరిష్కారం సాధించేందుకు ఇతోధిక వివరాలు సేకరించాలని 1960 లో జరిగిన భారత—పాక్ మంత్రుల సమావేశం నిర్ణయించింది. 1960 ఆగస్టు 12 వ లోక్‌సభలో ప్రసంగిస్తూ ప్రధాని నెహ్రూ "మనకు సంబంధించినంతవరకూ ఈ విషయంలో వివాదమే లేదు. రెండు మూడేళ్ళక్రితం ఈ విషయమై కొంత వినవచ్చింది. పాకిస్తాన్ ఈ ప్రస్తావన తెచ్చింది. కాని న్యాయమైన వివాదం ఉందని మనం భావించటంలేదు" అని అన్నారు.

బాడవలోని వివిధ ప్రాంతాలలోకి చొచ్చుకు రావటమే పాక్ పథకమనేది స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. మొదటి

కచ్ బాడవ ప్రాంతంపై పాకిస్తాన్ కన్ను

ప్రయత్నం ఛాడ్‌బెట్‌మీద జరిగింది. 1964 మే లో రెండవ ప్రయత్నానికి కంజర్‌కోటను ఎన్నుకోవటం జరిగింది. కంజర్ కోటకు మూడు కిలోమీటర్ల ఆగ్నేయంగా ముగ్గురు పాకిస్తానీల నరెస్టుచేయుటం జరిగింది. వీరు గడ్డి కోసుకోవటానికి వచ్చినవారు. పాకిస్తానీ సరిహద్దు పోలీసులు ఈ సందర్భంగా కాల్పులు ప్రారంభిస్తామని బెదిరించటం కూడ జరిగింది.

1964 మేలో భారత సరిహద్దు అధికారి పాక్ సరిహద్దు అధికారిని కలుసుకున్నప్పుడు దేశవిభజనకుముందు తయారైన పటాలనుబట్టి కంజర్‌కోట భారతప్రాంతంలో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నదని విశదం చేయుటం జరిగింది.

అయినా ఈ సంఘటన జరుగటాన్నిబట్టి పాకిస్తాన్ తన పేరాసను తీర్చుకోవటానికి కంజర్‌కోటను రెండవలక్ష్యంగా ఎన్నుకున్నదనుకోవచ్చు. ఈ సంఘటన తరువాత భారత గస్తీ దళాలు సరిహద్దు ప్రాంతమంతటా తీవ్రంగా గస్తీ తిరగటం ప్రారంభించాయి. ఇందుకు 1962 జనవరి 22 న పాక్ సరిహద్దుదళాలు ఫిర్యాదుచేయుటం ప్రారంభించాయి. ఆతరువాత పాక్‌దళాలు కంజర్‌కోట ప్రాంతంలోకి చొచ్చుకొని వచ్చాయి. మూడురోజుల తరువాత పాక్ దళాలు 18 మైళ్ళ పొడవున తూర్పు పడమరలుగా, ఒక బాట నిర్మించాయి. ఈ బాట భారత సరిహద్దుకు $1\frac{1}{2}$ మైళ్ళు దిగువన భారత భూభాగంలో ఉంది. అంతేకాక సరిహద్దుకు 1300 గజాలు దిగువనఉన్న కంజర్‌కోట కోటనుకూడ పాక్‌దళాలు ఆక్రమించాయి. అందుపై భారతప్రభుత్వం పంపిన నిరసనలను అధిక్షేపణలను పాకిస్తాన్ ఖాతరుచేయులేదు. సరిహద్దు నిర్ణయ కార్యక్రమంలో నిమగ్నులై ఉన్న ఇద్దరు సర్వేయర్‌జనరల్‌లూ వారి పని చేసుకోవటానికి పాకిస్తాన్ ఎదురు నిలిచింది.

ఆవిధంగా సమస్యేలేనిచోట సమస్యను సృష్టించటంలో పాకిస్తాన్ విజయం సాధించింది. దేశవిభజనకు ముందుకూడ ప్రస్తుతం పాకిస్తాన్‌లోఉన్న సింధురాష్ట్రానికీ, ప్రస్తుతం భారతదేశంలోఉన్న కచ్ సంస్థానానికి నిర్దిష్టమైన సరిహద్దు ఉంది. దేశవిభజనవల్ల ఈ సరిహద్దులో మార్పు రాలేదు. భారత సర్వేయర్జ జనరల్ ప్రకటించిన పటంలో ఈ సరిహద్దు స్పష్టంగా ఉంది. ఈ బాడవ ప్రాంతంపై భారత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్థమైన అజమాయిషీఉంది. ఈ ప్రాంతంలో భారత సరిహద్దు పోలీసులు సరిహద్దు వరకూ గస్తీతిరుగుతున్నారు. పాకిస్తానీలు చొచ్చుకొనిరావటం, భారత ప్రాంతంలో బాటవేయుటం సరిహద్దుకు దిగువన 1300 గజాల దూరంలో కంజర్ కోటవద్దా, 2000 గజాల దూరంలో వేరొక చోట భారతప్రాంతంలో రెండు కేంద్రాలు నెలకొల్పటం ఇవన్నీ 1965 జనవరి తరువాత జరిగిన సంఘటనలు.

ఫిబ్రవరి 12, 18, మార్చి 11 తేదీలలో భారత ప్రభుత్వం పంపిన అధిక్షేపణ పత్రాలలో పాకిస్తాన్ ఈ ప్రాంతంనుండి తన సాయుధదళాల నుపసంహరించుకోవాలనీ, ఈ ప్రాంతంలో పూర్వంఉన్న పరిస్థితిని పునరుద్ధరించాలనీ కోరటం జరిగింది. ఉభయపక్షాలకు చెందిన సరిహద్దు అధికార్ల సమావేశం జరుగాలనికూడ భారత ప్రభుత్వం ప్రతిపాదించింది. ఉభయదేశాల సర్వేయరుజనరలులూ సమావేశంకావాలని భారత ప్రభుత్వం ఇంతకుముందే సూచించి ఉంది.

ఈ విషయా లన్నిటినీ పాకిస్తాన్ ఇంకా ఆమోదించవలసి ఉంది. అయితే ఇందుకు ప్రతిగా సరిహద్దు ప్రాంతంలో భారీఎత్తున పాక్ సైనికుల కేంద్రీకరణ సాగుతున్నది. న్యాయవిరుద్ధమైన తన పథకాలకు మద్దతు తెచ్చుకోవటానికే పాకిస్తాన్ ఈ సైనిక కేంద్రీకరణ ప్రారంభించింది. కచ్‌బాడవ ప్రాంతంలో సగభాగం తమకురావాలని పాకిస్తాన్ కోరటం న్యాయవిరుద్ధమేకాక పాక్ విస్తరణవాదానికి నిదర్శనం కూడ.

విరిగిన హరివిల్లు

శ్రీ మహమ్మద్ ఇస్మాయిల్

నీలాకాశం
నీరెండ
టెరిలిన్ తెరలా వాన తుప్పర
హరివిల్లు.

తారురోడ్డు
పాత చీర మీద
కొత్త అతుకుల్లాగ
గతుకుల్లో వాననీళ్లు.
దారిలో చెడి ఆగిపోయిన లారీ
ఒలికిపోయిన ఇంకులా
డీసెల్ ఆయిల్.

నీటిమీద యాబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్
పికాసో బొమ్మలు.

కెలెడిస్కోప్‌లోని రంగులు
డీసెల్ ఆయిల్ నీట్లో కలిసిన
రోడ్డు గతుకులో,
లారీ పక్కన
హరివిల్లు రంగు రంగుల ముక్కలుగ
విరిగిపడి మెరసింది.

కర్ణాటక సంగీతము:

రాగ పరిణామము

శ్రీ వై. వి. నారాయణశర్మ

భారత దేశమునందంతటను సుమారు 12 వ శతాబ్దము వరకును సంగీత పరిణామము ఒక్కటియే యగుటవలన ఆ కాలపు సంగీత శాస్త్ర సంబంధములగు సంస్కృత గ్రంథములు—భరత శాస్త్రము, నారదశిక్ష, మతంగుని బృహద్దేశి, శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరము మూలమున తెలిసికొనుటకు మనకు చక్కని యవకాశము గలదు. భరతుని మతము ననుసరించి సంగీత మనునది నృత్యము, గీతము, వాద్యము అను మూడింటి చేరికయై యున్నది. భరతుడు కేవల మొక్క నాట్యమునేగాక నాటక కళను గూడ చక్కగా రూపొందించియున్నాడు. ఇదియే ఆయన ప్రత్యేకత అని గూడ చెప్పదగుదు. ఆయన మతము ననుసరించి (అనగా అతని యభిప్రాయము ననుసరించి) గీతము, లేక సంగీతము అనునది నృత్తమునకు తరువాత రెండవదిగా ప్రాముఖ్యము నందెను.

క్రమముగా మనకు భరతుని దగ్గర నుండి శార్ఙ్గదేవుని వరకు వచ్చునప్పటికి సంగీతముయొక్క క్రమ పరిణామము కొంత మార్పు చెందినట్లు తెలియుగలదు. ఎట్లన: ఈతడు సంగీతమన గీతవాద్యములు రెండింటికీ (అనగా గాత్ర సంగీతము, వాద్య సంగీతము) ఎక్కువగా ప్రాముఖ్యమును ఇచ్చి యున్నాడు. ఈనాటికినీ సామాన్యముగా ఆచరణములో సంగీత మనుదానిని అట్లే ఎంచుచున్నాము. నృత్తము వేరొక ప్రత్యేక కళగా తర్వాత రూపొందింపబడి వృద్ధిపొందినది.

సంగీత మనునది మార్గ, దేశి యని రెండు విధములుగా విభాగ మొనరింపబడినది. అందు మార్గ సంగీత మనునది పూర్వకాలపు ఆర్యుల సంగీత విధానమును నిరూపింపగలిగి యున్నది. జనసామాన్యమునకు చేరిక యగునట్టిది "దేశి" యని చెప్పబడినది. ఈ దేశి సంగీత మనునది మార్గ సంగీతమునకుండినంతటి కట్టుదిట్టములు లేవు కనుక ఆయా కాలములయందు ఆయా ప్రజల అభిప్రాయముల ననుసరించి కొన్ని కొన్ని మార్పులను చెందుతూ వచ్చి యుండెను. ప్రస్తుతమున యీ వ్యాసమునందు చర్చింపబోవు విషయము ఈ రెండవది యగు దేశి సంగీతమును గురించియే యగును. ఇట్టి దేశి సంగీతము మాత్రమేగాక ఇంకను మరియొక జనసామాన్య సంగీత విధాన మొక్కటి గూడను గలదు. అదేదియన గ్రామ్య గాన సంబంధ మగునది. జానపద సంగీతము అనునది. నన్నయకు పూర్వము నుండియును సంప్రదాయసిద్ధముగ కొన్ని కొన్ని జోలలు, ఏలలు, తుమ్మెద పదములు, వెన్నెల పదములు, యక్షగానములు మొదలగునవి ఎన్నియో ఆచరణలో నుండి యున్నవి. ఇట్టి ఈ పాటలన్నీ గూడా ఈనాటికినీ గ్రామములయందలి సామాన్య ప్రజ లందరును గూడ పాడుకొనుచుండుట గలదు. కనుక నీ జానపద గానము గూడను గమనింపదగినట్టిదియే కాగలదు. సామాన్య ప్రజా జీవితములో ఇయ్యది ఎక్కువ ప్రాముఖ్యము నందియున్నది.

భారతీయ సంగీతమునందు అతి ప్రాముఖ్యము నందినది. "రాగము" అనునది. ఈ రాగ విధానము ఎట్లు క్రమ పరిణామమును పొందియున్నదో ప్రస్తుతమున విమర్శించి తెలిసికొందము.

స్వరములు : శ్రుతులు

రాగ మనునది సామాన్యముగా మూడు స్థాయిల (octaves) లో పాడబడును. ప్రతి స్థాయి యందును స, రి, గ, మ, ప, ద, ని, అను సప్త స్వర ప్రత్యయములచే

రూపొందింపబడును. ఈ సప్త స్వరములకు మధ్యను ఇరువది రెండు శ్రుతులు అనుబడునని గుర్తింపబడి యున్నవి. శ్రుతి (Interval) యనగా రెండు శ్రుతుల (స్వరముల) యొక్క మధ్య నుండెడి శ్రుత్యంతర నిష్పత్తి యగును. ఇది ఆ స్వరము ఒక సెకన్డు వ్యవధిలో పలికింపబడు కంపనముల యొక్క సంఖ్యచే గుర్తింపబడు చుండును. ఈ దిగువ నివ్వన పథకము ననుసరించి 22 శ్రుతు లనునవి ఒక స్థాయి యందలి సప్త స్వరములకు ఎటుల విభాగింపబడినవో తెలియుదగును.

పై స్థాయి యందును, అయూ నిష్పత్తులలో ద్విగుణీకృత ములై పలుకుచుండగలవు.

వెంకటమఖి ఈ 22 శ్రుతులను 12 స్వర స్థానము లచే గుర్తించియున్నారు.స, ప, లు రెండింటినీ వదలి మిగతా 20 శ్రుతులను ఒక్కొక్కదానిని రెండు చొప్పున పది స్వర స్థానము లచే గుర్తించియున్నాడు. ఇవియే ప్రస్తుత కర్ణాటక సంగీతమం దుపయోగింపబడుచున్నవి. ఈ పంద్రెండును U మార్కు చేయుబడి వరుసక్రమములో చూపబడి యున్నవి. ఇవియే వీణ యందు 12 స్థానముల (మెట్ల) యందును పలుకగలవు.

	స —	రి —	గ —	మ —	ప —	ద —	ని —	స
స్వరములమధ్య నుండెడి శ్రుతుల సంఖ్య	4	3	2	4	4	3	2	4
మధ్య స్వరస్థాన శ్రుతి సంఖ్య	4	7	9	13	17	20	22	—

4 శ్రుతి ఇంటర్వల్ సరిగా 9/8 నిష్పత్తియగును ఇది మేజర్‌టోన్ అగును
3 .... 10/9 .... మైనర్‌టోన్ ....
2 .... 16/15 .... సెమీటోన్ ....

అనగా 9/8 చతుశ్రుతి (మేజర్‌టోన్), 10/9 త్రిశ్రుతి (మైనరుటోన్), 16/15 ద్విశ్రుతి (సెమీటోన్) అనగా అర్ధశ్రుతి యనియును చెప్పబడగలవు.

వీణయందున ఈ శ్రుతులు వాటివాటి శ్రుతి స్థానము లను ఆ తంత్రులయొక్క పొడవులను బట్టి నిర్ధారింపబడ గలవు. ముందు చూపబడు మూడవ పథకములో చెప్పబడిన ప్రకారము మధ్యమముయొక్క తీవ్రరూపమునకు అనగా ప్రతి మధ్యమ స్థానమునకు ఒక ప్రత్యేక శ్రుతి స్థాన మేర్పడి అంగీకరింపబడి నిర్ధారింపబడి యుండెను. ముందు చెప్పబోవు ఈ పథకము చాల శ్రద్ధతో గుర్తింపవలసినదై యుండును. ఏమన : కర్ణాటక విధానము, ఔత్తరాహిక విధానము అను రెండు సంగీత విధానములకున్నూ అనుసరింపబడినట్టి శ్రుతి విభాగము ఇందు చూపబడినది. ముందు 22 శ్రుతులకున్నూ గల సంబంధమును తెలియదగును. రెండు శ్రుతులు (స్వర ములు) ఒకే పర్యాయమున ప్రయోగింపబడినప్పుడు ఆ రెండింటి నాదమున్నూ ఒక దానితో నొకటి చేరి శ్రావ్యముగా నుండిన ట్లయిన ఆ రెండున్నూ సంవాదిత్వ సమ్మేళనము గలవి యని చెప్పబడును. ఒక వీణ యందలి శ్రుతి చేయబడినట్టి తంత్రిని రెండు సమాన భాగములుగా నర్చినచో రెండు స్థాయిల యందలి స్వరములను, వరుసగా ఆధారషడ్జము మొదలుకొని సప్తస్వరములనున్నూ, ద్విగుణీకృత నిష్పత్తిలో రెండు స్థాయి లలోని స్వరములున్నూ ఆ తంత్రిని ప్రయోగించినప్పుడు అందిమిడి యుండగలవు. అయూ స్వరముల నిష్పత్తులు దిగువస్థాయి,

కొందరి యభిప్రాయము ననుసరించి రెండవ, తొమ్మిదవ మెట్లు లేక స్థానములున్నూ, వరుసగా ద్విశ్రుతి రిషభము, ధైవతము అను పేర్లతో గాకను, శుద్ధ రిషభము, ధైవతము అని పిలువబడగలవు.

ముందు చెప్పబడిన రీతిగనే వీణ యందలి తంత్రిని మూడు సమభాగములుగానర్చి అందు 2/3 భాగపు తంత్రిని ప్రయోగింపజేసిన యెడల అప్పుడు ఆకంపన నిష్పత్తి ఆధార షడ్జమమునకు 3/2 నిష్పత్తిలో నుండగలదు. అదేవిధముగనే 3/4, 4/5, 5/6 (తంత్రియొక్క) భాగములను కంపింపజేసినట్లయిన వాటి యొక్క స్వర నిష్పత్తులు వరుసగా 4/3, 5/4, 6/5 లుగా ఆధార షడ్జమముతో నిష్పత్తి విలువలను కలిగియుండగలవు. అనుభవ జ్ఞానమువలన ఏ నిష్పత్తి విలువలు 2, 3/2, 4/3, 5/4, 6/5, లుగా నుండి ఆధారషడ్జమునకు అనుకూల వాదిత్వమును గలిగి బహు శ్రావ్యముగ నుండగలవనిన్నీ, మరియును, ఆ సంవాద ధ్వని క్రమ ముగా తగ్గి వచ్చుచుండగలదని తెలియును. తారషడ్జమున్న వదలి (2) పంచమము (3/2) మధ్యమము (4/3) ఈ రెండు శ్రుతులున్నూ షడ్జమముతో చక్కని సంవాదిత్వము కలిగి యుండగలవు. ఇదియే షడ్జ—పంచమ, షడ్జ—మధ్యమ భావ ములతో 22 శ్రుతులకు ఆధారము లయ్యెను. అవి క్రమముగా 1, 3/2, 4/3, 5/4, 6/5, నిష్పత్తులు పైన నుదాహరింపబడినవి.

మూడవ పట్టిక ము

శ్రుతి సంఖ్య.		సంకేతము.		పేరు.	ఇంటర్వల్ విస్తృతి		
	V						
4	1	—	స	శుద్ధ షడ్జము		1	
5		ర	రి 1	ఏకశ్రుతి రిషభము	$\frac{256}{243}$	$\frac{256}{243}$	$\frac{81}{80}$
6	2	రి	రి 2	ద్విశ్రుతి రిషభము	$\frac{25}{24}$	16/15	
7		రు	రి 3	త్రిశ్రుతి రిషభము	...	10/9	$\frac{81}{80}$
8	3	రె	రి 4	చతుశ్రుతి రిషభము	$\frac{256}{243}$	9/4	
9		గ	గ 1	శుద్ధ గాంధారము.		32/27	"
10	4	గి	గ 2	సాధారణ గాంధారము	$\frac{25}{24}$	6/5	
11	5	గు	గ 3	అంతర గాంధారము	,,	5/4	"
12		గె	గ 4	చ్యుత మధ్యమము.	$\frac{256}{243}$	81/64	
13	6	మ	మ 1	శుద్ధ మధ్యమము.	—	4/3	"
14		మి	మ 2	తీవ్ర మధ్యమము.	$\frac{256}{243}$	27/20	
15	7	ము	మ 3	ప్రతిమధ్యమము.	—	64/45	25/24, 45/32
16		మె	మ 4	చ్యుతపంచమము.	...	40/27	
17	8		ప .	శుద్ధ పంచమము.	$\frac{256}{243}$	3/2	
18		ధ	ధ 1	ఏకశ్రుతి ధైవతము.	—	128/81	81/80
19	9	ధి	ధ 2	ద్విశ్రుతి ధైవతము.	$\frac{25}{24}$	8/5	
20		ధు	ధ 3	త్రిశ్రుతి లేక శుద్ధ ధైవతము.	—	5/3	"
21	10	ధె	ధ 4	చతుశ్రుతి ధైవతము.	$\frac{256}{243}$	27/16	
22	....	న	ని 1	శుద్ధ నిషాదము.		27/10 16/9	81/80
1	11	ని	ని 2	కైశికి నిషాదము.	$\frac{25}{24}$	9/5	"
2	12	ను	ని 3	కాకలి నిషాదము.	—	15/8	
3		నె	ని 4	చ్యుతషడ్జ నిషాదము.	$\frac{256}{243}$	243/128	
	13	స	—	తారషడ్జమము.	—	2	

పై స్థాయిలోని చతుశ్రుతి రిషభము $\frac{9}{4}$, పంచమ శ్రుతివల్ల హెచ్చించుట మూలముగా లభ్యమగును. అనగా ($\frac{3}{2}\times\frac{3}{2}=\frac{9}{4}$). దాని దిగువ స్థాయిలోనికి దింపిన యెడల నయ్యెడి $\frac{9}{8}$ రాగలదు—($\frac{9}{4}\times\frac{1}{2}=\frac{9}{8}$) కనుక పంచమ సంబంధముగా మనకు చతుశ్రుతి లభ్యమయ్యెను. దీనిలో నుండి మరియొక పంచమ ఇంటర్వల్‌తో హెచ్చించగా $\frac{9}{8}\times\frac{3}{2}=\frac{27}{16}$ చతుశ్రుతి ధైవతము లభ్యమయ్యెను. ఇట్లే $\frac{27}{16}\times\frac{3}{2}=\frac{81}{32}$ స్థాయికి దిగువను $\frac{81}{64}$ (గ), $\frac{81}{64}\times\frac{3}{2}=\frac{243}{128}$ (ని) కాగలవు. ఇటుల స, ప, సంబంధముగా 4 శ్రుతులు ఎక్కువ లభ్యమయ్యెను. కనుక ఇంతవరకు 9 శ్రుతులు వచ్చెను. మరల మధ్యమ సంబంధముగా $\frac{16}{9}=(\frac{4}{3}\times\frac{4}{3}=\frac{16}{9})$ (ని) మరల $\frac{16}{9}\times\frac{4}{3}=\frac{64}{27}$ ను దిగువసాయికి తగ్గించిన $\frac{32}{27}$ (గ) ఇట్లే $\frac{32}{27}\times\frac{4}{3}=\frac{128}{81}$ (ధ). మరల $\frac{128}{81}\times\frac{4}{3}\div 2=\frac{256}{243}$ (రి) ఇటుల 13 శ్రుతులు వచ్చును. కాకలినిషాదము ($\frac{15}{8}$) అంతర గాంధారమునకు పంచమ మగును. మరియు $\frac{5}{3}$ ధైవతము. $\frac{5}{4}$ దిగువ ధైవతము యొక్క మధ్యమ మగును. ఇట్లే కైశికి నిషాదము పంచమమున్నూ, ధైవతము ($\frac{8}{5}$) సాధారణ గాంధారమునకు మధ్యమమున్నూ కాగలవు. ఇటుల మనకు 17 శ్రుతులు లభ్యమయ్యెను. మరల నిట్లే $\frac{5}{3}\times\frac{4}{3}=\frac{20}{9}$—$\frac{10}{9}$ (రి3), $\frac{10}{9}\times\frac{4}{3}=\frac{40}{27}$ (మ4) $\frac{8}{5}\times\frac{4}{3}=\frac{32}{15}$—$\frac{16}{15}$ (రి2) $\frac{16}{15}\times\frac{4}{3}=\frac{64}{45}$ (మ3) ఇటుల నిప్పటికి 21 శ్రుతులువచ్చెను. మరియొక్కటి గణింపవలసినట్టిది ఒకే ఒక శ్రుతి $\frac{27}{20}=\frac{81}{80}\times\frac{4}{3}$ అనగా నిది $\frac{81}{80}$ యొక్క మధ్యమము. $\frac{81}{80}$ శ్రుతి అంగీకరింపబడి యుండలేదు. అది (రి1) $\frac{256}{243}$ కంటెను తక్కువ యగుటవలన వదలివేయబడినది.

మ3, $\frac{256}{243} \times \frac{4}{3} = \frac{1024}{729}$ గా నుండవలెను. కాని $\frac{1024}{729}$ విలువ గల శ్రుతి చాలా క్లిష్టతర మగుటవల్ల దానిని $\frac{27}{20}$ నిర్ధారింపబడినది. (ఇది బేగడ మధ్యమము అనబడును). కొందరు $\frac{64}{45}$ ప్రతి మధ్యమముగా గాక $\frac{45}{32}$ ప్రతి మధ్యమముగా గ్రహించియున్నారు. $\frac{45}{32}$ అనునట్టి శ్రుతి స—స, స—మ సంబంధములోనిది కానందున ($\frac{9}{8} \times \frac{5}{4} = \frac{45}{32}$) ఇది ఋషభము నకు గ3 అగుటవలన (అనగా చతుశ్రుతి ఋషభము నందలి త్రిశ్రుతి గాంధారముచే గుణించగా లబ్ధమైనదని తెలియవలెను) దీనిని మూడవ పట్టికము వరుసలో నిరూపింపబడక అందున $\frac{64}{45}$ శ్రుతియే గ్రహింపబడినది. మరియును విచిత్ర మేమనగా స నుండి మ వరకును గల 10 శ్రుతులను పంచమముచేత హెచ్చించగా (పెంచగా) మరల ప నుండి స వరకు మరల పది శ్రుతులు వరుసక్రమములో రాగలవు. మిగిలిన మూడు మ2, మ3, మ4 శ్రుతులలోనూ మ3, మ4 వల్ల రి, రి1 న్నూ, వాటి దిగువను 10 శ్రుతులున్నూ—పై స్థాయిలో కలుగుచున్నవి. మ2 ($\frac{27}{20}$) విలువగలది సూత్రమునకు బంధింపలేదు గనుక వేరుగా నుండగలదు. ఎట్లన: $\frac{1024}{729} \times \frac{3}{2} = \frac{512}{243}$ అనగా రి1 పై స్థాయిలోని దగును. ఎట్లయినను $\frac{27}{20}$ శ్రుతి $\frac{1024}{729}$ కి బదులుగా ఎన్నుకోబడినట్లు ఇదివరకు తెలిసికొని యుంటిమి. పైన చూపబడిన మూడవపట్టికము ననుసరించి ఏక శ్రుతికిన్ని, ద్విశ్రుతికిన్ని మధ్య నుండెడి యంతరమున్నూ, త్రిశ్రుతికిని చతుశ్రుతికిన్ని మధ్యనుండెడి యంతరమున్నూ ఆమధ్య నుండెడి అన్ని స్వరములకున్నూ $\frac{81}{80}$ అంతరమని తెలియగలదు. ఇది కొమ్మా "Comma" యని పిలువబడుచున్నది. కాని, ద్విశ్రుతికిన్ని, త్రిశ్రుతికిని మధ్య నుండెడి స్వరముల అంతరము $\frac{25}{24}$ కాగలదు. ఇది $\frac{81}{80}$ కన్న కొంచెము ఎక్కువ విలువ గలది యగును. మరియును, $\frac{256}{243}$ కంటె నించుక తక్కువది యగుచున్నది. ఎప్పుడెప్పుడు స్వరముయొక్క చిట్టచివరి శ్రుతినుండి తరువాత స్వరముయొక్క మొదటి శ్రుతికి మార్పు గలదో అనగా స నుండి రి1, రి4 నుండి గ కున్నూ ఈ మొదలుగా మార్పులు కలుగునప్పుడు అచ్చటి అంతరము $\frac{256}{243}$ విలువగలది యగును. ఇది క్వార్టరుటోన్ అనియు లేక ఏక శ్రుతి యనియును పిలువబడుచున్నది. కనుక నిప్పుడు మనకు వరుసగా $\frac{81}{80}$, $\frac{25}{24}$, $\frac{256}{243}$ విలువగల మూడు ఏకశ్రుతులు కలుగుచున్నవి. వీటిలో తక్కువది $\frac{81}{80}$. ఇది భరతునిచే చెప్పబడిన ప్రమాణ శ్రుతి యగుచున్నది. ఇది మధ్యమ గ్రామమున పంచమ సంబంధము. మూడవపట్టికములో మొదటగా పేర్కొనబడిన ఏడు స్వరములున్నూ మొదటగా వేద సంబంధముగా నుపయోగింపబడి యుండెడివి. అవి ఉదాత్త, అనుదాత్త, స్వరితములను భేదములచే వేదములయం దుపయోగింపబడెడివి. అందును ముఖ్యముగా సామవేదమందున ఉపయోగింపబడెడివి. (నారదశిక్ష చూడదగును.)

"నారదశిక్ష" అనే గ్రంథములో సామగానమును గూర్చి యిట్లుల చెప్పబడి యున్నది.

"సామవేదేతు వక్ష్యామి స్వరాణాంచరితం యథా
తాన రాగ స్వర గ్రామ మూర్ఛనా నాంతు లక్షణమ్.
సప్తస్వరాస్త్రయోగామా మూర్ఛనా స్త్వేక వింశతిః
తాన ఏకోనపంచాశ దిత్యేత త్స్వర మండలం
షడ్జశ్చ ఋషభశ్చైవ గాంధారో మధ్యమ స్తథా
పంచమో ధైవతశ్చాథ నిషాద స్సప్తమస్స్వరః."

అనగా సామవేద స్వరములను వాటి నడకలను చెప్పుచున్నాను—ఏడు స్వరములు, మూడు గ్రామములు, ఇరువదియొక్క మూర్ఛనలు, నలుబది తొమ్మిది తానములు. అందు షడ్జ, ఋషభ, గాంధార, మధ్యమ, పంచమ, ధైవత, నిషాదములని ఏడు స్వరములు—ఇత్యాదిగా నన్నిటి లక్షణములునూ చెప్పబడెను. నారదాది శిక్షలు వేదాంగములలోనివి. వీనిలో సంగీత శాస్త్రములైన పారిజాతాది గ్రంథములలో చెప్పినట్లే, స్వర, గ్రామ, తానాదులు చెప్పబడెను. కావున సంగీత మంతయును సామవేదమునందు బుట్టిన దనదగును. కనుకనే గాంధర్వ వేదమని ఉపవేదములలో బరిగణించి యున్నారు. ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వ వేదములు, ఉపవేదములు అనబడెను. మరియును, ఇంకనూ గాన స్వరూపము కొంత వివరింపవలయును. "గానస్యతు దశ విధా గుణ వృత్తిః. తద్యథా—రక్తం, పూర్ణం, అలంకృతం, ప్రసన్నం, వ్యక్తం, విక్రుష్టం, శ్లక్ష్ణం, సమం, సుకుమారం, మధురం—అని గానమునకు పది గుణములు గలవు. అవి :—రక్తము—వేణు వీణా స్వరముల యేకీభావము రక్తమనబడును. పూర్ణము—స్వరశ్రుతి ఛందః పాదాక్షరముల వల్ల పూర్ణత గలిగినట్లయితే పూర్ణము. వ్యక్తమనగా పదపదార్థ స్ఫూర్తి గలుగునట్లుగా గానము చేయుట. విక్రుష్టము—అనగా ఉచ్చైస్స్వరములో పాడినను అర్థము పదములు స్పష్టముగా నుండుట. మధురము—అనగా స్వభావముచేత లలితాక్షర విన్యాసము, తదుచ్చారణ లాలిత్యము కలుగుట. ఇట్లే ఇతరములు నారదశిక్షలో వ్రాయబడి యుండినవి. ఈ పది విధముల గానములో సమగానమును ఆచార్యులు ఆమోదింతురు. (పరిచ్ఛేదమును పండితు లామోదింతురు.) మధురగానమును స్త్రీ లామోదింతురు అని ఆ గ్రంథమునందే వ్రాయబడినది. ఇది గాక మరియొక విశేషమును గూడ గమనింపవలయును.

"యస్సామగానాం ప్రథమః సవేణో ర్మధ్యమ స్వరః
యో ద్వితీయ స్స గాంధార స్తృతీయ స్త్వృషభ స్మృతః',

అనగా సామగానమునందలి ప్రథమ స్వరము (షడ్జమ) వేణుగానమున మధ్యమ స్వరమగును. మూడవది (గాంధారము) ఋషభమగును. ఇత్యాదిగా సామవేద స్వరములకు వేణువాద స్వరములకును భేదము గలదని చెప్పబడెను. మరియును,

"దారవీ గాత్ర వీణాచ ద్వే వీణే గాన జాతిషు
సామికీ గాత్రవీణాతు తస్యాః శ్రుణుత లక్షణమ్.
గాత్రవీణా తు సాప్రోక్తా యస్యాం గాయన్తి సామగాః
స్వర వ్యంజన సంయుక్తా అంగుళ్యం గుష్ఠ సంజ్ఞితా
హస్తే సమంయుతే ధార్యా జానుభ్యా ముపరిస్థితే."

ఇత్యాదిగా కర్రతో చేసినది యొకవీణ, శరీర మొక వీణ (గాత్రవీణ) అని వీణలు రెండు. గాత్రవీణతో సామగానమును చేతురు. కాలి ముణుకులమీద చేతులు వ్రేళ్లు అంగుష్ఠమును కలియకుండ చాచి, యా వ్రేళ్లతో స్వరముల సంజ్ఞలు చూపుచూ శిష్యులకు సామగానమును గురువు నేర్పవలెను. ఫలానా వ్రేలు ఫలానా స్వరమునకు గురుతని పరిభాష గలదు. "హస్తే నాధ్యాపయే చ్ఛిష్యాన్ శైక్షేణ విధినా ద్విజః" శిక్షలో చెప్పిన విధమున చేతితో శిష్యులకు గానము నేర్పవలెనని నారదశిక్షలో గలదు. (అట్లే ఈనాటి అనుసరణమున్నూ గలదు.) మఱియును,

"ఉదాత్తే నిషాద గాంధారే అనుదాత్తే ఋషభ ధైవతే
స్వరితప్రభ వాహ్యేతే షడ్జ మధ్యమ పంచమాః"

ఉదాత్తమందు నిషాద గాంధారములు, అనుదాత్తమందు ఋషభ ధైవతములు, స్వరితమందు షడ్జ, పంచమ మధ్యమములు పుట్టెను. అందువలన సప్తస్వరములును, ఉదాత్తాది మూడు స్వరములలో నిమిడియున్నవని తాత్పర్యము. ఈ యుదాత్తాది స్వరత్రయము కొంత మార్పు గలిగి అయిదు స్వరము లనబడెను. చూడుడు నారదశిక్ష :

"ఉదాత్తో హ్యనుదాత్తశ్చ స్వరిత ప్రచితే తథా
నిఘాతశ్చేతి విజ్ఞేయః సర్వ వేదస్తు పంచధా."

అని ఉదాత్తానుదాత్త, స్వరితములు గాక సామవేదమున, ప్రచయము, నిఘాతము అని మరిరెండు స్వరములు చెప్పబడెను. మరియు, అంకస్వరము, అక్షరస్వరము అనునవి గూడ కొన్ని సంకేతములు గలవు. ఆ సంకేతముల ననుసరించి సామవేద వేత్తలు గాన మొనర్తురు. అందువల్లను ఈ ఏడు స్వరములున్నూ పరిశుద్ధము లైనట్టివిగా ఎంచబడి "శుద్ధ స్వరములు" అని పేర్కొనబడినవి. తక్కిన అన్ని స్వరరూపములున్నూ (15న్నూ) సామాన్య జానపద గానమునందునూ, లౌకిక గానమునందును ఉపయోగింపబడుటవల్లనూ, సామగానమునందు ఇవి దూష్యము లగుటవలనను, ఇవి 'వికృతులు" అని పిలువబడినవి.

గ్రామములు

గ్రామములు అనునవి మూడుగా చెప్పబడినవి. ఇవి శుద్ధ స్వరములనే కలిగియుండి వరుసగా గ, మ, స, స్వరముల నుండి ప్రారంభింపబడి వరుసగా దిగువకు ప్రసరింపబడగలవు. ఎట్లనగా:- (1) గ, రి, స, ని, ధ, ప, మ, (2) మ, గ, రి, స, ని, ధ, ప,-(3) స, రి, గ, మ, ప, ద, ని, అనియును ప్రసరించబడగలవు. (ఇందు మూడవది వరుసగా పైకి ఆరోహణముగా నుండును.) ఇవి మూడునూ వరుసగా గాంధార, మధ్యమ, షడ్జ గ్రామములని పిలువబడగలవు. ఇందు మొదటి రెండున్నూ వేద గానము నుండిన్ని, చివరిది యగు మూడవది (సెక్యులర్ మ్యూజిక్) లౌకిక గానమునుండిన్నీ రూపొందింపబడి యుండినవి. వీటి యందు మొదటిది యగు గాంధార గ్రామము అనునది చాల పురాతన మగుట వలనను, మార్గ సంగీత సంబంధమైనందు వలననూ, భరతుని కాలమునాటికే (ఈ లోకమున) వాడుకలో నుండి తొలగిపోయెను. భరతుని మతానుసారముగా మధ్యమ గ్రామమునందలి పంచమము, శుద్ధ పంచమమున కంటెను తక్కువది యగు ప్రమాణశ్రుతి యగుచున్నది. అందువల్ల 3 వ పట్టికలో మ4 పంచమమున కంటెను (కామ్మా) అంతరము తక్కువది యగుచున్నది. కనుక నతనివలన నిది ప్రమాణ శ్రుతిగా గ్రహింపబడినది. పూర్వము ఆర్యులు, అనార్యులు అను వారు గ్రామములుగా నేర్పడి, కలిసి జీవించెడి కాలమున నివి వారిచేత నుపయోగింపబడి యుండెడివి. మధ్యమ గ్రామము, షడ్జ గ్రామము అనునవి రెండున్నూ వాటివాటి అంతర నిష్పత్తుల ననుసరించి క్రమముగా నేర్పాటు కాబడి ఉపయోగింప దగినట్టివై యుండగలవు.

మధ్యమ గ్రామ	3 వ పట్టిక
మూర్ఛనలు : అవ	మ, గ, రి, స, ని, ద, ప, మ
రోహణ క్రమములో	మ1, గ1, రి1, స, ని1, ద3, మ4 మ1
నిష్పత్తులు.	4/3, $\frac{32}{27}$, $\frac{10}{9}$, 1, 8/9. 5/6, $\frac{20}{27}$, $\frac{2}{3}$.

దిగువ స్థాయిలోని అంతరముల విలువలు క్రమముగా వాటి యొక్క స్థాయియందలి స్వర నిష్పత్తులలో సగ ములుగా నుండ గలవు. గనుకను 1, $\frac{1}{2} \times \frac{4}{3} = \frac{2}{3}$ (మంద్ర మ1) అని తెలియ వలెను. తక్కిన మూడు నిష్పత్తులను ఇట్లే లభ్యమయ్యెనని తెలియవలెను.

ఇకను మధ్యమ గ్రామమే ఆరోహణ క్రమములో చెప్ప వలయు నప్పుడో నీ దిగువ విధముగా నుండగలవు.

ఆరోహణ క్రమములో మధ్యమ	మ1, (ప)మ4, ద3, ని1, స, రి3 గ1 మ1
గ్రామమూర్ఛన విలువలు.	2/3, $\frac{20}{27}$; 5/6, $\frac{8}{9}$, 1, $\frac{10}{9}$, $\frac{32}{27}$, 4/3

ఈ విస్తృత్తులు షడ్జమము నాధారముగా గొని చెప్పబడి నట్టివి. కాని ఈ గ్రామమునందలి మూర్ఛన షడ్జమముతో ప్రారంభింపబడదు. గనుకను (దిగువ) మధ్యమముతో ($\frac{3}{4}$) ప్రారంభింపబడి మ1 ని ఆధారముగా చేసుకొని లెక్కించుట యుక్తమగును. అనగా మ1 ని ఆధార శ్రుతిగా నొనర్పవలెనని తెలియు నది. కనుక $\frac{3}{4}$ ను $\frac{3}{2}$ చే గుణించినచో ఈ సంయోగైక్యము కలుగును. ఎట్లన : ($\frac{3}{2} \times \frac{3}{2}$=3—1). అందువల్లను ఆయా విలువ లను ప్రతి దానిని మార్పు చేయకుండ నొక్కొక్క దానిని $1\frac{1}{3}$ రెట్లు హెచ్చించవలయును. ఇప్పుడీ క్రింది విధముగా ఆ వరుస క్రమమును వ్రాయునగును—

మధ్యమ గ్రామము—

1 $\frac{10}{9}$, 5/4, $\frac{4}{3}$, $\frac{3}{2}$, 5/3, $\frac{16}{9}$, 2 ఆరోహణ క్రమము.

2, $\frac{16}{9}$, $\frac{5}{3}$, $\frac{3}{2}$, $\frac{4}{3}$, $\frac{5}{4}$, $\frac{10}{9}$, అవరోహణ క్రమము.

మొందటి 3 వ పథకమును బట్టి షడ్జ గ్రామమున ఈ క్రింది విధముగా విస్తృతు లుండగలవు అని మనకు తెలియగలదు.

1, $\frac{10}{9}$, $\frac{32}{27}$, $\frac{4}{3}$, $\frac{3}{2}$, $\frac{5}{3}$, $\frac{16}{9}$, 2 ఆరోహణ క్రమము.

2, $\frac{16}{9}$, $\frac{5}{3}$, $\frac{3}{2}$, $\frac{4}{3}$, $\frac{32}{27}$, $\frac{10}{9}$, 1 అవరోహణ క్రమము.

పూర్వము గ్రామ విధానమువందున పాడుటలో ఆరోహణ క్రమములో గాని, అవరోహణ క్రమములోగాని, ఆ గ్రామము యొక్క స్వరముల నుపయోగించెడివారు. అటు తరువాత అభివృద్ధి ఈ యారోహణావరోహణ క్రమముల నిర్ధారణ యుని మనకు తెలియుగలదు.

మూ ర్ఛ న లు

ఒక గ్రామమునందలి స్వరములను వరుసక్రమములో ఆరోహణావరోహణక్రమమున పాడిన యెడల అది మూర్ఛన యను బడుచున్నది. ప్రతి గ్రామమునకును ఏడేసి మూర్ఛనలు వేర్వేరుగా గలవు. అవి ఎట్లనగా ఆ గ్రామము నందలి అన్ని స్వరములను వరుసగా నొక్కొక్క దానిని షడ్జ మొనర్పుచూ వచ్చిన యెడల వరుసగా ఏడు మూర్ఛనలు రాగలవు. ఈ మూర్ఛనలు చెవులకు వినుటకు ఇంపుగా నుండగలవు. ఇవియే పూర్వమునందు (జాతులు) రాగ రూపములుగా చెప్పనగును.

మధ్యమ గ్రామ మూర్ఛనలు

ఆరోహణ	అవరోహణ
1 మ, ప, ద, ని, స, రి, గ, మ—	మ, గ, రి, స, ని, ధ, ప, మ.
2 ప, ధ, ని, స, రి, గ, మ, ప—	ప, మ, గ, రి, స, ని, ధ, ప.
3 ద, ని, స, రి, గ, మ, ప, ద—	ద, ప, మ, గ, రి, స, ని, ధ.
4 ని, స, రి, గ, మ, ప, ద, ని,—	ని, ద, ప, మ, గ, రి, స, ని.
5 స, రి, గ, మ, ప, ద, ని, స—	స, ని, ద, ప, మ, గ, రి, స.
6 రి, గ, మ, ప, ద, ని, స, రి—	రి, స, ని, ద, ప, మ, గ, రి.
7 గ, మ, ప, ద, ని, స, రి, గ—	గ, రి, స, ని, ద, ప, మ, గ

షడ్జ గ్రామ మూర్ఛనలు ఇటువలెనే వ్రాయునగును. మధ్యమ గ్రామముయొక్క మొదటి మూర్ఛనను ఈ క్రింది విధముగా విస్తృతి విలువలో చెప్పవచ్చును.

ఆరోహణము : 1, $\frac{10}{9}$, $\frac{5}{4}$, $\frac{4}{3}$, $\frac{3}{2}$, $\frac{5}{3}$, $\frac{16}{9}$, 2

అవరోహణము : 2, 16/9, 5/3, 3/2, 4/3, 5/4, $\frac{10}{9}$,

అంతర గాంధారము ఒక్కటి తప్ప మిగిలినవి అన్నియును శుద్ధ స్వరములే యగును. ఆరోహణ క్రమములో రెండవ మూర్ఛనను ఇటువలెనే చెప్పవచ్చును.

(ప) మ4, ద3, ని1, స, రి3, గ1, మ1, (ప) మ4.

$\frac{20}{27}$, $\frac{5}{6}$, $\frac{8}{9}$, 1, 10/9, $\frac{32}{27}$, $\frac{4}{3}$, $\frac{40}{27}$, షడ్జమమును ఆధారశ్రుతిగా

1, 9/8, 6/5, $\frac{27}{20}$, $\frac{3}{2}$, $\frac{8}{5}$, 9/5, 2—$\frac{30}{27}$ ఆధార శ్రుతిగా తీసికొనబడినది.

స, రి4, గ2, మ2, ప, ద2, ని2, స—

మూడవ పథకము చూడదగును.

మిగతా పంద్రెండు మూర్ఛనలు గూడను ఇట్లే కనుగొన వచ్చును. ఈ దిగువను 4 వ పథకములో ఈవిధముగనే అన్ని మూర్ఛనల విలువలున్నూ చూపబడి యున్నవి. వీటిలో నాలుగు మధ్యమ గ్రామముల నుండిన్నీ, మూడు షడ్జ గ్రామముల నుండిన్నీ గుర్తింపబడి యుండినవి. ఇవి ఏడున్నూ చాలా ముఖ్యములైనట్టివి. మిగిలినవి అంతగా ప్రాముఖ్యము నందినవి కావు. ఇవి కొన్ని వేంకటమఖిచే కల్పింపబడిన మేళ కర్తలకు సరిపడగలవు. వాటివాటి యెదుట నాయా మేళకర్త రాగముల పేర్లు ఉదాహరింపబడి యున్నవి. ఈ పేర్లు వేంకటమఖిచెప్పిన మేళకర్తల నామములకు ఇంచుమించుగా సరికాగలవు. కొద్ది భేదము (లేక సందేహము) న్నవాటిని ప్రక్కను ?—ప్రశ్నగురుతుచే గుర్తింపబడి యున్నది. ఈ మేళకర్త నామములకు క్రిందను ఇతర (పాశ్చాత్య) దేశములలోని ఆయా రాగసంబంధములగు ఆయా దేశ నామములు చెప్పబడి యున్నవి గమనింపదగును.

గాంధారము మేచకల్యాణిలోని అంతర గాంధారమున కంటె కొంచెము హెచ్చుగా గలదు కనుక గుర్తింపబడినది.

నాలుగవ పథకము

మధ్యమగ్రామ మూర్ఛనలు	షడ్జగ్రామ మూర్ఛనలు
(1) 1, $\frac{10}{9}$, $\frac{5}{4}$, $\frac{4}{3}$, $\frac{3}{2}$, $\frac{5}{3}$, $\frac{16}{9}$, 2 హరికాంభోజి Mixolydian Scale	1, $\frac{10}{9}$, $\frac{32}{27}$, $\frac{4}{3}$, $\frac{3}{2}$, $\frac{5}{3}$, $\frac{16}{9}$, 2 ఖరహరప్రియ?
(2) 1, $\frac{9}{8}$, $\frac{6}{5}$, $\frac{27}{20}$, $\frac{3}{2}$, $\frac{8}{5}$, $\frac{9}{5}$, 2 షణ్ముఖప్రియ Aedian Scale	1, $\frac{16}{15}$, $\frac{6}{5}$, $\frac{27}{20}$, $\frac{3}{2}$, $\frac{8}{5}$, $\frac{9}{5}$, 2 భవప్రియ
(3) 1, $\frac{16}{15}$, $\frac{6}{5}$, $\frac{4}{3}$, $\frac{64}{45}$, $\frac{8}{5}$, $\frac{16}{9}$, 2	1, $\frac{9}{8}$, $\frac{81}{64}$, $\frac{45}{32}$, $\frac{3}{2}$, $\frac{27}{16}$, $\frac{15}{8}$, 2 (మేచకల్యాణి. Lydian Scale)
(4) 1, $\frac{9}{8}$, $\frac{5}{4}$, $\frac{4}{3}$, $\frac{3}{2}$, $\frac{5}{3}$, $\frac{15}{8}$, 2 శంకరాభరణము. Major Diotoric or Ieouian Scale	1, $\frac{9}{8}$, $\frac{5}{4}$, $\frac{4}{3}$, $\frac{3}{2}$, $\frac{5}{3}$, $\frac{16}{9}$, 2 హరికాంభోజి. Myxolydian Scale,
(5) 1, $\frac{10}{9}$, $\frac{32}{27}$, $\frac{4}{3}$ $\frac{40}{27}$, $\frac{5}{3}$, $\frac{16}{9}$, 2	1, $\frac{10}{9}$ $\frac{32}{27}$, $\frac{4}{3}$. $\frac{40}{27}$, $\frac{128}{81}$ $\frac{16}{9}$, 2 (Docian Scale)
(6) 1, $\frac{16}{15}$, $\frac{6}{5}$, $\frac{4}{3}$, $\frac{3}{2}$, $\frac{8}{5}$, $\frac{9}{5}$, 2 హనుమతోడి. Plerygian Scale	1, $\frac{16}{15}$, $\frac{6}{5}$, $\frac{4}{3}$, $\frac{64}{45}$. $\frac{8}{5}$, $\frac{9}{5}$, 2 హనుమతోడి Plerygian Scale
(7) 1, $\frac{9}{8}$, $\frac{5}{4}$,* $\frac{45}{32}$, $\frac{3}{2}$, $\frac{27}{16}$, $\frac{15}{8}$, 2 మేచకల్యాణి Lydian Scale.	1, $\frac{9}{8}$, $\frac{5}{4}$. $\frac{4}{3}$ $\frac{3}{2}$, $\frac{27}{16}$, $\frac{15}{8}$, 2 శంకరాభరణము. Iouian Scale.

మనము జాగ్రత్తతో ఆలోచించినట్లయిన ప్రతియొక్క గ్రామములోనూ గల మూర్ఛనల యొక్క వ్యక్తిత్వము ఆయా శ్రుతులకు మధ్య నుండెడి అంతరములను బట్టి గుణించినట్లయిన చక్కగా బోధపడగలవు. ఒకదానికొకటి ఏడు మూర్ఛలలో ఎట్లెట్లు సంబంధము గలదో తెలిసికొన నగును. ఎట్లనగా :—[$\frac{10}{9}$, $\frac{5}{4}\times\frac{9}{10}=\frac{9}{8}$] $\frac{4}{3}\times\frac{4}{5}=\frac{16}{15}$ ఈ మొదలుగా తెలిసికొన నగును.

$\frac{10}{9}$ $\frac{9}{8}$, $\frac{16}{15}$, $\frac{9}{8}$, $\frac{10}{9}$, $\frac{16}{15}$, $\frac{9}{8}$ ఇటుల అన్ని అంతరములున్ను వచ్చుచున్నవి.

శ్రుతుల విలువలలో గల వివ్నయ క్రమము—3, 4, 2, 4, 3, 2, 4—మరియొక విశేష మేమనగా—వీటన్నిటిని వరుసగా $\frac{10}{9}\times\frac{9}{8}\ldots\ldots\times\frac{9}{8}=2$ ఇది మొదటిదియు, చివరిదియును అగు అంతరముల మధ్యను గలది. మరియు శ్రుతుల యొక్క మొత్తము $3+4+2+4+3+2+4=22$ అగుచున్నవి. ఇవి యొక స్థాయి యందున గల శ్రుతుల సంఖ్య యగును.

రెండవ మూర్ఛనలో వరుసగా నుండు స్వరముల మధ్య నుండెడి శ్రుత్యంతర విలువలు $\frac{9}{8}$, $\frac{16}{15}$, $\frac{9}{8}$, $\frac{10}{9}$, $\frac{16}{15}$, $\frac{9}{8}$, $\frac{10}{9}$ ఈ వరుసక్రమము ప్రథమ మూర్ఛన నుండియును, రెండవ దానితో ప్రారంభించి మొదట దానిని చివరిదానినిగా చేసినట్లయిన వచ్చుచున్నది. ఇటువలెనే మూడవ మూర్ఛనా క్రమము మూడవ అంతరమగు $\frac{16}{15}$ తో ప్రారంభ మగును. రెండవదియగు $\frac{9}{8}$ తో అంతమగును. ఇట్లే అన్ని మూర్ఛనలకున్నూ వరుసగా తెలియుచునది.

జాతులు

రాగములను పాడునప్పుడు ఆ మూర్ఛన యందలి స్వరముల సంఖ్య ఎల్లప్పుడునూ ఏడుగనే ఉండవలయు ననెడి నియమము కొన్నిటికి మాత్రమే పరిమితముగా గలదు. అవి మేళకర్తలనబడగలవు. మిగతావాటి కన్నిటికిని ఆ నియమము లేదు. కొన్నిటియందు ఏడున్నూ ఉండక ఏవో కొన్ని స్వరములు ఆయా నియమముల ననుసరించి లోపించుచుండగలవు. కొన్ని స్వరములు పాట ప్రారంభించుటకు యుక్తములును, అందములును అయినట్టివి "గ్రహ స్వరములు" అనబడును. అట్లే యా పాటను ఆపుచుండుటకు (అవర్తంతములయందున) మరి కొన్ని స్వరములు "న్యాస స్వరములు" అనునవి గలవు. మరియును ఆ రాగమునకు లేక యా పాటకు చక్కని అందమును చేకూర్చ గలిగినట్టి స్వరములు కొన్ని "అంశ స్వరములు" అనునవి కూడను గలవు. ఇవియే జీవ స్వరములని కూడ పిలువబడగలవు. ఈ స్వర నియమములను, అలంకార విశేషములను అనుసరించి,

నట్టి వానినే చెప్పియుంటిమి. ఇవిగాక నింకను వక్రత్వము గలిగినట్టివియును కొన్ని గలవు. అనగా స్వరముల యొక్క వరుసక్రమమును తప్పించి ముందు వెనుకలుగా స్వర మూర్ఛ నలు కలుగజేయుట మూలముగా కొన్ని రాగములు కలుగు చున్నవి. ఎట్లన : స, రి, గ, ... ఇవి వరుస క్రమములో నుండి యున్నది. వీటిని వక్రము చేసినట్లయిన "స, గ, రి, గ" అని వక్రత్వము కలుగును. ఆరోహణమునందును, అవరో హణము నందునూ (స్వర) వక్రత్వమును కలుగజేసిన యెడల నెన్నియో రాగములు వచ్చుట కవకాశ ముండియున్నది. అందువల్ల రాగములు అసంఖ్యాకములుగా సృష్టింపగలవని చెప్పి యున్నారు "అనంతా వై రాగాః."

ఇటుల సృష్టించుట కవకాశము గల రాగము లన్నింటి లోనూ, చక్కని రంజకత్వము గల వాటిని మాత్రము ఏర్పరచుకొని, కొన్నిటిని విడిచియున్నారు. ఇదియే జనకజన్య రాగముల యొక్క విధానము. ఈ విధానమును "వెంకటమఖి యొక్క జనక—జన్య రాగ విధానము...." అని చెప్పెదరు. ఇట్టి ఈ విధానమే నేటివరకును ఆచరించబడుచు నున్నది. ఇవిగాక ఇంకను రాగాంగ, ఉపాంగ, భాషాంగ, క్రియాంగ, రాగ విధానమని మరియొక విధానము గలదు. ఈ విధానము సుమారుగా క్రీస్తు పూర్వము 10 వ శతాబ్ది కాలమున ప్రచారములో నుండెడిది. "రాగాంగ రాగము"అనగా—జనకరాగముల వంటివని చెప్ప దగును. ఉపాంగరాగము అనగా రాగాంగ రాగముల నుండి జన్య ములైనట్టివియును, తమ జనకరాగము యొక్క స్వరములనే కలిగియుండునట్టివియును అగును. మరియు నింకను ఎక్కు వగా సంగీత కళాభివృద్ధి కొరకై, రంజకత్వ విశేషముల కొరకై కొన్ని జన్య రాగములలో వాటివాటి జనకరాగములయొక్క స్వరములనే గాక ఒక్కొక్కప్పుడు ఇతర రాగములయొక్క స్వరములను ఒకటిగాని, రెంటిని గానీ కలిగియుండునట్టి జన్య రాగములు "భాషాంగరాగములని" పిలువబడుచున్నవి.

పైన చెప్పబడినట్టి రాగములలో కొన్నికొన్నిటివలన కొన్నికొన్ని క్రియలకు అనుకూలత గలుగుచుండుననే కారణ మున అట్టి వానిని "క్రియాంగరాగముల" ని పేర్కొని యుండిరి. ఇట్టివి యుద్ధ వీర, పరాక్రమ, భక్తి వీర, రౌద్ర భావాది క్రియలయందు ఉపయోగించునట్టి రాగములను క్రియాంగరాగములని పేర్కొనిరి.

శుద్ధ సాలగ (ఛాయాలగ) సంకీర్ణరాగ విధానము

ఇట్టి ఈ రాగవిధానము గూడను 10 వ శతాబ్ది కాలమున ఆచరణయం దుండెడిది. పైన వివరింపబడినట్టి విధానమున కంటెనూ ఎక్కువ వాడుకలో నుండి యుండెడిదని చెప్ప వచ్చును. ముందు చెప్పిన రాగాంగ, ఉపాంగములనునవి శుద్ధము లనబడుచున్నవి. ముందు చెప్పబడిన భాషాంగము లనబడు నట్టి రాగములు అనగా తమ జనకరాగ శ్రుతులనే గాక ఇతర రాగ శ్రుతులను రంజనము కొరకై ఒకటి లేక రెండు స్వర ములను గలిగినట్టివియు, ఇతర రాగ ఛ్ఛాయలను విరువు తీసి కొనునట్టివియును అగునట్టి వాటిని "ఛాయాలగములు లేక సాలగ రాగములు" అనుచుండిరి. ఒక నియమమునకు మించి ఒకటి, రెండు గాకను ఎక్కువగా మిశ్రమముగా ఇతర రాగ కళలను స్వరములతో మిశ్రమము లగునట్టి వానిని సంకీర్ణ రాగములనియు, సంకర రాగములనియు పిలువబడు చుండెడివారు.

ఘన, నయ, దేశి రాగవిధానము

కొన్నికొన్ని క్రియాదులలో ఉన్నతాశయముల నిచ్చుట కొరకై పాడెడి పాటలయందు ఉపయోగింపబడునట్టి క్రియాంగములే ఘన రాగములని పేర్కొని యున్నారు. మహా భక్తుడగు త్యాగరాజుగారు ఘనరాగ పంచకము అనునట్టి అయిదు రాగములలో పంచరత్నములు అనునవి రచించియున్నారు. అవి ఏవి యనగా: నాట—(జగదానందకారక), గౌళ—(దుడుకు గల), ఆరభి (సాధించెనే), శ్రీరాగము (ఎందరో మహానుభావులు,) వరాళి (కనకన రుచి) ఈ అయిదింటియందును అయిదు కృతులు చెప్పి భగవంతుని కీర్తించి యుండిరి. ఈ అయిదునూ గాక ఇంకనూ ఐదు ఘనరాగములు గలవు. అవి : కేదార, నారాయణ గౌళ, రతిగౌళ, సారంగనాట, బౌళి అనునవి—అన్నియును ఘన రాగములు 10 గా చెప్పియున్నారు.

రక్తి, నయము, రంజకత్వ విశేషములను కలిగించునట్టివి "నయరాగము" లనబడుచున్నవి. ఇవిగాక కర్ణాటక రాగములు, ఇతరదేశ కళలను అనగా హిందూస్థానీ లేక ఉత్తరదేశ సంగీత విధానము సందలి ఇతర (దేశ) రాగ కళ లను గలిగియుండునట్టివి దేశ్యము లనబడెను.

ఈ విధానము సుమారుగా 13 వ శతాబ్దములో హైందవ సంగీత విధానము, హిందూస్థానీ కర్ణాటకము అని రెండు విధములుగా విభాగ మేర్పడిన యనంతరమున ఆచరణలోనికి వచ్చియుండెను.

స్త్రీ, పురుష, నపుంసక రాగములు

ముందు చెప్పబడినట్టి విధానమున కంటెను ఇది పూర్వపుది అయియున్నది. సుమారు క్రీ. శె. 10 వ శతాబ్ది కాలమున అమలులో నుండియుండెను. ఈ విధానము ఆయా రాగ భావముల ననుసరించియును, వాటివాటియొక్క క్రియా

విశేషములననుసరించియును, ఇటుల పేర్కొనబడుచున్నవి. ఇట్టి వాటిని గురించి కొన్ని కొన్ని రాగములు సంస్కృత శ్లోకములలో పేర్కొనబడి యున్నవి. కొన్ని పురుషరాగము లనియును, కొన్ని స్త్రీ రాగము లనియును, పురుష స్త్రీ రాగములు కానట్టివి కొన్ని నపుంసక రాగము లనియును పేర్కొనబడియుండెను.

పురుషరాగములు, స్త్రీ రాగములు అను వాటిని వరుసగా రాగ, రాగిణిలని పేర్కొనియుండిరి. రాజపుత్ర విధానమునందున ఈ రాగ రాగిణిలను చక్కని బొమ్మల రూపములలో చిత్రించి రూపొందించియుండిరి. వాటిని చూచిన యెడల అందలి విశేషములు మనకు బోధపడగలవు.

మార్గదేశి విధానము

ఇవి కేవలము పూర్వమున వేదగానమునం దుపయోగింప బడెడివి. మార్గ రాగము లనునవి రత్నాకర గ్రంథకర్త (శార్ఙ్గదేవులు) 264 గలవని చెప్పియుండెను. అవి తరువాత వాడుకలో నుండి తొలగిపోయినవని తెలిపియుండెను. మరియు, తన కాలమునాటికి ఉండినట్టి వన్నియునూ దేశి రాగములు అనియే పేర్కొనియుండెను. పైన నుదాహరింపబడినట్టి ఆయిదు విధానములగు రాగము లున్నూ దేశిరాగ సంబంధములేనని చెప్పుదగును. గాంధార, మధ్యమ గ్రామములు రెండును ఎట్లు తొలగిపోయి షడ్జ గ్రామ మొక్కటి మాత్రమే నిలిచియుండెనో అట్లే మార్గ రాగ విధానము మరుగుపడిపోయి ప్రస్తుతమున దేశి రాగ విధానమే నిలిచియుండినది అని తెలియుదగినది.

దేశిరాగ విధానమునకు ఆంధ్రులసేవ

ముందు చెప్పబడినట్టి మార్గదేశి రాగ విధానములలో మార్గరాగ విధానము ఆర్యులకు చెందినట్టిదియును, దేశి విధానము అనార్యులకు చెందినట్టిదిగను చెప్పదగును. ఆయా కాలములయందు ఏ రుభయులున్నూ వారివారి ప్రత్యేక నాగరికతా విధానములతో నివసించియుండిరి. ఏ రుభయులున్నూ ఇటుల కలసి జీవించుచుండుట కొంతకాలము సాగిపోగ క్రమేణా మార్గ విధానము మరుగుపడిపోయి, "దేశి" విధానము ఒక్కటియే రూపొందింపబడి నిలిచి యుండినది. ఈ మార్పు విధానము చారిత్రకముగా నాగరిక విధానము ననుసరించి అనుసరింపబడినది. సుమారుగా 8 వ శతాబ్ది కాలమున జీవించియుండినట్టి మతంగుడు "బృహద్దేశి" యను సంగీత లక్షణ గ్రంథమునందు ఈ దేశి రాగ విధానమును గురించి విశేషముగా చెప్పియున్నాడు. వివిధ దేశస్థులును, వివిధ జాతుల ప్రజలచే అనుష్ఠింపదగినట్టి విధాన మగుటచే "దేశి" అని పేర్కొనబడినట్లుగా చెప్పియుండెను. ఈ దేశి విధానమున చర్చించియుండిన కారణము వల్లనే అతని గ్రంథము "బృహద్దేశి" అని పేర్కొనబడి యుండవచ్చునని కూడ ఊహింపదగియుండును. ఈ దేశి రాగ విధానము ననుసరించినట్టి కొందరిని యాతడు పేర్కొని యున్నాడు. వా రెవ్వరన: నవరులు, పులిందులు, కాంభోజులు, వంగీయులు, కిరాతులు, బాహ్లికులు, ఆంధ్రులు, ద్రావిడులు అను తెగలవారు. వీరు పాడెడి పాట లన్నియును (గామెట్) గ్రామములోని 4 స్వరములను మాత్రమే కలిగియుండెడివనియు, (వీటిని స్వరాంతరము అని పిలచెదరు) ఇవి సంపూర్ణ గానమునకు అనర్హములనియును, అతడు చెప్పియుండెను. ఇట్టివి ఎక్కువగా ధ్రువములు (దరువులు) పాడుట కుపయోగపడునని చెప్పియుండెను. ఇట్టివి నాటకములయం దుపయోగపడును. ఈనాటి కాలమున ఇట్టివి మనము యక్షగానములయందును, వీధినాటకములయందును వినుచుందుము. ఇట్టి వానిని గురించి ప్రబంధాధ్యాయమునందు వివరించియుండెను.

తరువాత శార్ఙ్గదేవుడు మధ్యమ గ్రామమునందలి 11 జాతులను పేర్కొనుటలో "ఆంధ్రి" యొక్కటిగా చెప్పియుండెను. ఈ యాంధ్రి యొక్క విశేషములను రూపొందించుచూ నొక శివస్తోత్రము రూపొందింపబడియుండెను. భరతుడుగూడ "ఆంధ్రి" యను "జాతి" రాగమును పేర్కొనెను.

హిందూదేశ సంగీతమునకు రాగ మనునదియే ప్రాణము. అందు రాగాలాపన విధానము చాలా ప్రాముఖ్యము నందియుండినది. ఇట్టి యీ రాగాలాపన విధానము చక్కగా మూడు స్థాయిలలో నాలాపించుటకు తగినట్టి యవకాశము గలిగి బహు రంజకత్వమును గలిగియుండును. మరియు, ఆరోహణావరోహణములయందు చక్కని సంచారములతోడను, గ్రహ అంశ న్యాస స్వరములతోడను, మరియు ననేకములగు గమకములచేతను అలంకృతమై రంజించుచుండును. గనుక నీ రాగ విధాన మనునది హైందవ సంగీతములోని కళా ప్రాశస్త్య మనియును, సంగీత ప్రపంచమున కంతటికిని మేటి యనియు ప్రశంసింపబడుచున్నది.

పోతన దశమస్కంధ పద్యశాసనము

శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి

శ్రీ చాగంటి శేషయ్యగారు ఆంధ్రకవి తరంగిణిలో: "భాగవత రచనాకాలము నాటి కాతని (పోతన) వయసు 40 సంవత్సరము లుండునని యనుకొనుచో క్రీ. శ. 1490 ప్రాంతమున భాగవతము పుట్టియుండునని నిశ్చయింప వచ్చును. ఎవరెంత ప్రయత్నించినను పోతన జననకాలము 1450—కి వెనుకకు గొంటలేరని ఘంటాపథముగాఁ జెప్పవచ్చును" అని—సూక్ష్మముగా సిద్ధాంతము చేసినారు. కాని, నెల్లూరు జిల్లా శాసనములలో పేర్కొనఁదగిన కందుకూరు తాలూకా (నెం. 26) గుండ్లపాలెము శాసనమందలి 'దశమస్కంధ' పద్యములను గుర్తించి, శాసన కాలదోషము సవరించుటకు శ్రీ చాగంటివారు గాని, 'పోతన'లో శ్రీ నిడదవోలువారు గాని, ప్రయత్నించలేదు. కావున ఇప్పుడా లోటు తీర్చుట దోషముకాదు.

".... వి (పి) రుల మహత్వం ఆదిపర్వ సకలభూత సంభవ అనుశాసనీక భాగవత దశమస్కంధ మపుసలాన వెల్లిన శాస్త్ర ధర్మార్థ మిది ...."

ఈ సూచన గుండ్లపాలెం శాసనములోనిది. పోల్చి చూడగా దీనిలో ఆదిపర్వములోని నన్నయ భారత వచనము, (3—ఆ, 87— వ) మౌసలపర్వములోని తిక్కన భారత సీసము (1—ఆ, 95 వ), పోతన భాగవత దశమస్కంధము లోని పద్య గద్యములు (పూర్వ భాగములోనివి) అక్కడక్కడ సమయానుకూలముగా నోటికి వచ్చినట్లెల్ల చేర్చి, చెక్కించినట్లు కనబడుచున్నది. కాబట్టి గుండ్లపాలెమున 'ఉద్ధరించిన శాసనము' కాలము నిర్ణయ మగుచో పోతన భాగవత రచనా కాలము నిశ్చయమైనట్లు భావింప వీలున్నది.

"స్వస్తిశ్రీ శాలివాన శకవర్షంబ్బులు 1120 అగునేంటి కాళయుక్తి సంవత్సర కార్తిక శు ౫ గు నెల్లూరి నలసిద్ధి రాజు సర్వసే (స) న్నాహము మెరసి యరగడ్డ పాటికి నెత్తివచ్చెను.......యాదవులు నల సిద్ధిం గూడి యుద్ధముచేసి మృతులైరి. .... స్తానం కొండయ్యకొడుకు రామయ్య వుద్ధ రించిన శాసనం."

పై గుండ్లపాలెం శాసనములో పేర్కొన్న శకవర్ష సంఖ్య 10 సంవత్సరముల కాలదోషముతోనో, అంతకంటె ఎక్కువ సంవత్సరముల కాలదోషముతోనో చెక్కింపబడినట్లు చెప్పకతప్పదు.

ఇందలి కాటమరాజు ఆవుల పుల్లరి యుద్ధకాలము సరియైనది కాదనుట నిజమైనను, ఆ చర్చ కిచ్చట తావులేదు. అద్దైనను శా. శ. 1180 అగుకాళయుక్తి అధిక కార్తిక శు 5 గురువార మనగా 3—10—1258 తేదీ గురువారముతో సమకాల మగుచున్నది. నిజ కార్తిక శు 5 శని వార మగుచున్నదే కాని, గురువార మగుటలేదు. కావున, అది గుండ్లపాలెం శాసనోద్ధరణ కాలము కాదన్నను, స్థూలముగా కాటమరాజు పుల్లరి యుద్ధకాలము కాబోలన వీలున్నది.

శక సంవత్సరములు మారినను, అధిక మాసము మారినను కాళయుక్తి కార్తిక శు 5 గురువారమునా డెప్పుడో ఈ గుండ్లపాలెము శాసనము చెక్కింపబడినట్లు తలంచినచో పంచాంగ ప్రకార మది శా. శ. 1360 అగు కాళయుక్తి కార్తిక శు 5 గురువారము—శాసనోద్ధరణ కాలము—అగుచున్నది. అప్పుడు 23—10—1438 తేది గురువార మీ శాసన సమ కాల మగుచున్నది. దీని తర్వాత 60 ఏండ్లనాటి కాళ యుక్తిలో కూడ సమకాలము సమన్వయ మగుటలేదు. 19—10—1498 తేది శా. శ. 1420 లో శుక్రవార మగు చున్నదే కాని, గురువార మగుటలేదు. అందువల్ల శా. శ.1360

అగు కాళయుక్తి సమకాలములో ఈ శాసనము చెక్కింప బడినట్లు స్థిరపడుచున్నది.

23—10—1438 తేదీ గురువారమునాటికే పోతన భాగవత దశమస్కంధ పద్యములు నెల్లూరు పాకనాటిలో ప్రచారమున నున్నట్లు శాసనోద్ధారణ పద్య గద్యములు చాటు చున్నవి.

గుండ్లపాలెము శాసనమందలి పోతన భాగవత కాలమును బలపరచుటకు బమ్మెర వంశ పురుషాంతర కాలము తోడ్పడు చున్నది.

బమ్మెర జంటకవులు రచించిన విఘ్న భజనానంద గద్యములో క్రింది వంశ వృక్షము చెప్పబడినది.

పోతయామాత్యుడు
(1420—50)
|
— — —
(1450—80)
|
(మ) ల్లయామాత్యుడు
(1480—1510)
|
ప్రౌఢ సరస్వతి
(1510—40)
|
కేసకవి — మల్లకవి
(1540—43)

గోలకొండ రాజ్య స్థాపకుడగు కులీ కుతుబ్‌శాహ కాలము (క్రీ. శ. 1512—43) లో బమ్మెర పోతరాజు ముది—ముది మనుమలు విఘ్నభజనానందము రచించి, పెనుమెప్ప వార భూపతి కంకితమిచ్చినట్లు "కతుపశాహ భూప కుంజరుచేఁ దారిచొకట్లు .... సరవి నందె" అను సమకాల చరిత్ర తెల్పు చున్నది.

గురుజాల మల్లన సోమయాజి కంకితమిచ్చిన దాక్షాయణీ పరిణయ మందలి కవి స్తుతిలో బమ్మెర కేసకవి—మల్లకవి వాచ్యముగా "మత్పితామహుని బమ్మెర పోతన ...... పుతింతు మెప్పుదున్" అని చెప్పుకొన్నను, ఈ బమ్మెర జంట కవులే విఘ్న భజనానంద గద్యములో చెప్పుకొన్న మీది వంశ వృక్షము ముత్తాతయనియే వివరించుచున్నది. స్థూలముగా మా ముత్తాతలలో తాత యున్నట్లు లెక్కింపక తప్పదు.

"బమ్మెర కుల పవిత్ర కౌండిన్యముని గోత్ర పోతయామాత్య పౌత్రయు (మ) ల్లయామాత్య ...." అనుటచేత పోతన కొడుకుపే రేదో తెలియుటలేదు.

పోతన శ్రీనాథుల బంధుత్వమే నెల్లూరు పాకనాటిలో—అతి శీఘ్రముగా—పోతన భాగవత వ్యాప్తికి కారణమై యుండ వచ్చును. శ్రీనాథకవి నెల్లూరు "పాకనా టింటివాఁడు" అనుట "బాంధవ" చరిత్ర సమ్మతము.

దేశదిమ్మరి శ్రీనాథకవియే పోతన భాగవత గ్రంథమును సంపాదించి నెల్లూరు పాకనాటి బంధుకోటికి పంచిపెట్టి నట్లు సమన్వయముచేయ వీలున్నది. అందువల్లనే కందుకూరు పాకనాటి శాసనములోని కా దశమస్కంధ పద్యములు ఎక్కినవి కాబోలు!

క్రీ. శ. 1425—38 మధ్యకాలమునాటికే దేశవ్యాప్తి నొందిన పోతన భాగవతమును క్రీ. శ. 1425—75 మధ్య కాలములో ఇమ్మడి సర్వజ్ఞ సింగమ నాయకుడు పాతిపెట్టించి నను ప్రయోజనములేదు. కాబట్టి, పోతన—సర్వజ్ఞులు సమ కాలికు లైనను, శత్రువులుకారు, భోగినీ దండకమునాటి మిత్రులే యగుదురు.

"ఈ (రావు) వంశీయులలో ముప్వురు రాజులు సర్వజ్ఞ సింగముఁడను పేరుతో నున్నను, మదంతావనీనాథ సోదరుఁడౌ భోగినీదండక కృతిపతి గావునను, నాతఁడు క్రీ. శ. 1430—70 ప్రాంతములు బరిపాలించెఁ గావునను, నీ కృతి క్రీ. శ. 1430 కి తరువాత పుట్టియుండునని నిశ్చయింపవచ్చును.

"ఆంధ్రవాఙ్మయమున విశిష్టమైన శాఖలలో 'దండక ములు' అను శాఖ యొకటి ..... ఈ దండక శాఖలో పోతన భోగినీదండకమునకు నొక విశిష్టస్థాన మున్నది. ప్రాధాన్య తయు నున్నది." —శ్రీ నిడదవోలు వేంకటరావుగారి పోతన.

ఇక్కడొక సందేహము పుట్టుచున్నది. క్రీ. శ. 1425—30 మధ్యకాలములో పోతన భోగినీ దండకమును వ్రాసిన పిమ్మట క్రీ. శ. 1430—38 ప్రాంతమున భాగవతమును వ్రాసినట్లు తలచినచో క్రీ. శ. 1438 తేది పాకనాటి శాసన ములో పోతన దశమస్కంధ పద్యములు చేర్చి, చెక్కించుటకు ప్రచార కాల వ్యవధి చాలదు. కాగా, అంతకు పూర్వమే భోగినీ దండక రచన ముగిసినట్లు స్పష్టమగుచున్నది.

"ఇక భాగవత రచన పూర్తియైన కాలము గూడ సూక్ష్మముగా నిర్ణయింపవచ్చును.

"శ్రీనాథునికి పోతనకు సంబంధించిన కథలలో గజేంద్ర మోక్షములోని 'సిరికింజెప్పడు' అన్న పద్యము ప్రసక్తమైనది. అది భాగవతము అష్టమ స్కంధములో నున్నది. అనఁగా క్రీ. శ. 1440 ప్రాంతములో పోతన అష్టమ స్కంధము గూడ రచించెనని మన మూహింపవచ్చును. ఏలననగా, శ్రీనాథుని

చరమకాలము క్రీ. శ. 1450 ప్రాంతమని చారిత్రిక విమర్శకుల నిర్ణయము. (పోతన) భాగవత రచన క్రీ. శ. 1460—70 ప్రాంతములో పూర్తి యైనట్లు మనము నిర్ణయింపవచ్చును." —శ్రీ నిడదవోలు వారి పోతన.

ఈ యూహ పోతన దశమస్కంధ పద్య శాసన కాలముతో కలియుటలేదు. క్రీ. శ. 1438 శాశయుక్తి నాటికే పోతన దశమస్కంధము దూరదేశములో ప్రచారమందున్నది.

శాసనోదాహరణ పద్యములు వచనములో చేరియున్నవి. తప్పులు తెలియుటకు పోలిక పద్యములు చూపబడినవి.

'భాగవత దశమస్కంధ' గద్య-పద్యములు

"…. యదుకులాత్మజుండు యాత్రియగోత్రజుండు అనూరూనుండును వాండు మధురాపురంబ్బుందనకు రాజధానిగా మధురంబులు మూరసేనంబు లవియెడి దేశం లేలె పూర్వకాలమున అనూరునికి పుత్రుం వసుదేవుండు అచట."

"వ. ….. అంత యదువిభుండయిన శూరసేనుండను వాఁడు మధురాపురంబు దనకు రాజధానిగా మాథురంబులు శూరసేనంబు లనియెడి దేశంబు లేలెం బూర్వకాలంబున—(స్కం. 10 పూ. 18 వ)

సీ. ఆ శూరసేనున కాత్మజం—డగు వసుదేవుఁ
డా పురి . . . . . . "
—(స్కం 10—పూ 29 వ)

*   *   *

"సీ రాజేంద్ర విమతొర్బి—రాజ లాంచ్ఛనంతో
వేల సంఖ్యలు దైత్య—విభులుం దన్ను
అక్రమించిన భూమి భార—మానం జాలక
గో రూపయై బ్రహ్మం—జేరంబోయి
కన్నీరు మున్నీరు—రోదనము శాయ
కరుణతో భావిండి—కమలభవుండు
ధరణి నూరడం బల్కి—ధాత్రియును వేల్పులు
కదలిరా విష్ణువిం—గాన వెంగి
పురుష సూక్తంబు చదివి య—ద్భుద సమాధి
నుండి యొకమాట విని వారి—జోద్భవుండ్ను
వినుండు వేల్పులు ధరయును నే—విన్న యెట్టి
పలుకు వివరించెదనని ప్రీతిం—బలికెం దెలియ.

సీ. రాజేంద్ర విమతొర్బి—రాజలాంఛనముల
వేల సంఖ్యల దైత్య—విభులు దన్ను
నాక్రమించిన భార—మాఁగఁ జాలక భూమి
గో రూపయై బ్రహ్మ—జేరబోయి
కన్నీరు మున్నీరు—గా రోదనము సేయఁ
గరుణతో భావించి—కమలభవుఁడు
ధరణి నూఱడబల్కి—ధాత్రియు వేల్పులు
గదలిరా విష్ణుని—గాన వేఁగి
పురుష సూక్తంబుఁ జదివి య—ద్భుత సమాధి
నుండి యొక మాట విని వారి—జోద్భవుండు
వినుఁడు వేల్పులు ధరయు నే—విన్న యట్టి
పలుకు వివరింతునని ప్రీతిఁ—బలికెఁ దెలియ.
(………)
—(స్క. 10. పూ 14 వ)

*   *   *

"యాదవకులమున నమరులు
మెదినిపైం బుట్టం జనుండు—మీ యంశమునన్
శ్రీ దైత్యుండు వసుదేవున
కాదరమునం బుట్టె భార—మంత్రయుం బాపుమ."

క. యాదవ కులమున నమరులు
మేదినిపై బుట్ట జనుడు—మీ యంశములన్
శ్రీదయితుడు వసుదేవున
కాదరమున బుట్టి భార—మంతయు బాపున్
—(స్కం. 10 పూ. 15 వ)

*   *   *   *

"హరి పూజాతర్కర పుట్టుండు
సురకన్యలు భూమియందు—సుందరతనులై
హరి కగ్రజుండై శేషుండు
హరి కళతూంబుట్టి భార—మంతయుం బాపుమ"

క. హరి పూజార్థము పుట్టుడు
సుర కన్యలు భూమియందు—సుందరతనులై
హరి కగ్రజుడై శేషుడు
హరి కళతో బుట్టు దత్రి—యారంభుండై
—(స్కం. 10 పూ. 16 వ.)

*   *   *

"వ. ….యదు వంశమునకు భయంబ్బు దొలగునని శ్రీ మూర్తుర్లున్ యోగ మాయాదేవిని ఇట్లనిరి."

వ. …..హరిదన్ను నమ్మినయదువులకు గంసునివలన భయంబు గలుగునని ఎరింగి యోగమాయాదేవి కిట్లనియె.
—(స్కం. 10 పూ. 58 వ)

*   *   *   *

"గోపికా జనములు—గోపాలకులుంన్న
పసుల మంద్దకునేంగు—భద్రదీవు
వసుదేవ నందములకుగభా పుత్రికలై"

సీ. గోపికా జనములు గోపాలకులునున్న
పసుల మందకు బొమ్మ భద్ర నీవు
వసుదేవు భార్యలు—వరుస గంనునివేత

—(స్కం. 10 పు. 59 ప.)

* * * *

"నానా విధ సంపదలకు
స్థానకమై (............)
మానవులు భక్తిం గొలుతురు
కానుకలును బలులనిచ్చి"

క. నానావిధ సంపదలకు
దానకమై సర్వ కామ—దాయినివగు నిన్
మానవులు భక్తి గొలుతురు
కానికలును బలుల నిచ్చి—కల్యాణమయీ

—(స్కం. 10 పు 60 ప.)

"పద్దెనిమిది నామంబ్బుల గొనియాడుదురు ఇయ్యాస్థ
నంబులు ఎరింగించవు మి........"

ఓ * * *

వ. ....పదునాలుగు నామంబులం గొనియాడుదురయ్యె్య
స్థానంబుల యందని యెరింగించి.........పొమ్మనియె...........

—స్కం. (10 పు. 61 వ)

పై పోతన దశమ స్కంధ పద్యోదాహరణలనుబట్టి 23—10—1438 గురువారము నాటి గుండ్లపాలెం శాసన కాలమునకు పూర్వమే పోతన భాగవత రచన పరిసమాప్తమై దూర దేశములో సైతము కంఠస్థమై ప్రచారమునందున్నట్లు స్పష్టమగుచున్నది.

చాంద్రమాన సంవత్సర మాస పక్ష తిథి వారముల కల యికనుబట్టి శకవర్ష సంఖ్యాదోషమును సవరించుట కాల దోషముకాదు. అందులో ఉభయ తారకముగా చెప్పి, ఉద్ధ రించిన శాసనము కనుక దానిలో శక సంఖ్యా దోషము ఉండక తప్పదు. అధిక మాస చమత్కారము దోషముకాదు. కాగా, శా. శ. 1360 వర్షంబులగు నేటి కాళయుక్తి సంవత్సర కార్తిక శుద్ధ పంచమి గురువారము (23—10—1438) తేదిన నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకా గుండ్లపాలెం శాసనము చెక్కింపబడినట్లు స్పష్టమగుచున్నది. పోతన భాగ వత రచనా కాల నిర్ణయమున కింతకంటే ప్రబలాధారము చిక్కలేదు.

ఇక పోతన భోగినీ దండకమును రచించెనా? సర్వ జ్ఞ సింగమ ప్రభువును బోతనయు నేకకాలమువారా? పోతనా మాత్యుడును శ్రీనాథుడును బావమరుదులా! పోతన శ్రీనాథుని కాలము వాడగునో కాదో?—మొదలగు జిజ్ఞాసలకీ పోతన దశమ స్కంధ పద్య శాసన కాలము సాధనమగునేమో చారిత్రక విమర్శకులు నిర్ణయించవలసియున్నది.

"ఎవరెంత ప్రయత్నించినను బోతన జననము క్రీ. శ. 1450 కి వెనుకకు గెంటలేరని ఘంటాపథముగా జెప్పవచ్చు." ననుట క్రీ. శ. 1438 కాళయుక్తి శాసన పద్యోదాహరణ సమ్మతము కాదు. అప్పటికే పోతన దశమ స్కంధకవియని మరచిపోరాదు.

ప్రబంధము, కావ్యము భిన్నములే!

శ్రీ కండల గంగినీడు

"హంసదౌత్యము" వ్యాసమును సాకల్యముగా చదివిన వారిలో నేను ఒకడిని. దానిమీద ఏప్రిల్ నెల భారతిపత్రికలో అచ్చయిన శ్రీ వెంచు సుబ్బయ్యగారి ఆక్షేపమునుగూడ సాకల్య ముగా చదివిన వారిలోను ఒకడిని. అందువలననే దానిమీద రెండుమాటలు వ్రాయ బుద్ధి వేసినది.

శ్రీ వెంచు సుబ్బయ్యగారు ప్రారంభముననే "వ్యాసమ్ము జదివి చాల ఆశ్చర్యము నొందితిని" అనివ్రాసిరి. వారి చర్చ జది విన నాకును ఆశ్చర్యమే కలిగినది. ఎందుకనగా అందులో వారి ఆవేశమే తప్ప ఆలోచన, సహృదయత లోపించినవనుటకు చిం తించుచున్నాను.

ప్రబంధము, కావ్యము భిన్నములా? ఏకములా? అన్నదే శ్రీ వెంచు సుబ్బయ్యగారి సమస్య! ఆంధ్రసాహిత్యము తరచిన వారికి యీసందేహమసలు కలుగుటకే అస్కారములేదు. కార ణమేమన, సంస్కృతసారస్వతముననే ప్రబంధము, కావ్యము

పర్యాయపదములు. ప్రాచీనాంధ్రకవులును వానిని పర్యాయ పదములుగనే ఉపయోగించుకొనిరి. కాని పిమ్మట రానురాను అదివేరు యిదివేరుగనే పరిగణింపబడినవి. "ప్రబంధము—ఉత్పత్తి" అను శీర్షికతో శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు చెప్పినది శ్రీ చెంచు సుబ్బయ్యగారి సందేహమునకు జవాబు. కాని ఇక్కడ అవసరమనిపించు దానితో కొంతభాగము ఉట్టంకించు చున్నాను.

1"తిక్కనాది ప్రాచీన మహాకవులు ప్రబంధాన్ని విపులార్థంతో స్వీకరిస్తే, ఆంధ్రలాక్షణికులు పరిమితార్థంలోనే స్వీకరించారు. కాలక్రమేణా ప్రబంధము ఒకప్రత్యేక ప్రక్రియగా పరిగణింపబడ్డది. అయినప్పటికి దీనికి సాకల్యముగా లక్షణము చెప్పిన లాక్షణికుడే లేడు. దాని స్వరూపం సంపూర్ణంగా తెలిసికోవాలీ అంటే ప్రబంధనామంతో వెలువడ్డ గ్రంధాలన్నిటిని సమగ్రంగా పరిశీలించి, వాటిలో ఉన్న సామాన్య లక్షణాలన్నింటినీ సమగ్రంగా క్రోడీకరించాలి. అలా క్రోడీకరిస్తే తేలే లక్షణసారం యీవిధంగా ఉంటుంది.

"ప్రబంధములలో శృంగారరసం ప్రధానం. తక్కిన రసాలు గౌణములు. ఏకనాయకాశ్రయత్వంతోబాటు వస్త్వైక్యంకూడ ఒక అపరిహార్యమైన ధర్మము. మరి అగ్రంధం అష్టాదశవర్ణనాత్మకమై ఉండాలి. ఆలంకారికమైన శైలి దానికి జీవం. మరి అది భాషాంతరీకరణం కాకూడదు. స్వతంత్రరచనై ఉండాలి. అంటే కథైక్యమూ, పాత్ర చిత్రణమూ కలిగి, అష్టాదశవర్ణన శోభితమై శృంగార రసప్రధానమై అర్థాతిశాయి అయిన శబ్దాలతో అలంకారిక సాంకేతికములకు విధేయమై అనతి విస్తృతమయిన ఇతివృత్తము గలిగి భాషాంతీకరణమునకు భిన్నమైన స్వతంత్రరచన ప్రబంధమవుతుంది. ఈ లక్షణాలు కొన్ని ప్రబంధాలకు పట్టకపోవచ్చును. అయినప్పటికీ స్వతంత్రరచనయై ఆలంకారిక శైలి ఉంటే అది ప్రబంధ శాఖలోనే చేర్చబడ్డది".

ఇంతయే కాదు. ఈవిషయము వింకను విపులముగా నెరుంగవలెనన్న శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి "ఆంధ్రకవిత—ప్రబంధయుగము" అను వ్యాసమును చదువవలెను. "ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహము" న "తృతీయఖండము—కావ్యప్రబంధ కవిత్వము" భాగమును చదువవలెను. ఇంకను అనేకులు పెద్దలు దీనిని గురించి మరింత విపులముగా చర్చించి యున్నారు. దానినంతయు పరిశీలించక కావ్యము, ప్రబంధము అభిన్నములేయన్న సరిపోవునా? అవి రెండును పర్యాయపదములే యనుటకు శ్రీ చెంచు సుబ్బయ్యగారు మిగులశ్రమపడి కావ్యములనుండియు, పండితులనుండియు ప్రమాణములను చూపి యున్నారు. ఈ విషయము నెవ్వ రెరుంగరు?

"ఇది (నైషధము) ప్రౌఢ కావ్యమనియే ఎన్నబడుచున్నదిగాని, ప్రౌఢప్రబంధమని చెప్పబడుట లేదు" ఇవి శ్రీ చెంచు సుబ్బయ్యగారి మాటలు. ఇంతవరకు ప్రబంధము—కావ్యము అభిన్నములేయని వాదించుచు వచ్చినవారు అవి రెండును భిన్నములేనని చెప్పక చెప్పినట్లైనది. మొట్టమొదట ఈ చర్చలో ఆలోచన లేదంటిని. ఆ మాటకు ఇదిగో ఇదొక ఉదాహరణ. ఇట్లు స్వవచన వ్యాఘాతము వీరి యీచిన్న విమర్శలోనే జరిగియున్నది. ఎదుటివారిని పరిహసింప నేర్చినవారు తమవీపు మీది మచ్చల నెఱ్ఱుంగగలరు.

ఆంధ్రనైషధము కావ్యమా, ప్రబంధమా? అను విషయమున శ్రీ గంగాధరంగారు "కోమటి మధ్యస్థము" చేసిరని చర్చకర్తయొక్క ఆరోపణ. కోమటి మధ్యస్థమనగా ఎటూ తేల్చలేకుండుట గదా? పైనుదాహరించిన శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారి ప్రబంధ లక్షణములలో "భాషాంతరీకరణ"2 దోషమొక్కటియే ఆంధ్రనైషధమును ప్రబంధ శ్రేణినుండి కావ్యశ్రేణిలోనికి గెంటుచున్నది. ఆ ఒక్క దోషమున్నను అది ప్రబంధముగానే పరిగణింపబడినదని వ్యాసకర్త నిర్ణయించిరి. ఇందులకు రెండు నిదర్శనములనుగూడ ఒసంగియున్నారు. ఇందులకు రెండు నిదర్శనము లెందు కని మొట్టమొదట నేనునూ వ్యాసకర్తను అపార్థము చేసికొంటిని. కాని ఆలోచింపగా వ్యాసకర్త లౌకికమునకు, దూరదృష్టికి ఈ ఒక్క సందర్భమే నిదర్శనము చాలుననిపించినది. నేను దానిని గురించి వివరించుటకు ముందు వ్యాసకర్తయొక్క మాటలు చిత్తగింపుడు. "శ్రీనాధుని శృంగార నైషధము ప్రబంధమా? కావ్యమా? అనునదే సమస్య!—పరిశీలించిన నైషధమును ప్రబంధముగా లెక్కించుటకు 'అనువాద' మను వాటంక మొక్కటియే అడ్డపడుచున్నది. తక్కినదంతయు ప్రబంధ స్వరూపమే! ఒక చేయి లోపించినంతనే వానిని మనిషియే కాదందుమా? 'ఏకోహి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః' అన్నట్లు ఆంధ్రనైషధము ప్రబంధముగానే లెక్కింపబడినది."

"ఆంధ్రనైషధము ప్రబంధముగానే లెక్కింపబడినది" ఈ మాటలో 'కోమటి మధ్యస్థ' మున్నదా? శ్రీ చెంచుసుబ్బయ్యగారికి 'ఉపాధ్యాయుడు బాలురకువలె' ఇంకను ఎంత నొక్కి చెప్పవలయునో తెలియకున్నది. 'ఆంధ్రనైషధము ప్రబంధమే' అనువాక్యమే వ్యాసమంతయు నింపియుండిన బాగుండెడిదేమో?

---

1. శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారి "నా రేడియో ప్రసంగాలు" అనే సంపుటలో 94వ పేజీ చూడండి.

2. ఇక్కడ దోషము, దోషముకాదనుట విజ్ఞులెరుంగుదురు గాక!

అది వారికే వదలుడము. వ్యాసకర్త ప్రతిభయెంతటిదో ఈ ఒక్క వాక్యమువలననే వ్యక్తమగు చున్నదంటిని. అదియేదో నాకు తెలిసినంతవరకు వివరించెదను. ఆంధ్రనైషధము ప్రబంధ మనుటకు (1) ఒక వేయి లోపించినంతనే వానిని మనిషియే కాదందుమా? (2) కవికుల తిలకుని సూక్తిని నిదర్శనముగా నొసంగియున్నారు. వీనిలో మొదటిది ప్రజాబాహుళ్యమునకు సంబంధించినది. దార్ష్టాంతికవచనము. ఈ వచనము సర్వ జనాంగీకృతము. సహృదయులైన వారికందరికీ ఇదియే సమాధానము. దీనినిగూడా అంగీకరించని కొందరు పండితు లుండ వచ్చునేమో యనుకొని అందుకై కవికులతిలకుని సూక్తిని ఉదాహరించి మైలురాయివలె ప్రతిష్ఠింప జేసినారు. కవి పండిత లోకము కాళిదాసు మాటను దాటి పోదు గదా!

నైషధము కావ్యమే కావచ్చు. అయినందువలననే ఆంధ్రమున అది కావ్యముకన్న ప్రబంధముగా గ్రహించుటయే మేలు రమని వ్యాసకర్త సూచించినారు. శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారు కూడ ఈయభిప్రాయమునే వెలిబుచ్చియున్నారు. "ప్రబంధ కవికులానికి మూలపురుషుడు శ్రీనాథుడు. కవిసార్వభౌముని శృంగారనైషధము ఆంధ్రప్రబంధాలన్నింటికిని మేలుబంతి" అని.

"భిన్నహస్తకౌశలము చూపించదలచినవారు హర్ష శ్రీనాథుల హంసదౌత్యకౌశలమే చూపవచ్చును గదా!" వ్యాసకర్త మీద చర్చకర్త విసురు — ఇదీ ఒక అభియోగమే! శ్రీనాథుని అనువాద మే పద్ధతికి చెందినదో ఎరిగియుండినచో శ్రీ చెంచు సుబ్బయ్యగారు ఆమాట అనియుండరు. వారి మతము ప్రకారము వ్యాసకర్త అమాయకుడై వ్యాసమున కుపక్రమించి యుండిన వింతగనే యుండెడిది. హర్షునిహంస సంస్కృతమున మాట్లాడిన మాటలే గదా శ్రీనాథుని హంస తెనిగించినది. "అది సంస్కృతమున బాగుగా పలికినది. ఇది తెలుగున బాగుగా పలుకలేదు. ఇది ఆంధ్రమున మధురముగా పలికినది. అది గీర్వాణమున మధురముగా పలుకలేదు." అనియే గదా వీటిరెంటి భేదములు వ్రాసిన, వ్రాయువలెను. వ్యాసకర్త హంసలలోని సమస్తత్వమును, గుణసాదృశ్యమును మాత్రమే పరిశీలించినారని తెలిసికొని యున్నచో శ్రీ చెంచు సుబ్బయ్యగారి కింత క్లేశము సంభవించి యుండెడిదికాదు.

"రెండు కావ్యములందును హంసలు భిన్నములు. ఒకటి హంస. ఒకట హంసి" అని వ్యాసకర్తగారే సెలవిచ్చినారు. "కథలేను భిన్నములు" కాదని యెవరన్నారు?" కవులు భిన్నులు —కాలమును భిన్నము" ఈభిన్నదశను వ్యాసకర్త ఆకవుల కావ్యములయందలి ఒక సంఘటనతో పోల్చి సుందరముగా నిరూపించి, లోకసత్యము నొకదానిని గూడ నిపుణముగా ప్రకటించియున్నారు. ఇక్కడగూడ వ్యాసకర్త నైపుణ్యమొకటి గలదు. "ఇక్కడే నైషధకవి వ్యక్తిత్వము, పద్యమ్నుకవి వ్యక్తిత్వము ప్రదర్శితమగుచున్నది. కాని, సూక్ష్మముగా పరిశీలించినచో కవులకాలము, వ్యక్తిత్వము భిన్నమైనను సర్వకాలీన సత్యమొకదానిని వెల్లడించుచున్నారను రహస్యముగూడ అంతు పట్టగలదు." ఇవి వ్యాసకర్త అయిన శ్రీ నూతలపాట గంగాధరంగారి మాటలు. నైషధకవి అన్నాడుగాని హర్షకవి అనిగాని, శ్రీనాథకవియనిగాని అనలేదు. మరియు నైషధమునకు పూర్వము ఆంధ్రగీర్వాణములలో దేనిని విశేషణముగా తగిలించ లేదు. దీనివలన నైషధకర్త లిరువురికి ఈమాటలు అన్వ యించుచున్నవి.

"ఈవిచారము అవిచారకము చేసి, దృష్టినొక్కమారు పింగళి సూరననైపు మరల్చినారు....వెంటనే హంసదౌత్యము తలపునకు వచ్చినదేమో!"— తలపునకు వచ్చుటేమి? శీర్షికే హంసదౌత్యమైనయెడల! వ్యాసకర్తగారు వ్యాసముయొక్క ఆద్యంతములు చర్చకర్త ఊహించునట్లు అనవసరముగా విస్తరించలేదు. దానిలో నెంతయో సారస్యమున్నది. శ్రీ గంగాధరము గారు వినమ్రతతో వ్యాసమును ప్రారంభించిరో, అనమ్రకు పరిష్కారసూచకమైన వివరణతో వ్యాసమును ముగించినారు. ఏనాటకమైనను గానిండు, దానిలోని నాంది భరతవాక్యము లొక యెత్తు, తక్కిన నాటకమంతయు ఒకయెత్తు! అట్టి నాందీవాక్యము ఈవ్యాసమునకు గలదు. ఫలదాయకమైన భరతవాక్యము వంటి వాక్యముగూడ ఈవ్యాసమున నున్నది.

మరియొక విశేషము! వ్యాసమును మర్త్యభూమి వాతావరణముతో ప్రారంభించి, పాఠకుని దివ్యభూముల వాతావరణమునకు కొనిపోయి, పాఠకుడు అచ్చట మధురస్మృతులలో విహరించుచుండగా వ్యాసకర్త భరతవాక్యమును పలుకుచున్నారు.

"అయినను మనమిచ్చు తాత్కాలిక సింహాసనములో వారి కేల?" అనిన శ్రీ చెంచు సుబ్బయ్యగారే శ్రీనాథునికి చచ్చు సింహాసనమును వేయ సాహసించినారు, పాపం!

అప్పకవి ఇంటిపేరు

ఏప్రిల్‌నెల భారతిలో అప్పకవి పూర్వికుల నివాసమును గురించి వ్యాసము చదివితిని. ఈతని ఇంటిపేరు 'కాకునూరి'. ఇతడు తన గ్రంథ పీఠికలో కర్తృవంశావతార వర్ణనమున తన పూర్వికులను గూర్చి తన పితామహునికి ప్రపితామహుని వద్దనుండి తనవరకు క్లుప్తముగ చెప్పికొనెను. భరద్వాజ మౌనీంద్రుని గోత్రమున నుద్భవించిన అతని తాతకు

తాతయగువాని తండ్రిపేరు తిమ్మనయని తెలియుచున్నది. కాని వీరి వంశమున సుప్రసిద్ధుడైనవాడు సోమయాహ్వయుడు. తిమ్మన ఇంటిపే రేదియో తెలియరాదు. సోమనను మాత్రము 'కాకునూరి ఘనుడ'ని వర్ణించినాడు. మరియు పీఠిక 72 పద్యమున నిట్లు కలదు :

> "అతడు మధురను బుధ సమూహముల దొడరి
> వేద శాస్త్ర పురాణాది వాదములను
> గాకు నూరింటి జేసిన కారణమున
> గాకునూరింటి వాడన ఘనత గాంచె"

ఆ సోమన మధురలో బుధ సమూహములను వేద శాస్త్ర పురాణాది వాదములలో 'కాకు నూరింట' జేసినాడట. అందువే 'కాకునూరింటి' వాడని ఘనత వహించెనట. 'కాకు నూరింటి, జేయు' అనగా నేమియో పరిశీలింపదగియున్నది. కాకు—గాసి, తిరస్కారము, వ్యర్థము, శూన్యము. కాకు చేయు—వ్యర్థ మొనర్చు, తిరస్కరించు అని యర్థము. మరియు నట్టి వాదములను 'నూరింటి'ని విఫల మొనర్చుటచే సోమనకు 'కాకునూరింటి' వాడను ఘనత వచ్చినదని అప్పకవి పై పద్యమున వివరముగ తెలిపియుండెను. 'చీకాకుపరచు' అనుట మన మెరింగినదే. నేను చూచిన వావిళ్లవారి ముద్రణములో 'కాకునూరింట' యనియు, 1901 లో బ్రహ్మశ్రీ యద్దనపూడి సంజీవయ్యగారిచే పరిష్కరింపబడి స్టార్ ఆఫ్ ఇండియా ప్రెస్, మద్రాస్ వారిచే ముద్రింపబడిన ప్రతియందు 'కాకునూరిటి' యనియు నున్నది. ఇది పొరుష నామమే.

తర్వాత 73 వ పద్యములో చరికొండ (పరికొండ) సీమలో ఆ సోమన కాకునూరను సర్వాగ్రహారమును సంతరించెనని యున్నది. అయితే సోమనకు వచ్చిన కాకునూరింటి వాడను ఘనతవలన ఆ యగ్రహారమునకు కాకునూరను పేరు వచ్చినదా? లేక కాకునూరను సర్వాగ్రహారమువలన అప్పకవి పూర్వీకులకు కాకునూరువారని పేరు వచ్చినదా? అనునది విచారింపదగియున్నది.


రెండు పద్యములను సమన్వయించుకొనిన సోమనకువచ్చిన కాకునూరింటివాడను ఘనతవలననే ఆ యగ్రహారమునకు కాకునూరను పేరు వచ్చినదని తేటతెల్లమగుచున్నది. వ్యక్తినిబట్టి వూరికి పేరు వచ్చుట కనేకములగు నుదాహరణములను చూపవచ్చును. సర్వాయపాలెం, బుచ్చిరెడ్డిపాలెం, తిమ్మానాయుడి కండ్రిగ, సోమయాజులపల్లె అనునవి ఒక వ్యక్తిపరముగను, వాడెండ్లవారిఖండిగ, జంగాలపల్లె అనునవి కొందరు వ్యక్తుల పరముగను వచ్చిన గ్రామ నామములే. కావున కాకునూరు అను గ్రామమున కా పేరు కాకునూరింటివాడను ఘనత గాంచిన సోమనచే సంతరింపబడిన తర్వాతనే వచ్చినది. అంతకుమునుపు ఆ వూరి పేరేమో? అతనికి పూర్వము తిమ్మన ఇంటిపేరేమో! తిమ్మన కుమారుడగు సోమన మిగుల కీర్తి గడించుటచే అతనికిని కాకునూరి తిమ్మనయని తర్వాత పేరు వచ్చియుండును. సోమనకు పూర్వము వారి వంశీయుల ఇంటిపేరునకు అప్పకవినాటికి మునుపే ప్రచారము తగ్గి కాకునూరింటివారను పేరే స్థిరపడియుండుటచే అప్పకవికిని తన పితామహుని ప్రపితామహుని ఇంటిపేరు తెలియదనియే స్పష్టమగుచున్నది.

అప్పకవి తాత పెదసోమయ. అతడు వఝ్ఝము పోతనార్యుని కుమార్తెయగు కృష్ణమ్మను వివాహమాడెను. అనగా అప్పకవి మాతామహుల ఇంటిపేరు 'వఝ్ఝమువారు'. వఝ్ఝం వారని ఇప్పటికిని అనేకులు గలరు. వఝ్ఝము పెద్దనార్యునిచే కామేపల్లి సంపాదితమని అప్పకవి తెలిపియుండెను.

మరియు ఏప్రిల్ భారతిలో శ్రీ వేంకటాచార్యులు ఉదాహరించిన పద్యములోని 'నవదళపురి' యను మాట వావిళ్ల ప్రతియందుగాని, స్టార్ ఆఫ్ ఇండియా ప్రెస్ ముద్రణమునందుగాని కన్పించదు. 'బొద్దినేపల్లినివరళపురిని' అనిమాత్రమే కలదు. ఇదియును గమనార్హము. 'నివరళపురి' ఏదియో?

కనిగిరి :

—వి. రాజగోపాలరావు.



మానవుడా ! జయం నీకు !

శ్రీ తంగిరాల వెంకట సుబ్బారావు

పరోమెట్టు పైకెక్కిన
మానవుడా ! జయం నీకు !
స్వర్గంతో ఇలాతలం
సంధింపుము, శుభం నీకు !!

అర్థమవని విశ్వంలో
అమృతమ్ములు కురిపింపుము
అజ్ఞానపు చీకటిలో
అమరజ్యోతి వెలిగింపుము.

మాయపోలె కన్పించెడి
మహాగోళ పరిధుల్లో
మానవాళి విజయాలను
తేనెలూర వినిపింపుము.

ప్రబంధాల చంద్రుడింక
అబద్ధాల ముద్ద కాదు;
ప్రజాకోటి వలస వెళ్లు
బహు చక్కని పచ్చబీడు.

ఆఖండలు డింక మనకు
అందరాని జేడు కాదు;
ఐక్యరాజ్య సమితిలోన
శాశ్వతముగ సభ్యుడతడు.

ఈ రోజున లియొనోవ్
ఎక్కినాడు చివరిమెట్టు
నిచ్చెనపై కాలుతీసి
నిల్చినాడు రోదసిలో.

జనావళికి అభయమిచ్చి
జయపతాక నాటినాడు
దివిని భువిని సంధించే
దివ్యవీణ మీటినాడు.

కళగూరగంప :

ఆధునిక కవితారీతులు

శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

ఒక వ్యక్తిని గూర్చి దూరంనుంచి చూసే సంఘానికి తెలిసిన 'నిజం' వేరు; ఆ వ్యక్తికి మాత్రమే తెలిసి ఉండే 'నిజం' వేరు. సంఘానికి తెలిసిన నిజంలోనూ మళ్లీ ఎన్నో తేడాలు. నిత్య సన్నిహితంగా ఉండే కుటుంబంవా రెరిగిన విషయం వేరు; ఆ వీధి వారికి తెలిసిన సంగతి వేరు; ఆ వూరివారికి అతని పట్ల ఉండే భావం వేరు. ఎక్కడో దూరంగా ఉండి వినికిడివల్ల, రచనలవల్ల మాత్రమే తెలిసినవారు అనుకునేది వేరు. వ్యక్తి కేంద్రంగా చుట్టూ అనేక ఏక కేంద్ర వృత్తాలు ఉన్నట్లు భావిస్తే, వ్యక్తికి దగ్గర దగ్గరగా ఉన్న వృత్తాలు వ్యక్తికి సత్యాన్ని చెప్పేవనీ, దూరదూరంగా ఉన్నవి సంఘ సత్యాన్ని చెప్పేవనీ అనవచ్చు. వెనుకటి కవిత్వం సంఘ సత్యానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తే, ఈనాటి కవిత్వం వ్యక్తి సత్యాన్ని ఎక్కువగా ఆదరిస్తూంది.

వెనుకటి కవులలో కూడా భవభూతి వంటివారు వ్యక్తి సత్యాన్ని ఆదరించినవారు కొందరు కనిపిస్తారు. వివాహమై మిథిల నుంచి అయోధ్యకు వచ్చేనాటి సీతాదేవి స్వరూపం ఉత్తర రామ చరిత్రలో రాముడు ఇలా వర్ణిస్తాడు :

"వతన విరళ ప్రాంతోన్మీల న్మనోహర కుట్మలై
ర్దశన కుసుమై ర్ముగ్ధాలోకం శిశు ర్దధతీ ముఖం,
లలిత లలితై ర్జ్యోత్స్నాప్రాయై రకృత్రిమ విభ్రమై
రకృత మధురై రంగానాం మే కుతూహల మంగకైః."

పాలపళ్లు పడిపోయి ఏర్పడిన ఖాళీలలో మొగ్గల్లాగ క్రొత్తగా పళ్లు అంకురిస్తున్నాయట సీతాదేవికి. సంఘదృష్టిగల కవులు స్త్రీ సౌందర్యాన్ని వర్ణించిన తీరుతో పోల్చి చూస్తే భవభూతి రచనలోని వ్యక్తి సత్య ప్రవణత బోధపడుతుంది.

సాంఘికములైన కట్టుబాట్లూ, ఆచారాలూ, పితృభక్తి, ప్రభుభక్తి, పాతివ్రత్యం మొదలైన ధర్మాలూ సంఘ దృష్టిగల కవిత్వానికి ఆలంబనాలైతే, వ్యక్తిలోని రాగ ద్వేషాలూ, భయాలూ, ఆశలూ, కష్టాలూ, సుఖాలూ, మృత్యుభీతి, తత్త్వచింతా, నిరాశా, నిస్పృహా మొదలైనవి వ్యక్తి దృష్టిగల కవిత్వానికి జీవగర్ర. సంఘంలో పదుగురిలో సమానంగా కనిపించే లక్షణాలను వర్ణించడంవల్ల సాహిత్యానికి సిద్ధించే సర్వజనీనత ఎన్ని చెప్పినా ఆ సంఘానికే పరిమిత మవుతుంది. వ్యక్తి అంతరాంతరాలలోని వాస్తవాన్ని యథాతథంగా చిత్రించే సాహిత్యం పైకి వైయక్తికంగా కనిపించినా, నిజానికి సంఘ దేశ కాలావధులను అతిక్రమించి సర్వ జగత్తుకీ ఉపాదేయం అవుతుంది. మన రామాయణాది పురాణాలు కాక, ఉపనిషత్తులూ, భగవద్గీత మొదలైనవే ప్రపంచదృష్టిని ఎక్కువగా ఆకర్షించడానికి ఇదే కారణం కావచ్చు.

ప్రాచ్య, పాశ్చాత్య దృక్పథాలలోని మంచి చెడుగులను విమర్శిస్తూ ఆల్డస్ హక్స్లీ ఇలా అంటాడు :

"He (Belial) persuaded each side (East and West) to take only the worst the other had to offer. So the East takes Western nationalism, Western armaments Western movies and western Marxism; the West takes Eastern despotism, Eastern superstitions, and Eastern indifference to individual life. Just think if they had made the best! Eastern mysticism making sure that western science should be properly used; the Eastern art of living refining Western energy; Western individualism tempering Eastern totalitarianism."

(Ape and Essence P. 184)

ఆధునిక కమ్యూనిస్టు ప్రభుత్వాలలో వలె మధ్య యుగ భారతదేశంలో సంఘానికి అధిక ప్రాబల్యం ఏర్పడడం, వ్యక్తి

అనుభవాలనూ, ఆశలనూ స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం కూడా కోరవడడం జరిగింది. ఇప్పుడిప్పుడు పాశ్చాత్య ప్రజాస్వామిక సిద్ధాంత ప్రభావంవల్ల వ్యక్తి సంపూర్ణ వికాసానికి అడ్డురాని విధంగా సంఘాన్ని సంస్కరించుకునే ప్రయత్నం ఆరంభం అవుతూంది.

ఆధునిక కవిత్వంలో కనిపించే మరొక లక్షణం 'ప్రతిభ' కంటె 'సత్యానికీ', 'నిజాయితీ' కీ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం. ప్రతిభకు రూఢంగా ఏర్పడిన అర్థం చమత్కార జనకత్వం అని; పఠితకు లేదా శ్రోతకు విస్మయం కలిగించే కవి శక్తిపట్ల అతనిలో ప్రశంసాభావం రేకెత్తించజేయగల శక్తి అని. ఈ అర్థంలో 'ప్రతిభ' ను ఆధునిక కవి ఉపాసించలేదు. తనమీద ప్రశంసాభావం కంటె తాను ప్రతిపాదించే సత్యం పట్ల ఆదరాన్ని అతడు కోరుతాడు. జనులను వినోదపరచి కాసేపు వాస్తవాన్ని మరపించి, వూహా స్వర్గవీధుల్లో పచారు చేయించే వ్యోమయానంగా కాక తన గీతం తన జాతి జీవితాన్ని మూల ముట్టుగా మార్చగల మంత్రం కావాలని ఆతని తపన.

లోకంలో మంచే జయించాలని, చెడు అంతరించి పోవాలనీ, కష్టం అనేది లేకుండా అంతా ఆనందంలో కల కలలాడుతూ బదకాలనీ ఈనాటి యువకవి ఆరాటం. మంచిని సమర్థించడానికీ, చెడును ప్రతిఘటించడానికీ అతడు నడుం కడుతున్నాడు. ఈ శతాబ్ది ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్ర రాష్ట్రోద్యమం, సర్వజనీన విద్యకూ వెనుకబడిన సాంఘిక వర్గాలవారి పునరుజ్జీవనకూ సాగిన ఉద్యమాలూ ఆనాటి యువకవిని ఉత్సాహభరితుణ్ణి చేసి భవిష్యత్తును గురించి బంగారు కలలు కనేట్టు చేసినయి.

ప్రపంచంలోనే సాంఘిక దురన్యాయాన్ని అంతంచేసి, జీవితానందంలో అందరికీ సమాన భాగం పంచిపెట్టగలదన్న ఆశలు గొలిపిన కమ్యూనిస్టు ధర్మం కొన్నాళ్లపాటు మన యువకవుల కలలకు ప్రాణం పోసింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సాగిన సుమారు ఈ రెండు దశాబ్దాలలోనూ దేశంలో పరిశ్రమల పెంపుదలకూ, జాతీయైశ్వర్యాభివృద్ధికీ కృషి జరిగిన మాట వాస్తవమే అయినా జాతి సాంస్కృతిక జీవితానికి ఉత్తేజం కలిగించి ఒక నూతన లక్ష్యం వైపుకు జాతిని నడిపించే ఉద్యమం ఏదీ రాలేదు. ఉన్న రాజకీయ పక్షాలు కలిగించిన ఆశలు నిరాశ లయినవి. పైపెచ్చు లోకకల్యాణ దృష్టికి కాక, స్వార్థ చింతనకూ, అవినీతి వర్తనకూ ఎక్కువ ప్రోత్సాహం లభించే పరిస్థితులు ఏర్పడినవి.

ఎదురుగా చూస్తూన్న నిజాన్ని కాదని గత కాల వైభవాల స్మృతులలోకో, పరాయివారి నుంచి ఎరువు తెచ్చు కొన్న బంగారు కలలలోకో ఎగిరిపోయి ఖులాసాగా కవితాగానం చేయడం ఇష్టంలేని నిజాయితీపరుడైన ఈనాటి యువ కువికి తన చుట్టూ ఎటు చూసినా నిరాశా నిస్పృహాలే ఎదురయి నయి. బలమైన ఆశాభావం కవిత్వ రచనను ప్రేరేపించగలిగి నంతగా నిరాశా నిస్పృహాలు రచనా ప్రవీణులను చేయలేవు. కాని, నిరాశమరింత తీవ్రమైతే దాన్ని వెన్నంటి యెప్పుడూ ఒక ఆశ వుండితీరుతుంది. అదే ఆ నిరాశాప్రకటనకు కారణ మవుతుంది. స్వాతంత్ర్య సంపాదనకుముందుకాలంలో వచ్చి నన్ని రచనలు తరువాతి కాలంలో రాకపోవడానికీ, వెలువడు తూన్న కొద్ది రచనలూ తీవ్ర నిరాశా భావపూరితాలుగా ఉండ డానికీ ఇది కారణం కావచ్చు.

నిరాశ తారస్థాయి నందుకుని ఈనాటి చదువుకొన్న యువకు లనేకులు "అసలు ఎవ్వరూ కవిత్వం వ్రాయకపోతేనేం? మంచి కవిత్వం చదివి ఆనందించే అలవాటు దేశంలో లేక పోతేనేం?" అని ప్రశ్నించేటంత తీవ్ర రూపం దాల్చింది. రోడ్డురోలరు లాగే కూలీలు తమలో ఎవడైనా చక్కని గొంతుతో పదం అందుకుంటే, లేక తమలో ఎవడైనా మాటకారీ, తెలివైనవాడూ ఉండి రక రకాల కథలు చెబుతూ ఉంటే, తమ అందరి మనస్సుల్లోనూ మెదులుతూ తాము చెప్పలేకుండా ఉన్నమాట అతగాడు చెబుతూఉంటే, తాము పాటుబడుతూన్న సంగతే మరచి ఆనందిస్తారు. అవిధంగా పారదర్శి, దూరదర్శి అయినవాడూ, తమ అందరి మనస్సుల్లో అణగి మణిగిఉన్న అవ్యక్త సత్యాలకు వాగ్రూపం ఇవ్వగలవాడూ, తమలో ఒక్కడైనా ఉంటే బాగుండుననే కోరిక కూడా లేకపోవడం సంఘం జంతు జీవన స్థాయికి దిగ జారిపోవడం.

ఇటీవల హైదరాబాద్ 'అమరసాహితి' వారు ప్రచు రించిన 'రాత్రి' అనే కవితా సంకలనంలో వర్తమానాంధ్ర కవితా రీతులను కొంతవరకు గుర్తించవచ్చు. 15మంది యువ కవులు వ్రాసిన 30 పద్యాల సంకలనం ఇది. దేశాన్ని ఆవహిం చిన నిరాశామయమైన వర్తమాన పరిస్థితులకు సంకేతంగా 'రాత్రి' అనే పేరు గృహీతమైంది.

'రాత్రి' ఈ కవుల దృష్టిలో
"పతిత
భయంకర సుఖవ్యాధి పీడిత జారిణి
పాపాలు పండిన పూర్ణ గర్భిణి" (పుట. 1)

"రాత్రిలోని క్షుద్రత్వం
రాత్రిలోని అమరత్వం

వీధుల్లో తిరిగే వేశ్యకు తెలుసు
కొండల్లో చరించే గొరిల్లాకు తెలుసు"

(పుట—49)

ప్రస్తుత యంత్ర నాగరకత ప్రపంచంలోని బుద్ధిమంతులందరినీ నిరాశాగ్రస్తులనుచేసి వారిలో మృత్యువాంఛ రేకెత్తిస్తున్న దన్నాడు బెర్ట్రాండ్ రస్సెల్. ఆ జగద్వ్యాప్త మృత్యువాంఛ తాలూకు ప్రతిధ్వనులు ఈ యువ కవుల గొంతులో వినిపిస్తున్నవి. ఒక కవి ఇలా అంటాడు:

"నా కీ మానవలోకం నిర్భరమై తోస్తున్నది
నరమేధం చేయాలని నా మది వాంఛిస్తున్నది
నరకపు నరలోకమెల్ల నరకాలనిపిస్తున్నది
జగతికి మరణపు శిక్షను చెప్పాలనిపిస్తున్నది."

"అసంపూర్ణమైన ఈ బ్రతుకులో
ఆనందం అందదని తెలిసి
దానికోస మన్వేషించడం
ఎప్పుడో మానుకున్నాను"

అంటాడు మరొక కవి. అవినీతినీ, లంచగొండితనాన్నీ సహించలేని ఈ యువకవులను

"అవినీతి కమిటీ ఆఫీసరు విసిరేసిన
ఖాళీ సీసా గాజు పెంకు చేసిన గాయానికి
మునలి స్పీకరు మంచ మెక్కిన ఘడియ"

హృదయ శల్యంగా బాధిస్తుంది. కనుకనే ఇలా ఆక్రోశిస్తున్నారు.

"ఎంతో ఆడంబరంతో గౌరవనీయులైన మంత్రిచే
పదేళ్ళ క్రిందట వేయించిన పునాదిరాయి
వెన్నెల పులుముకుంటూంటే
పక్కనే అలవోకగా మొలచిన ఆకాశమంత తాటిచెట్టు
సుధాకరుని పోటీగా మధు సుధ వొలికిస్తున్నది"

"మతముల పుట్టినిల్లు జనమాన్య చరిత్రల మెట్టినిల్లు"

"పాత గ్రామఫోన్ రికార్డును ప్రసారం చేస్తోంది.
లాడ్జింగ్ పక్కన హోటల్
భారతీయ సభ్యతా సంస్కృతులను గేలిచేస్తోంది
లాడ్జింగ్ శృంగార కేంద్రం
బలిసిన మానవ కీటకాలు దూరే చీమూ
నెత్తురు పారే రంధ్రం"

వంటి దృశ్యాలూ సహించలేని ఈ యువకవులు

"దేశానికి గ్రహణం పట్టింది
జాతి వెన్నెముకకు అవినీతి రాచపుండు పుట్టింది
దారుణమైన ఆపరేషన్ జరగాలి"

"జారత్వం రాజ్యంచేసే రాజ్యంలో రౌడీలే లీడర్లు
విప్పులవిడి విహారం జాతి పతనానికి నిదర్శనం"

అని ఘంటాపథంగా చాటుతున్నారు.

భగవంతుడిలో తమకీనాడు ఉన్న విశ్వాస రాహిత్యాన్ని ప్రకటించడానికి ఈ యువ కవులు ఏమాత్రం సంకోచించడం లేదు. ఇలా అంటున్నారు :

"శతాబ్దాలుగా పేరుకున్న
అబద్ధాల పుట్టలో
నిజం వాల్మీకి తపోముద్రలో ఉన్నాడో
దీర్ఘనిద్రలో ఉన్నాడో ఎవరికి తెలుసు?"

(పు. 61)

తమముందు తరం కవులు 'భావ కవిత్వం' పేరుతో వాస్తవిక పరిస్థితులకు దూరంగా చేసిన వూహా స్వర్గ విహారాలను ఈ యువ కవులు నిరసిస్తున్నారు.

"చాచిన చేతికి అందని అందపు వికటాట్టహాసం
రేపిన ఏడుపు బావురు మంటున్నది" (పు. 46)

అని భావ కవిత్వోద్యమ వైఫల్యాన్ని వర్ణించి,

"కవీ! కలల అద్దాలు తీసి లో
కాన్ని చూడమంటాను
సలక్షణంగా కళ్ళుంటే నీ
కిదేమి జబ్బంటాను?"

అని అమార్గం కవులను హెచ్చరిస్తున్నారు.

"ఈ ప్రపంచకం ఇంతే
కంటికి అంది నోటికి అందని భోజనం
కత్తిరించిన చిత్రం
కొన్ని అంగాలే మిగిలిన శిల్పం
మొండి గోడల అసంపూర్ణ గృహం"

అనీ,

"అసంపూర్ణమైన ఈ బ్రతుకులో
ఆనందం అందదని తెలిసి
దానికోస మన్వేషించడం
ఎప్పుడో మానుకున్నాను."

అని తీవ్రమైన నైరాశ్యం ప్రకటించే ఈ యువ కవులలో ఆ నైరాశ్యానికి హేతువైన లోక కళ్యాణ కాంక్ష అడుగడుగునా కనిపిస్తూంది.

"ప్రతి కంటినుండి రాలే ప్రతి కన్నీటి బొట్టును
నిరాశలో నిఖిల విశ్వాన్ని నింపుకొన్న

నా చేతి వ్రేళ్ళు తుడిచి వేస్తాయి."
"భావికాంతికి
వర్తమానంలో వత్తిగా మారి
జీవనరసామృతాన్ని చమురుగా వెచ్చించాలని"
తహతహ లాడుతారు.

"మల్లెలవయి మంచు కరగి
ఉల్లములందు మంచితనం పెరిగి
మంచివాని కంఠం కంచయి మ్రోగాలి
మంచివాని కష్టం కనకమయి పండాలి"—
ఇది వీరి నూతనోద్యమ ఆశయం.

ఈ యువ కవులందరి రచనలూ సమానంగా 'విజాయుతీ'ని ప్రతిధ్వనిస్తున్నాయనిగాని, వీరు వ్రాసిన ప్రతి పంక్తి కవిత్వంగా ఆస్వాద్యం అనిగాని, అనుభవలోపంవలన, అపరిణతివలన వచ్చే శబ్ద వాక్యాది దోషాలూ, అనౌచిత్యాలూ ఈ రచనలలో మృగ్యం అనిగాని నేననడంలేదు 'మనసు. లోని ఆలాపన మాటలలో మారిపోవు' అన్నట్లు అనేక స్థలాలలో వాక్కు కుంటుపడడం సహజం. అయినా, క్షణకాల వినోదానికి కాక జీవితంలోని విలువలలో మూలముట్టుగా మార్పు తేవాలనే సదాశయంతో కలం చేపట్టిన ఈ యువ కవులు నిరాదరణ పాత్రులు కారనీ మాత్రమే నా మనవి!

ఆదినుంచి కొనదాకా నిరాశాభావ పూరితంగా సాగిన ఈ కవితా సంకలనంలోని చిట్టచివరి గీతంలోని చిట్టచివరి పంక్తులు చూడండి!

"ఆకాశం భూమి ఏకమవుతున్నచోట
ఋణాలాంటి కవి మనస్సులో కవిత ఉబుకుతున్నచోట
కాలం కదలిక మొదలయినచోట
కలలకు రెక్కలు మొలుస్తున్నచోట
పువ్వు పండుగా మారుతున్నచోట
ఈ జీవితానికి ఆవలి ఒడ్డున
మన రక్తంలో రేపటి సూర్యుడు
ఉదయిస్తున్నాడు చూడు!"

అఖిలభారత రచయిత్రుల సమాఖ్య

అఖిలభారత రచయిత్రుల సమాఖ్య సమావేశాలు ఏప్రిల్ 25వ తేదీన హైదరాబాద్‌లో ఆరంభమై, 27వ సమాప్తమైనవి. పలుప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొదటిరోజు సమావేశం శ్రీమతి లీలావతిమున్షీ అధ్యక్షతన రవీంద్రభారతిలో జరిగింది. ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీమతి కామరాజుమ్మగారు సభ్యురాండ్రకు, రచయిత్రులకు స్వాగతం చెబుతూ "ఒకే గడ్డమీద జన్మ నందిన ప్రతివ్యక్తి తోటివ్యక్తి అభిప్రాయాన్ని గమనించి గౌరవించడం ఆధునిక యుగంలో అతిముఖ్యమైన అంశం. కాని మన జన్మభూమి బహుభాషల బహుసంస్కృతుల కలయిక కావడంవల్ల, ఒకరి ఉద్దేశాలు ఆశయాలూ మరొకరికి అందడం అంత సులభమైన పని కాదు. అయినా వీలు కల్పించుకొని పరస్పరస్నేహాన్ని, సౌహార్ద్రతనూ పెంచుకోవడం అవసరం. ఇది రచయితలకు మరీ ముఖ్యం. అన్నిరంగాలలోవలె రచనారంగంలోకూడ నేటి భారతీయమహిళ ఉత్సాహంతో ముందంజవేస్తున్నది. లలిత లలితమైన మధుర భావనలకు ఊపిరి పోసి, భాష, స్థలమూ అనే అడ్డంకులకు అందకుండా, దేశం నాలుగుమూలలా ప్రతిధ్వనించేటట్లుగా తీయగా పాడడానికి ఆవిడ గొంతు సారించు కొంటున్నది. ఆ కంఠం అవ్యాహతంగా అపస్వరాలు లేకుండా సాగవలెనన్నా, ఆ సందేశం అందరికీ అందవలెనన్నా ఆవిడ ప్రయత్నం చక్కని ప్రచారాన్ని పొందాలి. ఆవిడశక్తిని అందరూ గుర్తించి గౌరవించే అవకాశం కలగాలి. అటువంటి అవకాశాన్ని రచయిత్రులకు కల్పించి, వివిధభాషలకూ, వివిధప్రాంతాలకూ చెందిన సోదరీమణులను ఒకచోట చేర్చాలన్నదే ఈసమావేశం పరమార్థం.

"ఈనాడు సమర్థులైన మహిళామణులవల్ల జయప్రదంగా నిర్వహింపబడుతున్న ఈసభ, రేపు, అఖిలభారత రచయిత్రులకు ఉపకారకమైన శాశ్వత సంస్థగా రూపొందవలెనని ఆశిస్తున్నాను. నా ఆశే, అఖిలభారత రచయిత్రుల అందరి ఆశా అయిఉండడం అసమంజసం ఏమీకాదు.

"ఈ ఆశ సంపూర్ణ స్వరూపాన్ని పొందాలనీ ఈసభలు దిగ్విజయంగా జరగాలనీ భగవంతుడికి అంజలి ఘటిస్తూ ఈసభకు ఆహూతులైన అందరికీ సగౌరవంగా స్వాగతం పలుకుతున్నాను." అన్నారు.

ఆహ్వానసంఘం కార్యదర్శిని శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు సమావేశం లక్ష్యాలను వివరించిన మీదట, శ్రీమతి విజయలక్ష్మి పండిట్ సమావేశాలు ప్రారంభించారు.

విభిన్న ప్రాంతాల ప్రజలలో అవగాహనను తమ రచనల ద్వారా రచయితలు పెంపొందించాలని శ్రీమతి విజయలక్ష్మి పండిట్ తమ ప్రారంభోపన్యాసంలో చెప్పారు.

దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రజలను, ముఖ్యంగా యువతరం వారిని రచయిత్రులు ప్రేరేపించాలని, ప్రజలను సన్నిహితపరచాలనే మనోహారథులను నిర్మించే బృహత్ కృషిని రచయితలు చేయవలసి యున్నదని ఆమె

అన్నారు. ఈనాడు దేశము చాలా సమస్యలను ఎదుర్కొంటున్న దని, వాటిని విజయవంతంగా పరిష్కరించేందుకు దేశ ప్రజ లంతా సమైక్యంగా, ఒకటిగా పనిచేయడము అవసరమని కూడా ఆమె ఉద్బోధించారు. ఆమె ఇంకా ఇలా అన్నారు :

"మన దేశంలో మనం సహజీవనం నేర్చుకొనకపోతే శాంతియుత సహజీవనాన్ని గురించి యితర దేశాలకు మనం చెప్పగలిగే పరిస్థితిలో ఉండం ప్రపంచంలోను, దేశంలోను సాంఘిక, సాంకేతిక రంగాలలో అనేక పరిణామాలు సంభ విస్తున్నాయి. ఈ పరిణామాలను గురించి భావి తరాలవారికి వివరించే బాధ్యత రచయితలదే.

" ప్రపంచంలో భారతదేశంలోని రచయితలకు గల స్వేచ్ఛ ఎవరికి లేదు. అందువల్ల ఐకమత్య సాధనలో భారత రచయిత్రులు ప్రముఖస్థానం వహించగలిగే స్థితిలో ఉన్నారు.

"సంఘంలో తమకు కల స్థానాన్ని గురించి భారత స్త్రీలు సిగ్గుపడవలసిన అవసరంలేదు. ప్రపంచంలోని అనేక దేశాల లోని మహిళలకన్నా మన దేశంలో స్త్రీలు అత్యంత ఉన్నత స్థానంలో ఉన్నారు. ఈ విలువను కాపాడుకొంటే, ప్రపం చంలో భారతజాతి అత్యంత అభ్యుదయకరంగా రూపొంద గలదు.

"తక్కిన దేశాలలోని స్త్రీలకన్నా మన దేశంలోని మహి ళలు ఏవిధంగానూ తక్కువవారు కాదని విదేశాలలో నాకు గల అనుభవంవల్ల స్పష్టంగా చెబుతున్నాను. మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో పురుషులతో సమానంగా మహిళలు పాల్గొన్న తరుణంలో, పురుషులు ఏవిధంగానూ బాధపడ లేదు. ఇందుకు పురుషులను అభినందించవలసి ఉంది.

"రచయితల సృజనాత్మక కృషికి ప్రభుత్వం ఇవ్వవలసి నంతగా సహాయం ఇవ్వడంలేదు. వాటంతట వాటికే రచనలకు మంచి శక్తి ఉంది. అందువల్ల తమ కృషిని రచయితలు తీవ్రంగా తీసికొని, సంఘ శ్రేయస్సు కోసం వర్తమాన ప్రమాణాలను వివరించడానికి పూనుకోవాలి. నేటి నవీన భావాలను ప్రాచీన ఆధ్యాత్మిక విలువలతో మేళవించినప్పుడే మనం సరియైన సంయోగీకరణను చేయగలం. భవిష్యత్తుకు తగిన బాటను ఏర్పాటు చేయగలం. ఈ విషయంలో భాషా విభేదాలు ఏవీ అడ్డురావు. ప్రయత్నిస్తే, భారత రచయితలు ప్రపంచానికి ఆదర్శప్రాయమైన విధానాలను రూపొందించ గలరు.

"దేశంలో సమైక్యం లేకపోతే, ప్రణాళికలలో ఏవీ జయప్రదంకావు. ప్రతి రాష్ట్రంలోనూ వివిధ భాషలలో సాగే రచనలు యీ సమైక్యాన్ని సాధించడానికి గల మార్గా లలో ఒకటి. ఇందువల్ల ఒక రాష్ట్రంలోని ప్రజలు ఇతర రాష్ట్రాలవారిని అర్థంచేసుకోగలరు."

ప్రపంచంలో అత్యంత శీఘ్రంగా జరుగుతున్న పరిణా మాలను ప్రస్తావించి, తమ అనుభవాన్ని పేర్కొంటూ శ్రీమతి పండిట్ ఇలా అన్నారు : "రామాయణ, మహాభారతాల లోని కథలను నేను నా చిన్నతనంలో పరమసత్యంగా నమ్మే దానిని. కాని ఆ కథలను నా పిల్లలకు చెప్పినప్పుడు నా రనేక ప్రశ్నలు వేసేవారు. నా మనుమల దగ్గరికి వచ్చేసరికి యీ కథ లలో దేనినీ వారు అర్థం చేసుకోలేదు. పైగా నివసించడానికి భూమి తగినది కాదని వారు భావించేవారు. వారికి భూమి చాలా విసుగు అనిపించేది. ఎంతసేపూ వారు అంతరిక్షాన్ని గురించి, అక్కడి వింతలను గురించి మాత్రమే ఆలో చిస్తున్నారు."

పిదప అధ్యక్షురాలు శ్రీమతి లీలావతి మున్షీ తమ ప్రసం గంలో కామ ప్రవృత్తికీ, నేరాలకు ప్రాధాన్యమిచ్చే సాహిత్యం ఇదివరకు ఎన్నడూ లేనంతగా ప్రబలిందంటూ ఇలా అన్నారు :

"ప్రజలకు మతము స్థిరత్వాన్నిచ్చింది. అట్టి మత మును, మతాతీత ప్రజాస్వామ్యమన్న పేరుతో క్రమంగా విస్మ రిస్తుండటము విచారకరము. దేవుని తలచుకోవడము కూడా సంప్రదాయం కాకుండా పోయింది. ఈ చెడు ధోరణుల నరి కట్టి, భావి తరాలవారు వీటి ప్రభావాలకు లోనుకాకుండా చూచేందుకు రాజనీతిజ్ఞులు, విద్యాంసులు, వివేకసంపన్నులు అంతా తమ ప్రభావాన్ని చూపి తీవ్రంగా కృషిచేయవలసిన సమయం వచ్చింది.

"ఈ చెడుధోరణులకు మూలాధారములేమిటో ప్రభుత్వము కనుక్కోలేక పోయింది. దుష్టభావాలను అక్రమంగా అరువు తెచ్చుకోవడాన్ని, మన యువకుల మనస్సులను కలుషితం చేయ డాన్ని ప్రభుత్వం నిరోధించలేక పోయింది. ఫలితంగా నైతిక ప్రవర్తనకు, శాంతిభద్రతలకు సంబంధించి పెద్దసమస్య లేర్పడ్డాయి.

"సంస్కృత సాహిత్య ప్రభావము దాదాపు అన్నిభాషలపై పడింది. ఆ తరువాత అన్నిభాషలు ఆంగ్లసాహిత్యము నుండి భావాలను, భావ వ్యక్తీకరణను తీసుకోవడం ప్రారంభమైంది. కొన్ని దశాబ్దాల క్రితమే ఫ్రెంచి సాహిత్యంలో వచ్చిన కాల్పనికో ద్యమం ప్రభావం కూడా కొందరురచయితలపై ప్రసరిం చింది. ఆ తరువాత కమ్యూనిస్టు సాహిత్యము అభ్యుదయవాద మన్న పేరుతో తన ప్రభావాన్ని ప్రసరింపజేసింది. ఈవిధంగా సాహిత్యస్రవంతి విస్తరిల్లినది. ఈ స్రవంతిలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలనుండి అనేక భావోపనదులు చేరాయి. ఈ భావోప నదులు జీవితానికి సంబంధించి మంచి చెడుగులను, ఆదర్శాలను కొనితెచ్చాయి. అయితే వీటిలో కొట్టుకొనివచ్చిన చెడుగు మనుష్యు లను, మనస్సులను క్రమ్మివేసింది.

"మనలో పరస్పర సంబంధాలను కల్పించే మన సంస్కృ తిని నిలబెట్టేందుకు, ప్రపంచముతో మన సంబంధాన్ని పరీ క్షించుకునేందుకు తోడ్పడే కొత్త 'లింకు' లను మన మిప్పుడు కల్పించుకోవాలి. 50 లేక 60 ఏండ్లక్రితము చదువుకొనక పోయి నప్పటికి ప్రతి ప్రాంతపు తల్లులు రామాయణ భారతములలోని కథలను, పురాణగాథలను తెలుసుకుంటుండేవారు. వాటిని తమ పిల

లకు చెప్పేవారు. ఈ ప్రాచీన గాథలను గురించి గాని, జీవిత మతాలకు సంబంధించిన ప్రాథమిక విషయాలుగాని యీతరం వారికి బాగా తెలునునని చెప్పగలమా ? పాఠశాలలు, కళాశాలల్లో సంస్కృతము క్రమంగా అంతరిస్తున్నది. సంస్కృతము స్థానాన్ని ప్రాంతీయ భాషలు ఆక్రమిస్తున్నాయి. ప్రాంతీయ భాషలు వర్ధిల్లాలి. ఇందుపై ద్వంద్వాభిప్రాయా లంటూ ఉండవు. అయితే ప్రాంతీయ భాషలను అభివృద్ధిపరచడంలో సంస్కృతాన్ని నిర్లక్ష్యముచేస్తే అది అవివేక మవుతుంది. భాషా విప్లవము మనలను పరస్పరం కొంచెం ఎడంచేస్తే, సర్వ జనాదరణీయమైన సాహిత్యానికి ప్రేరణను వెనుకకు నెట్టితే, అలాంటి భాషా విప్లవము ఏకైక దృక్పథాన్ని చెడగొడుతుంది. మనలో అనైక్యం తెస్తుంది.

"ఈ శతాబ్దంలో వచ్చిన సాహిత్యం అధోముఖం పట్టింది. కామ ప్రవృత్తికి, నేరాలకు ప్రాధాన్యమిచ్చే సాహిత్యం ఇదివర కెన్నడూ లేనంతగా వ్యాప్తిలోకి వచ్చింది. యువతరంవారి వైఖరిని, దృక్పథాన్ని చెడగొట్టడం ప్రారంభించింది సాహిత్యం.

"భాషయొక్క సాహిత్యముయొక్క ప్రయోజన మేమిటి? ధ్యేయ మేమిటి ? ఉన్నతాశయాలకు ప్రేరేపించడం, తన దృక్పథాన్ని తాను మలుచుకునేందుకు వీలుగా మనో వికాసాన్ని కల్గించడమే. మనము ఒకవైపు సమైక్యాన్ని గూర్చి ఆలోచిస్తున్నాము. అయితే యీ రోజుల్లో ప్రచురించబడే సాహిత్యము మొత్తంమీద నానాటికి అనైక్యాన్ని తెచ్చే శక్తిగా పరిణమిస్తున్నది. ఈ సాహిత్యము మనస్సును, వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను చిన్నాభిన్నము చేస్తున్నది.

"సాహిత్యమంతా మనిషి మనస్సునుండే వెలువడుతుంది. పదానికున్న శక్తి మనిషిని గొప్పబుద్ధి కలవానిగాను, అల్పునిగాను చేస్తుంది. సాహిత్యం ద్వారానే మానవసంస్కృతి వెల్లివిరిసినది. మానవానుభవము సృజనాత్మకమైనది. ఎందుచేతనంటే పదజాలములోని అందముచేత. అయితే నేటి పరిస్థితి సంతోషకరంగా లేదు.

"దుష్టశక్తులను అణచివేసేందుకు ప్రభుత్వము దండిగా డబ్బు ఖర్చుపెట్టవలసి ఉంటుంది. కాని మన ప్రభుత్వము ఈ దుష్టశక్తులకు మూలాధారములను ఇంకా కనుగొనవలసి ఉన్నదని చెప్పుటకు చింతిస్తున్నాను. న్యాయమైన చాలా వాటికి ప్రభుత్వంవద్ద డబ్బు, విదేశీ ద్రవ్యమూ లేదు. అయితే దుష్టశక్తులను జనింపజేసే చలనచిత్రాలను, సాహిత్యాన్ని విదేశాలనుండి తీసుకరానిచ్చేందుకుగాను ఖర్చుపెట్టడానికి ధనము సమృద్ధిగా ఉన్నట్లు కన్పిస్తుంది. బంగారాన్ని దొంగతనంగా తీసుకునివచ్చేవారిని పట్టుకుంటారు. కాని చెడ్డ భావాలను అక్రమంగా దిగుమతి చేసుకోవడాన్ని, మన యువకులను ఆ చెడ్డ భావాలు కలుషితం చేయుటాన్ని పట్టించుకోరు.

"హత్యలకు, నేరాలకు స్త్రీలు, పురుషులు లేచిపోవడాలకు వార్తాపత్రికలు, తదితర పత్రికలు ప్రాధాన్యం ఇచ్చి ప్రచురిస్తున్నాయి. అలాంటివాటికి వార్త విలువ లుంటాయనుకుంటారు. అయితే దైనందిన జీవితములో మంచి పనులు, మంచి ఆలోచనలకు సంబంధించిన వార్తలు పత్రికలలో ప్రచురించబడే అవకాశము లేకుండా పోతున్నది.

"కొన్ని సంవత్సరాల క్రితము నిరక్షరాస్యులైన స్త్రీ పురుషులు యిప్పుడు ప్రథమంగా వ్రాయబడిన 'మాటల' ప్రభావానికి లోనవుతున్నారు. వెనుకముందు లాలోచించి విచక్షణతో నిర్ణయానికి వచ్చే స్తోమతను వీరు ఇంకా పొందవలసి ఉన్నది. ఈ తరగతి ప్రజలనుండే, తక్కువ జీతాలు పుచ్చుకునే అధ్యాపకులు వస్తారు. వారికున్న అసంపూర్ణ పరిజ్ఞానమునే పిల్లలకు పాఠశాలల్లో బోధిస్తారు. అపరిపక్వమైన పిల్లల మనస్సులు ఎలా దెబ్బతింటాయో ఆలోచించండి.

"ప్రస్తుతము కానవచ్చే ధోరణులలో మంచి కూడా ఉన్నది. అభిరుచులను క్షాళన మొనర్చి, నాగరిక మొనర్చడంలో కూడా గమనార్హమైన మార్పు మెల్లిగా వస్తున్నది.

"పిల్లలకు సత్సాహిత్యావసర మెంతైనాఉన్నదని రచయితలు, అకాడమీ సభ్యుల దృష్టికి తెస్తున్నాను. సముచితమైన 'కార్టూను'లను రూపొందించాలి. అలాంటి సాహిత్యము అహ్లాదకరంగానే కాక మంచి పనులకు ప్రేరేపించేదిగాను, సత్సంబంధాలను ధైర్య సాహసాలను ప్రోత్సహించేదిగాను ఉండాలి. పిల్లల గుణశీలాలకు ఈ దశలోనే పునాది వేయాలి."

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన రచయిత్రులకు ప్రముఖ సినీతార శ్రీమతి భానుమతీ రామకృష్ణ శాలువలను యిచ్చి, సన్మానించారు. దేశం వివిధ ప్రాంతాలనుంచి ఈ సభకు నలభై మంది ప్రతినిధులు వచ్చారు.

ఆహ్వానసంఘ సంయుక్త కార్యదర్శి శ్రీమతి నాయని కృష్ణకుమారి వందన సమర్పణ చేశారు.

అనంతరం శ్రీమతి కె. రామలక్ష్మి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. దీనితో మొదటి రోజు కార్యక్రమం సమాప్తమైంది.

అఖిలభారత రచయిత్రుల ద్వితీయ దిన సమావేశం ఆంధ్ర సారస్వత పరిషత్తు హాలులో జరిగింది. 'భారతీయ భాషలలో ఆధునికరీతులు' అనే విషయంమీద ఆయా భాషల ప్రతినిధి రచయిత్రులు వ్యాసాలు చదివారు.

దీనికి ప్రఖ్యాత సినీనటి, రచయిత్రి శ్రీమతి భానుమతీ రామకృష్ణ అధ్యక్షత వహించారు. తమ తమ భాషలలో రచనారీతులను గూర్చి ఒండొరుల అభిప్రాయాల తెలియుచేసుకోడానికి దేశంలో విఖ్యాతలయిన రచయిత్రులందరు ఒక వేదికమీద సమావేశమయినందుకు ఆమె తన ప్రగాఢానందం వెలిబుచ్చారు.

శ్రీమతి లీలా ముజుందార్ వంగ వాఙ్మయముమీద ఒక వ్యాసము చదివారు. రవీంద్రుని రచనలు వంగ సాహిత్యంమీద ఎంతగానో ప్రభావం వ్యాపింపజేశాయని ఆమె అన్నారు. ఇది

ఆధునిక రచనలమీద ఒక పక్షపాతంలా పనిచేస్తుందని ఆమె వ్యాఖ్యానించారు. అయితే అంతమాత్రంలో బెంగాలులో గొప్ప ఆధునిక రచన లేదని ఆమెకోనక్కరలేదనీ టాగూరు తరువాత కూడా కొందరు గొప్ప రచయితలు బయలుదేరారనీ ఆమె అన్నారు. శ్రీమతి ముజుందార్ ఆధునికవంగ వాఙ్మయంలో వేర్వేరు మార్గాలను గూర్చి విపులంగా అభివర్ణించారు. ఆ తరువాత రచయిత్రి లీలారాయ్ కూడా వంగ వాఙ్మయం మీద వ్యాసం చదివారు. ఆ తరువాత చదివిన వ్యాసాలు ఇవి : కన్నడం శ్రీమతి ఆర్. ఇందిర, మరాఠీ శ్రీమతి మాలతి బడేకర్, పంజాబీ శ్రీమతి ప్రభుజోత్‌కౌర్, సింధీ: శ్రీమతి పోపట్‌హీరా నందాని, సంస్కృతము : శ్రీమతి నళిని కె. పరేడ్‌కర్.

రెండవనాటి సాయంత్రం శ్రీమతి విజయలక్ష్మి పండిట్ అధ్యక్షతన ఆంధ్ర సారస్వత పరిషత్తు హాలులో జరిగిన సభా వ్యవహారాలకు సంబంధించిన సమావేశంలో ప్రాంతీయ భాషల కన్నింటికి కేంద్ర సాహిత్య అకాడెమీలో స్థానం కల్పించవలెని, కేంద్ర సాహిత్య అకాడెమీలో మహిళలకు స్థానం ఉండాలని, వేర్వేరు రాష్ట్రాలలో ప్రాంతీయ కార్యాలయాలతో శాశ్వతమయిన అఖిలభారత రచయిత్రుల సంస్థ ఏర్పరచాలని నిర్ణయించారు.

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కన్వీనరుగా ఈ విషయమై ఒక తాత్కాలిక సంఘం ఏర్పడింది. ఈసభలో వ్యాసాలు చదివినవారు ఈ సంఘంలో సభ్యులు అవుతారు.

అఖిలభారత రచయిత్రుల సంఘం నిర్మాణానికి సంబంధించిన వివరాలను నియమావళిని తయారుచేయడానికిగాను ఒక అడ్‌హాక్ సంఘం ఏర్పడింది.

శ్రీమతి విజయలక్ష్మి పండిట్, శ్రీమతి లీలావతి మున్షి, శ్రీమతి భానుమతి రామకృష్ణ, శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి, శ్రీమతి వూటుకూరి లక్ష్మీకాంతమ్మ (కన్వీనరు) ఈ సంఘంలో సభ్యురాండ్రుగా ఉన్నారు.

అన్ని రాష్ట్రాలలో శాఖలతో అఖిలభారత రచయిత్రుల సంఘాన్ని ఏర్పాటుచేయాలని నిశ్చయించారు.

కేంద్ర సంఘాన్ని ఏర్పాటుచెయ్యడానికి నాలుగు ప్రాంతీయ సంఘాలు ఏర్పాటుచేశారు. ఢిల్లీ, కలకత్తా, మద్రాసు, బొంబాయి ప్రాంతాలకు క్రమంగా శ్రీమతి ప్రభాజోత్‌కౌర్, శ్రీమతి రాణీరాయ్, ఇందిరా సోమసుందర్, ఉత్తమ చందానీగార్లను కన్వీనరులుగా నియమించారు. ఈ ప్రాంతీయ సంఘాలు కేంద్ర సంఘం ఏర్పాటుకు తోడ్పడగలవు. శ్రీమతి నాయని కృష్ణకుమారితో ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రాంతీయ సంఘం ఏర్పాటుచేశారు. కేంద్ర సంఘం ఏర్పడేవరకు మిగిలిన ప్రాంతీయ సంఘాల కార్యక్రమాలన్నీ ఈమె సమీకరిస్తుంటారు.

ఈ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాత మహిళలు రచించిన గ్రంధాల ప్రదర్శనం ఒక ప్రత్యేకత. ఆంధ్ర సారస్వత పరిషత్తు మందిరంలో ఏర్పాటు అయిన ఈ ప్రదర్శనంలో వివిధ భాషలకు, వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు రచించిన గ్రంథాలు వెయ్యి వరకు ఉన్నాయి.

దీనితోపాటు ఒక చిన్న చిత్రకళా ప్రదర్శనము గూడా ఏర్పాటు చేయబడింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చిత్రకారిణుల చిత్రాలు 150 వరకు ఉన్నాయి. ప్రదర్శనం ప్రారంభించిన శ్రీమతి విజయలక్ష్మి పండిట్ దీనిని చూసి ప్రశంసించారు.

26 వ తేదీ సాయంత్రం కవయిత్రీ సమ్మేళనం జరిగింది. శ్రీమతి ప్రభుజ్యోత్‌కౌర్ అధ్యక్షత వహించారు.

శ్రీమతి లీలావతి మున్షి ఇలా ప్రసంగించారు. "భారతదేశం చుట్టూ శత్రుమయంగా ఉన్న ఈ గడ్డురోజుల్లో దేశరక్షణకు కావలసిన శీలాన్ని యువకుల్లో పెంపొందించాలి. శీలం లేకుండా మన బిడ్డలు దేశాన్ని రక్షించలేరు. రెండు దశాబ్దాల క్రింద చియాంగ్—కై—షేక్ క్రింద యువకుల విషాద అనుభవాలను జ్ఞాపకము ఉంచుకోవాలి. మన దేశంపై దురాక్రమణ చేసిన చైనా ప్రచురణలకు విపరీతంగా పంచిపెడుతూ సరిహద్దుల్లోని భారతీయ యువకుల మనస్సులను పాడుచేస్తున్నారు. దీనిని తక్షణం అరికట్టాలి. దానికి కీలకము రచయిత్రుల చేతుల్లో ఉంది. యువకుల్లో శీలాన్ని పెంపొందించే రచనలును చేయాలి స్త్రీలు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు ముందుగా బలి అయ్యేది స్త్రీ అనే సంగతి గుర్తు ఉంచుకోవాలి. యుద్ధంలో కూడా స్త్రీలపైననే శత్రువు తాకిడి ఎక్కువగా ఉన్నట్లు ప్రపంచమంతటా చరిత్రద్వారా రుజువు అవుతోంది.

"ప్రజలలో ప్రధానంగా యువకులు, స్త్రీలలో ధైర్య స్థైర్యాలను నెలకొల్పే రచనలు చెయ్యాలని రచయిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాను. వాస్తవిక వాదము అభ్యుదయం పేరట కలిగే దుష్పరిణామాలను వారు ఎదుర్కొనజాలరు. ఏ పేరుతోనైనా సరే అశ్లీల సాహిత్యమును నేను సహించలేను. దానిని సాహిత్యము అనటానికే వీలులేదు."

27 వ తేది ఉదయం భారత సాహిత్యంలోని వివిధ వైఖరులను గురించి సదస్సు జరిగింది. సాయంకాలం సభలుపూర్తయాయి. సమాప్తి సమావేశానికి శ్రీమతి ఇస్మత్‌చుగతాయి అధ్యక్షత వహించారు.

గ్రంథ విమర్శలు

రొయ్యలు

(నవల : మలయాళీమూలం : శ్రీ తగళి శివశంకర పిళ్లై, తెలుగుసేత : శ్రీగన్నవరపు సుబ్బరామయ్య, ప్రచురణ : సాహిత్య అకాడెమీ, ఢిల్లీ తరపున ది ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ, హైద్రాబాద్. మూల్యం : రూ. 3—50.)

ఆధునిక సాహిత్యంలో నవలకున్న ప్రాముఖ్యం మరే ప్రక్రియకూ లేదు. పాశ్చాత్య భాషల్లోనూ, భారతీయ భాషల్లోనూ నేడిదే పరిస్థితి. నోబెల్ బహుమతి పొందిన ఇటీవలి సాహిత్యపరులు హెమింగ్వే, పాస్టర్నాక్, కేమస్, ఫాక్నర్, సార్త్రే అందరూ నవలా రచయితలే టి. ఎస్. ఎలియట్ తప్ప. 'చెమ్మీన్' (రొయ్యలు) అనే ఈ నవల కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమానం పొందింది. బహుమానం పొందటానికి తగిన అర్హత సాహిత్యపరంగా ఈ నవలకు ఉన్నది అనటంలో సందేహం లేదు.

ఇది పీడిత ప్రజల, సామాన్య ప్రజల యుగం. సాహిత్యం కూడా వారికి ప్రాధాన్య మివ్వటంలో ఆశ్చర్యమేమీలేదు. పడమటి తీరపు బెస్తవారి జీవితాన్ని చిత్రించే ఈ నవలలో వాస్తవికత పూర్తిగా ఉంది. ఆ బెస్తవారి దొక ప్రత్యేక సాంఘిక వ్యవస్థ. ఆ వ్యవస్థకూ, వారి నిత్య జీవితానికీ మూలాధారమైన విశ్వాసం సముద్రానికి సంబంధించినది. బెస్తవారు కడలి తల్లి బిడ్డలు. ఆమె వారిని పోషిస్తుంది, శిక్షిస్తుంది. పురుషుల్లో శారీరక, నైతిక, శక్తి సాహసాలు ప్రధాన విధులు. స్త్రీలలో పవిత్రత, పాతివ్రత్యం అలాగే ప్రధానం. తీరాన ఉండే స్త్రీల పాతివ్రత్యమే కడలిమీద విహరించే పురుషులకు రక్ష అనేది ముఖ్య విశ్వాసం. వ్యవస్థకు అధికారి ఒక్కొక్క గ్రామంలో ఒక కుల పెద్ద. ఈ కుల పెద్ద అనుమతి లేనిదే పెళ్ళిళ్లు జరగటానికి వీల్లేదు. బెస్తవాడు, పడవ, వలలూ, కొని పెట్టుబడిదారు కావటానికి వీల్లేదు. అనుమతి పొందే సమయాల్లో విధిగా 'నజరు' పెట్టవలసి ఉంటుంది. ఇక్కడ డబ్బు ప్రభావం ప్రవేశిస్తుంది. కుల పెద్ద వ్యక్తిత్వాన్నిబట్టి వ్యవస్థలో అతడు నిర్ణయించే మంచి చెడ్డలూ ఉంటాయి. అతని వ్యక్తిత్వం, ధనాకర్షణకు లోబడటం అరుదైన సంగతేమీకాదు. పోతే బెస్తవారిలోనూ వ్యక్తిగత భేదాలనుబట్టి వారికి వ్యవస్థతోనూ మూల విశ్వాసంతోనూ సామరస్యం లేక సంఘర్షణ, ఏర్పడుతూ ఉంటుంది. సంఘర్షణ ప్రయత్న పూర్వకంగా తెలిసి తెచ్చిపెట్టుకున్నదీ కావచ్చు. యాదృచ్ఛికంగా కలిగిందీ కావచ్చు. జీవితంలో సుఖ దుఃఖాలకూ, చివర మృత్యువుకూ ఆ సంఘర్షణే కారణం అవుతుంది. ఇటు సామరస్యమూ అటు సంఘర్షణా లేక ఒక తరహా జీవితం గడిపే వాళ్లుంటారు. వారిలో ప్రత్యేకత ఏమీ ఉండదు. ప్రత్యేకత, దేన్నో విశేషంగా ఆశించి, గాఢంగా అనుభవించి, తద్వారా వ్యవస్థతో లేక మూల విశ్వాసంతో ఘర్షణ పడేవారి సొమ్ము. అందువల్ల సామాన్యులైన బెస్తల సుఖ దుఃఖాల్నీ, జీవిత ధోరణినీ చిత్రించే సాహిత్యంలోనూ సామాన్యుల్లో ప్రత్యేకత కలిగిన అసామాన్యుల్ని చిత్రిస్తూ వారి ప్రత్యేకత ఎటువంటిదో స్ఫురించే విధంగా రచన సాగక తప్పదు.

పైన వివరించిన బెస్తల సమాజంలో చెంబన్‌కుంజులోని ప్రత్యేకత పురుషార్థాల్లో 'అర్థం' మీదా, 'కామం'మీదా అతనికి గల విశేషాసక్తి. డబ్బు చేర్చాలి. పడవలూ, వలలూ, కొని మోతుబరి కావాలి. విషయ సుఖం అనుభవించాలి. అది వాడి జీవిత లక్ష్యం. పళ్లికున్నం గ్రామవాసి కండకోరన్ అనే బెస్తవానీ ధనికత్వమూ, అతని అందమైన భార్యా, వాడి కళ్లల్లో అందుకోదగిన ఆదర్శాలు. ఈ లక్ష్య సాధనలో వాడు ధర్మాన్ని లెక్క చెయ్యడు. స్నేహం, కృతజ్ఞత, కొమార్తె పట్ల తన బాధ్యత, ఇవేవీ వాడి మనసుకు రావు. డబ్బుతో కులపెద్ద వాడివశం అవుతాడు. ఇక సంఘంలో ఎదురులేదు. 'కడలి తల్లి ఋతుమతి అయిన' కాలంలో కూడా సముద్రంమీద బెస్తలు పోగూడదనే పరంపరాగతమైన విశ్వాసాన్ని కాదని, సముద్రంమీద వెళ్ళి లాభంతో తిరిగి వస్తాడు చెంబన్‌కుంజు. ధన సంపాదనమీద దృష్టి ఉండటంవల్లే ఎవరూ దిక్కులేని సమర్థుడైన బెస్త యువకునికి కొమార్తె నిచ్చి వివాహంచేసి, వాళ్లే యిల్లరికం పెట్టుకోవాలని ఆశిస్తాడు. కాని, ఆ యువకుడు భార్యను తీసుకుని తన గ్రామానికి వెళ్ళిపోయి స్వతంత్రంగా జీవిస్తాడు! కొమార్తె వియోగంతో చెంబన్‌కుంజు భార్య మంచంపట్టి మరణిస్తుంది. అదొక అవకాశంగా గ్రహించి, కండకోరన్ చనిపోగా నిరాశ్రయురాలైన అతని భార్యను ఉంపుడుకత్తెగా తెచ్చుకుంటాడు చెంబన్‌కుంజు. వాని లక్ష్యం అలా నెరవేరింది. కాని, వాడు పొందగల్గిన 'విషయసుఖం' వాడు వూహించి ఉవ్విళ్లూరింది కాదు. వ్యవస్థనూ, మూఢ విశ్వాసాల్నీ గెలవగలిగాడు కాని చివరకు చెంబన్‌కుంజు అంతఃకరణ అతని కొమార్తెకు జరిగిన అన్యాయాన్ని గూర్చి అతణ్ణి నిలవదీస్తుంది. కొమార్తె కరుత్తమ్మకూ ఒక ముస్లిం యువకునికీ గల బాల్యస్నేహమూ నిర్మల ప్రేమా అవకాశంగా ఉపయోగించుకుని ఆ యువకుని వద్ద డబ్బు తీసుకుని ఎన్నాళ్లయినా తిరిగి యివ్వలేదు. తండ్రి వాడి డబ్బు తిరిగి యివ్వకపోవటం అది తన శీలంమీద తొలగని ఛాయగా, హృదయంలో భారంగా, భావిస్తూ కుమిలి పోతుంది కరుత్తమ్మ. కొమార్తెకు నైతికంగా తను చేసిన అన్యాయం చివరకు తెలిసినప్పుడు చెంబన్‌కుంజు మానసిక

నైకల్యం పొంది ఆ డబ్బు పరిక్కుట్టికి (ఆ ముస్లిం యువకుడు) తిరిగి యిచ్చి, నిష్కృతి పొందుతాడు. కాని చెంబన్ కుంజుకు మిగిలిందేమిటి ? పశ్చాత్తాపం !

కరుత్తమ్మ మనసు పాలవంటిది. ఆమె హృదయం పరిక్కుట్టికి సహజంగా అంకితమైంది. కాని ఆ సత్యాన్ని ఆమె మనసా ఎప్పుడూ అంగీకరించదు. కాబోయే భర్త కోసం శరీరమే కాదు, మనస్సు కూడా పవిత్రంగా, పరిశుద్ధంగా ఉంచుకోవాలి అనే లక్ష్యం ఆమెది. తండ్రి పరిక్కుట్టి దగ్గర డబ్బు పుచ్చుకొని ఆమెను అనుకోకుండా పరిక్కుట్టితో బంధించివేశాడు. కరుత్తమ్మలోని అవ్యక్త ప్రేమ యిలా నైతికమైన బాధ్యతాస్వరూపంలో ఆమె మనస్సుని మధురమైన ఆవేదనలో ముంచివేస్తూనే ఉంటుంది. రాత్రి ప్రశాంతతను భగ్నంచేస్తూ వచ్చే పరిక్కుట్టి పాట ఆమె మనస్సును నాగపాశంలా మోహముగ్ధంగా బంధిస్తుంది. పరిక్కుట్టి ప్రేమ ప్రతిఫలాన్ని కోరదు. కరుత్తమ్మ వివాహానంతరం ఆమె తల్లి మరణవార్త ఆమెకు తెలియజేసేందుకు ఒక్కసారి మాత్రమే అతను కరుత్తమ్మ ఉన్న గ్రామానికి వెడతాడు. కాని ఆ ఉదంతమే ఒక పెద్ద పీడగా లోకం దృష్టిలో కరుత్తమ్మ జీవితాన్ని అచ్ఛాదిస్తుంది. ఆమె భర్త అనుమానాన్ని రేపుతుంది. కరుత్తమ్మ భర్త పళని కడలిబిడ్డ. కడలిమీద అతను చూపే సాహసం అసమానమైనది. అది అతనిలోని ప్రత్యేకత. చివరకు తండ్రి చెంబన్ కుంజు మనోవైకల్యంతో ఆలనా పాలనా లేని వాడైనాడని అక్కతో చెప్పటానికి కరుత్తమ్మ చెల్లెలు పంచమి కరుత్తమ్మ ఉన్న గ్రామానికి వస్తుంది. వచ్చి పరిక్కుట్టి దీనావస్థను చెబుతుంది. అప్పటికిగాని పరిక్కుట్టి జీవితం తనమూలంగా ఎలా శుష్కించి శూన్యమైపోయిందో పూర్తిగా అవగాహన కాలేదు కరుత్తమ్మకు. అది అవగతం కాగానే అంతవరకు కృత్రిమమైన సంకల్పబలంతో అణచిఉన్న ప్రేమగట్లు తెగి ఉప్పెనలా ఆమెను ముంచివేస్తుంది. ఆ రాత్రే పరిక్కుట్టి అక్కడకు వస్తాడు. ఆ రాత్రే పళని, భార్య పాతివ్రత్యంమీద నమ్మకంతో, ఒంటరిగా, నిర్భయంగా సముద్రంమీద వెళ్తాడు. కరుత్తమ్మ సముద్రతీరాన పరిక్కుట్టి కౌగిలిలో లీనమైంది. పళని సముద్రంలో తుపానులో చిక్కుపడి గాలం మింగిన సొరచేపతో ఘర్షణ పడుతూ, సముద్రంలో లీనమౌతాడు. "రెండు రోజుల తర్వాత గట్టిగా కావలించుకున్న స్త్రీ పురుషుల శవాలు రెండు సముద్రతీరానికి కొట్టుకొని వచ్చాయి. చెరియళిక్కల్ పాశెం తీరానికి గాలం మింగిన సొర మీనొకటి కొట్టుకొని వచ్చింది." ఇది నవల ముగింపు. పళని గాలం మింగిన సొరమీను ! అతను మింగిన గాలం కరుత్తమ్మ ! నవలలో ఈ చివరి అధ్యాయం చాల శక్తివంతంగా, పొంగి వస్తున్న సముద్రంలాగే పాఠకుల్ని ముంచెత్తుతుంది.

కరుత్తమ్మ నైతిక విశ్వాసంతో, చెంబన్‌కుంజు వ్యవస్థతో, ఘర్షణపడి చివరకు గెలిచినా భగ్నజీవు లయారు. వారు రుజువుచేసుకున్న ప్రత్యేకతే వారి విజయం ! అలాగే పరిక్కుట్టి, పళని ప్రేమించిన స్త్రీ కోసమే, ఆమెమీద విశ్వాసానికే, జీవితాల్ని అంకితం చేశారు. ఈ కథ విషాదాంతమే ! అయితే నేం ? విషాదమూ, మరణమూ ప్రతి జీవికీ ఏదోవిధంగా తప్పవు. కాని, అవి ఒక్కొక్క వ్యక్తి జీవితానికి యిచ్చే విశేషార్థాన్ని బట్టే కదా ఆ వ్యక్తిలో ఉండే ప్రత్యేకతా, విలువా గోచర మౌతాయి. ఆ అర్థాన్ని విస్పష్టం చెయ్యటమే సాహిత్యం సాధించే ప్రయోజనం ! ఈ నవల గొప్పదనం వ్యక్తుల మనస్తత్వాల్నీ వాళ్ల ప్రత్యేకతల్నీ మాత్రమే విశదీకరించటం కాదు, వ్యక్తులు అజ్ఞాతమైన సాంఘిక, నైతిక, పారమార్థిక శక్తులతో ఎలా ప్రభావితులో ఆ విషయాన్ని సూత్రప్రాయంగా, నిర్దుష్టంగా, స్ఫురింపజేయటం. ఆర్థిక వ్యవస్థ, ఉత్పత్తి సాధనాలు సమాజంలో వ్యక్తుల జీవితాల్ని నిర్ణయిస్తాయనే వాదం కానీ, మానసికమైన విజ్ఞానాభివృద్ధితో జీవితసమస్యలు చక్కబడతాయనే అభ్యూహ కానీ, సమగ్రమైన దృష్టికి తార్కాణం కాదని ఈ నవల నిరూపిస్తున్నది.

వాస్తవికత దృష్ట్యా పడమటితీరపు బెస్తవారి జీవితాన్ని నిసర్గసుందరంగా చిత్రించేది, కాల్పనికవాదం దృష్ట్యా ప్రతిఫల మాకాంక్షించని ప్రేమ అనే మధుర సంవేదనను అతి సహజంగా, విశిష్టంగా వర్ణించేది, తాత్త్వికంగా గంభీరమైన అర్థస్ఫూర్తినీ, సత్యాన్నీ ఆలోచనామృతంగా భావుకులకు అందించేది—ఈ నవల అంగసౌష్ఠవం కలిగిన ఒక శిల్పం. ఆపాతమధురమైన ఒక విషాదగీతి. అర్థంకాని జీవితానికి ఒక సమగ్ర వ్యాఖ్యానం ! శ్రీ శివశంకరపిళ్లై అభినందనీయుడు ! అనువాదం అక్కడక్కడ నట్టుతూ ఉన్నా, అనువాదం చెడగొట్టలేని చేవ ఈ గ్రంథంలో ఉంది. ఈ నవలకు డా. నారాయణమీనన్ చేసిన ఇంగ్లీషు అనువాదం అంత చక్కగా ఉన్నదే. ఆ స్థాయిని తెలుగు అనువాదం అందుకొనే దెప్పుడు ? ఒక వచన గ్రంథాన్ని ఒక భారతీయ భాషనుంచీ మరొక భారతీయభాషకు తర్జుమా చెయ్యటం, ఇంగ్లీషులోకి తర్జుమా చెయ్యటం కంటె కష్టతరమైన కార్యమా ? ఇది అనువాదకుల, లేక పర్యవేక్షకుల కృషి లోపమనే అనుకోవాలి.

ఏ వ్యావహారికంగా వ్రాసినా సహజంగా శ్రుతిపేయంగా లేని తెలుగు తెలుగు కాదు. "తీర్మానించుకుండింది, బాగుందనుకుంది, తోచుండవచ్చు, తీర్మానించుకునుంది, అది ప్రేమింపబడిందై యుంది" ..... "దాని జీవితంలో ఒక ప్రత్యేకత సంభవించకుండా ఉంటే చాలు. సామాన్యమైన ఒక బెస్త స్త్రీ లాగా తన జీవితాన్ని అవసానింపచేయాలి" ఇది తెలుగా ? "అది మరొక్క పురుషుడిని ప్రేమించిందైనా, పురుషస్పర్శయొక్కా, పురుషుడికి విధేయ అగుటయొక్కా, ఆ ప్రాప్తి రాడకపోవుటయొక్కా అనుభూతి మరొక పురుషుడి నుండి దానికి లభిస్తుంది. ఇంక అది ఆ పురుషుడి దయింది.... అది వాడికోసమని దాన్ని పరిశుద్ధంగా ఉంచుకుండింది...." ఇందులో మొదటి 'మరొక్క పురుషుడు' ప్రేమించినవాడు, రెండవ 'మరొక పురుషుడు' భర్త అని అన్వయం. ఇలాంటి వాక్యాలు

సంస్కరించకపోవటానికి కారణం కేవలం అశ్రద్ధ కాక మరేమిటి ? ఈ నవలలోని భాషను పునర్ముద్రణలోనైనా సంస్కరిస్తారని ఆశిద్దాము.

—ఆర్. ఎస్.

కావ్య కుసుమాంజలి

కావ్య కుసుమాంజలి, కర్త: శ్రీ కొమండూరు కృష్ణమాచార్యులు. ప్రకాశకులు: కె. వి. యల్. నరసింహాచార్యులు, అడ్వొకేటు, అగ్రహారం, గుంటూరు, మూల్యము. రూ. 3.00.

బహుగ్రంథకర్తలు, విద్వత్కవిరాజ బిరుదాంకితులునైన శ్రీ కొమండూరు కృష్ణమాచార్యులుగారు అప్పుడప్పుడు రచించిన ఖండకావ్యముల సంకలన మీగ్రంథము. ఇందులో భక్తి కవిత, శృంగారకవిత, చారిత్రకకవిత, నవ్యకవిత, రాజకీయకవిత, సంఘాతకవిత, అనగీతకవిత అను విభాగములలో ఆయా విషయములకు సంబంధించిన కవితలు కూర్పు చేయబడియున్నవి. కొన్ని స్వతంత్ర రచనలు. కొన్ని ప్రసిద్ధులైన పూర్వ కవుల కృతులకు అనువాదములు. ఈవిధముగా శ్రీ మద్వేదాంతమహాదేశికులు, మయూర మహాకవి, జగన్నాథ పండితరాయలు, జయదేవ మహాకవి, శ్రీ సోమదేవభట్టు, నీలకంఠదీక్షితులు, మహామాత్యవత్సరాజు, శ్రీ హర్షుడు వీరి కృతులకు తెనుగుసేతలు ఇందులో నున్నది. ఆంగ్లమహాకవి వర్డ్స్‌వర్త్ రచన "సాలిటరీ రీపర్" కూడ పద్యములుగా ఆంధ్రీకరింపబడినది. ప్రస్ఫుటము, ప్రసన్నము అయిన శైలితో, చక్కనిధారతో, ఈకావ్య ఖండికలు సహృదయ హృదయరంజకముగా నున్నవి. "కావు పడుచు" అన్న ఖండికలోని ఒకపద్యము:

కొడవలి బట్టి వంగియుం
కోమలి 'కో'యని గూయు, కోయిలల్
పాడమిన సిగ్గచే పరుప
బోమిడి దూలగ దారి పోవగా
నెడపడకుండ బాడుకడు
వింపులు వింపెడు దివ్యగాన మీ
యెడదను హత్తుకొన్న యది
యెప్పటికైనను విస్మరింతునే.

సమకాలిక ఆంధ్రదేశ విశేషాలలో రాజధాని రగడ ఒకటి. విజయవాడను త్రోసి రాజన్న కొందరు ఆంధ్రనాయకుల వైఖరిని విమర్శించిన పద్యభాగ మిట్లున్నది:

ఆంధ్రమంత్రుల దృష్టిలో నల్పమయ్యె,
దేవతలుద్రొక్క నెరచెడు దివ్యభూమి
తునక మొక్కండు విశ్వంక జోచ్చురీతి
తలపునకు దెచ్చె వీరి సిద్ధాంతమరయ!

మహాకవి భట్టబాణకృత 'కాదంబరి'ని ద్విపద కాదంబరిగా అనువదించి ఈ సంపుటిలో చేర్చడం ఒకవిశేషం.

వాణీకుమార.

కాంగ్రెస్ అధినేత కామరాజ్

రచన: శ్రీ వెలమాటి శ్రీమన్నారాయణమూర్తి. పుటలు 24. వెల తెలియదు. ప్రచురణకు: పాండురంగ ప్రెస్, ఏలూరు పశ్చిమగోదావరి జిల్లా.

సి రా బా యి

గేయ కావ్యం. రచయిత: శ్రీశ్రీ పాద లక్ష్మీనారాయణ మూర్తి. పుటలు: 48. వెల తెలియదు. ప్రాప్తిస్థానం: శ్రీ గోదాగ్రంథమాల, శ్రీమన్నారాయణపురం, ఉర్లిపాలెం పోస్టు, దివి తాలూక, కృష్ణాజిల్లా.

జ ల జ

గేయకవితల సంపుటి. సప్తమ కుసుమం. సంపాదకురాలు: శ్రీమతి కాట్రగడ్డ ప్రమీలారాణి. 20 గేయాలు 20 పుటలు వెల: 35 పైసలు. ప్రాప్తిస్థానం: స్నేహపీఠం, ఏలూరు.

దే వ తి

చిన్ననవల. రచయిత: శ్రీ కె. ఆర్. కె. మోహన్. పుటలు: 60. వెల: ఒకరూపాయి. ప్రాప్తిస్థానం: శ్రీముఖ పబ్లికేషన్సు, పోర్టురోడ్, మచిలీపట్నం.

శ్రీ వేంకటేశ సుప్రభాతం

సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళం— ఈ నాలుగున్న పద్యకావ్యం. రచయిత: ప్రొఢకవి శ్రీ ఎస్. మహమ్మదాలీ. పుటలు: 48. వెల: 50 పైసలు. ప్రాప్తిస్థానం: రచయిత, కాళహస్తి, చిత్తూరుజిల్లా.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1
Editor : S. Sambhu Prasad.